UNIVERSAL LIBRARY
OU_204408
UNIVERSAL LIBRARY

OUP—552—7-7-66—10,000

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T. 83/S77C Accession No. T1742

Author

Title చెన్నపట్టణము [illegible]

This book should be returned on or before the date last marked below.

# చెన్నపట్టణములో

వేమూరి శ్రీనివాసరావు,
బి ఏ బి. యల్.

1925.

కాపీరైటు.

వెల రు. 1-4-0

# నే ను.

నేను మా తల్లిదండ్రుల కేకపుత్రుఁడను. మా తల్లి నాపైఁ గల ప్రేమకు మితిలేదు; నే నెక్కడినను మా మెకుఁ గనఁబడకుండుచో నామె విలవిలలాడును. అంత ప్రేమ నాపై మా తండ్రిగారికిని గలదు గాని యట్లున్నట్లు కనఁబడకుండుటకై యత్నింతురు; ఎవ్వారి కే పదార్థముపై నత్యంతప్రేమ కలుగునో యద్దాని కే భంగము కలుగుచుండునని మాతల్లితోఁ జెప్పుచుందురు; వారి శ్రద్ధను, ప్రేమను, ప్రేమాపరరూపమగు భక్తిని, దత్పదార్థముపైన నే నిల్పుటచే దేవుని మఱతురనియు భగవంతుఁడు వారలచేఁ దనను స్మరింపఁ జేయుటకై తత్పదార్థమును దనలోఁ గల్పుకొనుచుండుననియు బోధించుచుందురు. దానికిఁ గారణమిది. నా పితరులకు నాపూర్వము జన్మించిన ముగ్గురు పుత్రులును నైదేండ్లు నిండకపూర్వమే యీశ్వరసాన్నిధ్యము నొందిరఁట.

నా కైదవ యేటనే విద్యాభ్యాసము గావించిరి. “వీని కిప్పటినుండియుఁ జదు వేల? ఉల్లాసముగఁ దిరుగుచుండ నీయక?” అని మాతల్లి యనెడిది కాని విద్యాహీనుఁడగు పుత్రుఁడుండుట కంటె సంతతియే లేకుండుట మేలని మాతండ్రిగారు చెప్పుదురు. నాపైఁగల యనురాగము చేతను, వీథిలో నా కేమి యాపద వచ్చునో యను భయముచేతను నన్ను ఇల్లుకదలి వెళ్ళ

నిచ్చెడు వారు కారు. నేను బడిలోనికి వెళ్ళువాఁడను గాని నను దినము వెళ్ళువాఁడను గాను. ఆకారణములచే నాకుఁ జెలిమికాండ్రు తక్కువ. ఆ యున్నవారును నాతో మాయింటికడనే యాడుకొనెడివారు. నాకొఱకేమిచేసినను మాయమ్మ వారికిని బెట్టుచుండెడిది; మాతండ్రిగారును నాతోఁబాటు వారికిని జదువుచెప్పెడివారు; అందువలన నామిత్రులు వారిండ్లకడ కంటె మాయింటనే యెక్కువగ నుందురు. నేను వారిండ్లకైన వెళ్ళువాఁడనుగాను.

నా చిన్నతనమున మాయిల్లును బాఠశాలయుఁ దప్ప నితర మెఱుఁగినవాఁడను కాకపోవుటచే మామణిపురమును మించిన నగరము లేదనుకొనెడి వాఁడను; మా మణిపుర రాజుగారిని మించిన సార్వభౌముఁడు లేఁడను కొనెడి వాఁడను. కాని మామణిపురము పట్టణము కాదు. మేడలు మిద్దెలు తక్కువ; వీథులు వెడల్పుగ నుండవు. మార్గములు సరిగ లేవు. మంచినీటి సదుపాయమును మిక్కిలి తక్కువ. అయినను, మా రాజుగారును వారి కోటయు నందుండుటచే నది పల్లెటూరనియుఁ జెప్ప రాదు. కోటయని యందు ఖడ్గములు ఫిరంగులు శతఘ్నులు నుండు ననుకొందురేమో? అట్టి వేవియు నందుండవు. మా పురమందలి కోటఁ జూడ వచ్చినవారు అందలి శునకాగారమును జూచి పోవుచుందురు. దానిం జూచినవారెల్లరు ఏకగ్రీవముగ నట్టిది మన తెనుఁగుదేశమున లేదనియే చెప్పుదురు. అందున్న శునకముల వంటివియు సాధారణముగ మన భరతఖండ

మునసే గాన రావఁట. శునకముల ప్రాముఖ్యమును బ్రహ్మో జనమును నెఱిఁగిన వారు ఈశునకాగారము నిర్మించిన వారిని దేశభక్తులలో నగ్రగణ్యులగ నుతింతురు. అదియు యుక్తమే. భీమార్జున నకుల సహదేవులును ద్రౌపదియుఁ జీఁకిపోయినను ధర్మజుని విడువక యాతనితోఁ బరలోకమునకుఁ బోఁగల్గినది శునకముగాదా? శ్రీమహావిష్ణువుయొక్క యవతారమైన దత్తాత్రేయుని చిత్తరువునందు మూఁడు శునకము లుండుటఁ జూడమా? దత్తాత్రేయుఁడు సదా శునకములతోడనే గలసి యుండెడివాఁడు. విష్ణ్వంశ సంభూతులైన పుడమి పతులకును శునకములను బోషించుట పరమ ధర్మమే. ఇపుడు మానితిమి గాని ఈమృగముల యౌన్నత్య మెఱిఁగిన మన పూర్వులు వీని నామములను వీని శరీరభాగముల నామములను ధరించెడి వారు: శునఃపుచ్ఛుఁడు, శునోలాంగూలుఁడు మొదలగు ఋషి సత్తములు విశ్వామిత్రుని శిష్యులు; సూతునివలనఁ బురాణము లను వినిన మునివరులలో ముఖ్యుఁడైన శౌనకుఁడు శునకుని కుమారుఁడు. మాపురాభిమానముచేఁ జెప్పుటకాదు గాని యీ విస్మృతనామములను నవతారమును స్ఫురింపఁ జేయువారిని నెంతని కొనియాడవలెను? ఇంతకు మామణిపురమందుఁ జూడఁ దగినది యీ శరణాలయము తప్ప వేఱొండు లేదు. కచ్చేరీలును విశేషముగ లేవు. అంగడి నాకు సంబంధించిన పాఠ శాలయుఁ బెద్దదికాదు. అదియు మారాజుగారి పేరునఁ బర గదు. నిజనగరముపై వారికింత యనాదరణ మేలని యందు

రేమో, దానికిఁ బలువురు పలువిధములఁ జెప్పెదరు. నిజమేది యో నాకును దెలియదు.

మా తండ్రిగారి శ్రద్ధ వలనను నాకు సురుచిరాభ్యాసముచేఁ గల్గిన విద్యాసక్తి వలనను నేనేటేఁ బరీక్షలందుఁ గృతార్థుఁడనై పైపై తరగతుల కేఁగుచుంటిని. ప్రతితరగతియందును విద్యార్థులు నాకంటెఁ బెద్దవారే కాని చిన్నవాండ్రు లేరు. అప్పుడప్పుడు మా తండ్రిగారు "వీనికి దృష్టి తగులును; ఒక సంవత్సరము చదువు మాన్పింపవలయు" నను చుందురు. నాకించుక పడిసెము పట్టినా యీచదువు మాన్పించుఁ డనియుఁ జదువు లేనివారు బ్రతుకలేక పోరనియు మాతల్లి యనుచుండును. నన్నెక్కడ మాన్పించెదరో యని నాకు భయము కల్గెడిది, కాని చదువు మానకుండనే సాగినది.

"ఇంటరు మీడియటు" చదువుటకై పొరుగూర నొక కళాశాలలోఁ జేరితిని. అప్పటినుండియు నాకు విశేషముగ సంబంధములు వచ్చెడివి. నిజమునకు నాకప్పటికి వివాహమన్నను దాని కష్ట సుఖములన్నను అంతగఁ దెలియదు. ఎంతెంత గొప్ప సంబంధములు వచ్చుచున్నను గాళ్ళవేళ్ళఁ దన్ని వేయుచుంటిని. నల్వురిచేతను నన్వేషింపఁబడి, యాకర్షింపఁబడి, తహసీలుదారులు, మునసబులు, కలక్టరలచే, మాకన్యను వివాహము చేసికొనుము మాకన్యను వివాహము చేసికొనుమని, కోరఁబడినప్పుడు గాని నాఘనత, నామహాత్త్వము నేఁ దెలిసికొనలేక పోయితి. దమయంతియెదుట నలుని గూర్చి హంస వర్ణిం

చెను, రుక్మిణి యెదుటఁ గృష్ణుని నొక బ్రాహ్మణుఁడు వర్ణించె
ను, ఇంద ఉద్యోగస్థుల యెదుట నాపై మక్కువ పుట్టునట్లు
నన్నెవ్వరు కొనియాడిరో నాకిప్పటికిని దెలియదు. నేను రైలులో
ప్రయాణము చేయునప్పుడును నెవరిండ్లకైన విందున కేగినప్పుడును
కన్యాపితరులు నన్నుఁ జూచుచు నన్నుగూర్చి సంభాషించుకొను
చుండెడివారు. అయ్యది నేను గ్రహింపఁగ నే నాకెక్కడ నుండి
యో వివచ్చెడిది. గమనమం దాభిజాత్యము, దృష్టియం దనుభా
వము కలిగెడివి. ఒక్కొక్కప్పుడు కొందఱు నన్నుఁ దీసికొని
వెళ్ళి తమ బాలికలను జూపించెడివారు అప్పుడు వారు నాకు
చేయు గౌరవ మింతంతగాదు. ఒక్కొక్కప్పుడు కుర్చియందుఁ
గూర్చున్న పెద్దలు కూడ లేచి నన్ను కూర్చుండు మనెడువారు
గృహిణియు గృహకృత్యములు మాని తన పుత్రికకుఁదల దువ్వి
బొట్టు కాటుక పెట్టి పరికిణికట్టి పట్టుచొక్కా తొడిగి చొక్కా
పైన తన మెడలోని కంటెయో కాసులో పెట్టి మెల్లమెల్లగ
నాప్రక్కను గూర్చుండు తండ్రియొద్దకో మేనమామయొద్దకో
తీసికొని వచ్చెడిది. కొంత సేపైన పిమ్మట, నితనిఁ జూచితివా
యనియు నితఁడు నీకు నచ్చెనా యనియు ఆ బాలిక నడుగువారు.
నేనెట్లుంటినో యెవ్వరును జెప్పలేదుగాని నే నెప్పుడే బాలికను
జూచిన నప్పటి కాకన్నియయే నా కందముగఁ గనఁబడియెడిది.
వారిలో నొక్కరిని వరియించుట నాకసాధ్యముగ నే దోఁచెను.
పూర్వము రాజపుత్రికల స్వయంవరములకు నృపకుమారు
లెల్లరు నొక్కసారి వచ్చెడువారు. ఆవచ్చిన వారిలో రాజపుత్రి

తనకు నచ్చిన వానిని వరించెడిది. అది సులభమే. అట్లు వివాహము కావలసిన కన్నియలందఱు నొక్కసారి యలంకరించుకొని వచ్చి తాము తెచ్చెడు కట్నములు ఆరణములు నుడువుచో నాకుఁ గల్గిన విషమావస్థ యిఁక వరులకుఁ గలుగదు. ఏమైనను, నా కీయాహ్వాన సందర్శనము లెక్కడు సంతోషదాయకముగ నుండెను. నాకు వివాహమైనచో నిందఱు నన్ను గౌరవించుట యుండదు. కావున నాయీస్థితినే విలంబము చేయఁగోరుచుంటిని. మఱియు నొక్కసారి పుస్తె ముడి వేయఁగనే యాబాల యెట్టిదైనను, నాజన్మాంతము యర్ధాంగి యగునుగాన తొందఱపడక సర్వవిధముల నుత్కృష్టయగు కన్యనే వరింపవలెనని నిశ్చయించుకొంటిని. మా శాఖలో నన్ను మించిన పెండ్లికొడుకు లేక పోవుటచే నేనెంత విలంబము చేసినను నుత్తమ సంబంధము నన్ను దాటి పోదని నాకుఁ దెలియును. అందువలననే, నాకెంత కట్న మిచ్చెదమన్నను నేను వేగిరించి యెవరితోడను సరేయనలేను. కాని యెప్పటికైనను నేను వివాహము చేసికొనక తప్పదు గాఁబట్టి ఎట్టికన్యను వివాహము చేసికొనవలయునో నిర్ణయించుటకుకొన్ని నికష్టవల్లక్షణముల ముందుగనే యాలోచించుకొని యుంటిని: నాకుఁ బత్నియగు చిన్నది రూపమున రంభవలె నుండవలెను; చదువులలోనా సరస్వతి; వీణవాయింప నేర్పును గలిగి యుండవలెను; మున్ముందు నాపనులలో సహాయము చేయుటకై యామెకింగ్లీషువచ్చి యుండవలెను. కన్యకుఁ దల్లియుఁ దండ్రియు

నుండవలయును; తండ్రియు సామాన్యుఁడుకాక ప్రతిష్ఠకలిగిన గొప్ప యుద్యోగస్థుఁడు కావలయు. నే నత్తవారింటి కేగు నపుడు సరసములాడుటకును నాతో మాటాడుటకును బావ మఱఁదులు మఱదండ్లు నుండవలెను. వీరును విద్యావంతులు కావలయు. అత్తవారు నేవెళ్ళినపుడెల్ల నాకుధనము వస్త్రము లొసంగి మర్యాద చేయఁగలుగుస్థితివంతులుకావలయు. ఈలక్షణములతోఁ గూడిన బాలలలో నితరవిషయములను బట్టి యొకర్తు నెన్నుకొనెదఁ గాక యని నిశ్చయించుకొంటిని.

నే నట్టి యూహలతో నుండఁగనే మాతండ్రిగారు నాకు సంబంధము నిశ్చయము చేసినట్లు తెల్పిరి. ఆమాట వినఁగనే నానవనాడులు కృంగిపోయెను. మాతండ్రిగారు నిశ్చయించిన సంబంధము నంగీకరింపననుచో నేమని యని యందురో కాని ఆయనమాట కే నెదురాడలేను. ఆయన నాకై నిశ్చయించిన బాలికను నే నీమధ్య గావించిన కన్యాలోకన యాత్రయందుఁ జూడలేదు గాని యదివఱకే యెఱుఁగుదును. ఆమె జనకుఁడు మా మేనమామ బంధుఁడగుటచే నాకుఁ దెలియకుండ మాతండ్రిగారితో మాటాడెను. మాజనకుండును కలసిన సంబంధమనియుఁ గులమింటి కోతినైనఁ జేసికొమ్మని పెద్దలు చెప్పి వారనియుఁ దలఁచి యాసంబంధ మేర్పాటుచేసెను. తరువాతఁ ద్వరలో నే నాకు వివాహమైనది.

నాభార్య నేఁదలఁచిన నుత్కృష్టవధు లక్షణములతోఁ గూడినది కాదు గాని, సత్కులమందుఁ బుట్టిన బుద్ధిమంతు

రాలు. విశేషము చదువుకొనినది కాదు గాని గుణవతి. ఆమె రూపలావణ్యము లంతగఁ జెప్పఁదగినవి కావు గాని నాపై నను రాగముమెండు. ఏమైనను నేఁగోరుకొనినట్లుకాక యన్యథా వివాహము జరుగుటచే నాకుఁ జింతగనే యుండెడిది. నావివాహము పరీక్షలకుఁ గొన్ని దినములు ముందుగ జరిగెను. వివాహము మనుగుడుపుల సందడిచేఁ గొంత చదువు మానినను ఆసంవత్సరము పరీక్షలలో నేనే ప్రథముఁడనైతి. ఇది తెలిసి నప్పటినుండియు మాతల్లియుఁ దండ్రియు మాకోడలువచ్చిన వేళ మంచిది, మాకోడలు వచ్చిన వేళమంచిది యనుచుండిరి. వా రట్లు తలచుచుగ ననుచుండుటచే నట్లే కాఁబోలని నేననుకొనెడి వాఁడను. అందువలనను సహవాసముచేతను, ప్రతిపంత మనో రథుఁడనైన నాకు ఆమెపై మొదట జనించిన విముఖత క్రమ క్రమముగఁ దఱిగిపోఁ జొచ్చెను.

"ఇంటరు మీడియటు" ముగిసినపదప బి. ఏ. చదువు టకు రాజమహేంద్రవరము వెళ్ళితిని. ఈసారి నానిమిత్తము మాతల్లి దండ్రులటకుఁ గాపురము వచ్చిరి. నేను "బి. ఏ."చదు వుచుండఁగనే నాకుఁ బునస్సంధాన మయ్యెను. నేఁజదువుకొను నప్పుడును నాచేడియ నాతోడనే యుండెడిది. అట్లు కొన్ని నెలలు జరిగిన పిదప మాతల్లి, అయినంతవఱకుఁ జదువు చాలించి మన స్వగ్రామము వెళ్లిపోవుదమని బలవంత పెట్టెడిది. స్వగ్రామములోఁ గుమారుఁ డుద్యోగము చేయుట, కోడలు నట్టింటఁ దిరుగుట, యుండకుండఁ బొరుగూర నద్దె యిండ్లలో

నుండుటేమి గ్రహచారమని విసుగుకొనెడిది. మాఅబ్బాయి "బి. ఏ" అని చెప్పుటే మాతండ్రిగారికి సంతోషము. కావునఁ దమ కెన్ని కష్టములైనను సరే, నేను "బి. ఏ" యగువఱకు రాజమహేంద్రవరమునుండి కాపురము కదల్పమని మాతండ్రిగారనెడివారు. నాకును "బి. ఏ." యనిపించుకొనుటెంతో గొప్పగఁ దోఁచినది; "బి. ఏ." యనిన వారికెంతయో గౌరవముండెడిది. వారికిఁ దెలియని విషయము లేదనియే ప్రతివారు నను కొనెదరు; దొడ్డిలోఁ దోఁటకూర గింజలు నాటుట మొదలు సూర్యగోళాంతర్గత లాంఛనా పరిశీలనము వఱకు వారికిఁ దెలియని సంగతులు లేవు. అది యిది యననేల ? బి. ఏ. లకు దెలియని విషయమే లేదు. మఱియు వారాడినదే సత్యము; వారిప్రవర్తనమే నాగరికత; వారొకమాటకు నవ్వుచో నందుఁ దప్పక హాస్యమున్నదను మాటయే. అట్టియెడ వారికి ధనగౌరవములకు లోటేమి? ఒకవేళ వీరియందేలోపమున్నను 'బి. ఏ. లు వీరికేమి, అవి లోపముగ నెంచరా' దనుచుందురు. రాజమహేంద్రవరమున వీరిని జూచినప్పటినుండియు నేనును ఎప్పుడు బి. ఏ. యగుదునని తొందఱ పడుచుండువాఁడను. కాని పరీక్షల కొక్కొక్కప్పుడు రాత్రి నిదురమాని చాలసేపు మేలుకొనియుండి చదువవలసినపుడు నాకు విసుగుపుట్టి "యీమొలప్రాయము వైదికకర్మనిష్ఠలం బోనాడఁగ భోగములఁ బొందుట యెన్నడ"నుకొనెడివాఁడను; ఒక్కొక్కప్పుడు నాకింత చిన్నతనములో నేల వివాహము చేసిరని మాపితరులపై సణుఁగు

కొనువాఁడను. తుదకు బి. ఏ పరీక్షలుగూడ నైనవి.

మేము మరల మహిశపురము వచ్చితిమి. మా రాజుగారి సంస్థానములోఁ బని చేయుచు నింటకడనుండుటే మా తల్లిదండ్రులకోరిక. తమగ్రామవాసులను మా రాజుగా రాదరింపకపోరని మా తండ్రిగారి నమ్మకము. మఱియు మా మహిశపురములోఁ బుట్టి పెరిగినవారిలో బి. ఏ. లైనవారు తక్కువ. కావున నన్నుఁ జూచి మా తండ్రిగారికిఁ గల్గిన సంతోషము మా పురాధిపతికిని గలుగునని మా తండ్రిగారి యూహ. నాకు లేదనక యందఱికంటెఁ బెద్దజీతముతోఁ దమ సంస్థానమున రాజుగా రుద్యోగమిచ్చెదరని యువ్విళ్లూరుచుండిరి. ఆట్లానంద నిమగ్నులై రాజ సందర్శనమునకై పోయిరి. కోటగుమ్మము యొద్ద యొక గంట నిలుచుండిన పిదప రాజుగారెవ్వరిని లోపలకు రానీయవలదన్నారని ద్వారపాలకుఁడు చెప్పెను రాజుగారి కనుగ్రహము కలిగినప్పుడే వారిని జూచుట మేలని మా తండ్రిగారు మరలిరి; కాని వారిదర్శనమునకై కొన్న కమలాఫలములు వృథాపుచ్చరాదని వానిఁ గొనిపోయి దివానుగారిని దర్శించిరి. పరిదర్శన మించుక కష్టముమీఁదనే యయినది. తమ సంస్థానములోఁ దమపురమునందే పుట్టి పెరిగిన నన్ను వృద్ధిలోనికిఁ దెచ్చు భారము రాజుగారిదియు దివానుగారిదియునే యనియు నేను వారివాఁడనే యనియు వారి సంస్థానములో నేదో యుద్యోగము కల్పించి మహిశపురములోనే నన్నుంచవలయుననియు మా తండ్రిగారు కోరిరి. ఆమాటలకు దివానుగారు తమబల్లపైనున్న కాగితమునంకఁ జూ

చుచు "రాజుగారు విశాలహృదయులు; వారి దృక్పథమును విస్తీర్ణమైనది. దేశమంతటిపైనను వారిచూపులు ప్రసరించును. అర్హుఁడైనవాఁ డెచ్చటివాఁడైనను వాని కుద్యోగమిత్తురుగాని మామణిపురమువాఁడు మాజాతివాఁడు అని క్షుద్రాభిమానములు వారికిలేవు. అదిగాక, మీరువాఁడు "బి. ఏ." యని చెప్పితివే! మాసంస్థానములో బి. ఏ. లవసరములేదు. మారాజుగారి స్వాంతవ్యాజ్యములతో విశేషముగ ఖర్చగుచున్నది ఇప్పుడు బి. ఏ. లకుఁ దగిన జీతము నీయలేము" అనిరఁట మామంత్రిగారి మాటలు నాకుఁజెప్పి మాగ్రామమునకు సమీపమునే యెచ్చటనైనఁ బ్రయత్నింపవలెనని చెప్పెను.

కొలఁదిదినములలోనే పరీక్షాఫలితములు వచ్చినవి. వేదాంతభాగమందు నేనే ప్రథముఁడను. ఆవిషయమును గాఢాసక్తముగ చదివియు వేదాంతమనఁగానే నేను నవ్వుకొంటిని. గాని నిజముగ నది వేదాంతముకాదు. దానికి వేదముతో సంబంధము లేదు. అసలు వేదమే లేదు. అది ఇంచుక తార్కికనైతికమానసిక శాస్త్రముల సముదాయము. ఏదైనను రాష్ట్రమునంతకుఁ బరీక్షకువచ్చినవారిలో నేనే యగ్రగణ్యుఁడనగుటచే నాకును, సహజముగఁ గొంతగర్వముగనేయుండెను. నాకెంతగవచ్చిన విషయమును మఱువరాదనియు, విడువరాదనియు వ్రాసినే సృష్టి చేసినఁ బేరుప్రతిష్ఠలువచ్చునవియు నే నెంచితిని. ఏపాఠశాలలోనైన నాకుఁ బ్రతిమాలి యుద్యోగమిత్తురని తలఁచితిని. ముందుగ మామణిపురపుపాఠశాల ప్రధానోపాధ్యాయునే దర్శించితిని.

ఆయన చాలమంచివాఁడు. నన్నాదరించి పరీక్షలో నేనగ్రగణ్యుఁడనైనందులకు సంతోషించెను. కాని నేనడిగిన విషయము మాపాఠశాలలో బోధింపఁబడకుండుటచే నన్నుపాధ్యాయునిగఁ గైకొనుటకవకాశము లేదయ్యెనని చింతించిరి.

మాగ్రామమునకు సమీపముననున్న తణుకునగరమునఁ గలెక్టరు కచ్చేరిలో నుద్యోగము ఖాళీవచ్చెనని వింటిని. దానిం గూర్చి ప్రయత్నించుటకచ్చటకు వెళ్లితిని. ఆనగరమున నొక స్నేహితునింట బసచేసి శిరస్తాదారుగారిని జూచితిని. ఆయన యుద్యోగము లేవియు ఖాళీలేవనియు, ఉన్నను బ్రాహ్మణేతరుల కిచ్చెదరుగాని బ్రాహ్మణులకివ్వరనియుఁ జెప్పిరి. ఈసంగతి మాస్నేహితునకుఁ జెప్పి యచ్చటి కళాశాల ప్రధానోపాధ్యాయుని గూడ దర్శింపఁ దలఁచితినని నుడివితిని. కచ్చేరియందు ఖాళీలు లేవనుమాట యసత్యమనియు శిరస్తాదారు ఆయుద్యోగము తనవారి కివ్వదలఁచుకొని యిట్లు చెప్పుచున్నాఁడనియుఁ జెప్పి, [illegible] కలెక్టరుగారినే చూడుమని సలహాయిచ్చెను. ఆనాఁడు ప్రధానోపాధ్యాయుని జూచితిని. ఆయన నన్నుఁ గొంతతడవు నేను బైట నిలచినపిదప లోపలకు రాఁ బిలిచి కుశలప్రశ్నలన్నియు వేసి తుదకు మా[illegible]పురము ప్రధానోపాధ్యాయుఁడు చెప్పిన సమాధానమే చెప్పెను. ఇఁక కలెక్టరుగారిని జూడవలసియున్నది. అందులకానాఁడు ఆమఱునాఁడు తణుకునగరములోనే యాఁగితిని.

# 2

## మిత్రసందర్శనము

ఆసాయంకాలము ప్రధానోపాధ్యాయుని జూచి మరలి వచ్చునప్పటికింకను కచ్చేరినుండి నామిత్రుఁడు రాలేదు. వాని యింట నొంటరిగ నున్న నాకేమియుఁ దోఁచకపోవుటచే ఆ పురముననే యున్న మఱియొక మిత్రుని జూడఁ బోయితిని. ఇతఁడు రాజమహేంద్రవరములో నా పైతరగతిలోఁ జదువుచుండెడివాఁడు. ఇపుడు తమనగరమునఁ గళాశాలలో నుపాధ్యాయుఁడు. ఇతనియిల్లు తెలిసికొనుటకు నితని యింటిప్రక్కనుండియే రెండుమూఁడు సారులు తిరిగి రెండుసందులు మూఁడునకు వెళ్ళి, తుద కొకరి నడిగినఁగాని తెలియదయ్యెను, నొంటరిగ వచ్చు నొకబాలుని విశ్వసుందరుని యి ల్లెచ్చటయని యడిగితిని. మొదటనే యడుగుచో నింతప్రయాసము లేకపోయెడిది. నేను విశ్వసుందరుని గృహముదగ్గఱకు వెళ్ళునప్పటికి వాని యింటియొద్ద గుమ్మమున కెదురుగ నొకబండి యుండెను. బండివాఁడు ఎద్దులదగ్గఱనే నిలువఁబడి గారెలు తినుచుండెను. నేను బండిప్రక్కనుండి మెట్లు ఎక్కఁబోయితిని. అపుడే లోపలనుండి యొకయౌవనవతి బండివానికై యిత్తడిచెంబుతో జలము తెచ్చుచున్నది; నన్నుఁజూచి యామె యచ్చటనే యాగెను. నేనును మెట్లుదిగితిని. రెండునిమిషములచ్చటనే యుంటినిగాని యామె రాలేదు. కావున నేను మరల మెట్ల నెక్కితి. ఆమెయు మరల గదలి వచ్చుచుండెను. నన్నుఁ జూచుటతోడనే యామె

వెనుకడుగు వేసి యూఁగెను. అమ్మా మంచినీళ్లిప్పించరా అని బండివాఁడు కేక వేసెను. ఆమె జలము నిచ్చినతరువాతనే నేను లోపలకు వెళ్ళవచ్చునని నేను మరల మెట్లు దిగి నిలుచుంటిని. కాని ఆమెయు నేను లోపలకు వెళ్ళినతరువాతనే వీథిలోనికి వచ్చి జల మివ్వవచ్చు ననుకొని యూఁగెను. నేను మరల లోపలకు వెళ్ళఁబోయితి; మేము మరల తారసిల్లితిమి. ఇట్లు దాఁగుడుమూత లాడున ట్లయ్యెను. ఆమెకును నవ్వవచ్చెను. మందహాస మామెముఖముపైఁ గనఁబడెను.

అదేమి చిత్రమోగాని నవ్వున కొకవిశేషగుణము కలదు. ఎదుటివారు విశేషముగ నవ్వుచుండుచో మనకును, కారణము తెలియకపోయినను, నవ్వవచ్చును నవ్వునకొక్క లలితరూపము మందహాసమునకున్నట్లు. ఒకొక్కప్పుడొకమందహాసము ఎదుటివారి మందహాసమునకుఁ బ్రత్యుత్తరముగ వచ్చును. పరిచితు లగువారు మార్గమందుఁ దారసిల్లిరేని వారు విస్మితవదను లగుదురు; అది చూచి మనమును మందహాసము చేయుదుము. పిమ్మట ఎవరిదారిని వారు పోవుదుము. వారి స్మేరాననమునకు 'మీరు కుశలమా?' అని యర్థము. మన మందహాసమునకు 'మాకుఁ గుశలమే! మీరు క్షేమముగ నుంటిరా?' అని యర్థము. ఇట్లొక నిమిషమైన మార్గమం దాగకయే, నోరు తెరచి యొక్క మాటలాడకయే యన్యోన్య యోగక్షేమము లారయుటకీ ముఖవికాసము తోడ్పడుచున్నది. దీని ప్రయోజనము కాలహరణము చేయలేని కార్యవ్యాపృతులగు

వారుకాని పూర్ణముగ గ్రహింపలేరు. మఱియు వివిధహాస్యముల పరిభాషయు నెఱింగి నేర్పుతో వానిని వినియోగింపవలయును గాని యేసూత్రి మెమఱి యుండినను మెప్పువాండ్లును. తమ విద్యాసంపత్తిచేఁ గాక తమ తార్కికనైపుణ్యముచేతను గాక కేవలము నవ్వుతోడనే తమ ప్రతికక్షులకు వెఱపు పుట్టించువార లున్నారు. అకాలమున నవ్వి సభనుండి వెడలఁగొట్టబడిన వెడఁగులు నున్నారు.

ఆ బింబానన హాసితవదనార విందమునుజూచి నాకును నవ్వొవచ్చెను గాని దానినెంతో ప్రయత్నముగా నాపుకొంటిని. ఆమెయో పదినైదేండ్లవయసువచ్చినపడుచు. నే నిఱువదేండ్లు నిండని యువకుఁడను. మా కెట్టి నింద్యభావములు లేవని మే ముభయముల మాఱుగుసుమముగాని యొకరిని జూచి యొకరు నవ్వుకొనుచున్నమమ్ము చూచిన లోక మేమనును? నేను నోరు గట్టిగ బిగబట్టుకొని యామెవైపు చూడక క్రిందఁజూచుచు మెల్లెక్కి విశ్వసుందరా! అని కేక వేసితిని. చావడియం దెవ్వరు కనఁబడలేదు. వెనుకకు వచ్చుటకుగాని ముందునకు వెళ్ళుటకుగాని తోఁచక యట్లే నిలువఁబడితిని. ఇంతలో 'సోమేశ్వరుఁడు గారా? రండు' అని వినిపించెను. అది పురుష కంఠధ్వని. ఆధ్వని వినఁగనే నాప్రాణములు లేచివచ్చెను. నేను చావడిలోనికి వెళ్ళి యొకకుర్చీపైఁ గూర్చుంటిని. చావడి కొంచెము చిన్నదియే. మఱియు ఆనాఁడు వారింటఁ గొంతసందడిగ నుండెను. విశ్వసుందరుని తమ్ముఁడువచ్చి మాఅన్నయ్య ఫలాహారము చేయు

చున్నాఁడు, మూఁడునిమిషములలో వచ్చును, కూర్చుండుఁడు. అని చెప్పెను. నేను వచ్చినవేళ మంచిదే యనుకొని లోలోన సంతసించితిని; ఫలాహారము చేయుచున్నప్పుడే మెడబొత్తాము ఇప్పుకొనుట నాజూకుకాదుగావున ముందుగనే చొక్కావదులు చేసికొంటిని; జేబురుమాలుతోఁ జెయ్యి తుడుచుకొని యుంటిని. ఇంతలో విశ్వసుందరునితండ్రి తడియంగవస్త్రము విప్పి పొడిబట్ట కట్టుకొనుచుఁ జావడిలోనికి వచ్చెను. నేనిదివఱ కొకసారి యీయనను జూచియుంటినిగాన 'మీరు క్షేమముగా నున్నారా' యనియడిగితిని. ఆయన తలమాత్రమూపి మాటాడకయే వీధిలోనకి వెళ్లి "ఒరీ! బండికట్టినావా? అనిబండివానినడిగి లోపలకు వచ్చిరి. లోపలనుండి మఱియొక సుందరాంగి వచ్చెను. ఆమె మేను బంగారపుచాయ. ఆమె లేఁత గులాబిరంగుచీర కట్టుకొని మబ్బురంగుజాకెట్టు తొడుగుకొనెను. ఆమె నడుచునప్పు డందియలచప్పుడు లేదుకాని మెత్తని జోడుచప్పుడు వినవచ్చెను. ఆశబ్దమే నన్నామె నింతగఁ బరిశీలింపఁజేసినది. మన కన్నియలు పాదరక్షలు తొడిగికొనుట నాకుఁ గ్రొత్తగనే యుండెను. ఆమె యెవ్వరైయుండునని వెఱగొందుచుంటిని ఆమె నాప్రక్కనున్న బల్లనుజూపించి "నాన్నగారు! ఆబల్లమీఁది బట్టలమూట నిట్లిం"డని యడిగెను. ఆయన కామాటలు పూర్తిగవినఁబడక పూర్వమే "పోనిండు, నేనే తెచ్చుకొనియెద"నని యామె కదలెను. ఆబల్లప్రక్కనే నాకుర్చీయుండుటచే నేను లేచి కుర్చీ జరిపితిని. ఆమె నాప్రక్కనుండియే పోయి మూటతీసుకొనెను.

నిజముగా నాశరీరము గగుర్పొడిచెను. ఆమెబట్టలు తీసుకొని "కామేశ్వర చిల్లరయేది?" అనితమ్మునిదగ్గఱనుండి చిల్లరపుచ్చుకొని "కామేశ, ఆబల్లమీఁద పుస్తకములు పెట్టితిని. అన్నయ్యను తీయుమను" అని చెప్పి, నాన్నగారు వెళ్లివచ్చెదననియె. ఆయన శుభము శుభము అని ఆమెచేతిలోనున్నమూట పుచ్చుకొని వీథియరుగుమీఁదఁ బెట్టిరి. "ఇంకను అమ్మ లోపలనే యున్నది కాఁబోలు" అని యామె లోపలకుఁ బోవుచుండెను. "నీవు బండి యెక్కవే, రైలువేళ అయిపోవుచున్నది." అని యాయన "శశి వెళ్ళుచున్నదే" అని బిగ్గఱగఁ గేకవేసిరి. ఆమె బండియెక్కినది. ఆమెతల్లియు లోపలనుండి వచ్చినది. వారందఱు వీథిగుమ్మములో నిలువఁబడిరి. నేనుమాత్ర మెవ్వరిచేఁ బలుకరింపఁబడక చావడిలోనే యుంటిని. నీ రెవ్వరు చూడకుండఁగ వెళ్లిపోవుదమన్నను వీలులేదయ్యె. కావున బల్లమీఁదనున్న పుస్తకముతీసి చూచుచుంటిని. ఇంతలో విశ్వసుందరుఁడు వచ్చెను. "నిన్నొక్కఁడను గూర్చుండఁ జేసితి; ఏమియు ననుకొనకుము. మాచెల్లెలు లూరికి వెళ్ళుచున్నది. ఆతొందఱలో నుంటిమి" అనియెను. "దానికేమిగాని మీపనులకడ్డము వచ్చితినని నాకే సిగ్గగుచున్నది. మఱియొకప్పుడు కలిసికొందములె" అని నేను లేచితిని. అతఁడును బండియెక్కి వెళ్ళెను. నేను మరల బొత్తాము పెట్టుకొని కుర్చీనుండి లేచి వారింటనుండివచ్చితిని.

బండి యెక్కి వెళ్ళిన యువతియే యింకను నాచిత్తమున నుండెను. ఆమెను నహృదయమున స్థిరముగ నిల్పుటకేది

హేతువో నే నెఱుఁగను. ఆకసకాంగి తటిల్లతవలె నాదృష్టి పథమునుండి వెడలిపోయెనుగాని నే తేఱిపాఱిచూచువఱకునైన నచ్చట నుండలేదు; నిజమునకు నాకప్పుడు చూచినవలెనను తలఁపు కలుగనే లేదు. కావున ఆమె ముఖము చంద్రబింబమువలె నుండెనని కాని, కన్నులు గండుమీలఁ బోలియున్నవని గాని, కంఠము శంఖమని గాని నేను చెప్పలేను. నేను మొదటఁ జూచిన పద్మాక్షియు సౌందర్యవతియే; ఆమె రూపము చూచితిని. అయినను నే నామెనుగుఱించి తలఁపలేదు. ఈమె శరీర సౌందర్యము విలోకింపకపోయినను ఈమెతో మాటాడకపోయినను నాచిత్త మెద్దానిచే నాకర్షింపఁబడినదో నాకుఁదెలియదు. ఆవిక తొడుగుకొనిన యీ రమణీమణికిని జాకెట్టు తొడిగిన యీ చంచలనయనకును గలభేదము విస్పష్టముగ గోచరించెను మెట్లెక్కి వచ్చువానినన్నుఁజూచియే ఆమె తొలఁగెను. ఈమెయో జోడుతో నాప్రక్కనుండియే వెళ్ళి మూట తెచ్చుకొనెను. ఈమె గమనమందును, వచోధోరణియందును గొంత సొబగును వెలివియు విశదమైనను నారీమణులకు సహజభూషణమైనలజ్జ యీమెకడ గోచరింపకుండుట లోపమయ్యె; అయిన నీమెయందేవిధమైన లోప మారోపించుటకును నాకుబుద్ధిపుట్టదు. నేనిట్లు సంచలితహృదయుఁడనగుట గొప్ప తప్పిదమే యని యెఱుఁగుదును కాని యెంత ప్రయత్నించినను ఆమెను మఱువవలెననుకొన్నను ఆమెనుగూర్చియే తలఁపులు పుట్టుచుండెను. ఇంతకు నాకు నిజము : పూర్వకావ్యములందేమిచెప్పినను ఆలో

కమునసే యనురక్తి పుట్టించుట కంబుజనేత్రల యందమే కారణముకాదు. అన్యమొకటి కలదు. కాని అది యనధారాసాధ్యము.

నే నామగువను గూర్చియే తలంపోయుచుం బురమందిరమునకుం బోయితిని. నేనుకూడ బి. ఏ నైతిని గావునం బురమందిరమునకుం బోవుటకు నాకును తాహతు కలిగినది. మందిరమందలి నిగనిగలాడుచున్న కుర్చీలును బల్లలును దళతళ మెఱయుచుండెను. బల్లమీఁదనుండిన యొక వార్తాపత్రిక తీసి యందుద్యోగవిషయ ప్రకటనలను జూచుచుంటిని. అచ్చట మఱెవ్వరును లేరు. వెనుకనైపున్న వసారాలోనుండి మాటలుమాత్రము వినఁబడుచుండెను. నేవినిన కంఠధ్వని యేడ్లు గడచిన వారిదేకాని పదములుమాత్రము పసుల గాచు పిల్లలపదములవలె నుండెను. వారు పేకాడుకొనుచు నొకరినొకరు దూషించుకొనుట తెలియఁబడె. అంతలో నాయొద్దకొక సేవకుఁడు వచ్చి "మీ కెవరికొఱకు వచ్చితిరి" అనియడిగెను. ఎవరికొఱకుఁగాదని నిజముచెప్పితిని. "అట్లైనచో మీ రిందుండరాదు. సభ్యులుతప్ప పైవారిటకు వచ్చుటకు వీలులే"దని నాకు వాఁడు బైటకు మార్గముచూపెను. నన్ను బైటకుం బంపినందులకుం గోపము లేదుగాని విద్యావంతులు, ధనవంతులు, నాగరికులు, ఉన్నతోద్యోగస్థులు వీరిసంఘమందే యవాచ్యపదములు వినఁబడుటకుం జింతయయ్యెను. పై వారలు వెళ్ళఁదగిన పురమందిరమేదైనం గలదాయని యాసేవకునే యడిగితిని, "అవతల వీథిని

దేవుఁడుగుడి ప్రక్కనున్నది; వెళ్ళుఁడ"ని వాఁడు చెప్పెను. ఈ రెండవ మందిరమునకు వచ్చితిని; దీని ముందు వాకిలి మిక్కిలి విశాలముగనుండెను. అందే పూలతోఁటగలదు. పలువిధములైన పుష్పములను జూచినను వాని సౌరభము నాఘ్రాణించినను ఆనాఁటి శ్రమలనట మఱచిపోదుము. అవి చాలభాగ మన్యదేశీయమైన మొలకలగుటచే వాని పేరులు మాత్రము చెప్పజాలను. ఈమందిరమును విశాలముగనే యున్నది. ఇచ్చటను వార్తాపత్రికల కడ నేనొక్కఁడనే కూర్చుని చదువుచుంటిని. ఇందు సభ్యు లెక్కుడుమందియే కలరు. వారు ప్రక్కవసారాలో నాలుగైదు గుంపులుగనుండిరి. ఇట మాటలకంటె నెక్కువగ డబ్బులచప్పుడే వినఁబడెను. ప్రాంగణ వృక్షపుష్పసౌరభము కంటె వదనోద్గత ధూమగంధ మెక్కువగ నుండెను. వారాడెడు నాటలవలనఁ గాలహరణము మాత్రమే జరుగుట లేదు. ఆటను శ్రుతిగనూన రాగముల యాలాపనలు చేయఁబడుచుండెను. గెలుపోటులనుబట్టి రాగములును మారుచుండెను గాన గాంధర్వము పూర్తిగఁ బోషింపఁబడుచుండెను. ఈమందిరమునను నేనెవ్వరి నెఱుఁగకపోవుటచే వార్తాపత్రికలున్న బల్లయొద్ద నే కూర్చుంటిని. కొంతసేపటి కెవ్వరోవచ్చి నాకన్నులుమూసిరి. నాకన్నులు మూయఁబడినపుడు నే నింతకుఁబూర్వము చూచిన కోమలాంగియే గోచరించినది. మూసినవారెవరో తెలియలేక వారి ముంజేతులు నాచేతులతోఁ దడివి చూచి "ఇసీ, కంకణములు లేవు, ఎవరైననేమి" అంటిని. ఆమాటలకతఁడు

పక్కననవ్వి "ఇంతవాఁడవా" అనెను. నేను వెనుకకుఁదిరిగి చూచితిని; అతఁడు విశ్వసుందరుఁడే. అతనిసోదరిని రైలెక్కించి వచ్చెను. "నీకొఱకు వతిలి మందిరమునకు వెళ్ళియుంటిని, అచ్చటకు రాకూడదసిరి" అని నేనంటిని.

"ఓహో. అదియా, అది యామధ్యనే ఏర్పడినది. ఇందులోనికిఁగూడ నితరులు రాకూడదుగాని"

"అయినచో నేనిచ్చటినుండి వెళ్ళిపోవలయునా?" యని యడిగితిని.

అక్కఱలేదు. సభ్యులతో నెవ్వరైన రావచ్చును. నిర్ణయమదిగాని, తఱచు పరులు వచ్చుచునేయుందురు. ఇందులో నౌకరిద్దఱున్నారు. వారువచ్చునప్పుడే నౌకరులు శ్రద్ధతోఁబై వారిని పంపివేయుదురు. మిగిలినవారు మందిర క్షేమమును గూర్చి యంత శ్రద్ధపుచ్చుకొనరు."

"అవునులే! ఒకనియమ ముండవలయును. మీతోఁట బాగుగనున్నది." అని నేను ప్రశంసించితిని.

కాని యతఁడు.

"ఆతోఁటనుగుఱించియే సంవత్సరమున కాఱువందలగుచున్నవి. దీనిమూలముననే పుస్తకములు కొనుటలేదు. అదిగాక పుస్తకములు కావలయునని యెవ్వరు నడుగరు. వచ్చినవారు పేకయో, చదరంగమో యాడివెళ్ళుదురు. కొందఱదిగో! ఆచెట్లక్రిందఁ గూర్చుండి కబురులు చెప్పుకొని వెళ్ళుదురు" అని విశ్వసుందరుఁడు తత్తైలనావిముఖుఁడగుటచే మందిరముందలి

గ్రంథసంగ్రహణాలోపమును దెల్పి 'సరేగాని, నీ వేమిపనిమీఁద వచ్చితివి" అని నన్నడిగెను.

"ఏదైన నుద్యోగమునకుఁ బ్రయత్నించుటకు వచ్చితిని" అని వార్తాపత్రికలపైనున్న ప్రకటనలలోని బొమ్మవైపు చూచుచుంటిని.

"ఆఁగొమ్మల నేమిచూచెదవు? ఈపుస్తకములో బొమ్మలు చాల నున్నవి చూడుము" అని యొకయింగ్లీషు మాస పత్రిక యందిచ్చెను. అందుఁ దియ్యఁగనే యొకచిత్తరువుండెను. అందు భార్యాభర్తలిద్దరు పోరాడుచుండిరి; వారింటికివచ్చిన యతిథి తెల్లపోయి చూచుచుండెను. అదిచూచి నేను నవ్వితిని "ఎందులకయ్యా, ఇట్టిపుస్తకముల"ని యడిగితిని.

"నీవు నవ్వితివే. అందులకే; కచ్చేరినుండి పని చేసివచ్చిన వాండ్రు ఈకథలు చదివి కులాసగ వెళ్ళపోవుటకు" అని విశ్వసుందరుఁడు పలికెను.

"కులాసగ నుండుటకు మార్గమిదియా, ఇతరుల గృహములందలి కలతలువినఁగాని సంతోషము గలుగదా ? మంచి పుస్తకములే"! యని నే నాక్షేపణ చేసితిని.

"కథ చదువకుండనే ఆక్షేపణచేయుట వేమి?ఇది చదువుచో నీవును నీభార్యయు నెన్నడు పోరాడకుండ నీతి బోధించునేమో" యని విశ్వసుందరుఁడు సమర్థించెను.

"చాలు, చాలు, హంసవింశతి చదువుచో స్త్రీలకు పాతివ్రత్యము వచ్చునన్నట్లే యున్నదిలే."

"పుస్తకములు చదువుటవలనఁ బ్రయోజనమే లేదందువా యేమి? దీనికేమిగాని, నీవు వచ్చినపనియేమైనది? ఎవరినైనఁ జూచితివా?"

"ఒకరిద్దఱను జూచితినిగాని లాభము లేకపోయెను, రేపు కలక్టరును జూడవలెననియున్నది. అందుల కాగినాను"

"మాప్రధానోపాధ్యాయుని జూడలేకపోయితివా? ఈయన మంచివాఁడు కూడను; ఈయన ప్రోత్సాహముచేతనే మాసోదరిని బి. ఏ చదువుటకుఁ జెన్నపట్టణము పంపించవలెనని నిశ్చయముచేసితిమి. ఆసందడిచేతనే నీతో మాట్లాడుటకైన వీలులేకపోయినది."

"మీచెల్లెలు బి. ఏ. చదువుటకు వెళ్ళుచున్నదా? సంతోషమే ఇదివఱకు నింతవఱకుఁ జదివినవారు మనవారిలో లేరనుకొనెదను. తుదకు నేనుకూడ మరలఁ జదువవలసివచ్చునట్లున్నది. ఏపాఠశాలకుఁబోయిన, చరిత్ర చదివినవాఁడు, గణితము చదివినవాఁడు, విజ్ఞాన శాస్త్రములు చదినవాఁడు కావలెననుచున్నారుగాని, మాకుఁ జోటులేదు. మామణిపురములోను నిచ్చటనుగూడ నిట్లే యైనది"అని నాకతనిమాటవలనఁ గల్గిన విస్మయము మఱుగుపఱచి చెప్పితిని.

" ఆమాటనిజమే. ఉపాధ్యాయుఁడుగ నుండఁదలఁచుకొనుచో నాయాశాస్త్రములు చదువవలసినదే. ఒకసారి అట్లు వెళ్ళివచ్చెదము రా" అని యతఁడు ముందునకు నడిచెను. నే నాతని వెంటవెళ్ళితిని; చెట్టుక్రింద వేయఁబడిన బల్లపైఁ గూర్చుం

టిమి. అచ్చట నుండిన వారందఱును నాకుఁ గ్రొత్తయే. వారి కబురులు పట్టిచూడ నెవ్వరో న్యాయాధిపతిని దూషించు చున్నట్లున్నది. మఱియొకరు తమకచ్చేరిలోని యొకగుమాస్తా భార్యనుబెట్టు బాధలను వర్ణించుచుండెను; మఱియొకఁడు పుర మందలి లోభివైశ్యుని నిందించుచుండెను. వారి కథానాయకు లను నే నెఱుఁగకపోవుటచే నచ్చటివారికిఁ గలుగు నానందము నాకుఁ గలుగలేదు. మఱియుఁ బొద్దుపోవుచుండెను. కావున నచ్చటినుండి బైలుదేరితిమి. నేనును విశ్వసుందరుఁడును మా ట్లాడుకొనుచు మామా బసలుచేరితిమి.

---

## 3

### పూర్వసమాచారము.

ఆరాత్రి భోజనసమయమున నామిత్త్రునితో విశ్వసుం దరుని జూచితి ననియుఁ బురమందిరముల కేగితిననియుఁ జెప్పి తిని. విశ్వసుందరుని జనకుఁడు కుమార్తె విద్యకొఱకే యుద్యో గము సెలవుపుచ్చుకొని యిటఁ గాపురముండె నని నామిత్త్రుఁ డు నాకెఱింగించెను. మఱియు ఆయన యచిరకాలములోనే యుద్యోగము చాలించుకొన నున్నాఁడనియు ఆపట్టణమునఁ జదు వఁ దగిన విద్య యామెకుఁ బూర్తి యైనను దన్నగరమందుండు సౌఖ్యమితర చోటుల లేకపోవుటచే నందే యాయన వసింతు

రనియు నుడివెను. ఆయభిప్రాయ ముండుటవలననే విశ్వసుందరుని నచ్చటఁ గళాశాలలో నుపాధ్యాయునిగఁ బ్రవేశపెట్టించిరఁట. అతఁడా సంగతులు చెప్పుచున్నపుడే, "విశ్వసుందరుని చెలియలను జెన్నపట్టణము పంపెదరఁట గదా !" యని నేను వినినసంగతి క్రొత్తవిశేషముగ నాతనికిఁ జెప్పితిని. "అవును, పాప మాయమ్మాయి కింకేమి గలదు? పొద్దుపోవుటకైన నేదోయొక వ్యాపృతియుండ వలయుఁగదా ! తల్లిదండ్రులున్నంతకాల మెక్కువగఁ జూచెదరుగాని తరువాత ఎవరు చూతురు? ఏ బాలికాపాఠశాలలోనైన నుపాధ్యాయినిగ నుండవచ్చును. అంతవఱకు అవసరము రాదుగాని; విశ్వసుందరుఁడు కూడఁ జెలియలి నెంతో యెక్కువగనే చూచును" అని నే మనసులోఁ గోరినట్లుగనే నేఁజూచిన కాంతనుగూర్చి యాతఁడిన్ని సంగతులు చెప్పెను. ఈవిషయములు విని నే నివ్వెరపోయితి. పాపము ! ఆమెవితంతువా ? అనియడిగితిని. ఆమెభర్త పెండ్లియైన యచిరకాలములోనే మరణించె ననియు నామె తండ్రి యామెను బాలశాలకుఁ బంపుచుండెననియు నామెయు శ్రద్ధగనే చదువుకొనెడిదనియు నతఁడు తెల్పెను. ఆ రాత్రియంతయు నాయుద్యోగమునుగూర్చి కాక యామెను గుఱించియే తలఁ పోసితిని.

నా కుద్యోగప్రయత్నమం దలత్యమే కలిగెను. కాని యెవ రేని యేమిచేయుచుంటివని యడిగిన వారికి సమాధానము చెప్పుటకై పనికివచ్చునని మఱునాఁ డుదయమునఁ గలక్టరుగా

రిని జూచుటకు వెళ్లితిని. ఆయన దరఖాస్తు వ్రాసి కచ్చేరిలో నిమ్మనియు నేదేని పనివచ్చునపుడాలోచించెదమనియుఁ జెప్పిరి. ఒక కాకితమువ్రాసి కచ్చేరిలో నిచ్చితిని.

కాంతావలోకమునచే నాచిత్తమునఁగల్గిన విభ్రమమును నామిత్రుని వచనము లినుమడింపఁజేసినవి. ఆమె యిఁక యెక్కడ చదువునో సెలవులు ముగియకపూర్వమే యెచ్చటి కేగుచున్నదో, అదేమిటి ఇదేమిటి, ఆమెనుగూర్చి తెలియఁగల విషయములన్నియుఁ దెలిసికొనుటకు యత్నించితిని. కచ్చేరిలో నేను కాగితమిచ్చి వచ్చినతరువాతఁ జేసిన పని యదియే. నేను ప్రయాసపడి తెలిసికొనిన విషయము లిపుడే మీకుఁ జెప్పెదను.

విశ్వసుందరుని తండ్రి చైకితాయనుఁడుగారు. ఆయన కిద్దఱు కుమార్తెలు. జ్యేష్ఠకుమారికకు సంబంధము వెదకునపుడాయనకుఁ గొన్ని సంగతు లనుభవమయ్యెను: పెండ్లి కుమారి తను జూడవచ్చినవారు "అమ్మాయి యేమిచదువుచున్నది? సంగీతము నేర్చుకొనుచున్నదా?" యని యడుగుచువచ్చిరి. రెండవ కుమార్తెయగు శశిరేఖకుఁ జదువును సంగీతమును నెక్కువగాఁ జెప్పించుచోఁ దక్కువకట్నములోనే మంచిసంబంధము రావచ్చునని యీమెకుఁ జిన్ననాఁటనుండియు శ్రద్ధతోఁ జదువు చెప్పించిరి. హవ్యవాహనుఁడుగా రీమెచదువు చూచియే కట్నమేమియుఁ గోరక యీమెను దమకుమారునకుఁ జేసికొనిరి.

ఈ హవ్యవాహనుఁడుగారి సంగతియు మీకుఁ గొం

చెము చెప్పెదను. ఆయన రాజమహేంద్రవరములో నొక తెలుఁగువైద్యుఁడు; ఇంగ్లీషుకూడ బాగుగ నేర్చినవాఁడు; బాగుగ మాటాడఁగలఁడు. ఆయన వచోద్ధోరణిఁజూడ మొదట బసవ రాజీయము చదివి తరువాత గౌరవమునకో, ముచ్చటకో, యవసరమునకో యింగ్లీషు చదివినట్లు కనఁబడును; అక్షరాభ్యాసమే ఏ. బి. సి. డీ. లతోనై యుండవచ్చునని తోఁచును. ఆయన కాపురమున్నయిల్లు ఆయన సంపాదించినదే; అది చిన్నదైయిఱుకుగ నుండినను బహుభద్రముగను నందముగను నుండును. వీధిగుమ్మము తెరదాటఁగనే చిన్నచావడియు నందు నాలుగుకుర్చీలును నొకబల్లయు దానిపై నొక చిన్నబీరువాయుఁ గలవు. బల్లక్రిందనే చిత్తుకాగితములు వేయ బుట్ట యున్నది. ఈ చావిడిని జేరి పశ్చిమముగనున్న కొట్టులోఁ గొన్నికల్వములు, ఒకత్రాసు కొన్నిబుడ్లును గలవు. సాధారణముగ నీయన వినియోగించు మందులు బల్లమీఁదనున్న బీరువాలో నేయుంచును. ఇంతయింగ్లీషు వచ్చిన యీయనకు మొదటినుండియు వైద్యము చేయుటందే యభిప్రాయముండెనేని సామాన్యముగ నెక్కువగౌరవమును బడయుచుండిన యింగ్లీషువైద్యమునే యీయనయు నభ్యసించి వైద్యకళాశాలలోఁ జదివియుందురు. హవ్యవాహనుఁడుగారు మొదట గలక్టరుకచ్చేరిలోఁ బనిచేసిరి. ఈయన యుద్యోగములో నున్న కాలములోనే రాజమహేంద్రవరములో ఈయిల్లు సంపాదించిరి. ఈయన ప్రయోజకత్వమును సిరిని జూచి నోర్వలేని కొందఱీర్ష్యవహించి యీయనపై నాకాశరామన్నయర్జీలిచ్చిరి.

సర్కారుసొమ్ములను బ్రజలసొమ్ములను నపహరించిరని వాదులు పుట్టించిరి. హవ్యవాహనుఁడుగారికి రోషమువచ్చి యాపని మానివేసిరి. ఎవరినైనఁజూచి యాశ్రయించి వారిని పొగడు నభిప్రాయముగాని యభ్యాసముగాని యాయనకు లేదు. ఏదైనను గట్టివిడిచినట్లు కటికి పటుకు చెప్పుదురుగాని నీళ్లునములరు. కలక్టరుకచ్చేరిలోఁ బని మానిన తరువాత నితరస్థలముం దాయన ప్రయత్నము చేయలేదు. స్వతంత్రజీవనోపాధికై యోచించిరి. ఇదివఱకుఁ జదివిన చదువువలన నట్టిదేదియు సాధ్యము కాలేదు. కావున నిఁక సులువైనది వైద్యము చేయుటయని బసవరాజీయము కొని దానిని బరిపూర్ణముగఁ జదివిరి కొన్ని యింగ్లీషువైద్య గ్రంథములుకూడఁ జదివిరి. ఈయనకు వైద్యమే జీవనోపాధి గనుక నెవ్వరికిని డబ్బుపుచ్చుకొనక మందునివ్వరు. ఒక్కొక్కపు డా పుచ్చుకొనునది చాల హెచ్చుగనుండును. మఱియు నెవ్వరేని తమయింటికి రమ్మనిపిలచినపుడు, అనుద్యోగులగు నాయుర్వేద వైద్యులగౌరవము నిలువఁబెట్టుటకు, నాలుగైదు సారులువచ్చి బ్రతిమాలి గుఱ్ఱపుబండిని దెచ్చినగాని వెళ్ళరు. అట్లైనను హవ్యవాహనుఁడుగారిది మంచిహస్తమని వాడుకపడుటచే ఆయనదగ్గఱకుఁ గొందఱు వచ్చుచునే యుందురు. ఆయన మొదటినుండియు నవనాగరికతాభిమాని యగుటచేఁ బుత్త్రుఁడు చెన్నపట్టణములోఁ జదువుకొనునపుడు కోడలను దమదగ్గఱనే యుంచుకొని దొరసానుల పాఠశాలలోనికిఁ బంపిరి. కుమారుఁడు యం. ఏ. అగువఱకు వానికిఁ బునస్సంధానము

చేయఁదలఁచుకొనక పోవుటచేఁ గుమారుఁడును గోడలును ఒక రితో నొకరు కలసిమెలసియుండలేరు. భర్తలు వచ్చిరేని పడఁతులు తలుపు మూలల దాఁగుట లోపలకుఁ బరుగిడుట తలుపు వేసికొనుట హన్యవాహనుఁడుగారికి నసహ్యమే కాని యీయన కోడలు శశిరేఖ, మొదట, భర్త యెదుటపడుటకుఁ గొంత సిగ్గు పడుచునేయుండెను. మఱియు నామెభర్తయు బి. ఏ. యం. ఏ. లకై చెన్నపట్టణములోనే యుండువాఁడు; సెలవునకైన నింటికి వచ్చువాఁడు కాఁడు. శశిరేఖ విద్యపై మిక్కిలి శ్రద్ధగలిగి పాఠశాలయందును నింటియందును దదేకదృష్టి తోడనే యుండెడిది. ఈమె తెలివినిబట్టి యీ యాఁడుపిల్లల పాఠశాలలోఁ గొన్ని తరగతులు చదువకయే పైతరగతులలో వేసెడివారు. దొరసానులతోఁగలసి మాటాడుచుండుటచే నింగ్లీషునం దామె కేమగవాఁడును జాలఁడు. కాని, ఈమె తెలివియు, రూపమును నడవిఁగాచిన వెన్నెలయయ్యెను. ఆమె కిన్నియొసఁగిన దేవుఁడామె భర్తకాయువుమాత్ర మీయఁడయ్యెను. శశిరేఖ భర్త యం. ఏ. చదువుచుండఁగనే పరలోకమునకేగెను. అప్పటినుండియు నీమె తండ్రియింటనే యుండుచుండెను.

చైకితాయనుఁడుగారు తను పుత్రికకుఁ గల్గిన దుర్భరావస్థ చూచి సహింపలేక యీమె మిక్కిలి బెంగపడునని మాత్రము పైకి ధైర్యము వహించి యుండువారు. ఆమెకు జీవనము కష్టముగ దోఁచకుండుటకై యీమె మనస్సు కనిపెట్టి వర్తించుచుండువారు. ఆమె దుఃఖమును మఱచు

టకై బంధువు లాక్షేపణ చేయుచుండినను ఆమెను గళాశాలలోఁ బ్రవేశ పెట్టిరి. ఆయన జీవించి యున్నన్నాళ్ళును నామెను గౌరవముగఁజూతురు గాని తరువాత నేమగునో కాన నామెకు విద్యాభ్యాసంగము కలుగఁజేయవలెననుకొనిరి. ఆమె కొఱకే ఆయన యుద్యోగము సెలవుపెట్టికొని తత్పనగరమునఁ గాపురము పెట్టిరి. ఇంతవఱకుఁ జదివినతరువాత బి. ఎ. చదువుటకు శశిరేఖకును గోరికపుట్టెను; చదివింపవలెనని తండ్రికిని దోఁచెను. కాని యామెకుఁ జెన్నపట్టణములోనగు వ్యయము భరించుట కష్టమను భయముగలిగి స్త్రీలకున్నత విద్య చెప్పింపవలయు ననునభిమానము కల శశిరేఖ మామగారేమైన సహాయము చేయుదురేమోయని హవ్యవాహనుఁడుగారిని నడుగ వచ్చెను. చైకితాయనుఁడుగారు పెఱవారులేని సమయము చూచి తాము వచ్చినపని చెప్పిరి. ఈయన చెప్పినదంతయు విని హవ్యవాహనుఁడుగారు "బావగారు! దీనికై మీరు రైలుఖర్చులు పెట్టుకొని రావలయునా? నాకంటె మీదేగద బాధ్యత" అని పలుకుచుండిరి. అంతలోనే మఱియొకఁడు రామకృష్ణయ్య అనునతఁడు వచ్చి "అమ్మాయ్యా జ్వరమేమియు తగ్గలేదు. మీరొకసారివచ్చి చూడవలయునని మఱిమఱి చెప్పుమని కోరినారు." అనినుడివెను. నిద్రపట్టినదాయని హవ్యవాహనుఁడుగారడిగిరి.

"నిద్రగూడ బాగుగఁబట్టలేదు."

"మందిచ్చినారా?"

"ఆ".

"కషాయముకూడ ?"

"ఆ".

"నేను చెప్పిన మూలికలన్ని వేసి కాచినారా?"

"సముద్రిపాంచి, జటామాంసి, ఏవేవో దొరక లేదను కొనినారు"

"అవి లేకుండఁ గషాయము కాచి యిచ్చినారా? నేను చెప్పినదొకటి మీరు చేసినదొకటి ! ఏదైన వికటించినయెడల వైద్యుఁడు చేసినాఁడని నెపము వేయుట కా ?"

"లేదండి. అందుచేత నే ఆకషాయ మివ్వలేదు. దానికి బదులేమైన మందుండు నేమో ఇచ్చెదరేమో అడిగిరమ్మని కూడ చెప్పినారు."

"మందులు లేకేమి ? మందులు లేకపోవునా ? ఇన్ని సంవత్సరములనుండి యింతమందికి జబ్బులు కుదిర్చినపుడు మందు లేయుండవా ? పిలిచిన మాటాడునట్టి మందులున్నవి. వాని పటుత్వము గ్రహించి పుచ్చుకొను సమర్థులుండవలయునుగాని!"

"మీరు బీదలను సాదలను గనిపెట్టి యనుగ్రహించవలయును గాని"

"ఎవరు కారు బీదలు? మాదగ్గఱకు వచ్చినపు డందఱు బీదలే. ఇపుడు మీరనగ మీరు కాదు. ఎవరి సంగతైనను జెప్పు చున్నాను. రోగములు తగుల్చుకొను నపుడందఱు భాగ్యవం తులే. అవి కుదుర్చుకొనుటకు మాకీయఁబోవునప్పటికిఁ బీద తనము వచ్చును"

"ఆ. అదినిజమే. ధనమంతయూ లాగుకొనఁబడి యప్పటికి జోగులగుదురు" అని చైకితాయనుఁడుగారనిరి.

"అదికాదండి. మందిచ్చి శరీరముకాపాడెడు వైద్యున కిచ్చుటకుఁ జేతులురావు. భోగమువాండ్రకిచ్చుటకు, అబద్ధము లాడు సాక్షులకు లంచములిచ్చుటకు నెంతసొమ్మైనను వచ్చును"

అని హవ్యవాహనుఁడుగారు వైద్యులుచేయుమేలునకుఁ దగిన పారితోషికము పొందలేకుండుట తెల్పిరి. తానువచ్చినపుడే యిట్టిప్రసంగము వచ్చినందులకుఁ గించనొంది రామకృష్ణయ్య "గొప్పవారిదగ్గఱ మీరెంతైన దండించి పుచ్చుకొనవలసినదే కాని, మాబోటి పేదలేమిచ్చుకొనఁగలరు? మమ్ములను మీ రొకకంటఁ గనిపెట్టుచుండవలయునుగాని," అని పలికెను.

"పేదతనమున కెక్కడికి? ఎవరుకారు పేదలు? పేద వాఁడను గావుననే డబ్బుపుచ్చుకొని వైద్యము చేయుచున్నాను. అసలుశాస్త్రములో డబ్బు పుచ్చుకొనగూడదనియే చెప్పి యున్నది." అని హవ్యవాహనుఁడుగారు ప్రత్యుత్తరమిచ్చి తమ ధనాకాంక్షకుఁ గారణము తెల్పిరి.

అపుడొక తొమ్మిదేండ్లబాలిక, హవ్యవాహనుఁడుగారి కుమారిత, లోపలిగుమ్మము తెరదీసికొనివచ్చెను. ఆమెనుజూచి హవ్యవాహనుఁడుగారు "ఒసీ, కమలా నీమేజోడేది? పో, తల దువ్వుకొనిరా, అని కోపపడిరి. ఆబాలిక లోపలకుఁ బోయెను. మఱల ఆయన "చూచితిరా! పేదఱికముచేతనే యందఱు అన్నివృత్తులు చేసికొనుట. ఎవరిపట్టుకు వారే పేదలు. ఇరుగో

మా బావగారు, ఉప్పాడ జరీబట్ట కట్టుకొనివచ్చినారు. ఏరును బేదవారే! బావగారు! చూచితిరా ? ఈలాగున్నది. మనదగ్గఱ నుండి పట్టుకొని వెళ్ళువారే కాని యిచ్చేనువారొకరు లేరు." అని బల్లమీఁద బీరువా తెఱచి యొక సీసాలోని మాత్రిలు మూఁడుతీసిరి.

ఈమాటలు చైకితాయనుఁడుగారిని గుఱించి చెప్పినవే యని యాయన గ్రహించిరి "ఉన్నవారి దగ్గఱకు వచ్చి పట్టు కొని వెళ్లుదురుగాని, నాబోఁటి లేనివానిదగ్గఱకు రారుగద!" అనిజవాబు చెప్పిరి. హవ్యవాహనుఁడుగారు మూఁడుమాత్రిలు రామకృష్ణయ్య కిచ్చి మిరియాల కషాయముతో నిమ్మని చెప్పిరి. అతఁడు "మీరు తప్పకుండ దయచేయవలె"నని వెడలెను. హవ్యవాహనుఁడుగారు మరల కూర్చుండి, "ఏమి, బావగారు, అందఱు క్షేమముగానున్నారా? అమ్మాయి ఎక్కడనున్నది?" అని యడిగిరి.

"ఆ క్షేమమె అమ్మాయి ఎక్కడ నుండును? నాదగ్గ ఱనే యున్నది. ఇంటరుమీడియెటుపరీక్ష అయినది. విన్నారుగ. ఇపుడు మీయనుగ్రహమువలన బి. ఏ. కూడఁ జదివింపఁదలఁచి యే మీదర్శనమునకు వచ్చితిని." అని చైకితాయనుఁడుగారు తమవచ్చినపని వెల్లడించిరి.

పాప మపుడు హవ్యవాహనుఁడుగారికి దుఃఖము వచ్చెను. ఇంచుక తలవాల్చుకొని మాటాడలేక, రెండునిమిష ములకిట్లనిరి. "మా కృష్ణునిమాట జ్ఞాపకము వచ్చుచున్నది.

వాఁడు సీమపచ్చిమెరపకాయవంటివాఁడుగద! వానిని చెన్న
పట్టణము పంపకపోయిన యెడల బాగుండెడిదేమో? ఇంతకు
మాయదృష్టము" అని యూరకుండిరి.

"మాకు మీకుఁగూడ అదృష్టములేదు. ఇంతకు, మా
అమ్మాయి నిర్భాగ్యురాలు. వెనుకటిసంగతులు జ్ఞాపకము చేసి
కొనిన కొలఁది విచారమేగాని యేమియు లాభము లేదుగద!"
అని చైకితాయనుఁడుగారు విచారించిరి.

"అంతేలెండు. వారినిజూచి వీరినిజూచి యీపాటికి
మావాఁడుకూడ నే తహస్సీలుదారుగనో యుండునుగద యని
యేదో చింత కలుగుచుండును." అని నిట్టూర్పువిడచి యొక్కింత
తడ వూరకుండిరి. చైకితాయనుఁడుగారు కూడ కొన్నినిమిష
ములుమౌనముగనుండి బల్లపైనుండిన కాగితపుముక్కను రెండు
వ్రేళ్ళతో నలుపుచు నిట్లనిరి.

"నేనువచ్చి మీకు వెనుకటిసంగతులు జ్ఞాపకముచేసి
మఱింత విచారము కలుగఁజేసినాను. ఈవిచారముచేతనే
కృష్ణయ్య మనలను సముద్రములో ముంచి పోయినప్పటినుండి
మీయింటికి వచ్చి మీముఖము చూడలేక పోయితిని. ఇప్పు
డేదో తప్పనిసరి వచ్చినదిగదా యని గుండె రాయిచేసికొని
వచ్చినాను కాని,"

"తప్పనిసరి కేమిలెండు. మీరు మేము రాఁగూడదా,
పోఁగూడదా?"

"కూడదనియా? విచారముచేత రాలేకగాని." అనియిం

చుకయూరకుండి "ఇప్పుడు మీకోడలకు విద్యాపూర్తి మీరే చేయించవలెను. దానికి మొదటినుండి యింగ్లీషు నేర్పించినది, చేసినది, మీరే." అని వినయముతోఁ బలికిరి. ఆమాటలకు సమాధానము చెప్పక,

"మీ అబ్బాయి ఇప్పుడెక్కడ నున్నాఁడు?" అని హావ్యవాహానుఁడుగారు ప్రశ్నించిరి.

"తక్షనగర కళాశాలలోనే ఏబదిరూపాయి లిచ్చు చున్నారు. మేమంతటను అక్కడ నుండవలె ననియే వాని నక్కడ చేర్పించితిని." అని చైకితాయనుఁడుగారు పలికిరి.

"అవును, మంచిపని చేసినారు. నలుగు రొకచోట నుండిన ఖర్చుతగ్గును. మీవాఁడు చెల్లెలకైనఁ బాపను వచ్చును."

"వాఁడుపంపించున దేమిటిలెండు. పెద్దలు మీరున్నారు. మీ తరువాత నేనున్నాను. ముందుగ మనదిగద బాధ్యత."

"మీరుబాధ్యత అనినారు గనుకచెప్పుచున్నాను. పిత్రార్జితమైన యాస్తి యుండినఁగాని నాకెట్టి బాధ్యతయు లేదఁట. నేను న్యాయవాదులను కనుగొంటిని."

ఈమాటలకు చైకితాయనుఁడుగారికిఁ గొంచెము కోపమువచ్చినది. దానినణఁచుకొని "పిల్ల లున్నవారేనా ఘట్లు చెప్పినది? మీకోడలను మీరు పోషించుటకుఁ బిత్రార్జిత మెందులకు?" అని యడిగిరి.

"సరే, దానికేమి లెండు. అసలు శాస్త్ర మది. మీ అమ్మాయి పోషణ నిమిత్తము నే నేమియు నివ్వవలసిన

బాధ్యత లేదు. ఇచ్చుచో నెంతైన నీయవచ్చును.''

అని చెప్పినంతలో లోపలనుండి మైదేండ్ల బాలుఁడు వచ్చి "నాన్నగారు, అమ్మ మడికట్టుకొనుమని చెప్పినది'' అని నుడివెను. ఆమాటలువిని "బావగారు, లెండు. మడి కట్టుకొనెదము" అని హవ్యవాహనుఁడుగారు వియ్యంకుని భోజనమునకుఁ బిలిచిరి.

"భోజనమున కేమి లెండు. నామనవి విని, దానిని చెన్నపట్టణములో బి. ఏ. చదివించు భారము మీది. దానికి మీరంగీకరింప వలయును. దానివిద్య ప్రారంభించినవారు మీరు. మీరే తుదముట్టింప వలయును. అది బి ఏ. అయి యుద్యోగముచేసి యుద్ధరించునని కాదు; దానికి సత్కాలక్షేప మగుటకు మార్గముగ నుండునని. తగిన వ్యావృత్తి లేనిచో ఈ వయస్సులోఁ గష్టముకద!''

"సరే, దానికేమి లెండు. మీరు మడి కట్టుకొనుఁడు."

"మీరు లెండు. ఇక్కడ మనవాండ్రే యున్నారు. వారితో వచ్చెదనని చెప్పినాను. నాకొఱకు కనిపెట్టుకొని యుందురు. నేను భోజనము చేసితిని కాదని మీరేమియు ననుకొనకుఁడు. మీయాజ్ఞ నెప్పుడును బద్ధుఁడనే. సెలవు దయచేయుఁడు. అని చైకితాయనుఁడుగారు లేచిరి.

"సరే, నేను, అన్నివిధముల నిట్లు చితికిపోయి యున్నాను. చూచినారుగ. మీరు నన్ను నమ్ముకొని మీఅమ్మాయిని చెన్నపట్టణము పంపకుఁడు. ముందు చేతినిండ డబ్బుచూచుకొని

మఱి పంపవలెను. లేనియెడల నిష్కారణము అమ్మాయి చిక్కుపడును."

"అన్నిటికి బూరేయున్నారు."అని చైకితాయనుఁడుగారు లేచివచ్చిరి. కాని హవ్యవాహనుఁడుగారు చెప్పిన మాటలచేతను ముఖ్యముగ న్యాయవాదిని నాలోచన యడిగినా నని చెప్పుటచేతను ఆయన యన్యాయమే చేయునని యు ఆయన సహాయము చేయఁడనియు నిశ్చయము చేసికొనిరి. విశాఖపట్టణములోఁదమ తోడియల్లుఁడు మిక్కిలి ధనికుఁడుండెను. ఆయనకు సంతానము లేదు. శశిరేఖ వెళ్ళి యామె పినతల్లిని యడుగుచో నెక్కువ సహాయము కలుగునని తలఁచి యామె నచ్చటకుఁ బంపిరి.

---

## 4

### ఆరాత్రి

తటునగరమునుండి సాయంకాలమునకు నేను మామిడిపురము వచ్చితిని. వెళ్ళినపని యేమయ్యెనని మాతండ్రిగారు ప్రశ్న వేసిరి ఒక్కటిని కొనసాగలేదని చెప్పితిని. ప్రయాణము వలననో యెండవలననో నాకుఁ దలనొప్పియుఁ జిరాకుగ నుండుటచే వేడినీళ్ళ స్నానము చేసితిని. నా స్నానము పూర్తియగు లోపుననే మాయమ్మ వడ్డించెను. మానాన్నగారు మడికట్టుకొని విస్తరిదగ్గఱఁ గూర్చుండి నన్నుఁ బిలచిరి. "వాఁడు స్నానముచేసి వచ్చును, మీరు పరిషేచనము చేయుఁడని మాతల్లి చెప్పెను. వాఁడుకూడ రానియని మాతండ్రిగారనిరిగాని, "నేను స్నానముచేసి వచ్చుచున్నాను,మీరుకూర్చుండుఁడు"అని నేనును

నీళ్ళకాఁగుకడనుండి కేక వేసితిని. మాతండ్రిగారు భోజన మారంభించిరి. నేను స్నానముచేసి పట్టుబట్ట కట్టుకొని వెళ్ళునప్పటికి మాతండ్రిగారిభోజన మయ్యెను. ఆయన లేచిరి. నే నొక్కఁడనే భోజనము చేసితిని. నా కన్నము సహించలేదు. కొంచెము మజ్జిగఁ ద్రాఁగి నా గదిలోనికి వెళ్ళి పరుంటిని.

నాగది పెద్దదికాదు. చిన్నమంచములు రెండు పట్టఁగ నొక చిన్నబల్లయు నొకకుర్చీయు వేయుటకు మాత్రము చోటు కలదు. ఆ బల్లమీఁద కొన్ని పుస్తకములు మాత్రము పెట్టుదును. రాత్రి వేళలందుమాత్రము తాంబూల పళ్ళెరము అత్తరుబుడ్డి అగరవత్తులుగుచ్చెడు నిత్తడిచెట్టు నాయర్ధాంగి పెట్టును; అదివఱకు కాటుక కాయయు దువ్వెన్నయుఁగూడ బల్లమీఁదనే పెట్టుచుండెడిది కాని నేనొకసారి వానిని దీసివేసితిని. అప్పటినుండియు వానిని బెట్టుట మానివేసినది. అందుచేతనే నాబల్ల శుభ్రముగ నుండును. ఆరాత్రి వెలిగించిన అగరువత్తులు నేను రాజమహేంద్రవరములోఁ గొనినవే. అవి మంచివత్తులే కాని యానాఁడు నా కట్టి వాసనయు వేయలేదు. అగరువత్తుల వాసన గదినుండి పోవుచుండుటకై కిటికీతలుపులు వేయఁబడెనుగాని నాకు ఉక్కఁగ నుండుటచేఁ దలుపులు తీసితిని. మామూలు ప్రకారము చదువుకొనక దీపము తగ్గించి మంచముపైఁ బరుంటిని. కాని నిదుర పట్టలేదు. తణుకునగరములో నేఁజూచిన సుందరాంగి నాకన్నులకుఁ గట్టినట్లుండెను; ఆమె దీనావస్థయే నా తలఁపులలో నుండెను.

పడమటింటినుండి మాయమ్మ యువతులకువచ్చి యీ పూట సోమయ్య సరిగా భోజనము చేయలేదనెను. ఏమిరా, అబ్బాయి? అని మానాన్నగా రడిగిరి. ఏమియులేదు, కొంచెము బడలిక చేసినదని చెప్పితిని. ఈమాటలు విని నాసతి గదిలోపలకు వచ్చెను. ఆమెరాకను జూచియు నే నటుతిరిగి పరుంటిని. ఈలా గున్నారేమి యని న న్నామె యడిగెను. నేను మొదట జవాబు చెప్పలేదు. ఆమె మరల నడిగెను.

"ఏమియులేదు" అని నేను ప్రత్యుత్తర మిచ్చితిని.

"ఏమియు లేనియెడల అన్న మెందులకు సహించలేదు? ఒంటిలో నెట్లైన నున్నదా"?

"ఏలాగులేదు."

"తల నొప్పిగ నున్నదా?"

"లేదు."

"ఏమియు లేకపోయిన నప్పుడే పరున్నారేమి?"

"అబ్బ! నీవిన్నిప్రశ్నలు వేయకు"

"మీ కేదైన బాధగ నుండుచో దాచు టెందులకు?"

అని బల్లవైపుచూచి "ఇదిగో తాంబూల మిట్లే యున్నదే! చెక్కకూడ వేసికొనలేదు" అని నాకిచ్చుటకై వానిం జేతబట్టుకొనెను.

నే నామెవైపు తిరుగకయే "అవును. వేసికొనలేదు" అని జవాబు చెప్పితిని.

"కడుపు నొప్పిగనున్నదా?" యని యామె మరల

ప్రశ్నించెను.

ఈప్రశ్నలకు నాకు విసుగుపుట్టి యేదో యొకజవాబు చెప్పినఁగాని మానదని అవు నంటిని.

"తమలపాకులు తెచ్చి వెచ్చచేసి కాచుదునా?"

"నాకేమియు నక్కఱలేదు. నీవు వెళ్లి భోజనము చేయుము."

"నాభోజనమున కేమి లెండు. మీకు కాచి వెళ్ళెదను."

"నాకుఁ గాచనక్కఱలేదు. అమ్మ కసి పెట్టుకొని యుందును. నీవు త్వరగ వెళ్ళు"

"అత్తయ్యా, మీరు భోజనము చేయుచుండుఁడు. నేను కాచి వచ్చుచున్నాను." అని యామె కేకవేసి "ఏమి? కుంపటి పట్టుకొని రానా? అని యడిగెను. నాకు మనములోఁ గలుగు నాలోచనల కీమె ప్రశ్న లడ్డువచ్చుచుండెను. ఎంతచెప్పినను బ్రశ్నపై ప్రశ్న వేయుచుండెను గాని యచ్చటినుండి వెళ్ళదు. ఆసమయమున నా యాంతరంగిక భావములమధ్య నేనొక్కరుఁడనే యుండఁగోరితిని. "నాకుఁ గాచనక్కఱలేదు. నీవు వెళ్ళు" అని గట్టిగఁ జెప్పితిని. ఇంకను నామె వెళ్ళక, "పోని, తాంబూలము వేసికొనుఁడు" అని నా కందీయవచ్చెను. నాకప్పుడు నిజముగఁ గోపమే వచ్చెను. "తాంబూలము వద్దు, గింబూలము వద్దు. నీవు, వెళ్ళు! నన్ను మాట్లాడించకు, నీవు వెళ్ళుచో నన్నియు తగ్గును" అంటిని. ఆమాటలకుఁ, బాపము, నా యర్ధాంగికిఁ గష్టగనే యుండెను. ఆమె యించుక చిన్నవోయి "నేనుండుచో మీకుఁ

గష్టముగనుండుచో వెళ్ళిపోయెదనులెండు" అని గది వదలి వెళ్ళెను. ఆమెపై నాకపుడు జాలికలిగెను. మంచిచెడ్డలపుడు స్ఫురణకు వచ్చెను. నాయవస్థను దలఁపోసికొంటిని. ఈమెపైఁ గినియుటేల? మఱియు నాకు హృదయభారము కలుగుటకుఁ గారణమేమి? ఒక్క కాంతను జూచియుఁ జూడనట్లు చూచితిని. ఆమెను జూచుచుండుటకే కోరికలు పుట్టుచుండెను. నాహృదయ మామెవెంటనే యరిగెను. అట్లు నిర్గతచిత్తుఁడనగుటచే నాకెవ్వరేమి చెప్పినను వినఁబడుటలేదు. మనస్సులో నొక చెప్పరాని బాధ పుట్టెను. కావ్యములయందు వర్ణింపఁబడు విరహవేదన నాకపు డనుభవమయ్యెను. అదెవ్వరితోడఁ జెప్పుకొనినను సిగ్గుచేటు. మఱియు నేను వివాహితుఁడను, నాచిత్తమాకర్షించినదియు నన్యదత్తయే. నాతలఁపులును గోర్కులును పాపభూయిష్ఠములే. అయినను మనోజానల వేదనచేఁ బుణ్యపాపము లెఱుంగకుంటి. ఇంతలోఁ జంద్రోదయమై కిటికిలోనుండి వెన్నెలవచ్చెను. ఈబాధకుఁదోడు చంద్రికలు సోకుచోఁ దాపము హెచ్చగునని చదివి యుంటిని గాన వెన్నెలరాకుండఁ దలుపులు వేసితిని. పచ్చకర్పూరముతోఁ గలసిన గంధము రాయుచోఁ దాప ముపశమించునని యందురు గాని నాకట్టి యనుభవము లేకపోయెను. నాకట్టి శీతలోపచారములు చేయు సఖులుగాని సఖురాండ్రుగాని లేకపోయిరి. పైఁగ నాప్రియసఖ కుంపటి తెచ్చి కాచెదననియె. ఈ తాపమును నివారణ చేసికొనుటకై చిత్తము నన్యాయత్తము గావింపఁ గోరి, లేచి, దీప మెక్కించి

కుర్చీపైఁ గూర్చుండి బల్లమీఁద నున్నపుస్తకమును దీసితిని.

సీ. "నెత్తమ్ములనుచుఁ గొప్పిన్నెల లంచు వటుఫల
శ్రీలంచు డాఁబేటి చిప్పలనుచు
నమ్ముల పొదులంచు ననఁటి కంబములంచుఁ
బులినమంచును సుడి చెలువమనుచు
హరిమధ్యమం బంచు హేమ కుంభములంచు
నవమృణాలములంచుఁ జివురులంచు
మదను శంఖమటంచు మణిదర్పణములంచుఁ
బగడమంచును దిలప్రసవమనుచు
తే. శఫరులనుచు సింగిణులంచుఁ జంద్రఖండ
మనుచు శ్రీకారములటంచు నళులటంచు
నిట్టివి గదయ్య చెప్పఁబోయిన నుపమలు
వీనిఁ దడవ సిగ్గొదవు నవ్వేలఁది నెంచి".

అను పద్యము తీయఁగ నే వచ్చినది. దానిని జదివితిని. నేఁజూచిన సుందరాంగి కీయుపమానము లెట్లు సరిపోవునో యని పరిశీలించితిని. ఈ యుపమానములు నాకొక్కటియు నచ్చలేదు. ఆమె శరీరావయవములు నేనంతగ విలోకింపలేదు గాని యెద్దాని కది విమర్శించినచో సౌందర్యమే యుండదని తలఁచెదను. ఈవిభిన్నావయవ సౌందర్యము కవులేగాని కాముకులు పరిశీలించియుండరు. అట్లు పరిశీలించుచో నిజముగఁ బడంతులచే వలపింపఁబడు కాంతులుండరు. మగువ లెట్టివారైనను మన్మథుఁడు వారికిఁ దోడగుచుండును. అందువల్లనే బ్రహ్మ వారలను సృజించు నపుడు నిర్లక్ష్యముగ నుండును. మోహాంధులగు పురుషులకుఁ దమ కాంతలు సౌందర్యరాసులవలెఁ గనఁ

బడవచ్చును. కాని నేను నిజము చెప్పుచున్నాను. నేనట్టి యుగ్ర మనుజుఁడఁ భ్రమచెందలేదు. నన్నాకర్షించిన దేదియన, నేనది యుఁ జెప్పలేను.

ఆపుస్తకము చదువ బుద్ధిపుట్టలేదు. మఱియొక పుస్తకమును దీసితిని. అది వేదాంత విషయమైన పుస్తకము. పుస్తకము తెఱువఁగనే దానిపై విముఖత కలిగెను. మఱియొక పుస్తకమును దీసి చదివితిని. ఏమి చదివినను నాతలఁపులు మారుటలేదు. కాఁబట్టి చదువుటమాని, మరల దీపము తగ్గించి పరుంటిని. నిద్దుర పట్టకపోవుటచే నటునిటు దొర్లు చుంటిని.

ఇంతలో నాసతి వచ్చి నేను దొర్లుటచూచి యింకను నిద్దుర పట్టలేదా యని యడిగెను. నేను ప్రత్యుత్తరము చెప్ప లేదు. ధైర్యము గలవాఁడను కాఁబట్టి నా మనోవ్యాధిని నెవ్వరికిఁ దెలియనీయలేదు. ఆమె నన్ను మఱల మఱలఁ బ్రశ్నించుటచే జికాకు కలిగి యొక్కొకసరు కసరితిని. ఆమె, "నేను మాట్లాడిననే మీకుఁ గోపమువచ్చుచో మాట్లాడనే యాడ" నని తలుపు గడియవేసి పరుండెను. నాకుఁగూడ నిద్రపట్టలేదు. కలలు వచ్చుచుండెను. అవి వికృతమైన కలలే. నేఁ గోరిన యూ పెత్రో ముచ్చటించినట్లు ఏదేదో కలవచ్చెను. అంత నులికిపడి లేచితిని. నాసతి నామొంటిపైఁ జేయివేసి జ్వరమువచ్చెనేమో యని చూచెను. నాశరీరము వేడిగనే యుండెను గాని యది జ్వరముకాదు. "ఇట్లు ఉలికిపడితిరేల ? అత్తయ్యను లేపుదునా"

జూసి నాసతి యడిగెను. “అక్కఱలేదు, నీచెయ్యి నాగుండెలపై వేసియుంచు”మని చెప్పితిని. అంతమాత్ర ముపచారము చేయ నిచ్చినందులకే యామె మిక్కిలి సంతోషించెను. “ఏమి, భయ పడినారా? యని యడిగి యామె కరకమలము నాహృదయము పై వేసి నిదురించెను నాకుఁ గలత నిద్దురతోడనే తెల్లవారెను.

---

## 5

### ఎత్తుగడ.

ఇట్లు వికల హృదయుఁడనై రాత్రియంతయు గడిపి తిని. కాకులు కూయుటతోడనే మెలఁకువ వచ్చెనుగాని పరుపు మీఁదనుండి లేవలేక పరుంటిని. కాని యప్పుడే మాయావు ఈనినదని కేకలు వినఁబడుటచే లేఁగదూడను జూచునుత్సాహ ముతో లేచితిని. ఆయావును నాలుగు దినముల క్రిందటనే మాయూరు సంతలోఁ గొంటిమి. కొనిన నచిరకాలములోనే యీనుటచే మాకందఱకు నానందమయ్యెను. నేను పెరటిలో నికి వెళ్ళునప్పటికి నల్లని కోడెదూడ గంతులు వేయుచుండెను. ఆయుదయము చాలభాగము పెరటిలోనే కూర్చుండి యుం టిని. ఆవునకు నేనే దగ్గఱనుండి కుంచెడు ధాన్యము దంపించి పెట్టించితిని. అది మాయ తినకుండ నుండునట్లు చూచుచుంటిని. ఆసందడివలన నామనోవ్యాధిని గొంత మఱచితిని.

నేను పదిగంటలకు భోజనముచేయుచున్నపుడు మా

తండ్రిగారు "ఏమిరా! నాయనా! నిన్న నీ యొంటిలో బాగుండ లేదఁట. ఇప్పుడు కులాసగ నున్నదా" యని యడిగిరి. "కులాసగనే యున్నది; దేహములో నేమియు లే"దని నేను జవాబు చెప్పితిని. వంటయింటి గుమ్మము వెలుపల వసారాలోఁ గూర్చుండియున్న నా నెచ్చెలి యచ్చటినుండియే "జున్ను పెట్టరేమో యను భయముచేత నట్లనుచున్నారు గాని, నిజముగ నిన్న బద్ధకముగనే యున్నారు" అనెను. మాయమ్మ వంటచేయునప్పుడును మాకు వడ్డించునప్పుడును, ఆమె యొద్దకైనఁ బిలుచునని, ఆ చెంబిట్లు పెట్టుటకుఁగాని, ఈపీట యిట్లు వేయుటకుఁగాని కోడలు వంటయింటిలోనే యుండును. ఈమె యట్లు పలుకఁగ మా నాన్నగారు నవ్వి "ఏమిరా అబ్బాయి" అని అడిగిరి. అప్పు డామెపై నాకుఁ గొంచెము కోపము వచ్చినది. నేను లేదన్నది తానున్నదని యందులకే కోపమువచ్చినది గాని తన నడుగక పోయినను మగవారితో నట్లు ప్రసంగించినందులకుఁ గాదు. మాతండ్రిగారి యొద్ద నామెకుఁ జనువు కలదు. అదివఱకుఁ గలసిన సంబంధమగుటచేతను, మాతండ్రిగారి కాఁడుపిల్లలు లేకపోవుటచేతను, ఆమె బుద్ధిమంతురాలగుటచేతను, అధికూడనని యెద, ఆమెకుఁ జనువిచ్చిరి. ఈకారణముననే యీమె యట్లు చెప్పిననుకొనియెదను; ఒకవేళఁ గొందఱు కోడండ్రవలెనే యీమెకును అత్తమామలయెడ భయభక్తులు తక్కువగుట చేతనే చెప్పెనేమో తెలియదు. ఏమైనను నా భార్యపై నాకుఁ బక్షపాత ముండకపోదు గావున మొదటి కారణమే నిజమని

నేను చెప్పెద. మాయమ్మయు, ఆమాటలువిని "అప్పును నిన్న వీఁడు సరిగ భోజనము చేయలేదు. ఇపుడు జున్ను వండ నేవం డను" అనియెను. "లేదమ్మా, నాయొంటిలో బాగుగ నేయున్నది. ఏమియుజబ్బులేదు" అని గట్టిగనంటిని. అన్నముకలుపుకొని కుదు రు చేసికొని పులుసు పోయుమంటిని. నాకై ప్రత్యేకముగఁ జారు పెట్టితిననియు నాపూటఁ బులుసు పోయననియు మాయమ్మ యనెను. నాకెట్టి బాధయులేదు. పులుసే పోయుమని నేను బలవంతపెట్టుటచే మాయమ్మ వడ్డించెను. అది కలుపు కొని తినుచుండఁగ మానాన్నగారు, "ఏమిరా, అబ్బాయి నిన్న టినుండి ఏదో యాలోచించుచున్నట్లున్నావు." అని యడిగిరి. నామనశ్చింత ముఖముపై ద్యోతకమయ్యెను గాఁబోలు, కావుననే యట్లడిగిరి. నాపై మాతండ్రిగారికిఁ బ్రేమమెండు. నన్ను మొదటి నుండియు గారాబముగఁ బెంచిరిగాని యొక మాటైనఁ గోపపడి యుండరు. నామనస్సునకు నొచ్చుపనిని జేయరు సరికదా, కష్ట ముగఁదోఁచుమాటైన నాడియుండరు. నేనును మాతండ్రిగారిపై నత్యంతప్రేమతోడను భక్తితోడను మెలంగుచును. ఆయనకేమి కోపము వచ్చునో, యేమికష్టముగఁ దోఁచునో యని యే నేను మెలంగువాఁడను. మాతండ్రిగారు చెప్పిన దానికొక యక్షర మైనఁ దప్పిపోక వర్తించువాఁడను. ఇదివఱకెవ్వరికును నా వ్యా కులమునకుఁ గారణము చెప్పలేదుగాని, మాతండ్రిగా రడుగు టచేఁ జెప్పక తప్పదయ్యె. కాని యేమికారణమని చెప్పుదును?

అబ్బ! మోహానాంగుల చూపులలో నేమున్నదో కాని!

దీని నేశాస్త్రవేత్తయుఁ జెప్పలేకపోయె. పూర్వము యుద్ధమందు దేవతలును తత్తుల్యులగు నరులును ఆగ్నేయాస్త్రమును బంపి శత్రుసేనలను గాల్చెడివారఁట! సమ్మోహాస్త్రము వేసి మూర్ఛితులను జేసెడివారఁట. నిజముగా ఆయస్త్రముల శక్తి వంటిదే వీరి యర్ధనిమీలిత నేత్రములందును గలదు. వీరు అబలలఁట! వీరబలలని యెవఁడా చెప్పినవాఁడు? లలనాపాంగవీక్షణాకలితదారుచిత్తుండగు షండుఁడో తీక్ష్ణవైరాగ్యచండకిరణాతపశుష్కరాగుండగు సన్యాసియో యట్లనవలయును గాని! వీరు కరపల్లవములతోఁ దాకకయే పురుషులను స్తంభింపఁజేసెదరు; భీషణ భాషణములు లేకయే వికలహృదయులను జేసెదరు. అట్టి వీరు అబలలా, లేక, విభ్రాంతచిత్తులై పుష్పగుచ్ఛంబులఁ గోట నెక్కుచుఁ గదళీతరువుల నానుచు దొండపండులఁ బంటఁ గొరుకుచుఁ బట్టపగటఁ గలువరించు వారబలలా. మఱియుఁ బ్రతివాఁడును బడాయికి "కలంచునే సతులమాయల్ ధీరచిత్తంబులన్" అనుచుండును, ఈముక్క యెక్కడ వినెనోకాని! సతుల మాయలఁట! ఈయనవైపు చూడక యామె దారిని నామె యేగినను మాయయే? ఈయనంతటి ఋజుమార్గవర్తిని తొట్రిల్లఁజేయుటకు సతులు మాయలు చేయవలయుఁ గాఁబోలు! తన ఘనచిత్తము కరగకుండ నుంచుకొనలేక యోడిపోయి వారిచర్యలు మాయలనును. అదిగాక, మాయలే యనుఁడు. అవి యెవ్వరిని కలంపలేదు? కలంచుటే కాదు. ఎవ్వరినిక్షోభ పెట్టలేదు? "ఇనుపకచ్చడాల్కట్టిన మునిముచ్చులెల్లఁ దామర

సనేత్ర లిండ్లబందాలుకారె?" పరాశరుఁడు, వ్యాసుఁడు, విశ్వామిత్రుఁడు, వారు వీరననేల ? మహామహులందఱు నావలె బాధపడిన వారె.

నిజమైన కారణము మీ దగ్గఱఁ జెప్పితినిగాని మా తండ్రిగారితోఁ జెప్పుటకు సిగ్గుపడితిని. ఆయనతో నట్లు చెప్పలేదు. ఇపుడాలోచించిచూడఁగ, నాకు సిగ్గుపడుటకుఁ గారణమును గనుపించదు. నే నేమి తప్పొనరించితినని నేను సిగ్గుపడవలయును ? ఏదేని యకార్య మొనరించినచో సిగ్గుపడవలయును గాని యేకార్యమును జేయక పరాధీనుఁడనై యుండిన నేను సిగ్గుపడుటేల? ముష్కరులు మనలను బాధపెట్టి మన ధనమపహరించుకొని పోయినయెడల మనము సిగ్గుపడుదుమా? ఒక చంచలనేత్రి యామె వీక్షణమునకు నన్ను గుఱిచేసికొని నాచిత్తమపహరించెనేని నేను సిగ్గుపడు టెందులకు? కాని యా సమయమునకు నన్ను సిగ్గావరించుకొనుటచే నేను నిజము చెప్పక యబద్ధమే పల్కితిని. "నేను చదివిన చదువంతయు నిరర్థకమయ్యెనని నాకు నిన్నటినుండి విచారముగ నే యున్న"దంటిని. ఇట్లుపలుకఁగనే నేను మాతండ్రిగారితోడనే యసత్యము పలుకుచున్నానని గ్రహించి నాహృదయ మించుక కొట్టుకొనెను. మనశ్శాంతికొఱకై నేను నిజమే పల్కితినని సమర్థించుకొంటిని. ఇంత చదువు చదివియుఁ బరాంగనచే మోహపెట్టఁబడితి; నాచదువేల, కాల్పనా? అది నిరర్థకముగాక యేమైనది ? కాని, మాతండ్రిగారు గాని నేనుగాని యిట్లర్థము చేసి

కొనలేదు. మఱియు, నేను ఇంతచదువు చదివియు నేఁగోరిన పదవిని బడయలేకపోయితి; నాచదువువలనఁ బ్రయోజనమేమి? అయ్యది నిరర్థకమే యయ్యె నని విచారించితిని. పాపము మా తండ్రిగారికి నాయీభావములు తెలియవు. "ఏమిరా అట్లున దవు? ఏ కచ్చేరిలోఁ జేరినను ముప్పది రూపాయలిచ్చెదరు. అట్లనుకొనెదవేల? అందఱు నీకంటె నెక్కువ చదివిరా? అనిరి. "నాన్నగారు! నన్ను చెన్నపట్టణము పంపక మీరుకూడ వచ్చి యుండవలెనని రాజమహేంద్రవరములోఁ జదివించితిరి. అచ్చట బి. ఏ. లో తత్వమే చదివితిని. ఏపాఠశాలకేగినను మాకు చరిత్రయో విజ్ఞానశాస్త్రములో చదివిన వారు కావలయునుగాని మీ రక్కఱలేదనుచువచ్చిరి. మన మణిపురములో నట్లయ్యెను, తటునగరమున నట్లయ్యెను. ఎక్కడకు వెళ్ళిన నట్లే యగును; కలక్టరుకచ్చేరిలో ఖాళీలు లేవఁట. ఉన్నను బ్రాహ్మణుల కుద్యోగము లీయరఁట. నేను చదివి యేమిప్రయోజనము? ఒక్క సంవత్సరము చెన్నపట్టణములోఁ జదివినచో నెవరైన నెత్తిమీఁదపెట్టుకొని పని యిత్తురు. నాకేమియు దోఁచకుండ ఉన్నది అని దీనముగఁబలికితిని. నేను విచారమునొందుట మాతండ్రిగారు భరింపఁజాలరు; "అటులే కానియరా నాయనా! నీవెంతవఱకు నెన్ని యేండ్లు చదివినా చదివించెదను. ఎంత యదృష్టము చేసికొనినవారికో గాని చదువే రాదు. నీవు చదువుకొని పైకి వచ్చెదనంటే నడ్డుపెట్టెదనా?" అనిరి. ఆ మాటలతో సూర్యోదయముచే మంచు విఱిగిపోవునట్లు నాకించ

యంతరించెను. నాకుత్సాహము కలిగెను. ముందు శశిరేఖను జూడవచ్చును. ఆపైన దైవమున్నాఁడు అనుకొంటిని, కాని మాతల్లి, యింకను జరుగవేమిటి? లక్షణముగఁ గొడుకు కోడలు నట్టింటఁ దిరుగుచుండక ? పోనీ, నీవు చదివినది పనికిరాక పోవుచో అందఱికంటె నీకుఁ బదిరూపాయలు తక్కువయిమ్మను. నీవే యేబదులు వందలు తెచ్చినఁగాని జరగదు అని లేదుకద" అనియె. నేనింతయుఁ గష్టపడి చదివి తోడివారలకంటెఁ దక్కువగ నుండుట మాతండ్రిగారిష్టపడలేదు. "ఒకటి రెండు సంవత్సరములలో నేమియు మించిపోదులె, అబ్బాయి వెళ్ళినను గోడలు నీయొద్దనే యుండునులె" అనిరి. నేను వెళ్ళుట నిశ్చయమైనది. మేము భోజనముకడ నుండియు లేచితిమి. నేనుత్సాహముతోడనే యుంటిని.

నాకు దేహమందనారోగ్యము లేనట్లు స్పష్టపడియెను గావున మాయమ్మ జున్నువండెను. మధ్యాహ్నము ముందుగ నాకుఁ గొంతపెట్టి కొంచె మిరుగు పొరుగు వారలకుఁ బంపినది. మాయింటి పొరుగుననున్న చతురిక మాయింటికి వచ్చినది. ఈమె వచ్చునప్పటికి మాయమ్మ యరఁటిదూట తఱుగుచుఁ గూర్చుండెను. మానతి గదిలోనే చదువుకొనుచుండెను. చతురిక మాయమ్మదగ్గఱనే కూర్చుండెను, మీయింటిలో వంటయేమిటి, మీయింటిలో వంట యేమిటి యను కుశల ప్రశ్నలన్నియునైనపిదప చతురిక "మీరు జున్నుపంపించినారు; ఆవా, గేదియా యీనినది?" అని యడిగెను.

"ఆవేనమ్మ, కొద్దిగఁ బాలిచ్చినది. అందువలన మీకుఁ గొంచెము పంపించినాను."

"సరే, అందులకుఁగాదండీ. ఊరకయే, ఆవుదియా, గేదిదియా యని యడిగినాను. ఇప్పుడైనఁ జాలనే పంపించినారు. మాయింటిలో జున్ను తినునది నేనొక్కతెనెగాని, వారు, అంత యిష్టముగఁ దినరు." అని చతురిక నవ్వుచుఁ బలికెను.

"ఈపూట అంత బాగుగఁ గూడ లేదులె. ఏలకగింజలు లేకపోయిన" వని మాయమ్మ చెప్పెను.

"బాగుండకేమి? బాగుగనే యున్నది. మిరియములపొడి వేసినారు. ఎట్లైన, ఆవుజున్ను గేదిజున్నంత గట్టిగ నుండదు లెండు. ఈయావు ఎక్కడిది? కోడలు అరణము తెచ్చుకొనినదియా?" అని చతురిక ప్రశ్న వేసెను.

"ముప్పదియైదు రూపాయలు పోసి కొనినామమ్మ. మా కోడలు అరణము తెచ్చుకొనుట కూడనా?"

"అట్లనెదరేమండి? ఆపిడ పుట్టింటివారు భాగ్యవంతులు; ఒకటిగాదు, రెండావుల నరణమియ్యఁగలరు; ఏమియు లేనివారు, మా పుట్టింటివారు, ఇచ్చెదమనినారు. ఆవును మేపుట, కట్టివేయుట, దానికిఁ జాకిరిచేయుట కష్టమని మావారు పుచ్చుకొనుటమానినారు కాని!" అని చతురిక నుడివెను.

మాయమ్మ చక్రములు చక్రములుగఁ దఱిగిన దూట ముక్కలను దొంతరలు పెట్టి వానిని మఱలఁ జిన్న చిన్న ముక్కలుగఁ దఱిగి వేయుటకు గిన్నె నొకటి తెచ్చి మరలఁ గత్తిపీటపైఁ

కూర్చుండెను. ఒక దొంతరను దీసి తలుగుచు, "చతురికా, డబ్బు ఉండఁగనే సరియా ? ఒకరిభాగ్యము మన కెన్నడు నక్క-అలేదు గాని, ముద్దు ముచ్చట లెఱింగి యుండవలయును. ఇపుడు వారొక యీవు నిచ్చినచో మన లోపమంతయుఁ దీరిపోయి భాగ్యవంతులమగుదుమని కాదు? వారు ఇవ్వకపోయిన మనము కొనుక్కొ-నలేక పోదుమనియునుగాదు. అటువంటివన్నియు వేడుకలు. ఒక్క-డే కొడుకు; అన్నిముచ్చటలు తీర్చుకొనవలెనను కొనఁగ నేమియు లేకపోయినది!" అనినది.

"మీరు తీర్పుమనఁగ వారు తీర్చకపోయినారా" యని చతురిక నవ్వినది.

"తీర్చుమని మేమడుగవలయునా ? అవి వారెఱిఁగియుండవలయును గాని. ఇన్ని పండుగలు వచ్చినవి, ఎప్పుడైన నల్లుని దీసికొని వెళ్ళి బట్టలిచ్చి పంపినారా ? అసలు పెళ్ళిలో లాంఛనములు జరపినారా ? ఇటువంటి వన్నియు మొదటినుండియు నెఱిఁగి యుండవలయునమ్మా. ఆమధ్య యీయూళ్ళోనే యేదో పనిలో నుండేవారే, వేంకటేశ్వర్లు గారని, ఆయన రెండవ కొమార్తెను మా అబ్బాయికి నిచ్చెదమని ఎంతో బలవంతము చేసినారు. అయిదురోజులు వియ్యపురాలు లాంఛనములు, అయిదురోజులు అయిదు పెద్దకాసులు, సమస్త మర్యాదలు జరిపెదమనినారు. అవి మేమడిగినామా? వారొక్క-రే కాదు. ఇంకను అనేక సంబంధములు వచ్చినవి. ఏలాంఛనములు లేకపోయినఁ గావలసిన సంబంధమని యొప్పుకొన్నాము. వేంక

టేశ్వర్లుగారి అమ్మాయికి సంగీతము ఇంగ్లీషుకూడఁ జెప్పించి నారఁటమ్మా!"

"పోనిత్తురు. ఇపుడు ప్రియంవద కేమిలోటు ? ఇంగ్లీషు నేర్చి వీరేమి కచ్చేరీలెక్క యుద్యోగములు చేయఁబోయెదరా?"

"అవునులే, అసలుసంగతి చెప్పుచున్నాను."

"ఏది, కోడలు ? ఒదినా!" అని చతురిక పిలచెను.

మాయమ్మ చివరను జెప్పినమాటలు నేను వింటిని. అప్పటికి నాహృదయము స్వస్థతనొందెను. సంతోషముంగ నుప్పొంగితిని. పూర్వము దుష్యంతుఁడు కణ్వాశ్రమమున శకుంతలను జూచి మోహవిభ్రాంతుఁడై వర్ణాశ్రమధర్మరక్షణముచేయుచు ధర్మము తప్పక యుండిన నాహృదయము విప్రకన్యను జూచి యేలవికలత నొందెనని చింతించెను. ఆమె విశ్వామిత్రుని కుమారిత యని తెలిసినపిమ్మట, ఆమె క్షత్రియకన్య, నాకుఁ బరిణయయోగ్యమైనది కావుననే నామనసామెపై వ్రాలెనని సంతోషముతో గంతులువేసెను. అంత సంతోషము నాకును గలిగెను. శశిరేఖను నేఁ బ్రేమించుటకు కారణము లేకపోలేదు. ఆమె పూర్వము నాకై యర్పింపఁబడిన కన్య. ఆసంబంధమును గారణమును నుండుటవలననే యద్దాని నే నెఱుంగకపూర్వమే నా హృదయ మామెయందు లగ్నమైనది. నేను శశిరేఖతోఁ జెలిమిచేయుట దోషముగాదు. ఆ మనోవాంఛితమును దీర్చుకొనవలయును. అది దైవనిర్మితమే. ఈసంతోషముతో నేను చన్నపట్టణమునకుఁ బ్రయాణమగుటకు సద్దుకొనుట నారంభించితిని.

# 6

## ప్రయాణము.

నేను చెన్నపట్టణము వెళ్ళుట నిశ్చయమయ్యెను. సోమే శనా దక్షిణమర్ధ లాభమ్మనినారు కనుక నేను బైలుదేరుటకు విదియా శనివారము బాగుగనున్నది; చెన్నపట్టణములోఁ దిగుటకుఁ దదియకూడ మంచిదే. కావున విదియా శనివారము నాఁడు బైలుదేరుటకు మాతండ్రిగారే ముహూర్తముంచిరి. శనివారము నాఁడు దుర్ముహూర్తము వెళ్ళఁగనే మాయమ్మ నాకుఁ దలయంటెను. పిమ్మట నేను బట్టలు సద్దుకొనుట ప్రారంభించితిని. అందు నాసతియుఁ గొంత సహాయము చేసెను. ప్రయాణమునకుముందు తీపి తిని వెళ్ళుట శుభమని మాయమ్మ ఆవుపాలతోఁ బరమాన్నము కాచినది. సాయంకాలము రైలునకు వెళ్ళునపుడు భోజనము చేయవలయును గాన నుదయమునఁ గూడఁ బెందలకడనే భోజనమునకుఁ గూర్చుంటిని. తొమ్మిదిగంటలే యైనను నాతోఁ గూర్చుండి భోజనము చేయవలయునని మాతండ్రిగారును వచ్చిరి. భోజనమైన తరువాత రైలు వేళవఱకు నాకు నిముషమొక యుగముగ నుండెను. ఆపూట యంతయు నాకొఱకేదో చేయుచు మాయమ్మ వంటయింటిలోనే యుండెను. నే నేదేని యొకపనిమీఁద గదిలోనికి వెళ్ళునపుడు నాసతియు గదిలోనికి వచ్చెడిది. కాని నేను నాప్రయాణపు తొందఱలో నుండుటచే నామెను బలుకరింపలేదు. ఎట్లాగుననో

మూడుగంటలవఱకు జరిపితిని. మఱల భోజనమునకు లేచితిని. నేను భోజనము చేసి వచ్చునప్పటికే మాతండ్రిగారు బండి పిలిపించి నాపెట్టెని నామూటను బరుపుకు బండిలోఁ బెట్టించిరి. “సోమా! రైలు ప్రయాణమునకు మనమొక నిముషము ముందుగనే యుండవలయును, త్వరగఁ బదర” యనిరి. మాయమ్మ లోపలినుండివచ్చి “ఏది? అబ్బాయి మూటయేది? ఇంకను సర్దవలయును. అప్పుడే బండిలోఁబెట్టినారా? మీకెప్పుడునొక్కటే తొందఱగదా!” అనినది. “ఇంకెంతసేపు సర్దుట రైలువేళ యైపోవుచున్నది” అని మానాన్నగారు బదులుపలికిరి. “వానికోసము మినుపసున్ని చేసితిని. నాల్గుండలు కట్టి యివ్వవలయును ఆమూటయేది” యనిమాయమ్మయడిగెను. నేనప్పటికి జోడుతాళ్ళు ముడివేసికొనుచున్నాను. మాతండ్రిగారే, బండిలోనుండి మూట తీసికొనివచ్చి “యీమినపసున్ని వానికి లోటువచ్చినది! వానికిఁ జెన్నాపట్టణములోఁ గావలసినన్ని గొప్ప గొప్ప పిండివంటలు” అనిరి. “సరే, ఈనాలుగుండలతోడనే వాని కవునరియా? దారిలోనికిఁ బనికివచ్చును” అని మాయమ్మ మూటకట్టెను. ఈలోపుననే నాసతి తమలపాకుల చుట్టలు, గుప్పెడు చెక్కలు, ఏలకకాయలు లవంగములు నా కోటుజేబులో వేసెను. నేను కోటు తొడుగుకొని గదిలో వంకినున్న టోపీపెట్టుకొని వచ్చి, మూట బండిలోఁ బెట్టితిని. ఎక్కుమురా అబ్బాయి! బండిత్వరగఎక్కు, శకునము మంచిది, అని మానాన్నగారు అనిరి. నేను బండియెక్కితిని. వెళ్ళుచున్నాను

అమ్మా అని చెప్పితిని. నా సతి మాయమ్మ వెనుక నిలువఁబడి తదేకదృష్టితో నన్నుఁ జూచుచుండెను. ఆమేమియు మాటాడలేదు, కంటనీరు మటుకు గ్రిమ్ముచుండెను. ఆసమయమున నామెను జూడ నాకును నించుక యేదో హృదయభారము కలిగెను. కాన నామెను జూచుటమానితిని. మాతండ్రిగారు కూడ గులాబిరంగు తలపాగ చుట్టుకొని బండియెక్కిరి. ఆయన నాతోఁగాని నేనాయనతోఁగాని కొంచెము సేపువఱకు మాటాడలేదు. మా యిఱువురకును గన్నులయందు నీరు వచ్చుచుండెను. కలఁగఁబోయెడు నెడబాపును గుఱించి విచారమగుచుండెను. వచ్చుచున్న దుఃఖము నాపుకొనుటచే గొంతుకయందును భారముగనే యుండెను. సుఖముగ నింటిపట్టున నుండక యీప్రయాణమేల తలపెట్టికొంటినని పశ్చాత్తాపము నొందితిని. మేము రైలుకు వెళ్ళుచుండఁగ మార్గమందుఁ గనబడిన కొందఱు పరిచితులెక్కడికని యడిగిరి. "మాఅబ్బాయిని చెన్నాపట్టణము పంపుచుంటి"నని మానాన్నగారు చెప్పునపుడే యాయనకుఁ గొంత సంతోషము వచ్చెను.

చెన్నపట్టణము, అందలివిలాసములు, తిరిగి వచ్చిన తరువాత నాకగు గౌరవము, ముఖ్యముగ శశిరేఖా సందర్శనమును దలఁచుకొనుచు వానింగూర్చి తలఁపోయుచు నేనును లోలోన మురియుచుంటిని. రైలుస్టేషను చేరఁగనే బండిదిగితిమి. బండివాఁడు సామాను దింపి లోపలఁబెట్టెను. మాతండ్రిగారు సామానుయొద్దనే కూర్చుండిరి. స్టేషనులోఁ గ్రింద దుమ్ము

తోడను ఉమ్ములతోడను నసహ్యముగా నుండుటచే నేను బైట బచారుచేయుచుంటిని. ఇంతలో టిక్కట్లు నిచ్చుటకు గంటకొట్టిరి. చాలమంది టిక్కట్లిచ్చు కిటికీకడ గుంపుగఁ జేరిరి. అచ్చటి త్రోపులాటలు, గెంటు కొనుట టిక్కట్టు నలిగిపోయినదనుకొనుట, చిల్లరపోయినదని కేకలిడు వారలను, జూచి నేనచ్చటకు వెళ్ల లేదు. గదిలోనికి వెళ్లి మదరాసునకు టిక్కెట్టు ఇమ్మని యడిగి తిని. గదిలోనికే నాతో గొందఱును నాకంటె ముందుగ గొంద ఱును వచ్చి టిక్కట్లనడిగిరి ; బైటకువెళ్ళి కిటికీ దగ్గఱకు రమ్మని యాటిక్కట్లు నిచ్చువాఁడు చెప్పుచుండెను గాని, నా "హై "కాల రు" చూచియు నేను మదరాసునకు టిక్కట్టు అడుగుట చేతను నాకు ముందుగ నిచ్చెను. టిక్కట్టు పుచ్చుకొని మాతండ్రిగారి దగ్గఱకువచ్చితిని. "అబ్బా ! గట్టివాఁడవేరా ! ఈసమ్మర్దములో నపుడే టిక్కట్టు ఎట్లు తెచ్చితివిరా !" యని మెచ్చుకొనిరి. సామాను రైలులో వేయుటకుఁ గూలి వాండ్రను బిలచితినిగాని యీపెట్టె పరుపునకుఁ గూలి వాఁడెందులకని మాతండ్రిగారు పెట్టె చేతఁబుచ్చు కొనిరి. పరుపుకూడఁ బెట్టెమీఁద పెట్టి మేమిఱువురము సాయముపట్టి రైలుగట్టు దగ్గఱనే పెట్టితిమి. రైలు రాకపోవుటచే నేనిటు నటు పచారు చేయఁజొచ్చితిని. ఎవ్వరి తోడనైన మాటాడుచో నింగ్లీషుననే మాటాడు వాఁడను. నవ్వుచో గట్టిగ నవ్వువాఁడను. కిఱ్ఱు చెప్పులు తొడిగి కొని మూరెడు పొడుగు చుట్టలు నోటఁ బెట్టుకొని చేతులలోఁ గఱ్ఱలు చెంబులు పుచ్చుకొని రైలు ప్రయా

ణమునకు వచ్చిన పల్లెటూరికాపులు కొందఱు నాకు వినిపించు నట్లే యెవరాయన యని తమలోఁ దామనుకొనుచుండిరి. ఎవరికిఁదోఁచినట్లు, వారు పోలీసు యుద్యోగి యని కొందఱు, ఓవరుసీరుఅని కొందఱు చెప్పుకొనిరి. నేనుమాత్రమెవ్వరికిని సమాధానము చెప్పలేదు. ఇంతలో రైలువచ్చినది. "రారా అబ్బాయి" అని మానాన్నగారు పిలిచిరి. పెట్టె చేత నెత్తుకొనిరి. రైలుతలుపు తీసి నేను లోపల కెక్కి పెట్టెయుఁ బరుపును చెంబును బుచ్చుకొంటిని. నా వెనుక నే మఱికొంద ఱెక్కిరి. ఆబండిలోఁ గూర్చుండినవారు "తలుపు వేయుఁడయ్యా, తలుపు వేయండి, ఒకరొక దానిలోని కెక్కుఁగ నందఱు దానిలోనికే"! అని తలుపు దగ్గఱఁ గూర్చుండినవారితోఁ జెప్పిరి. తలుపు వేసిరి. "రైలు వెళ్ళిపోవునయ్యా, నే నెక్కుఁడనే, నాకు సామానుకూడ లేదు, నన్నెక్కనీయుఁడయ్యా" అని బ్రతిమాలువారిని," "ఇక్కడఁజోటు లేదు పో, పైబండ్లన్నియు ఖాళీగానే యున్నవి అని చెప్పి పంపివేయుచుండిరి; వీరిని దలుపు తెరువనీయక గట్టిగఁ దలుపు నొక్కి పట్టిరి. మఱియొకఁడు వచ్చి తలుపుత్రోసెను. "ఇందులోఁ జోటు లేదు, పైకివెళ్ళుఁడని" తలుపు మరల వేసిరి. నీయిష్టమేనా యని యతఁడు తలుపు మరలఁ ద్రోసెను. చోటులేదని చెప్పఁగ నీకుఁ దెలియదా?" అని మాబండిలోనివా రిద్దరు లేచిరి. అంత నాతఁడు "ఈబండి నీసొమ్మా, నీయబ్బసొమ్మా? నీవెట్లు డబ్బిచ్చి టిక్కట్టుకొంటివో నేను నట్లేకొంటిని. ఎట్లు ఎక్కనీయవో చూచెదను" అనితలుపు రెండుచేతులతోడను గుభాలునఁ ద్రోసెను.

తలుపునందిమి నిలుచున్న నితుప్రురు వెనుకకుబడిరి. మఱల లేచిరి. పడత్రోసెదవా ? యని దూషణమును బ్రారంభించిరి. నన్ను మానాన్నగారు పిలచి, అబ్బాయి ! జాగరూకతసుమా, చెన్నాపట్టణములో మంచిసహవాసములు చేసి శ్రద్ధగ జదువు కొనుచుండు. లేనిపోని జోలికిబోకు. తఱుచుగ నుత్తరము వ్రాయుచుండుము అని చెప్పిరి. తలుపు తోసెద యతడు రైలెక్కెను. రైలు కూసినది. "అబ్బాయి! తలుపుసందులబడి నీవ్రేళ్ళు నలుగును. దూరముగ మధ్యగ గూర్చుండు"మని మానాన్న గారు చెప్పిరి. నేను భయములేదని చెప్పి కిటికిలోనుండి తల బైటకుబెట్టి మాతండ్రిగారితో మాటాడుచుంటిని. రైలుకదలి నది. రైలుతో మాతండ్రిగారు రెండడుగులు వేసి, ఓరీ, అబ్బాయి నీ దేహారోగ్యము సరిగ జూచుకొనుచుండుము అని చెప్పిరి. రైలు గబగబ నడుచుటచే ఆయనయు రెండడుగులు గబగబ వేసి యచ్చటాగి "ఒరే, అబ్బాయి, ఉత్తరము, ఉత్తరము" అని చేతితోడను సంజ్ఞచేసి "తఱుచుగ వ్రాయుచుండు" అని బిగ్గ అగనేక వేసిరి. నేనును వెళ్ళుచున్నానని రైలుకిటికిలోనుండియే చెయ్యి త్రిప్పితిని. మాతండ్రిగారు రైలు చాలదూరము వెళ్ళ వఱకు నట్లే రైలువైపు చూచుచు నిలువబడిరి. అది వారి దృష్టిపథము తప్పగనే మరలిరి. నేను మాతండ్రిగారు కనబడి నంతసేపు ఆయననే చూచితిని. తరువాత గూర్చుంటిని. రెండు నిముషములు మాబండిలో నెవ్వరును మాటాడలేదు. తరువాత నందులో నొకడు బలవంతముగ నెక్కినవానిని ఏయూరు

వెళ్ళుదురని యడిగెను. అతఁడు శాల్మలీపురమున దిగుదునని చెప్పెను. “సరే ఈకొంచెము దూరమునకు నెక్కడనిలుచుండి నను సరిపోవు”నని వారనిరి. “అంకులకేనయ్యా, ఈబండి మీరేమి గడించిరా ? అని యతఁడు సమాధానము చెప్పెను. “అందఱి సదుపాయమునకై చెప్పిరిగాని వారికొఱకుఁగాదు కద; మీరిట్లు ఇరికి కూర్చుండ నక్కఱలేదు. పైబళ్ళన్నియు ఖాళీగనే యున్నవి. అయిన రెండుగడియల సేపునకుఁ దగువులాట యేమి”టని వారు సమాధాన పరచిరి.

ఈకబురులు ముగియు లోపలనే తత్పురనగరము చేరితిమి. రైలాగుటతోడనే నేను దిగితిని. నేనంత తొందఱగ దిగుటచే నేను టిక్కట్టు లేకుండ రైలెక్కితి ననుకొని టోపిపైఁ బేరు వ్రాసుకొనిన యుద్యోగియొకఁడు నాయొద్దకువచ్చిటిక్కట్టు చూపుమనెను. ఆనాఁడే శశిరేఖకూడ బైలుదేరునని వింటినిగావున నామె వచ్చెనో లేదో యని తొందఱగఁ జూడఁబోవు చుండ వాఁడడ్డమువచ్చెను. ఈతొందఱలో టిక్కట్టు కనఁబడినదికాదు. అదిచూపకుండ వాఁడు వెళ్ళనీయుటలేదు. వెతుకఁగ వెతుకఁగ లోపలికుడితిని జేబులో టిక్కట్టుకనఁబడినది. దానిని దీసిచూపి, యీమాత్రము దానికి మర్యాదలేకుండ నాపితివిగద యని వానిని నిందించి వానిప్రత్యుత్తరము వినకుండనే శశిరేఖకొఱకు వెదుక నారంభించితిని. చైకితాయనుఁడుగారు కనఁబడిరి. ఆయనను జూచి శశిరేఖ వచ్చినదనుకొంటిని. కొంచెము దూరము వెళ్ళఁగనే ఫ్లేబండి ఖాళిగనున్నదోయని విశ్వసుందరుఁడు వెద

కుట గాంచితిని. అతనికడకుఁ బరుగెత్తితిని. ఓహో విశ్వసుంద రుఁడా! యనిపలుకరించితిని. అతఁడు "నీవు వెళ్ళుచున్నావా?" యని తాను బండి బండి వెతుకుటకే పోవుచుండెను. "మీసోదరి వచ్చుచున్నదా? ఈబళ్ళు ఎంతమాత్రము ఖాళిగలేవు, ఆఁడు వారిబండిలో నెక్కింపుము"అని చెప్పితిని; అతఁడు సరేయనియె. అతనితోడ నేను, శశిరేఖయు నామెతండ్రియు నిలుచుండిన చోటునకు వెళ్ళితిని. విశ్వసుందరుఁడు శశిరేఖ పెట్టి చేతఁబుచ్చుకొని యాఁడువారిబండిలో నెక్కుమువుగాని రా, ఇంక నెక్కడ ఖాళిగలేదు అని సోదరికి జెప్పెను. వారికి సహాయముచేయుటకై నేనామెపరువు పట్టుకొంటిని. చైకితాయనుఁడుగారు నన్నుఁ జూచి "పాపము మీరు శ్రమపడుచున్నారే" యని యొకమూట పట్టుకొని వచ్చుచుండిరి. శశిరేఖ మరచెంబు పట్టుకొనెను. ఆయన మాటాడినందులకును నేను కొంతసహాయము చేసినట్లు గుర్తించినందులకును సంతోషించి "ఏమి సహాయము లెండు! మీరు మోయలేరు. ఆమూట తెండు"అని చేయిచాపితిని. కాని ఆయన అక్కఱలేదనియె. శశిరేఖ బండియెక్కెను. ఆమె చెన్నపట్టణములో నెచ్చట దిగునని యడిగితిని. విద్యార్థినులకు వసతియేర్పరుపబడియుండెననియు, నచ్చటనే దిగుననియు చైకితాయనుఁడుగారే చెప్పిరి. ఇంతలో రైలుబైలుదేరుటకు గంటకొట్టిరి. నేను తొందరగ నాసామానున్న బండి వెతకుకొనుచు నచ్చితిని. తలుపుతీసికొని యెక్కఁబోఁగ మణిపురములోఁ గ్రిందనుండి పోరాడి యెక్కినయతఁడే యిందుఖాళీ లేదు రావలదని నన్నుఅడ్డుపెట్టెను

నా పెట్టియుఁ బరుపును నందే యుండుటచేతను నే నందుండియే దిగినవాఁడ నగుటచేతను ఆబండిలోనుండిన కొందఱు "ఆయన ఇంటిలోనివారే! రానిండు రానిండ"నిరి. నాల్గునిముషములు కలసి ప్రయాణము చేయఁగనే శకటాభిమానము కలిగి నన్ను చిక్కులు పెట్టక లోపలకు రానిచ్చిరి. అట్టిచో మనము పుట్టి పెరిగిన దేశమందును దేశస్థులందును భక్తియు భ్రాతృభావమును గలుగుట కేమి లోటు? రైలు తత్తనగరమునుండి బైలుదేరఁగనే నే నాలోచనలోఁ బడితిని. తొలుత శశిరేఖ నెట్లు పలుకరింప వలెనని యూహించుచుంటిని. శశిరేఖ యొక్కతెయే వచ్చు చున్నది. ఒంటిగఁ బ్రయాణముచేయుఁ బడంతికిఁ బురుషసహాయ మవశ్యము. ఆమెకు సహాయముచేయుటే యామెతోఁ బరిచయము చేసికొనుట కుత్తమమార్గము. పూర్వము యోధులు సుందరాంగుల కాపత్కాలమందు సహాయము చేసియేగదా వారి ప్రేమకుఁ బాత్రులైరి. నూతఁబడిన దేవయానిని రక్షించియే యయాతి యామెను వివాహమాడఁ గలిగె. మఱియు నేఁజదివిన ఇంగ్లీషు నవలలందు పురుషులు తమ మనోనాయికల యనురాగమునకుఁ బాత్రులుకాఁగోరి వారికిఁ దామే చాటున నుండి యాపదలు కల్పించి యేమియు నెఱుఁగనట్లు వెళ్ళి వారి నుద్ధరించుచుండిరి. నేనును శశిరేఖకు సహాయము చేయుటకు నడుము బిగించితిని. కానియామెకు నాసహాయమవసరమెక్కడ? నే నిట్లాలోచించు చుండఁగ నొక్కటి స్ఫురణకువచ్చెను. శశిరేఖకు టికెట్టు విశ్వాసుందరుఁడు కొనును, అడావిడిలో

నతఁడు టిక్కెట్టును శశిరేఖ కిచ్చుట మఱచును. బెజవాడలో టిక్కెట్టులను బరీక్షచేయుట కొక్కఁడు వచ్చును; అతఁడు శశిరేఖను గూడ టిక్కెటు చూపుమని యడుగును. ఆమె వెతకి వెతకి యది కనఁబడకపోవుటచే వెలవెలఁబోవును. అంతవాఁడట్టహాసముచేయును. ఆసమయమున నేఁబోయి వానికి సమాధానముచెప్పిపంపివైచెదను. ఆమెను అమర్యాదనుండి కాపాడితివని శశిరేఖ సంతోషించును.

ఇట్టి మందియుపాయము తట్టినందులకు లోలోన సంతోషముతోనుంటిని. కొంచెము నిద్రకూడ పట్టెను. కాని ప్రతిస్టేషనులోను బోరాటములే. సూర్యునితో వెలుతురుతప్పనట్లు రైలుతోఁ బోరాటలు తప్పవుకాఁబోలు. రైలులో నన్నిరకముల కబురులు వినఁబడుచుండెను. ఉద్యోగస్థులనుగూర్చి నిందలు ధరవరుల వాకబులు, వితంతుసోదరికి రావలసిన సొమ్మునుగూర్చి యాలోచనలు, సంగీతములు, నవ్వులు, చంటిపిల్లల యేడ్పులు, అన్నియు వినఁబడుచుండెను. ఒక్కగంట రైలులోఁ బ్రయాణము చేయుచోఁ బ్రపంచమందలి యన్ని సంగతులు తెల్లమగును.

రైలు నిలచ్చుటాగినను నది బెజవాడ స్టేషనేమో యని చూచుచుంటిని. అనఁగ నవఁగ బెజవాడవచ్చెను. నేను బండిదిగి ఆఁడువారి బండిదగ్గఱకు వెళ్ళితిని. ఆబండి ప్రక్కచెక్కయెక్కి లోపలఁ జూచితిని. లోపలనున్న సల్గురుస్త్రీలు నిద్రపోవుచుండిరి. టిక్కెట్టునడుగుట కెవ్వరును రానేలేదు. నేను బండిచెక్క దిగి నడచి రెండడుగులు వేసితిని. నావైపు ఎవరోవచ్చుచున్నట్లు

చూచితిని. ఈరాత్రివేళ నాఁడువారిబండి యెందుల కెక్కితివని నన్నడుగునేమోయని జడిసితిని. అతనికి నాపై యనుమానము గలుగకుండుటకై నేను మరల వెనుకకు వెడలి యాబండియే యెక్కి శశిరేఖా శశిరేఖాయని పిలచితిని. నేనట్లుపిలచుటచేత, ఆబండిలోనున్న మాబంధువులకై నేను ఆఁడువారిబండి నెక్కితినిగాని చోరుఁడనుగా ననుకొని యాతఁడు వెడలిపోయెనో, తనపనిమీఁదఁ దనదారిని దాను బోయెనో కాని, నాకు మాత్ర మతఁడు మరల నగుపడలేదు. శశిరేఖ లేచి బండియం దుండియే యెవరువారని యడిగెను. "నేను, సోమేశ్వరుండను, సుఖముగ నిద్రపట్టినదా? మంచినీళ్ళు కావలయునా?" అని యడిగి "మీ యన్నయ్య నిన్నుకనుగొనుచుండుమని చెప్పినాఁడులెమ్ము" అంటిని. "అటులనా? ఇక్కడ బాగుగనేయున్నది. నిద్రపట్టినది." అని చెప్పి యామె మరలఁ బడుకొనినది. నేనును ఇంతవఱకు ధన్యుఁడనైతి ననుకొని మాబండి యెక్కితిని.

బెజవాడ దాటినతరువాతఁ గొంచెము ఖాళీయగుటచే బల్లమీఁదఁ బరుంటిని. నాకు నిద్ర బాగుగఁ బట్టెను. ఉదయమున గూడూరులో ముఖము కడుగుకొనుటకు దిగితిని. అచ్చటనే శచీనాథుఁడును మఱికొందఱు మిత్రులును గనఁబడిరి. ముఖము కడుగుకొనిన పిదప నచ్చట నమ్ముఇడ్డెనుల భక్షించి కాఫీత్రాగి శచీనాథుఁడును నేనును నేనెక్కిన బండి దగ్గఱకు వచ్చితిమి. శచీనాథుఁడు నాతోడనే కూర్చుండెను. రైలు కదల నారంభించిన తరువాత మాయమ్మ యిచ్చిన

మినపసున్నియుండలు మేమిద్దరము భక్షించి నా జేబులో
నున్న చెక్కలు వేసికొంటిమి. నేను అతఁడు పాఠశాలలో నెను
కటి యుపాధ్యాయుల సంగతియుఁ గొందఱు విద్యార్థులు గావిం
చిన యల్లరిని గుఱించియు ముందుఁ జెన్నపట్టణములో మేమెట్లు
వర్తింపవలసినదియుఁ దరువాత నేమేయుద్యోగము లెచ్చటఁ
జేయవలసినదియు మాటాడుకొంటిమి. రైలు ఆగినపుడెల్ల
మేమును దిగి జేబులలోఁ జేతులు పెట్టుకొని పచారుచేసెడి
వారము. రైలు కదలినపుడే మరల బండిలో నెక్కుచువారము.
నెల్లూరు స్టేషనులో రైలెక్కుటకు వచ్చిన యొక అయ్యంగారి
భార్యయుఁ జంటిబిడ్డయు నెక్కరిగాని ఆ మూటమాత్రము పెట్టి
పట్టుకొని యెక్కలేకపోయె. ప్రయాణీకు లెక్కువగ నుండుటచే.
యెక్కుట కష్టముగనే యుండెను. ఎక్కలేక భార్యను రైలుదిగు
మని యఱచుచున్న యా స్వామిం జూడ మాకు నవ్వువచ్చి నవ్వి
తిమి గాని యాతనకు సహాయముచేయ బుద్ధి మాకుఁ బుట్ట
లేదు.

చెన్నపట్టణము చేరినతరువాత మా సామానులు మోం
యుటకై వచ్చిన కూలివాండ్రను వదలించుకొని యొక్కనిచే
మోయించి జట్కాబండ్లకడకు వెళ్ళితిమి. తిరువళ్ళికేణికి బండి
వాఁడు మూఁడు పావులాలు అడిగెను. మామూలుగ నిచ్చునది
పావుల మాత్రమే యఁట ; కావున శచినాథుఁడు వలదనియె.
మూఁడు పావులాలగుచో మా యిరువురకు నారేసియణాలగును;
అది యంతపెద్దమొత్తముకాదు. కాని మాఱెయిద్దఱము, తిరువళ్ళి

క్కేణికిఁ బోవువారలను, బిలచి వారిని గల్పుకొని రూపాయ మూఁడుపావులా లిచ్చి గుఱ్ఱపుబండి యెక్కితిమి. ఆబండివాఁడు త్వరగఁ దోలుచుండఁగ గుఱ్ఱమును శ్రమపెట్టవలదు, మెల్లగఁ దోలుమని చెప్పితిమి. మేము గుఱ్ఱపుబండిలోఁ గూర్చుండి బండిలోఁ జేతులానుచుకొనుట కుండు సంచులందుఁ జేతులుంచి రోడ్డునకా యీ ప్రక్కలఁ జూచుచుంటిమి. నేనెఱింగిన వాఁడొక్కఁడును గనఁబడక పోవుటచే నీబండియెక్కుట నిరర్థకమయ్యెనని విచారముకలిగెను. ఆపూట తిరువళిక్కేణిలో జనార్దనునింటనే దిగితిమి. ఆతఁడాదరించినట్లు ఏయత్తగారును నల్లుని నాదరింపలేదు. ఆతఁడు ధనము ప్రధానముకానివాఁడు, శాంతుఁడు. ఆరణాలిచ్చి వానియింట నాపూట విందారగించితిమి. భోజనముకాఁగానే మేముండుటకు గదులు వెదకుకొనఁ బోయితిమి.

---

# 7

## మొదటివారము.

నేనును బద్మాకమూరుం డను మఱియొక విద్యార్థియు భోజనము చేసి పిదప గదులకోసము వీథి వీథి తిరిగితిమి. అందుఁ గఁటికిఁ బుగ నండిన ప్రతిగృహమును బ్రవేశించి మీయింటియందేదైన గదులు ఖాళీగనున్నవా యని యడుగుచు వచ్చితిమి. అట్లడుగుటకు నాకు మొదట భయమేయయ్యెను; మాయింటిలోనిగది యద్దెల కిచ్చుకొనుగతి మాకు రాలేదని యీ యా

యిండ్లవారు మమ్ము దూషింతురేమో యనుకొంటిని. కాని ప్రతివారును గదిలేదని చెప్పుటలో యొకటి చూపించుటలో గాని యెవరును నిందింపలేరు. పద్మకుమారుఁడు క్రిందటి సంవత్సరము కూడఁ జెన్నపట్టణములో నుండినవాఁడు గావున నతని కచ్చటి సంగతులు తెలియును. సాధారణముగఁ బ్రతియింటియందును గదులు దొరకుననియు విద్యార్థుల కద్దెలకిచ్చుచుందురనియు నేదేని యొకయింట ముందువాకిట జనముగపడరేని వారుకనఁబడు వఱకు నింటిలోపలకు వెళ్ళవచ్చుననియు నతఁడు చెప్పెను. కాని నేను సంకోచించి వీథిగుమ్మము దగ్గఱనే యుండువాఁడను. కొన్ని యిండ్లగదులు ఖాళీగనుండినను నింటిలోనున్న యయ్యంగారులు ఖాళీలేదని చెప్పువారు వారిని బద్మకుమారుఁడు తిట్టుచు బైటకువచ్చెడువాఁడు. వారట్లు చెప్పుటకుఁ గారణమేమని నేనడుగఁ దెలుగువారలు చుట్టలుకాల్చి యుమ్ములు వేయుదురనియు వారి యాచారమునకు వీరిపరివర్తనము చాలదనియు వారు భయపడి యిట్లు చెప్పుదురనెను. తిరిగి తిరిగి నల్లతంబివీథిలో నొకగొల్లవాని మేడపై నే నొకగదియు దాని సమీపముననే పద్మకుమారుఁడొకటియుఁ గుదుర్చుకొంటిమి. ఆసాయంకాలము మాకుఁ గావలసిన సరుకులు కొనుక్కొనుటకై బజారునకు వెళ్ళితిమి. దుకాణములు పెద్దవన్నియుఁ బట్టణములోనే యుండుటగాన ట్రాము ఎక్కి వెళ్ళితిమి. నేను కొనవలసినవి యెక్కువగ లేకపోయినను ట్రాముబండి యెక్కు సరదాచేతనే వెళ్ళితిని. రైలు పట్టాలపై నడుచు ఆబండ్లను జూడగ నాకెంతో ఆశ్చర్య

మయ్యెను. పద్మకుమారుఁ డిదివఱకు వాని నెక్కుట నేర్చికొనెను గాన ట్రాము నడుచుచుండఁగనే యెక్కి నన్ను నెక్కుమనెను. నేను భయపడుచు భయపడుచు నెక్కి పడితిని. ఎవరైనఁ జూచి నవ్వెదరేమోయని త్వరితముగ లేచి దులుపుకొంటిని; ట్రాము వాఁడు నాపై జాలిగొని బండి యాపెను. నేను మరల నెక్కి పట్టణము వెళ్ళి యది యాగిన తరువాతనే దిగితిని. చెన్నపట్టణములో బేరసారముల యనుభవము నాకు లేదు గావున నాకుఁ గావలసినవి కూడఁ బద్మకుమారునే కొనుమంటిని. నేను మేడలు, మిద్దెలు దుకాణములు, వచ్చెడుబండ్లు పోయెడుబండ్లు చూచుచుంటిని. నామిత్రుఁడు సరుకులు కొనినపిదప మరల బండి యెక్కుటకు వచ్చితిమి. మేము మొదట ట్రాముదిగిన చోటునుండి యరమైలు ముందునకు వచ్చి యుంటిమి. ఇచ్చటినుండికూడ ట్రిప్లికేనునకు నొక యణా పుచ్చుకొందురని పద్మకుమారుఁడు చెప్పెను. నాకు ట్రాముసరదా తీరలేదు కావునను ఒక యణా పూర్తిగ నిచ్చుచున్నాముగావున దానికి ట్రాముమీఁద ప్రయాణము చేయఁగలిగినంతదూరము చేయవలెననియుఁ బద్మకుమారుని బలవంతపెట్టి వెనుకకే తీసికొని వెళ్ళితిని; ట్రాము బైలుదేరు చోటుననే దాని నెక్కితిమి.

మేమింటికి వచ్చునప్పటికి కాలస్యమైనది. తెచ్చినసామాను గదిలోవేసి తాళము వేసి జనార్దనుని యన్న సత్రమునకుఁ బరుగిడితిమి. అది మిక్కిలి విశాలమైనదే గాని యంతయు భుజించు విద్యార్థులతో నిండిపోయెను. ఒక పెండ్లి విందువలెఁ

గన్నుల కింపుగనే యుండెను. మాకుఁ జోటు లేక పోవుటచేఁ బదినిమిషములు వీధిలోనే నిలువఁబడితిమి. కొందఱు భోజనము చేసి లేచినతరువాత వారివిస్తరులు ఎత్తివేసి, గచ్చు తడిగా నుండ నీళ్ళుజల్లి మాకు విస్తళ్ళువేయఁబడెను అక్కడనే మా భోజనము; నాకు అసహ్యమే యైనది. పైఁగ నెన్నియొడ్లనుం డియో గచ్చునందింకిన సాంబారు, పచ్చళ్లయొక్క కుళ్ళువాసన యొకటి! ఆపూట కెట్లో భోజనముచేసితిని గాని మఱునాఁటినుం డియు నేనున్న గదిలోనికే భోజనము గొనితెమ్మని చెప్పితిని. మా మేడక్రిందఁ గాపురమున్నది గొల్లవారైనను మాగదికిని వారికిని సంబంధము లేదుగావున మాగదిలో భోజనముచేయుట వలనఁ దప్పులేదు; అదిగాక, మహాపట్టణమందుండు విద్యార్థు లకు అంతకంటె నాచారము సాగదు నామిత్రుఁడు పద్మనువా రుఁ డిదివఱకే చెన్నపట్టణమున నాసనలు కలవాఁడయి యుండెను గాన నచ్చటికే వెళ్ళి భోజనము చేయువాఁడు.

శశిరేఖ యెచ్చట దిగినదియు నెచ్చట నున్నదియు నాకుఁ దెలియలేదు. ఇవి కనుగొనకుండుటయు నామెకుఁ గావలసిన సహాయము చేయకుండుటయు నాలోపమే; కాని శచీ నాథుఁడును మఱికొందఱును వెంబడి యుండుటచే వీరిని వద లించుకొని వెళ్లుటకు వీలైనది కాదు. ఆమె ప్రవేశించు కళాశా లలోనే నేనును జేరితినిగాని యామె మొదటివారములో నెచ్చ టను గనఁబడలేదు. మొదటివారమంతయుఁ గ్రొత్తగ వచ్చినవా రిని జేర్చుకొను సందడితోడనే ముగిసెను గాని పాఠములు జరు

గ లేదు. అందువలన వేఱుగఁ గబురులు చెప్పుకొనువారే కళాశాలకువచ్చి బైటనే గుంపులుగుంపులుగనుండి యాటలాడుచుఁ బాటపాడుచు వెడలిపోయెడువారు. నిజమునకుఁ జెన్నపట్టణము వెళ్ళిన మొదటివారములో శశిరేఖను గుఱించి నేనంత తలఁప లేను. ఆమహాపట్టణము అందలి మేడలు, దీపములు, దుకాణములు, ట్రాముబండ్లు, మోటారుబండ్లు నాచిత్త మాకర్షించి యున్నవి. మొదటి వారమంతయుఁ బట్టణము వెంబడి తిరుగుచుంటిని. అందుఁ జూడఁదగినవి చూచుచుంటిని.

కళాశాలలో పాఠములు చెప్పుట సరిగఁ బ్రారంభించిన తరువాతనే శశిరేఖ వచ్చెడిది. మఱియు నేఁజదువునది దేశచరిత్ర భాగమొక్కటియే కావున ఆతరగతియందే యామెను జూడఁగలుగువాఁడను. విద్యార్థినులకుఁ గుర్చీ లుపాధ్యాయుల చెంగటనే వేయుదురు. మాకు దూరముగ బల్ల లుండును. కావున విద్యార్థులము మాలో మేము మాటాడుకొనునట్లు విద్యార్థినులతో మాటాడుటకు వీలులేదు. అట్టిది లేకుండఁ జేయుటకే యట్లుమాకు దూరముగ వారికిఁ గుర్చీలువేసిరి. మఱియుఁ గళాశాలకు వారొకయడుగు ముందుగ వచ్చినను వారుండుట కొక గదినిచ్చిరి. అందఱు విద్యార్థిను లచ్చటనే యుందురు. కావున నప్పుడును నేను శశిరేఖతో మాటాడుట యసంభవమే. నే ననుదినమును నామెను జూచుచుంటిని. ఆమెనుగుఱించి తలఁపోయుచుంటినిగాని యామె నన్నుఁజూచెనో లేదో ? ఎట్లులైనను ఆమెదృష్టి నాకర్షింపఁగోరితిని. వాతల

దువ్వుకొని మంచిమంచి బట్టలు కట్టుకొని, అత్తరు రాసికొని యామె కెదురుగఁ గూర్చుందమన్నను నాకంటె నెక్కువగ బట్టలు కట్టుకొని వచ్చువారున్నారు ; కేవలము దొరలవలె నుండువారున్నారు; కావున వస్త్రములచే నే నాకర్షింపఁ గల్గుట పట్టిమాట. నా తెలివి తేఁటలను బట్టియే యామె నన్నుఁజూచు లాగునఁ జేయఁగోరితిని. ఆతరగతిలో నేనుదప్ప మిగిలినవారం దఱు నింగ్లీషుకూడఁ జదువవలసియున్నది. వారది చదువుకాలములోఁగూడ నేను చరిత్రకు సంబంధించిన పుస్తకములే చదివితిని. మాతరగతిలో నెల్లరికంటె నావిషయమున నే నెక్కుడు చదివితిననుటకు సందేహము లేదు. కాని చదివిన దెట్లు ప్రకటించుట? దీని కెట్టివీలును జిక్కకయుండెను. ఇట్లు చాలదినములే గడచెను. ఉపాధ్యాయుఁ డేదైన ప్రశ్న వేయునేమో, యాతఁడెంచిన దానికంటె నెక్కువ సామర్థ్యముతోఁ బ్రత్యుత్తరము చెప్పవలెనని యాతనికంటె ముందుగఁ బాఠములు చదివి యుంచువాఁడను. కాని యాతఁడొకప్రశ్నను నెవ్వరి నడుగలేదు. అదేమి పఠము చెప్పుటయో గాని యాతఁడు చెప్పినది విద్యార్థులకుఁ దెలిసినదో తెలియలేదో కనుగొనఁడు. తన ధోరణిని తాఁ జెప్పుకొని పోవునుగాని వినువార లెంత గ్రహించిరో విమర్శింపఁడు. నేఁజదివినది వెల్లడించుటకును మార్గము లేకపోయె. ఇఁక నేనే యుపాధ్యాయుని బ్రశ్నలు వేయ మొదలిడితిని. ఇతర పుస్తకములలో నేఁజదివినదియు నే బోధపఱచుకున్నదియుఁ బ్రశ్నించి యదెట్లు చెప్పుమని యడుగువాఁడను. నే

నెఱిఁగినదాసిగూర్చియే యడుగుచున్నానని యుపాధ్యాయుఁడు గ్రహించుచో నన్ను దండించునుగాన నాకేమియుఁ దెలియుట లేదని చెప్పితిని; కాని తరువాత పశ్చాత్తాపము నొందితిని. ఆఁడువారికిఁగూడఁ దెలిసినవిషయము నేను బోధపఱచుకొనలేక పోవుట నాబుద్ధిమాంద్యమును వెల్లడించెనని సిగ్గుపడితిని; కాని యొకలాభము చేకూరెను. ఇదిపఱకు నుపాధ్యాయుని బ్రశ్నించు నాచార మాకళాశాలలో లేదఁట. నే నట్లుడుగఁగనే ప్రతివారును నావైపుచూచిరి. శశిరేఖయుఁ జూచెను. అంతియె చాలుననుకొంటిని; కాని యామె నన్నుఁగూర్చి యేమనుకొననో తెలియదయ్యో.

---

# 8

## సముద్రపుటొడ్డు షికారు.

సాధారణముగఁ బ్రతిసాయంకాలమును గళాశాలనుండి రాఁగనే సముద్రపుటొడ్డునకు షికారు వెళ్ళుదును. ఎవ్వరో కొందఱు విద్యార్థు లేవో యాటలాడుదురుగాని తక్కినవారు చల్లగాలికై సముద్రపుటొడ్డునకే వత్తురు. ట్రిప్లికేనులో నయ్యది మిక్కిలి రమ్యముగనుండును. ట్రిప్లికేను సముద్రమును జేరియే యున్నది. మాయింటికిని, అనఁగ, నే నున్నగదికిని, దానికిని బావుమైలుకంటె నెక్కువయుండదు. అది యంత చేరువగ నుండుట నే ననుదినము వెళ్ళుట కొక్కకారణము. మఱియు

సముద్రతీరమున వివిధములగు పుష్పముల మొక్కలు తీర్చినట్లు పాతి, కన్నులపండువు చేసియున్నారు. వీనిప్రక్క నుండు రోడ్డు కూడ మిక్కిలి విశాలముగను నున్నఁగను నుండును. ఈరోడ్డు పొడుగున విద్యుద్దీపములుండును. ట్రాంప్లికేనులోనుండి వచ్చుచు నీరోడ్డు దాటఁగనే సైకతశ్రేణులం దడుగిడుదుము. సాయంకాల మీయిసుకలో, సౌరభము నాఘ్రాణించుచుఁ బుష్పముల మొక్కల ప్రక్కనుండి నడుచుచుండినను అలలతుంపరలు మీఁదఁబడుచుండ నీటివార నడుచుచుండినను మిక్కిలి మనోహరముగ నుండును. కాని నాకుచు నాతోఁ దఱుచువచ్చు శచీనాథునకును నీటివార నడుచుట కంటెను పుష్పసౌరభము నాఘ్రాణించుటకంటెను జలనిధి గభీరముచుగూర్చి తలఁపోయుటకంటెను వన్నెవన్నె వస్త్రములతో వచ్చు పడఁతులఁ జూచుటం దెక్కువ కుతూహల ముండెడిది. ధరించువస్త్రముల రంగును బట్టియే, యొక మైలుదూరములో నుండఁగనే, వచ్చునది పురుషుఁడో స్త్రీయో మేము చెప్పఁగలము. వారి వసనముల వర్ణములుమిక్కిలి ఘనముగ నుండును. మగవారు సాధారణముగఁ దెల్లబట్టలవారే. రంగుచొక్కా లుండినను నివి యంత దీప్తిగ నుండవు. చిన్నివన్నెలపై వనితలకుఁ గలభ్రాంతి పురుషులకు లేదు. పుష్పములకు దళములవలెను సీతాకోకచిలుకలకు రెక్కలవలెను పూఁబోఁడులకుఁ జిత్రవర్ణ వస్త్రములే యలంకారములు. నిజమునకు వారిముఖములకంటె వారిబట్టలే మమ్ము నాకర్షించెడివి. ఇట్లాకర్షింపఁ బడితి మని చెప్పుటచే మాస్త్రీఁ

దప్పుపట్టెదరేమో? నామట్టుకు నే నెట్టి దురూహలతోడను వారివైపుఁ జూడలేదు. మగవార లందఱువచ్చు చోటునకు విచ్చలవిడిగ స్త్రీలు షికారువచ్చుట నే నిదివఱకుఁ జూడలేదు. నా కియ్యది వింతగ నుండుటచే వీరిపై నాదృష్టి వెడలెడిది. ఆ మహాపట్టణమైన చెన్నపట్టణమునందుఁ బాశ్చాత్యసంపర్క మెక్కువగద! దానితోడనే పాశ్చాత్య నాగరికతయు నెక్కువ యబ్బెను. కావునఁ జెన్నపట్టణములోఁ బురుషులును స్త్రీలును, బాలురును వృద్ధులును హిందువులును క్రైస్తవులును, నందఱును సముద్రతీరమునకు వచ్చెదరు. దొరలు దొరసానులసంగతి చెప్పనే యక్కఱలేదు.

శచీనాథుఁడు నాకంటెఁ జెన్నపట్టణములో రెండు సంవత్సరములు ముందునుండి యుండెను గావున నాతని కందఱు దొరల పేరులును దెలియును; మాకుఁ గనఁబడిన ప్రతి దొరను ఫలానవాఁడని చెప్పఁగలఁడు. అంతకంటెఁ జిత్రము: ఆదొరతోఁ గలసినడుచు దొరసాని పేరును జెప్పఁగలఁడు. అతఁడు చూపించిన జంటలలో నెచ్చటనోగాని భార్యాభర్తలు లేరు. "దొరల పేరులు నీకుఁ దెలిసినను దెలిసియుండవచ్చును. ఆదొరసానుల పేరులు నీ కెట్లు తెలియును? వారు, తమతోఁగూడ నడచివచ్చు దొరల భార్యలు కారని నీ కెట్లు తెలియును? లేనిపోనివి కల్పింపకు" మని యొకనాఁడు శచీనాథునితో నంటిని. "మణిపురమువాఁడవు, కోటగోడలు, ఘోషాలుతప్ప చెన్నపట్టణమునాగరికత నీ కేమి తెలియు నని యతఁడు న న్నాక్షేపణ

చేసెను. అప్పటినుండియు నా యనాగరికత వెల్లడి చేసికొన కుండుటకై యతఁ డేమిచెప్పినను నాలకింతునుగాని యదెట్లని యడుగను. శచీనాథుఁడు చెప్పినదే నిజమైనచో నట్టి యాచారము మనలో లేకపోవుట సంతోషమే. సంతోషమే యనుట నాకేల? పరపురుషులతో షికారుపోవుట నాగరికత యయ్యెనేని నాగరికత లేకపోవుట లోపమే. లోపముండుటయు శోచనీయమే నేనొకనాఁడు శచీనాథుఁడుచెప్పిన విషయము మిథునము వెనుక వారేమి చెప్పుకొందురో వినవలెనను కుతూహలముతో వెళ్ళితినిగాని వారిమాటలు నాకు వినఁబడలేదు. ఆదారి వెనుకకుఁదిరిగి చూడఁగ మా రహస్యములు వినుటకు వచ్చుచున్నావా యని నన్నుకొట్టునేమో యని భయపడి నేనును వెనుకకుఁదిరిగి వచ్చితిని.

నేను మా తరగతిలో నుపాధ్యాయుని బ్రశ్నించిన సాయంకాలమే యథాప్రకారము కూలంకషతీర విహారమున కేగితిని. ఆనాఁడును శచీనాథుఁడు నాతోవచ్చెను. మేము కొంతదూరము నడచి కాళ్ళు నెప్పులుపెట్టుటచే నిసుకలోఁ గూర్చుండి యేవేవో మాటలాడుచుంటిమి. మావైపే యిద్దరు జవ్వనులు వచ్చుచుండుట చూచితిని. వారినిజూడ నా హృదయము జల్లుమనెను. అందొకతె శశిరేఖ. ఆమెను జూచుటచేఁ బ్రమాదమునఁగాని రాగోద్రేకమునఁగాని నా నోటినుండి యే మాటవచ్చునో యని భయపడి నేను తలవంచుకొని యిసుకలోనుండిన నత్తగుల్లల నేఱుచుంటిని. వారిని శచీనాథుఁడు

చూచి "అమగోనోయి, మీశశిరేఖ వచ్చుచున్న" దనెను ఆమాటలతో నాకుఁగొంత దడ పుట్టెను. నామనస్సులోని సంగతి యాతని కెట్లు తెలిసెనని నివ్వెరపడితిని. అయినను నింకను కయుఁ జలింపనట్లే తల యెత్తకయే "మాశశిరేఖ యేమిటి?" యంటిని.

"మీయంతరగతిలోఁ జదువుచున్నదిగనుక మీశశిరేఖ; దీనిలో తప్పు లేదుగదా! సోమేశ్వరా, నీ వేమైనఁ గష్టపడి చదివెదరా?"

"ఎవ రెట్లుచదివెడిదియు మాకళాశాలలో నెట్లు తెలియును? ఉపాధ్యాయుఁడు వచ్చును, ఒకగంటయో అరగంటయో యుపన్యాస మిచ్చును, వెళ్ళిపోవును. కష్టపడి చదివినది కాఁబట్టియే యింతవఱకు వచ్చినది"

"దాని కేమిలే! పేరుచూచి యాఁడువారని యెఱిఁగి పైతరగతులలో వేయుదురు. స్త్రీవిద్యయం దభిమానముగద! ఇపుడు!"

ఆతఁడి ట్లనుచుండఁగనే వారు మమ్ములను సమీపించిరి. వారిమార్గమున వారు పోవక, శశిరేఖ నన్ను "ఓహో సోమేశ్వరుఁడుగారా!" యని పల్కరించెను. నామేను పులకరించినది. నే ధన్యుఁడనైతి ననుకొంటి. అట్టివిద్యావతి యొక్క కలోనుండుట ధన్యత కాక యేమగును? నా తెలివితేటల వలన నా విద్యవలన ముఖ్యముగ ఆనాఁడు నే నుపాధ్యాయుని వేసిన ప్రశ్నలనుబట్టి యు నన్నామె జ్ఞాపకమునం దుంచుకొనఁ గలిగె

నని యనుకొంటిని. ఆమె పల్కరింపునకు నా చిఱునవ్వే ప్రత్యుత్తరము. అంతకంటె నేనేమియు బదులు చెప్పలేను. ఇవన్నియుఁ జూచుచుండిన శచీనాథుఁ డెవ్వరికడ నేమని నన్నాక్షేపణ చేయునోయని భయమును గలిగెను. శశిరేఖయు నామె సఖియుఁ దమదారిని జనినపిదప నాతఁడు "సోమేశ్వర! నీకును ఈమెకును బాగుగఁ బరిచయ మున్నదాయేమిటి?" యనియడిగెను.

"బాగుగఁ బరిచయ మేమిటి? అదేపరిచయము! మాతరగతిలోఁ దెలుగువారే తక్కువ. ఉన్నవారిలో మేము సమీప గ్రామవాసులముగద!"

"అయిన, మీరందఱొక్కచోటనే కలసి కూర్చుందురా?"

"లేదు. ఆఁడువారికిఁ బ్రత్యేకముగ నుపాధ్యాయుల చెంతనే కుర్చీ లుండును."

"అవునులే! వీరి యత్తరవులు, అగరునూనెల పరిమళములు వారికే తగులుచుండ వలయును."

కారణము లెవ్వియో నాకుఁదెలియ వనిచెప్పి యీవిషయమునుగుఱించి మాటాడకమఱియొక సంగతిలోని కతనిని దింపఁదలఁచి మూఁడుప్రక్కను జరీతలపాగ పెట్టుకొని జరీయుత్తరీయమును వేసికొని వెండిపొన్నుకఱ్ఱ చేతనూఁగించుచు వెళ్ళుచున్న వానిం జూచి శచీనాథా! వీరెవరు? అని యడిగితిని.

"వీఁడా! కుప్పుసామి అయ్యరు. ఇపుడు బోర్డులో

పని లే! వెనుక మా కృష్ణాజిల్లాలో డిప్యూటికలక్టరుపని చేసినాఁడు. అప్పుడు సంపాదించిన డబ్బుతోఁ బది గ్రామములు కొనవచ్చును. వీనికిఁ బిల్లలు లేరుసుమా!"

"అట్లగుచో నింకను ఉద్యోగ మెందులకు?"

"సంపాదించిన మాత్రమున నింకను నిలువయున్నదనుకొన్నావా? పగలుసంపాదించినది రాత్రి ఖర్చు. నీకటికొఱగ్గుకొఱకే వీనిసంపాదన."

అని, మాకు దూరమునుండి వెళ్ళుచున్న యొకనిని జూచి పిచ్చుకుట్టుమదలియారుగారూ?" అని కేకవేసెను. ఎవరా మొదలియారుగా రని ప్రశ్న వేసితిని.

"ఈ మొదలియారు ఎవ రందువా? ఈయన మొదట ఎవరో, వీని కులగోత్రము లేమిటో నాకుమాత్ర మేమి తెలియును!"

"అయినచో నెట్లు పిలచితివి."

"తేరువీథిని గాపుర మున్నాఁడు. వీనితల్లికడఁ జాల ధన మున్నది. అది వీఁడు గుణించుచుండును"

ఆ మొదలియారుగారును మా సమీపమునకు వచ్చిరి.

"ఏమండి! వాఁడువచ్చి మిమ్ములను గలసినాఁడా? అని శచీనాథుఁడు వారి నడిగెను."

"ఎవరు?"

"వాఁడండి. వైద్యుఁడు, కన్నప్ప."

'"లేదండి."

"చూడండి. వానిపాగరు! నేను వచ్చినప్పుడుచెప్పి వచ్చి నాను. మన మదలియారుగారి తల్లిగారికి జబ్బుగానున్నది. అవశ్యముపోయి చూడుమయ్య అని. వాడువచ్చి చూచెదనని చెప్పె. ఇంకనురాలేదా?"

"అయ్యో మీరు నిండ శ్రమయయినదే."

"శ్రమ కేమిటి? స్నేహితున కింతమాత్రము చేసిననే శ్రమా? మఱి, కుక్కపిల్ల యెటులున్నది?"

"బాగుగనే యున్నది. తల్లిపాలు విడిచినది. మీరు ఎవరినైనం బంపుచో వారిచేతి కిచ్చి దానిని బంపెదను."

"సరే. కాని, నేను పంపినవాడు వచ్చునపుడు మీరింటియొద్ద నుందురో యుండరో. మీరే యొక కూలివానిచేతనైనం బంపరాదా? కూలి నే నిచ్చెదను."

"సరిసరి! కూలి మీ రివ్వవలెనా? అటులనే పంపెదను. మీ రింకొకతడవు మన కన్నప్పగారి దగ్గఱకుంబోయి అమ్మకు జ్వరమువచ్చినది రమ్మని చెప్పవలెను. లేదా నన్నే వెళ్ళుమనెదరా?"

"అక్కఱలేదు. నేను చెప్పెదను."

అని శచీనాథుండు పలుకంగనే మొదలియారు వెళ్ళెను. మా మాట లాతనికి వినంబడని యంత దూర మా మొదలియారు నడచినపిమ్మట శచీనాథుండు "వీని కొఱకిపుడీ వీధులన్నియుదాటి నేను వెళ్ళవలెనంట. నా సతల్లికి

జబ్బుచేసినప్పుడు వైద్యుని పిలుచుకొనుట నాసికి భారమైనచో మనకా శ్రద్ధ? సులువును?" అని నాతో ననెను.

"నీవాతనికి స్నేహితుఁడవుకద. అంతమాత్రము చేయఁగూడదా? పోని కుక్కనుగూడ నిచ్చెదనని చెప్పినాఁడే. అందులకైనఁ బ్రత్యుపకారము చేయువలదా?"

'ప్రత్యుపకారము చేసిననే కుక్క నిచ్చెద ననినాఁడా? అతఁడు కుక్క నిచ్చుటకుఁ బ్రతిఫల మపేక్షించెనేని యది క్రయమగును. అతఁడు నాకుఁ గుక్క నిచ్చెద ననియెఁగాని కుక్కను అమ్మెద ననలేదే! ఇటువంటి వన్నియు న్యాయ శాస్త్రము చదువునపుడుగాని నీకుఁ దెలియవు."

శచీనాథా! చాలు. చాలు. నీ న్యాయము! నీ శాస్త్రము! కొంచె ముపకారము చేయుమనఁగ నీచదువు బాగుగనే యుపయోగించు చున్నావు. అతఁడు కుక్క నిచ్చుటకుఁ బ్రతిఫలము లేకపోవుచో నీవు కుక్కదానము పట్టితివా?

నేను వెళ్ళి వానిదగ్గఱఁ గుక్కను బుచ్చుకొనివచ్చుచో నది దాన మగును; వాఁడే యొకనిచేతఁ బంపి మాయింటియొద్ద దానిని విడిపించును; యజమానుఁడు దానిని విడువఁగనే నది యెవని సొమ్మునుగాదు. దానిని ముందెవరు కట్టివేయుదురో యదివారిది. రోమనులలోఁగూడ శాస్త్రమట్టిదే. దానిఁబట్టియే యింగ్లీషు న్యాయశాస్త్రము నేర్పడెను. అదియే మనకును వర్తించును. నేను కుక్కను మొదట మాయింటఁ గట్టివేసి దను. తెలిసినదా? శునకదానము పట్టుటలేదు. నీ కివేమియు

దెలియదు గనుక యిట్లనుచుంటివి" అని తన ప్రవర్తనము సమర్థించుకొనుటకు నాకు న్యాయశాస్త్రబోధనము చేసి "ఇంకే మిటి విశేషములు సోమేశ్వరా?" అని యడిగెను.

"ఏమున్నవి ? ఆ అయ్యంగారెవరు ?" అని నీటివార నడుచుచుండిన యొక అయ్యంగారిని జూపి యడిగితిని.

"ఆయన ముఖము ఇటు త్రిప్పని, చెప్పెదను." అని ఆ యయ్యంగారు కొంచెము మళ్ళినతరువాత వానిం జూచి,

"వీడా ? వీడు చేసినది ఓవరుసీరుదగ్గఱ గుమాస్తాపని. పాతిక రూపాయలు జీతము. కాని తాయారమ్మగారి యొళ్ళంతయు బంగారమే ! ఒక రైతునకుం దప్పోడు నీళ్ళిప్పించిన యెడల నీయునకుం దప్పోడు రూపాయలు.

సోమేశ్వర ! గొప్పవారందఱు నిట్లు గొప్పవారైన వారే ! న్యాయముగ వెళ్ళువానికి డబ్బెట్లువచ్చును చెప్పు, నీకు నాకు, ఇన్నినంగ నెవ్వఁడైన నిచ్చునా ? ఏదో, పాచిక వేయవలెను ; వానితల ముంచవలెను ; అప్పుడు వానిదగ్గఱ నుండి నాలుగు డబ్బు లేరుకొనవలెను. డబ్బు సంపాదించిన తరువాత నందఱు పెద్దమనుష్యులె! ఏదీ? ఈరోజున నాంచారమ్మగారిని దీసికొని రాలేకుకాంబోలు ? ఈమె ఎప్పుడు నూటేసి రూపాయలకుం దక్కువ చీరకట్టదు."

"ఆబిడనుగూడ నీ వెక్కడ చూచితివి ? "అని నేనడిగితి.

"సరి, సరి, కొన్నివాళ్ళయన భీమవరములో నుండు వాఁడు. ఆవిడ చెవితమ్మి చిల్లిలోనుండి నీవు నేను గూడఁ దూఱ

వచ్చును. ఆచెవులనుండి రెండేసి తులముల కమ్మలు వ్రేలాడు చుండును. రేపు వచ్చినప్పుడు చూపించెదనులె." అని యావి డను జూడకపోవుటచే నాకేదో తక్కువయైనట్లును ఆలోటు తాఁ దీర్చెదననియుఁ బలికి నావైపుఁ జూచుచు "మీశశిరే ఖకుఁ గూడ నేమైన నగలున్నవా?" అని యడిగెను.

శచీనాథుఁడు మరల శశిరేఖ ప్రసంగములోనికి దిగెను. అతని ప్రశ్నలకు నేను సమాధానము చెప్పఁదలఁచుకొన లేదు. అయిన "మాశశిరేఖకు" అని నోటినిండఁ బలికి "నగ లున్నవో లేవో నేను చూచితినా?" యని జవాబు చెప్పితిని.

"పోని, పెండ్లియైనదా? చదువంతయు నైనతరువాత గాని పెండ్లి చేసికొనదా?"

"నే నేసంగతియు నామె నడుగలేదు." అని విముఖత తోడనే ప్రత్యుత్తరమిచ్చితిని. కాని యతఁడీయ్యది గ్రహింప లేదు.

"ఇది యడుగవలయునా? పెండ్లియైనచో మంగళసూ త్రములు కనఁబడవా? అందఱు చంద్రమతులా మంగళసూ త్రము భర్తలకేగాని యగుపడకుండుటకు? వీరి పాతివ్రత్యములు మనకుఁ దెలియవా?" అని శచీనాథుఁడు తన ధోరణిని బ్రశ్నించెను.

నాతలఁపులన్నియు శశిరేఖపైననే యుండెను. ఆవిడ నన్నుఁ బల్కరింపుటకుఁ గారణ మేమై యుండవచ్చును? ఆమె విషయమై ముచ్చటించుట నాకు సంతోషమే యగుచుం

డెనుగాని శచీనాథుఁ డెవ్వరేమను కొందురో యని శంకింపక మాటలాడుచుండును. ఇతనినోట నిం కేమాటవచ్చునో యని వెఱచి యీప్రస్తావన మార్చఁగోరితి. అప్పటికిఁ జీఁకటి పడుటచే "శచీనాథా, చీఁకటిపడినది, వెళ్ళుదమా? మీయింట నొక్కరితె యుండునుగాఁబోలు" అని యతని వచనములు విని పించుకొనని యట్లే పలికితిని.

"ఒక్కతె యున్న నేమి? పిల్లులెత్తుకొని పోవునా? అయిన, పద" అని యతఁడు లేచెను. నేనును లేచితిని.

"చీఁకటి పడినతరువాత నింట నొక్కతె యుండుటకుఁ గష్టముగ నుండవచ్చునుగదా పెద్దవా రెవరైన నుండినఁ గాని."

"నేను పెండ్లామును గనిపెట్టుకొని కూర్చుండువాఁడను గాను సుమా. క్రొత్తగ శోభనమైన యూవను లోకంపులకుఁ రెండవపెండ్లి చేసికొనిన వృద్ధపతులు మఱియొకందులకుఁ గని పెట్టుకొనియుందురు; ఎంత కనిపెట్టిన నెట్లుతిరుగువా రట్లు తిరుగక మానరు."

ఈమాటలకు నాకు నవ్వు ఆగలేదు "శచీనాథా, భార్యకు భర్త యెట్టిసహాయమైనఁ జేయవచ్చునందువా? ఆమెను దాసిగనే చూడవలెనందువా?" యని ప్రశ్నించితిని.

"ఓహో! ఇంకను గొన్ని ఇంగ్లీషునవలలు చదువు; వారి యాచారము పట్టుపడుచోఁ జాల బాగుగనుండును" అని హేళనగ ననియె.

ఇట్లు మాటాడునపుడును నామనసు యెదుట శశిరేఖయే కనఁబడుచుండెను. ఈనాఁడు కల్గిన పరిచయము వృద్ధి చేసికొన నిశ్చయించితిని. శశిరేఖయు నాతోడఁ బ్రసంగింపఁగోరియుండెనని నమ్మకముతోనుంటిని శచీనాథుని నాతనియింటికడ విడిచి యీ యూహలతోడనే నే నింటికి వచ్చితిని.

---

# 9

## నాజోడు.

నేను క్రొత్తగఁ దిరుచునాపల్లి జోడు కొనుక్కొంటిని. దానిపేరు తిరుచునాపల్లిజోడు గాని దానిని జెన్నపట్టణములోనే చేయుదురు. దీనినే ముంగియూర ఆకుచెప్పులందురు. అవి తొడుగుకొనుటకును వదలుటకును జాల సదుపాయముగను సులువుగను నుండును గాన వానిని గొంటిని. మఱియు వీనినన్నిటికంటె నెక్కువ కారణము, అవి కఱవవు. పూర్వకాలమందు జోళ్ళు కఱచెడివి కావనియుఁ దురకరాజ్యమును నంతకంటె నెక్కువగ, నాంగ్లేయరాజ్యమును వచ్చినప్పటినుండియు జోళ్ళు కఱచుచున్నవనియు మా పద్మకుమారుఁడు చెప్పెను. దీనికతఁడు చెప్పు కారణమిది: పూర్వకాలమందు మాంసమునకై గాని చర్మములకొఱకుగాని పశువులను జంపెడువారు కారు. అవి ముదిమి వచ్చి చచ్చిపోయినపిదప వాని చర్మములతోఁ జెప్పులుకుట్టెడువారు. ఇపుడో, గొడ్డుమాంసము తిను తురకలును, ఆంగ్లే

యులును మాంసముకొఱకును అంతకంటె నెక్కువగ వాని చర్మములకొఱకును నడివయస్సు వానిని లేఁత వానిని బలవంతముగఁ జంపి వానినంజుడు గుడుచుచున్నారు; వాని చర్మములతోడనే జోళ్ళు చేయుచున్నారు. బలవంతముగఁ జంపఁబడిన నరులు పిశాచములై తమ్మును జంపినవారిని బట్టుకొని పీడించునట్లు ఈపశువులు తమ చర్మములతోఁ జేయఁబడిన జోడులను దొడుగుకొనిన వారిని గఱచి కఱచి కసి తీర్చుకొనును. కాని, ఆకుచెప్పులకు అడుగట్టయే కాని పైకప్పు యుండదుగావున నెక్కుడే దొడయున్నవాఁడు కఱవలేనట్లు ఇవియుఁ గఱవఁజాలవఁట. మఱియు నే నీ జోళ్ళను మాయింటిప్రక్కనే కాగితములు కలములు, సబ్బులు తువాళ్ళు అత్తరులు, అమ్మునట్టి అయ్యంగారి యొద్దఁ గొంటిని. బ్రాహ్మణుఁడమ్మిన జోళ్లును సాత్వికముగనే యుండును. ఈజోళ్ళకు మూడు రూపాయలిచ్చితిని. ఆ యయ్యంగారు నాకుఁ బరిచితుఁడగుటచే నాకు బేరము చెప్పలేదు. ఒకవేళ నాయొద్ద నెక్కువ పుచ్చుకొనినను జెప్పులమ్ముకొను బ్రాహ్మణున కెక్కువ యిచ్చినను బుణ్యమే.

ఈక్రొత్తజోడు తొడుగుకొని మా కళాశాలకుఁ బోయితిని. మాకళాశాలలో దొరవేషము వేసికొని మేజోడు తొడిగికొనినఁ గాని జోడుతోఁ గూర్చుండరాదు. మఱియు జోళ్ళను మేడమీఁద విడువరాదు. క్రిందనే విద్యార్థులందఱు జోడులు విడుచుట కొకస్థలమేర్పఱుపఁబడియెను. కాని యుపాధ్యాయులతో బాగుగఁ బరిచయమున్నవారును ధైర్యముగల

వారును నీసాంకేతిక స్థలమందుఁగాక తమ తమ తరగతుల యందే పెట్టుకొందురు. నేనుమాత్రము ప్రధానోపాధ్యాయుని నియమము పాటించువాఁడను. నియమమునకు బద్ధుఁడై దానిం బాటించుట యందు గొప్పకలదు గాని దాని నుల్లంఘించుట యందుఁ గాదుగదా! అందులకే నేను జోడుక్రిందనే విడిచితిని; గాని యితరులకున్నంత ధైర్యము నాకు లేకపోలేదు. నే నొంటి గంటకు మేడపై మాతరగతినుండి వచ్చిచూచుకొనఁగ నాజోడు కనఁబడలేదు, దానికై నాలుగుసందుల వెదకితిని గాని యెచ్చ టను గానరాదు. మూఁడు రూపాయలు దండుగ పెట్టితినని విచా రించితిని. ఎవరైనఁ బొరపాటునఁ దొడిగికొనిపోయి యుండ వచ్చును, వారుమరల మధ్యాహ్నము తెత్తురని ధైర్యము తెచ్చు కొని ఫలాహారమునకు వెళ్ళితిని. రెండుగంటలకు మరల వచ్చి యప్పుడును, మరల నాలుగు గంటలకుఁ గళాశాలవదలి పెట్టిన పుడును జోడునకై వెదకితిని. అప్పుడును గనఁబడలేదు. ఆనా యంకాలమంతయు నాకు విచారముగనే యుండెను. జోడుకొని యొక్కరోజు కాలేదు, దానికొ్రత్తరంగు మాయలేదు, అప్పుడే పోయెను. ఎవరికి విచారమురాదు? కళాశాలలోని వారం దఱు సచ్చరితులే. అందలి యుద్యోగస్థులా నీతినేర్పు గురువులు; వారిట్టి నీచకార్యము చేయరుగదా! శిష్యులా, విద్యావంతులైన వారే. ఎవ్వఁడు చెప్పులజోడును దస్కరించును? చిన్నప్పుడు పాఠశాలలందుఁ బుస్తకము పోయెనని యుపాధ్యాయునితోఁ జెప్పుచో ఆయన మిగిలిన బాలురనందఱి నాపి వారి పుస్తక

ములు పరిశీలన చేయుచుందుము. నేను ప్రధానోపాధ్యాయు నితో నాక్రొత్తజోడు పోయినదని చెప్పవలెననుకొంటిని; కాని, జోడు కళాశాలలోఁ బోయినదన్నచో నందలి యుపాధ్యాయుల యొక్కయు విద్యార్థుల యొక్కయు సచ్ఛీలముపై శంకగలిగి యున్నట్లే కదా! అట్లు శంకించినందుకుఁ ప్రధానోపాధ్యాయుఁడు నన్నేమనునో యని వెఱచి యాయనకుఁ జెప్పుట మానితిని. ఇన్ని సారులు వెదకినను గనఁబడకపోవుటచేత నేను కళాశాలకుఁ దొడిగికొని రానేలేదేమో యని యనుకొంటిని. నా గదిలోనే యుండవచ్చునని కళాశాలనుండి త్వరితముగ నింటికిఁ బోయి వెదకితిని. అచ్చటను గనఁబడదయ్యె. ఒకవేళ, జోడు కొని అయ్యంగారికి మూఁడు రూపాయలిచ్చి జోడు తెచ్చుకొనుట మఱచితినేమో యనుకొని మరల దుకాణమునకుఁ బోయి యచ్చట జోడు పెట్టితినా యని యడిగితిని. ఆ యయ్యంగారు నన్ను గేలిచేసెను. నేను కొనకపూర్వము చెప్పిన కబురులకును నిప్పటి ధోరణికిని వ్యత్యాసము చూచి నీతఁడు నమ్మరానివాఁడని తోఁచెను. నాకును గోపమువచ్చెను. అరవమాయ చేసి నీవే యపహరించితివి; నాజోడిచ్చినఁ గాని నేను కదలనని గట్టిగ కేకలు వేసితిని. అపుడతఁడు నన్ను బ్రతిమాలి నేను జోడుతొడిగికొని యింటికి వెళ్ళుట తాను జూచెనని చెప్పెను. నాకును దొడుగుకొని వచ్చినట్లే జ్ఞాపకముండుటచే మాఱుమాటాడక యింటికి వచ్చితిని.

ఆనాఁడు సాయంకాలము షికారు వెళ్ళలేదు. నాతోఁ

బాటు పద్మకుమారుఁడును గొంచెము సేపు గదిలోనే యుండి, పిమ్మట నతఁడొక్కఁడు వెళ్ళెను. నా పాదరక్షు లేమయ్యెనో యని యాలోచించుచుంటిని. ఒకవేళ కళాశాలలో మేడమీఁదనే పెట్టితినేమో యనుకొంటిని; మేడపై వెదకుటకు, నెప్పుడు తెల్లవారు, నెప్పుడు కళాశాలకుఁ బోయెదనని తొందఱపడుచుంటిని. ఇంతలో నాకొకటి తలఁపునకువచ్చెను. నాలుగైదు రోజులక్రిందట సముద్రపుటొడ్డున శశిరేఖ నన్నుఁ బల్కరించెను. ఆమె నాతోఁ బరిచయము చేసికొనుటకు యత్నించుచున్నట్లు స్పష్టమయ్యెనుగదా! పరిహాసమున కామె నాజోడుతీసి దాఁచియుండవచ్చును; నాజోడు పోయియుండదు. చిత్రాంగి చేతికిఁ బావురములు చిక్కినట్లు శశిరేఖచేతికి నా పాదరక్షలు చిక్కినవి. నేను మాత్రము సారంగధరునివలె వర్తింపక మాయిరువురకును గీడు వాటిల్లఁజేయక బుద్ధికలిగి నడుచుకొనవలెనని నిశ్చయించితిని; లేనిచోఁ దరతరములకును నా పేరును శశిరేఖ పేరును నాటకములలోఁ జేర్చి ప్రతివారును నవ్వుచుందురు. శశిరేఖకడనే నాజోడుండుట నిశ్చయము; కాని నేను దానిని బొందవలయును. శశిరేఖ యెంతచమత్కారముగ దానిందీసి దాఁచెనో నేను అంతచమత్కారముగఁ దిరిగి గైకొనవలెను. మఱియు నామె చేసిన పరిహాసము, సరసము, నెఱుఁగని మూఢునట్లు జోడుపోయినదని విచారింపక యామె చేసినదెఱింగియు నే నేమఱియున్నట్లును, ఈమె నాకుఁ దెలియకుండ జోడు తీయయత్నించియు నాకోడిపోయినదనియుఁ దెలియఁ

జేయవలయును. అట్లొనరించుటకై యామెను మొదట నెట్టి
ప్రశ్న వేయవలయునని యాలోచించితిని. ఆ రాత్రి పాఠములు
చదువక యీవిషయమును గూర్చియే తలఁపోసితిని. "శశిరేఖా!
నీమృదు పదకమలములకు నాజోళ్ళు కర్కశముగ లేవా?
యని యడుగ నిశ్చయించితిని. అదియే మంచిప్రశ్న. తరువా
తిసంభాషణ నామె యిచ్చు ప్రత్యుత్తరములను బట్టియుం
డును. దానికై యిపుడే యాలోచించుకొనఁ బనిలేదు.
నాకంత సమయస్ఫూర్తి లేకపోలేదు. ఈప్రశ్న నాకుఁ దోఁచఁ
గనే నాకానందము కలిగెను. అప్పటికే రాత్రి పదిగంట లగు
టచే దీపము తగ్గించి పరుంటిని. నాకుఁ గొంచెముగ నిద్దుర
పట్టెను. ఆనిద్దురలోనే మహానందము కలిగెను. నాకొక కల
వచ్చె. ఆకలలో: నేనును బద్మకుమారుఁడును సముద్రపుటొ
డ్డునకు షికారుపోయితిమి. మేము నీటియొడ్డున నడుచుచుండఁగ
నది యెట్లో రైలయ్యెను. కొంతదూరము వెళ్ళినతరువాత నొక
స్టేషనువచ్చెను. అచ్చట నేను దిగితిని; ఒక క్షత్రియకాంత,
రైలెక్కుటకు, ఎక్కివచ్చిన సవారిలో నేనెక్కితిని. ఆసవారి
బోయీలు నన్ను తఱుముకొనివచ్చిరి. నేను ఛల్ ఛల్మని
సవారిని దోలితిని; అది యాకాశమార్గమున నెగిరిపోయెను.
మేఘములలో నొక మేడయుండెను. ఆమేడలోనుండి శశిరేఖ
వచ్చి "సోమేశ్వరా దిగవేమి"యని యడిగి, సవారిపైఁ జెయ్యి
వేసెను. నేను దిగితిని. ఆసవారి నాతిరుచునాపల్లి జోడుగ
మారిపోయెను. శశిరేఖా, జోడులను హస్తములఁ బట్టుకొం

దు వేల యని యడిగితి; "నీజోడగుటయే కారణ"మని యామె మందహాసము చేసెను. నీకరపల్లవము వాడిపోదా విడువుము విడువుమని చెయ్యిజాఁపితిని. నా వ్రేళ్ళకు గదిగోడ తగిలి నాకు మెలఁకువవచ్చెను, లేచి కూర్చుంటిని. ఇసీ, ఇదంతయుఁ గలయేకద యనుకొంటిని. అపుడు గడియారము చూచితిని. రెండుగంటలు దాఁటెను. అచిరకాలములోనే యీకల ఫలితము కనఁబడునని యనుకొంటిని. తరువాత నిద్రపోవుచో ఫలితమువోవును గనుక తెల్లవాఱువఱకు నట్లే బలవంతముగ మేల్కొని యుంటిని.

నిద్ర లేకపోవుటచే నాకు శరీరము భారముగనుండెను. ప్రొద్దుటనే లేచి చల్లనినీళ్ళ స్నానముచేసి వెచ్చవెచ్చని యిడ్డెనులు నాలుగుతిని కాఫి త్రాగితిని. ఆనాఁడు సంతోషమున లేచుటచే నిడ్డెనులు భక్షించితిని గాని యనుదినము నట్లు తినను. వీనిం దినుటచేతనో నామనస్సు సంతోషముచే నిండియుండుటచేతనో ఆపూట నాకన్నము సహించినది కాదు. ఆయుదయము తొమ్మిదియున్నరకే కళాశాలకు వెళ్ళితిని. తిన్నగ మేడయెక్కితి. విద్యార్థులుండు గదిచెంగటకే వేగిరముగ వెళ్ళితిని. ఆగదిలో నెవ్వరు లేరు. అప్పటి కెవ్వరును వచ్చినట్లు లేదు. గదిగుమ్మముయొద్ద నొక బంట్రౌతు మాత్రముండెను. గదిముందు నేను రెండు మూఁడుసారు లటునిటు పచారుచేయుచు జోడునకై చూచితిని. మంచికలకూడ వచ్చుటచేఁ దప్పక యుండునని సంతోషముతోనుంటిని గాని యది యగు

పడలేదు. నే వచ్చుటనే తటపటాయించుటఁ జూచి యేమట్లు తిరుగుచున్నారని యాభటుఁడడిగెను. ఏమియు లేదని యంటిని గాని వాఁడు, ఏమియు లేనిచో నిచ్చటఁ దిరుగుటేల ? యని గట్టిగఁ బ్రశ్న వేసెను. "శశిరేఖ" యని యేదో మెల్లగఁ జెప్పఁ బోవుచుంటిని. "ఏమిటి!" యని వానికి వినఁబడక పోవుటచే మరల నడిగెను. అప్పటికి నేను ప్రమాదమువలన శశిరేఖ పేరు చెప్పుచున్నానని గ్రహించి, సవరించుకొని, నిన్న నాజోడిచ్చట మఱచితినని చెప్పితిని. "మీజోడు మేడపై నౌకరులకుఁ బెట్టితిరి" యని వాఁడు మరలఁ బ్రశ్నించెను. ఆగదియందు శశిరేఖ లేదు, గుమ్మముయొద్ద నాజోడును లేదు, పైగ నీభటునిచే నీమాట లేలయనుకొని నాతరగతికిఁ బోయితిని. జోడుపోయిన దానికంటె నాకుఁగలిగిన యాశాభంగమునకు దుఃఖ మెక్కువ యయ్యెను. ఆనాఁడు శశిరేఖ వచ్చెనో లేదో కూడఁ జూడలేదు. ఎటులో యాగంట గడపి మరల మొదట నేను విడిచినచోటున వెదకుటకు వచ్చితిని. అది కనఁబడలేదు. మఱునాఁడు విఘ్నేశ్వరుని చవితి. కళాశాలకు సెలవు. కాన మఱునాఁడు ఎవరైనఁ దొడిగికొని వచ్చుదురేమో చూచుటకు వీలులేదు. ఇఁక నిరాశ చేసికొని యింటికి వచ్చితిని.

# 10

## చాదా.

శచీనాథుఁడు కాఁపురమున్నది పెద్దయిల్లు. అది రోడ్డు కంటెఁ బల్లముగనుండును. ఇంటిలోఁ గ్రిందఁ జెమ్మగనే యుండును. అందు వాసముచేయుట యారోగ్యము కాదు. ఈభయము మనకే గాని యచ్చటివారల కంతగ లేదు. అందువలననే ఆంధ్రవిద్యార్థులు చెన్నపట్టణములో మేడలయందుందురు. అరవలు క్రింది గదులనే పుచ్చుకొందురు. శచీనాథుఁడున్న యింటికిని మేడకలదు ; అందొకటి పడుకగది. రెండవగదిలో నతఁడు చదువుకొనుచుండును. ఆమేడభాగమును, క్రింద వంటకును సామానులు పెట్టుకొనుటకు రెండుగదులును, గలసి యిరువది రూపాయల కతఁడు అద్దెకుఁ బుచ్చుకొనెను. ఈయిల్లు వెడల్పునకంటె నెనిమిదిరెట్లు పొడవు. శచీనాథుని భాగము వెనుక, రెండిండ్లవా రుండిరి. మేడమాత్రము ముందు భాగముమీఁదనే యుండెను. శచీనాథుని భాగమునకు వెనుక నొకయయ్యరుగారుండిరి. వీరి వెనుక నొకయయ్యంగారు, ఈయనయు భార్యయు నొక తోఁబుట్టువును వీరి కాఁపురము. ఈయన నెల కాఱురూపాయలే యద్దె యిచ్చును. వీరిభాగము చాలలోపలగను జిన్నదిగను నుండును. వీరి యింటికెవ్వరు వెళ్ళవలసినను శచీనాథుని వంటయింటి ప్రక్కనుండియే వెళ్ళవలయును. అయ్యంగారి వంటయిల్లు వైష్ణవేతరు లెవ్వరును జూడరాదు

కాఁబట్టి యీయన ముందు రెండువాటములను బుచ్చుకొనక వెనుక భాగమును బుచ్చుకొనెను. వీరి యాచారమును గాలియు వెలుతురుకూడ మన్నించి వీరి వంటయిల్లేకాక సాధారణముగ వీరిగదులయందును బ్రవేశింపవు. శచీనాథుఁ డీయింటిలోఁ బ్రవేశింపక పూర్వమే అయ్యరుగారును నయ్యంగారును నందుండిరి. వీరు కాఁపురమున్న యింటిలో శచీనాథుఁడెట్లు ప్రవేశింపఁ గలిగెనో నాకాశ్చర్యమే. అరవబ్రాహ్మణులు నాకెవ్వరును జోటిచ్చిరికారు; మఱియుఁ బన్నెకుమారుఁడు, వైష్ణవులు తెలుఁగు వారలకద్దెల కీయరని చెప్పెను. ఒకనాఁడు నేను శచీనాథునే యీయింటిలోని భాగమెట్లు సంపాదింపఁగల్గితివని యడిగితిని. అతఁడు "దానికేమున్నది? అయ్యంగారీయననుచో నాంచారమ్మగారిని యడుగవలయును. అంతే" అని యతనిసహజవిధమున నోరు చప్పరించి చెయ్యితిప్పెను. శచీనాథునకు వీరందఱితోడను బరిచయమే. అతఁడందఱితోడను గలసి మెలసి మాటాడుచుండును. ఆతఁడెఱుఁగనివాఁడు చెన్నపట్టణములో నాకుఁ గనఁబడలేదు. స్నేహముచేయు నేర్పాతనికడ కలదు. అతనికిఁ గావలసిన బజారుపనులు అయ్యరో, అయ్యంగారో చేసి పెట్టుచుందురు. విఘ్నేశ్వరుని చవితినాఁడు ఉదయమున నే యతఁడు కుర్చీమీఁద కూర్చునియుండెను. ఆతని కెదురుగ నుండిన చెన్నపట్టణములోఁ జేసిన వెదురుబల్లమీఁదఁ బొగవచ్చుచుఁ గాఫీగిన్నె యుండెను. శచీనాథుఁడు సిగరెట్టు నోటినుండి తీసి వ్రేళ్ళతోఁబట్టుకొని కాలిన నుసిరాల్చుటకై దానిని వేలుతో

మీాటుచుండెను. అపుడు శచీనాథుని భార్యవచ్చి "ఈరోజున పండుగాయెగద, మీాకు సెలవుకూడ, ఈరోజునైన బజారువెళ్ళరాదా ? నిన్నను మొన్ననుగూడ అయ్యారుగారింట్లో పుచ్చుకొనినాను చింతపండు. ఇంక నెన్నిరోజులు అప్పునకుఁ దిరుగవలెను? సిగ్గుసిగ్గు!!" అని కనుబొమలు ముడిపైచెను. "ఉండవే తెప్పించెదను" అని యాతఁడు పలికి సుబ్రహ్మణ్య అయ్యరూ అని పిలచెను. ఆయన యామేడయెక్కి వచ్చెను. శచీనాథుని భార్య ప్రక్కగదిలోనికి వెళ్ళెను. అయ్యరు శచీనాథున కెదురుగనున్న కుర్చిపైఁ గూర్చుండఁగనే వీనిని "ఏమయ్యా సమాచారము ?" అని యాతఁడడిగెను.

"ఏమున్నది ?"

"మీారు కాపి సాపడినారా ? కొంచెము సాపడుండు. ఇంకను వేడి చల్లారలేదు," అని శచీనాథుఁడు తన ముందున్న గిన్నె అయ్యరువైపు త్రోసెను.

"వలదు వలదు సామి, ఇప్పుడే సాపాటు అయినది" అని చెప్పునపుడే సుబ్రహ్మణ్య అయ్యరునకు తేనుపు కూడ వచ్చెను. అంతలోనే కన్నసామి చెట్టి శచీనాథుని కొఱకు వచ్చెను. ఇతని గదియందు మూడవకుర్చి లేకుండుటచే నితఁడు లేచి కిటికిలోఁ గూర్చుండి చెట్టిని కుర్చిలోఁ గూర్చుండఁ జేసెను.

"ఏమయ్యా చెట్టిగారు, ఉదయముననే వేంచేసినారు ? అయ్యో, అయ్యో, నాకు నిండావిచారమైనదండి. ఇప్పుడే గిన్నె మూతికిఁ దగిల్చితిని. మరలఁ గొంచెము కాపి కాఁచమని

చెప్పెదను" అని "ఏమే నాంచారీ" అని కేక వేసెను. అతఁ డెవరిని బిలచెనో యతనికిఁ దప్ప మిగిలినవారికిఁ దెలియలేదు. కన్నసామిచెట్టి కుర్చీనుండి లేచి, తాను దెచ్చి యొడిలోఁ బెట్టుకొనిన సీనారేకుడబ్బా బల్లమీఁదఁబెట్టి "వలదు వలదు సామి ఇప్పుడే గొంతునిండ కాపి సాపడితిని" అని చెప్పెను.

"పోనీ, రెండు ఇడ్డెనులు సాపడుండు." అని తాను కాపితాగి "తాయి, కాలురూపాయి కొనిపోయి కృష్ణయ్యరు దుకాణములో నిడ్డెనులుకొనిరా" అని శచీనాథుఁడు కేక వేసెను.

"ఏమియు నక్కఱలేదు సామి. ఇడ్డెను, కాపి, అంతయు అయినతరువాత నే వచ్చితిని. నేఁడు మనపనిచూడుఁడు; ఈ ప్రొద్దు దాటుచో మనకు వసూలుకాదు. మీరే బోణి చెయ్యఁడు. మీ చేతితో నొకరూపాయి వేయుఁడు!" అని కన్నసామిచెట్టి బల్లమీఁదనున్న సీనారేకుడబ్బా యెత్తెను. ఆడబ్బాకుఁ దాళము వేయఁబడియుండెను. దాని మూతమీఁద మాత్రమొక రంధ్రముండెను. దానిలోనుండి రూపాయలు డబ్బులు లోపలకు వేయవచ్చునుగాని యందులోఁ బడినవి తాళము తీసినఁగాని రావు.

"దీని తాళమే దప్పా?" యని చెట్టిని శచీనాథుఁ డడిగెను.

"బీగము మురళీధర అయ్యంగారియొద్ద నే యున్నది."

"బాగుగ నేయున్నది. ధనార్జనమున కిదియొక మార్గమా?"

అని మెల్లగ శచీనాథుఁడనియె. అది కన్నసామిచెట్టికివినఁబడక పోవుటచే "ఏమిటిసామి" యని యడిగెను.

శచీనాథుఁడామాటలు మరలపలుకక "ఒక్కడబ్బాలో నేమగునండి? మురళీధర అయ్యంగారు నాదగ్గఱకు నొక డబ్బా పొద్దుటనే పంపెదననినారు, టిప్లికేనంత నాకొప్పగించినారు, నేను ఇంకను డబ్బా చేరలేదనియే చూచుచున్నాను" అని డబ్బా లేనందులకై యత్యాతురతతో నున్నవానివలెఁ బలికెను.

ఈచందా యెదులకని సుబ్రహ్మణ్య అయ్యరు అడిగెను.

"దక్షిణ యాఫ్రికాలో మనసోదరు లనేకకష్టముల పాలగుచున్నారండి. వానిని వినినను దలఁచుకొన్నను నిజముగ నేడుపే వచ్చును అందుచే నేను మీతోఁ జెప్పుటలేదు కాని అబ్బ అబ్బ"!! అని మిక్కిలి దుఃఖమువచ్చినవానివలెఁ దలవంచుకొని "వారికిఁ గొంచెము సహాయము చేయవలెనని ప్రయత్నము చేయుచున్నాను" అని కొంతసేపూరకుండి "అన్నట్లు అయ్యరుగారు, నేను మిమ్ములను బిలచిన పని చెప్పుట మఱచిపోయినాను, మొదట ఈసంగతి మఱచి, నేనే బజారునకు వెళ్ళవలెననుకొని మీకేమైనఁ గావలయునేమో యని యడుగుటకుఁ బిలిచితిని. ఇపుడు, చూచితిరిగ. నేను వెళ్ళుటకు వీలులేదు. ఎట్టులైనఁ గొంచెము దేశసేవ, అయిన తరువాత నేగద, సోదరసేవ ? అందువలన నాకు బజారుపోఁ దీరికలేదు." అని శచీనాథుఁడు అయ్యరువైపుఁ జూచెను.

"నేను పోయెదను లెండు. మీకేమి కావలయును?" అని సుబ్రహ్మణ్య అయ్యరు అడిగెను.

"కనుగొని చెప్పెదను" అని శచీనాథుఁడు లోపలకు వెళ్ళి భార్యనడిగి సుబ్రహ్మణ్య అయ్యరును బిలచి వాని చేతికి నర్థరూపాయ యిచ్చి తనకుఁ గావలసినవి చెప్పెను; లోపల నుండి వచ్చునప్పుడే యుత్తరీయము వేసికొని వచ్చి కన్నసామి చెట్టిని "రండు, పోదము" అని పిలచెను.

వారిద్దఱును మేడ దిగిరి. వీథిలోని కడుగిడుచు "చెట్టి గారు! మనమిరువుర మొక్క వీథి నెందులకు? చెరియొక వీథిని వెళ్ళుచో మంచిదిగద! మీరొక పని చేయుఁడు; ఈ డబ్బు నాచేతికిండు; మీరు పట్టణము పోయి, అయ్యంగారి నడిగి మఱియొకటి పుచ్చుకొనుఁడు. మనమిద్దఱము కలసి యొక వీథిని దిరిగిన దానికంటె వేర్వేఱుగఁ దిరుగుచో రెట్టింపు వచ్చును, చూడండి!" అని శచీనాథుఁ డాలోచన చెప్పెను. కన్నసామి చెట్టి దాని కంగీకరించెను.

"అవును. మీరు చెప్పినది బాగుగనున్నది. నే నిప్పుడే పట్టణము పోయెదను" అనియె.

"పోని మీరు వెళ్ళుట, వచ్చుట, ఆలస్యమగు నేమో, ఇచ్చటనే యంగడియలో దొరకునెడ కొనరాదా? మనమే తాళములు వేయవచ్చును?"

"ఇపుడు దుడ్డులేదే. పట్టణమే పోయివచ్చెదను."

"కానిండు."

కన్నసామిచెట్టి డబ్బాకొఱకు వెళ్ళెను. శచీనాథుఁడు డబ్బాపుచ్చుకొని వచ్చుచుఁ దనమార్గమంను జరీయుత్తరీయము వేసికొని కనఁబడిన ప్రతివానిని జందాయిమ్మని యడుగుచు వచ్చెను. పేదవారల బాధపెట్టరాదనియు గొప్పవారలనే యడుగవలయుననియు నతఁడు చెప్పెను. వారిచ్చినను నీయకు న్నను నొక్కని రెండవసారి యడుగఁడు. అతఁ డట్లడిగినను గొన్ని డబ్బు లందుఁబడెను. ఆడబ్బాపుచ్చుకొని శచీనాథుఁడు ఎనిమిదిగంటలకు నాగదికి వచ్చెను. ఒహో, శచీనాథా! మూఁడు రోజులనుండి నిజాడలేదే? యని యడిగితిని

"దేశోద్ధరణము కొఱకుఁ గొట్టుకొనువారికిఁ దీరిక యెట్లుండును? నీ కెవరెట్లు పోయినను నవసరములేదు కనుక షికారులు వెళ్ళుచుందువు."

"నీవేమి చేసితివి దేశోద్ధరణమునకు?"

"మూఁడురోజులనుండి మేమేమి చేయవలసినదియు నుపన్యాసము లిచ్చుచున్నారు. అవి వినుచున్నాను. దక్షిణ ఆఫ్రికాలో మన భారతీయ సోదరులున్నారనిగాని వారు ఇడుమలు పడుచున్నారనిగాని నీకుఁ దెలియునా?"

"నీవెట్లెఱింగితివా?" అని నవ్వుచు నడిగితిని.

"నే నెఱుఁగనా? ఈ యుదయము కన్నసామిచెట్టి వారి కొఱకు చందా ఇమ్మని పీడించినాఁడే? ఇంకను నెఱుఁగక పోవలయునా?"

"ప్రొద్దుటే నీవిల్లు వచ్చితివేల?"

"చందా ఈయవా?"

"నీ వెంత యిచ్చితివి?"

"నేనెంతని చెప్పఁగలను? ఈసబ్బాలో నెంత యుండునో అంతయు నేనిచ్చినట్లే."

"నేనును అటులనే యిచ్చితిననుకొమ్ము."

"దేశమునకై పాటుబడలేనివారు ధనమైన నీయవలెను. నీ వింటినుండి కదలవు? చందామైన నీయవు? శ్రమపడకుండ మన సోదరుల కష్టములు వాయవలెనన్న నెటులఁబోవును?"

"శచీనాథా, ఈనాఁడు నీవు చాల శ్రమపడి యుండవలయును."

"పడలేదా మఱి? పొద్దుటే లేచితిని, కాఫీత్రాగితిని. అది గొంతుక దిగకుండనే బైలుదేరితిని."

"ఎంతవసూలు చేసితివి?"

"ఎవఁడిచ్చును? ఎక్కడో దక్షిణాఫ్రికాలో నెవరో బాధపడుచున్నారఁట! మన మందఱము వాండ్రకు డబ్బీయవలయునఁట! వాండ్ల నిక్కడనుండిపోయి యక్కడ నెవరేడువు మఱి?"

అట్లతఁడు చెప్పునంతలో నాకు భోజనము వచ్చెను. "శచీనాథా, నీవింకను దిరుగవలయును కాఁబోలు?" అంటిని.

"ఎవఁడు తిరుగును ఈయెండలో? నీవు భోజనము చేయుము. నేను కూర్చుండెదనులే."

"పోనీ, నీవుకూడఁ గొంచెము కూర ఫలాహారము

చేయుము."

"ఏమియు నక్కఱలేదు నీవు భోజనము చేయుము. ఏది నిన్న సాయంకాలము వచ్చినవార్తాపత్రిక ?" అని దానిని దీసికొని చదువుచుఁ బడకకుర్చీలోఁ గూర్చుండెను.

నేను విస్తరి వేసికొని వడ్డించుకొనుచు "శచీనాథా మొన్న నాజోడు పోయినదోయి! క్రొత్తగఁ గొని కళాశాలకుఁ దొడుగుకొని వెళ్ళితిని. మరల నది కనపడలేదు". అని చెప్పితిని.

"మీ కళాశాలలోనే?"

"అవునోయి."

"ఇంకేమి! అందఱును శ్రీవైష్ణవులే బుట్టెకుఁగొయ్యలు మాత్రమేనయ్యెనోగాని ! జోడు పోయినచో మరల సంపాదించుకొనలేక పోయితివా ? రేపు వెళ్ళి చూడుము. ఏదో క్రొత్త జోడే వచ్చును. అచ్చటనుండు క్రొత్తజోడు నీదేయగును."

"మూఁడు రూపాయలు పెట్టి కొంటినోయి. నీనోటివాక్యమున దొరకుచో నీకు ఫలాహారము పెట్టెదను; విఘ్నేశ్వరుని పేరునఁ గొబ్బరికాయ కొట్టించెదను"

ఇట్లు మాటాడుకొనుచుండఁగనే మామెట్లపై నలుగురైదుగురు వచ్చుచున్నట్లు చప్పుడు వినఁబడియె నేను భోజనము చేయుచుండుటచేఁ గదలలేదు. వారు దగ్గఱగ వేసియున్న తలుపు త్రోసికొని వచ్చిరి. వారిలో నొకఁడు శచీనాథునిజూచి, "మీ రిక్కడనే యున్నారా ? ఎంత వసూలైనది? యనెను.

"ఏమి వసూలండి ? చాలకష్టముగ నున్నది" నావైపు చూపి, "ఈయనకుఁగూడ నొకగంట నచ్చచెప్పినఁగాని యొక రూపాయ యిచ్చినాఁడు కాఁడు. మనవారలకు దక్షిణ ఆఫ్రికా యెచ్చటనున్నదో తెలియనే తెలియదండి. మీరు సముద్రపు టొడ్డున రెండు ఉపన్యాసములిచ్చిరా, చందాలు జలజల రాలిపోవా ?"

"సరే, మనమింకను జాలదూరము తిరుగవలెను పదండి" అనిరి. వీరితో శచీనాథుఁడును వెళ్ళెను.

---

# 11

## పిలుపు.

మా యింటిదగ్గఱ సంగతి: ఇదివఱకు విఘ్నేశ్వరుని చవితికి ఏసంవత్సరమును నేనింటియందుండక పోలేదు. తక్షువగరమునఁ జదువుకొనునపుడును బండుగ రేపనఁగ మా మణిపురము వెళ్ళువాఁడను. ప్రతిసంవత్సరమును మాతండ్రిగారు కూడ బజారువచ్చి పాలవెల్లి మామిడాకులు పత్రి కలువపువ్వులు విఘ్నేశ్వరుఁడు మొదలగు వానినన్నియుఁ గొనువారు. మా పురోహితుని రప్పించి నాచేఁ బూజచేయించు చుండువారు. ఈ సంవత్సరమును నే లేకపోయినను వెనుకటియట్లే మాతండ్రిగారు బజారు వెళ్ళి యన్ని సరకులను దీసికొని వచ్చిరి. మాయింటిలోఁ జిన్నది నాసతియే గావున, మాతండ్రిగారు, ముద్దుచే

నామెచేతఁ బూజచేయుంచిరి. భార్యపేరు చెప్పుట సిగ్గే యైన ప్పటికి, మీరు నాకిచ్చిన చదువుచే, నిఁక నామెనుగూర్చి చెప్పు నపుడు పేరుతోడనే చెప్పెదను; మనపెద్దలు భార్యపేరు చెప్ప రాదని నియమముచేసిరఁట. ఆహితాగ్నులు తమ పడఁతులను ఓసి అనియు, ఏమే అనియు, ఇదిగో అనియుఁ బిలుచుటకుఁగారణ మదియేనఁట నాకుఁ గార్యమైన తరువాత, ముఖము కడుగు కొనుటకు నీళ్ళు కొఱకుగాని, యెందులకుగాని, పిలువ వలసి వచ్చెనేని యేమని పిలువవలయునని పెద్దలనడిగితిని. పేరుతోఁ బిలువరాదని యందఱుచెప్పిరి; కాని యట్లేల పిలువరాదో యెవ్వరును జెప్పిరికారు. అయినను బెద్దల యాచారము మన్నింపవలయును. పేరుపెట్టి పిలుచునంతటిదోషము మీతోఁ బేరుచెప్పిన మాత్రమున రాదు. భార్యపేరు చెప్పుటే పాప మగుచోఁ బెండ్లియందుఁ దలుపులయొద్ద బలవంతము పెట్టి పేరులుచెప్పించి యుండరు అప్పుడు కాకపోయినను నిపుడు చెప్పుచున్నాను. నాభార్యపేరు ప్రియంవద. నేను చాలదూర మున నొంటరిగ నుండుటచే నాయారోగ్యము బాగుండవలయు ననియు నాకుఁ జనువువచ్చి మంచియుద్యోగము కావలయున నియు మనసార నపేక్షించి ప్రియంవద విఘ్నేశ్వరునిబూజ చేయఁగోరెను. ఆమెయు మాపురోహితునిచే లక్ష్మీ సహస్ర నామములు చెప్పించి కుంకుమతోఁ బూజచేసెను. ఆపూట పూజ, భోజనము లగునప్పటికి రమారమి యొంటిగంట యయ్యెను.

తరువాతఁ బైపనులన్నియు ముగిసిన పిదపఁ బ్రియంవద తలదువ్వుకొని బొట్టుపెట్టుకొని, సాయంకాలమున విఘ్నేశ్వరునకు మంగళహారతి యిచ్చుటకు నిరుగు పొరుగువారిని బిలువవెళ్ళెను; ముందు చతురికను బిలచి సువర్ణ యింటికేగెను. సువర్ణ యత్తగారు సుందరమ్మగారు, వత్తులకై ప్రత్తి బాగుచేసికొను చుండిరి. ఆమె "ఏమే ప్రియంవదా! ఇట్లు వచ్చితివి? మీ యింటిలో పండుగ కేమేమిచేసిరి" అని యడిగెను.

"కొబ్బరివేసి బూరెలు, సగ్గుబియ్యపు పరమాన్నము."

"మీ ఆయన లేకుగద ఇచ్చట, నీవు పుట్టింటికి వెళ్ళవా?"

"నా కెక్కడైన నొక్కటే. ఏది? కోడలేది?"

"ఆ. నేను సరే! మా కోడలు సరే! అన్నియు నొక్క లాగున నున్నవి"

"మీ కేమి, మీ కోడలి కేమండి?"

"నివింక నా సంగతి యడుగకు, ప్రియంవదా. నే ననేక విధములఁ జెప్పినాను; 'నిప్పుకూడఁ దలంటుకొనవే, పూజ చేసికొనవే, నీతోటివారందఱు పూజ చేసికొనుచున్నారు' అని; నామాటలు త్రోసివేసినదికాని, సరే అని యైన ననలేదు."

"మనస్సు కులాసగ లేకపోయిన తరువాత, ఏదియుఁ దోఁచదు సుమండి! ఏది సువర్ణ?"

"చూడు, ఆవిడ గదిలోనే యుండును."

ప్రియంవద సువర్ణయున్న గదిలోనికి వచ్చెను. అది పెద్దగదియే; విశాలముగనే యున్నది. అందొక చిన్నమంచమును

దానిపై గలేబులేని యొక పరుపును నుండెను. గదిలోనే మాసిన చీరలు పాతబట్టలు నుండెను. ఆగది కిటికియందు మూతవిఱిగిన బొట్టుపెట్టియు నందు గుంకుమ యొలికిన కాటుక కాయయు నొకమూత లేని కుంకుమబరిణియు నుండెను. మంచముప్రక్కనే యొక చాప యుండెను. దానిమీఁదను సువర్ణ మాసిపోయిన యొక యెఱ్ఱరంగు చీర కట్టుకొని వ్రేలుముడితోఁ బరుండియుండెను. ప్రియంవద గది ప్రవేశించి "ఏమే సువర్ణా, పడుకొనియున్నావు ?" అని యడిగెను. సువర్ణ దిగ్గున లేచి, "ఓహో, ప్రియంవదా? రా, కూర్చుండుము, నీవెప్పుడు మా యింటికి రావుగద. నీవు కూర్చుండిన కొంచెము సేపైనఁ గులాసగ నుందును" అనెను.

"అవునుగాని, పండుగపూట, ఈ చింకిరిగుడ్డ, వ్రేలుముడి, నీవు ఈచాపమీఁద పడుకేమిటి ?"

"ఏమిచేయుమనెదవో?"

"మీయత్తగారు కూడ పూజచేసికొనుమని చెప్పినా రఁట! పోని, జడైన వేసికొనినావా ?"

"నాకిట్లు తగదా, అక్కయ్య ? నే నేలాయుండినను నన్నడుగువారేరి? ఏదో, మాయత్తగారి ధర్మమున రెండు పూటలు ఇంతవండి పెట్టుచున్నారు, భోజనము గడిచిపోవు చున్నది. ఇంకేమి కావలెను చెప్పు?"

"దానితో సరియా? నీ వేమియు...

"బాగున్నది ! ఇంతవఱకు అదృష్టము బాగుగనున్నది

కాఁబట్టి భోజనమునకు లోపము లేదు. ఇఁక ముందు ముందేమి పుట్టునో !"

"చాలుచాలు లె నీమాటలు! ఈ గ దేమిటి? ఈ మాసిన బట్ట లేమిటి?"

"నే పండుకొనుటకుఁ దగదా ఈగది ? ఇంకెవరికిఁ గావలయును ?"

"నీపడుకగది యిట్లుండుట దరిద్రము గూడ. ఇందులో నడుగు వెట్టుటకు నాకే యసహ్యముగ నున్నది. ఇదెప్పుడైన నూడ్పించినావా? మోకాలులోతు దుమ్ముతో నిండియున్నది గద. మగవారి కసహ్యము వేసినదంటే వింత యేమున్నది ? కోపపడివారంటే కోపపడరా?"

"పోని, అదైన నేది ?, ఇది అసహ్యముగనున్నది. ఈ ప్రికారము చేయుము, ఆప్రికారము చేయుము అని కోపపడినను జాలును. అదియు లేదే. నే నింటిలో నున్నానో లేనో, చూడరు. భోజనము వేళకు ఇంటికి వచ్చుట, రెండుమెతుకులు నోటిలో వేసికొనుట, ఇఁకఁ బరుగెత్తుట. ఈగోడ యెంతో నేనంత. నేఁజెప్పుచో నీవు నమ్మెదవో లేదో కాని, నాబ్రతు కెట్లులుండవలెనో యట్లున్నది" అని సువర్ణ కంటఁ దడివెట్టుకొనెను. ప్రియంవదకుఁగూడ విచారము వచ్చెను; పాపము సువర్ణ తనయీడు చిన్నది. తా వచ్చినపుడే యత్తవారింటికి వచ్చినది. కాని భర్తవలన నణుమాత్రము సంతోషము లేకపోయె. ఆమెకు వివాహకాలమందుఁ బెద్దనగలే పెట్టిరి; కాసులపేరులు,

వరహాలపేరులు జంటజంటల పేరులున్నవి. గృహకృత్యములలోఁ దాను జేయవలసినవి లేవు. అయినను మనస్సున కెంతమాత్రమును సంతోషములేదు. ఆవయస్సున ప్రియమైన మగఁడు మనసిచ్చి మాటాడనిచో మగువల కెక్కడిసంతోషము? తల్లిదండ్రులు పెండ్లిచేసినప్పుడును వలపు లెఱుఁగని బాల్యమందు వివాహమైనప్పుడు నాభరణములిచ్చు పతివరింపఁబడును గాని వయస్సువచ్చిన పడుచు వివాహము చేసికొనుచో భూషణములను గడ్డిపరకలవలె నిరాకరించి తనను నిజముగఁ బ్రేమించు భర్తనే చెట్టపట్టును. నగనాణ్యములు లేకపోవుఁగాక, చీనాంబరములు లేకపోవుఁగాక, ఆహారమును గలవగుఁగాక "అరమరలులేని కూరిమి నసఁగి పెనఁగి కపటమెఱుఁగని మమతలఁ గలసి మెలసి కూడియుండిన నాథు"ని ప్రేమపూరిత వాక్యములే యెల్లకొదువలను దీర్చి యుల్లాసమునిచ్చును. పాపము, సువర్ణభర్త వేశ్యాలోలుఁడై భార్యను జూడకయే యుండెను. ప్రియంవద తనకుఁగల్గిన విచారము బైటకుఁగనఁబడనీయక

"ఓసి, సువర్ణా! పండుగపూట నీవు విచారింపకు, ఎప్పటికి రోజు లొక్కలాగునుండవు? బుద్ధులుకూడ నొక్కతీరు ననే యుండవు. మంచిరోజులు వచ్చును. అపుడు మంచిబుద్ధులే పుట్టును. అందఱికంటె నెక్కువగ నీభర్తకుఁ దలలో నాలికవై నీవుండుము" అని చెప్పుచున్న సమయమున నచ్చటకే చతురిక, యొకచేత మొగలిపువ్వులు దుప్పట్లయు నవరమును, రెండవచేతఁ గొబ్బరినూనె సీసాయుఁ బుచ్చుకొని వచ్చెను.

సువర్ణ యింకను విచారముతోడనే తలవంచుకొని యుండెను. ప్రియంవదయే చతురికను గూర్చుండుమనెను. సువర్ణయుఁ దల యెత్తి చతురికను గూర్చుండుమని తాను చాపమీఁద జరిగెను.

"ఎంతకుఁ బుచ్చుకొనినావో మొగలిపువ్వులు? యని ప్రియంవద చతురిక నడిగెను."

"ఏమో నేను కొనలేదు. మధ్యాహ్నము వచ్చునపుడు పట్టుకొని వచ్చినారు".

"అయినచో నీవే వేసికొను".

"నీకుఁ గావలసినయెడలఁ దీసికొనవో!"

"నాకక్కఱలేదు. సువర్ణకుఁగూడ జడవేయవలెనని యడిగితిని."

"పుచ్చుకొనవో, ఒదినా! నీవు నేను గూడ వేసికొన వచ్చును."

అని చతురిక పువ్వులరేకులను సువర్ణవైపు త్రోసెను. మొగలిపువ్వుల జడవేసికొనుట, సంతోషముగ నుండుట, సువర్ణచిత్తమునకు నమవసి నిశియందు వెన్నెలవచ్చుట యంతటి విరుద్ధముగఁ దోఁచెను. "అయ్యో! నాబ్రతుక" యని నిట్టూర్పు విడిచె. తనజీవితము నెఱిఁగిన చతురిక కూడ ఇట్లసంబద్ధముగఁ బల్కినాయని సువర్ణకు నవ్వును వచ్చెను.

"నీకేమే? ఎప్పుడును మంచి మాటలాడుచుండుము; మంచి జరుగును" అని ప్రియంవద పలికెను.

"మనమాటల ప్రకారము జరుగుచో నిఁక లేనిదేమి?

నాకెప్పుడు నొకటే మంచి"యని సువర్ణ పెదవివిఱచి కొంచెము సేపుండి "చెన్నపట్టణమునుండి యుత్తరములు వచ్చుచున్నవా? కులాసగ నున్నారా?" యని ప్రియంవద నడిగెను.

"వచ్చుచునే యున్నవి."

"పండుగకు రాలేదేమి ?"

"వెళ్ళి రెండు నెలలేగద అయినది. ఒక్కరోజు సెలవు కొఱకు అంతదూరమునుండి వచ్చుట కష్టము."

"అవును. సెలవిచ్చిన యొక్కరోజును ప్రయాణములోనే అయిపోవును" వీరిట్లు మాటలాడుచుండగ

"నాకెవరు వేసెదరు జడ?" అని చతురిక యడిగెను.

"నే వేసెదను రా?" అని సువర్ణ చతురికకు దగ్గఱగ గూర్చుండి జడ వేయుచుండెను.

"సువర్ణా! ఈసాయంకాలము విఘ్నేశ్వరునకు మంగళహారతి యిచ్చెదము. నీవు తప్పకుండ రా. చతురికకూడ వచ్చును" అని ప్రియంవద పిలిచెను.

"వచ్చుచో వచ్చెదను. లేనా లేను."

"అట్లుగాదు. నీవు తప్పకుండ రావలెను. నిన్నుఁ దప్పకుండ రమ్మని చెప్పుమని మాయత్తగారుకూడఁ జెప్పినారు".

"నే నెక్కడికి వచ్చుటలేదో. గుమ్మముదాఁటి కదలుట లేదు. నేను నలుగురిలోనికిఁ దగుదునమ్మా యని యేమని రాను?"

"ఏమని రానేమిటి? అట్లనఁగూడదు. ఎంతటి యదృష్టవంతులకు నింటిలోఁ బెద్దదిక్కుయుండుట? పసుపు పావురాణి

పూసికొని పేరంటములకు వెళ్ళుట? ఈరోజు పూజచేసికొను మని మీయత్తగారు కూడ చెప్పినారంట గద! నీవేల పూజ చేసికొనలేదు?" అని ప్రియంవద ప్రశ్నించెను.

"అక్కయ్యా! నేను చెప్పిన నమ్మెదవో లేదో కాని నే మ్రొక్కనిదేవుఁడు లేఁడు, నేఁబట్టని వ్రతములేదు. ఎంత చేసిన నొక్కటేఫలము. అంతకంతకు మితిమీఱిపోయినది. అదివఱ కొక్కసారియైనఁ బలుకరించెడి వారు; ఇప్పుడదియు లేదు. ఎందుకు నాకీపూజలు, గీజలు? దేవుళ్ళయందు నాకు భక్తికూడ పోయినది."

"ఎవరో మందుపెట్టినారమ్మ; లేకపోయిన నింతగ నుండదు. ఒదినా! నేనొక పనిచెప్పెదను చేసెదవా?" యని చతురిక యడిగెను.

"మందులేమిటి మాకులేమిటి గాని మన యదృష్టము తిన్నగనుండుచో ఏమందులు పనిచేయును? క్రిందటిజన్మములో నెవరికో యెడబాపులు చేసినాను, ఈజన్మములో నే ననుభవించుచున్నాను" అని సువర్ణలత యూచెను.

"ఎవరికర్మానుభవము వారికిఁదప్పదు; కాని, ఎల్లకాల మొక్కతీరుగ నుండదు. ఇట్లుండుటకు సగమువంతు నీవే చేతులారఁ జేసికొనుచున్నావు. నీవు ముందుఁ బరిశుభ్రముగ నగుపడు. ఈమాసిన గుడ్డలు మాని మంచిచీర కట్టుకొను. తలదువ్వుకొని బొట్టు కాటుక పెట్టుకొను, అన్నిటికన్న ముఖ్యము, ఈసాయంకాలము మాయింటికి వచ్చి విఘ్నేశ్వరుని ప్రసాదము

పుచ్చుకొను. ఇప్పటినుండి నీవు కులాసగనుండుము!" అని ప్రియంవద హితవుచెప్పెను.

"విఘ్నేశ్వరుని ప్రసాదమునకేమి గాని, నీచేతిప్రసాదము పుచ్చుకొనుచో నీయదృష్టమే నాకుఁ గొంత పట్టి వచ్చును." అని సువర్ణ ప్రియంవద ముఖమువైపుఁ జూచెను.

"సరే, నాయదృష్టమున కేమిలె! సరే, అట్లే అను నీవు వచ్చుట ముఖ్యము."

"నీయదృష్టమున కేమిలేటో ఒదినా? చిలుక గోరు వంకలాగున నున్నారు?" అని చతురిక తన జడ వంకరవచ్చునేమో యను భయముతోఁ గదలక, తలయెత్తక ప్రియంవదను గూర్చి పలికెను.

దానికిఁ బ్రియంవద నవ్వుచు "నే నామాట కొప్పుకొనను, చిలుక చిలుకవలె నను లేదా, గోరువంక గోరువంకవలె నను. అంతేగాని చిలుకనుదెచ్చి మాఋజాతి పక్షితో గలిపెదవేమిటి?"

"ఏమిటో చెప్పగునా? మాఅన్నగారు పచ్చగనుందురు కావున ఆయన చిలుక, నీవు నల్లగ నున్నావు కాఁబట్టి గోరువంక!" అని తలయెత్తి ప్రియంవదవైపుఁ జూచెను. ఆ మాటలకు ముగ్గురును నవ్విరి.

"అవునో, చిలుక, గోరువంక అందురేమిటి? అవి రెండు కలసియుండునా?" యని సువర్ణ యడిగెను.

"ఆసంగతి మాఅన్నగారి నడుగుమో! ఒదినా!" అని

సువర్ణవైపుఁ జూచి చతురిక నవ్వెను.

"బాగుగఁ జెప్పితివి!" అని సువర్ణ పలికెను గాని ఆమాటలు పలుకులోపుననే యామె ముఖముపై విన్నదనము తోఁచెను.

"అబ్బా, చతురిక, ఏమిమాటలు! ఏమినవ్వు! అని ప్రియంవద మందలించెను."

"నాకెప్పుడు నవ్వేనో!"

"మంచిదే కద. సంతోషము సగముబలము." అని ప్రియంవద పలికెను.

"నాకెప్పుడు సగముబలమే. పూర్తియైన బలమెప్పుడును లేదు." అని చతురిక యాక్షేపింపఁబడిన దానివలెఁ బ్రత్యుత్తరమిచ్చెను.

"నాకెప్పుడు సంతోషములేదు. ఎప్పుడు బలము లేదు." అని సువర్ణ తనసంగతి చెప్పుకొనెను.

"బాగుగనే యున్నవి మీయర్థాలు! ఓసీ సువర్ణ, నీకు సంతోషము లేకుండ నీవే చేసికొనుచున్నావు, నీ పిమధ్యనెపుడైన మీయాయనకు, భోజనముచేసి లేవఁగనే తాంబూలమిచ్చినావా? భోజనముకు వచ్చు ముందు కాళ్ళు కడుగుకొను నీళ్ళిచ్చినావా? నీమట్టుకు నివు అంటి ముట్టక యుందువు! ఈసాయంకాలము విఘ్నేశ్వరుని ప్రసాదము పుచ్చుకొని నీభర్తకు నీవు నీచేతితోఁబెట్టు." అని ప్రియంవద మరల హితవు చెప్పెను.

"అందఱు నీవలెను నీభర్తగారివలె ననుకొనినావో ? ఒకరిమీఁద నిష్టములేనితరువాత నొకరు చేసినది యెందుకుఁ బనికివచ్చును ?" అని సువర్ణ దీనముగాఁ బలికెను.

"ఇష్టము లేకపోవుటేమిటి ? పోట్లాడుకొనినారా వీరి పెద్దలును వారిపెద్దలును? సంహారణముచేసినారా ఒకరినొకరు? పెళ్ళికిఁ బూర్వము అయిష్టములేదు. పెళ్ళిఅయి కాఁపురమునకు వచ్చిన తరువాత యిష్టము పుట్టించుకొనవలెను.

"అట్లనకు, ఒదినా! ఇంకొకరిమీఁద మనసుపోయిన తరువాత భార్య యెంత చేసినను బనికిరాదు; నీవు నేతిజిలేబి చేసిపెట్టు; దీనికంటె బోగముది చుట్టచేతితోఁ బెట్టిన నూనె పకోడి బాగుగానుండును." అని చతురిక లోకజ్ఞానముగల దాసివలెఁ బలికెను.

"అది పూర్వపుచట్టమై నీవు కాకపోయినావా ? మగవారల ప్రవర్తన అంతయు మనముచేసెడి దానినిబట్టియే యుండునులె. సరే, చతురిక ! సువర్ణ ! మీరు దీపములుపెట్టుటకొఱకనే రమ్మను ఇదే చెప్పుచున్నాను. ఇంక వెళ్ళెదను ఆవు వచ్చు వేళైనది." అని ప్రియంవద లేచెను.

"ఆవు వచ్చుచో నీవేమి చేయవలెను." అని చతురిక యడిగెను.

"దాసి చిట్టుపెట్టును, గాని, యేపనియందైన మనకుండు శ్రద్ధ దాసివాండ్రకెందలకుండును ? సాధ్యమైనంత వఱకు, నేను చేసికొనుటో, నేను దగ్గఱనుండి చేయించుటో

గాని, పనివాండ్రమీఁద వదలివేయను. అదిగాక ఇపుడు నాకేమి పనులున్నవి? ఆవునకుఁ జేసినఁ బుణ్యము కూడ." అని ప్రియంవద వారిని విడిచి యింటికి వచ్చెను.

ఆసాయంకాలము విఘ్నేశ్వరునకు మంగళహారతి ఇచ్చెను. చతురిక సువర్ణయుఁగూడ వచ్చిరి; చతురికకూడ మంగళహారతి పాడెను. కొబ్బరికోరు, పంచదారయుఁ గలపి దానిని దేవునకు నైవేద్యము పెట్టి ప్రియంవద చతురికకు సువర్ణకుఁ బెట్టెను. ఆరాత్రి తాను జేసినపూజకు దేవుఁడనుగ్రహించుననియు నాకన్నివిధముల విఘ్నేశ్వరుఁడు జయము కలిగించుననియు నమ్మి సంతుష్టహృదయముతో నామె నిదురించెను.

---

## 12

### ప్రస్తావన.

నాప్రియసఖి విఘ్నేశ్వరునకుఁ జేసిన పూజయు నే మ్రొక్కుకొనిన మ్రొక్కును నూరకపోలేదు. ఇట్టి సంకుచితారాధనలకే యభీష్టము లొసంగు దైవ మింకెవరును నాకుఁ గనఁబడలేదు. ఈయనను విఘ్ననాయకుఁడనియుఁ దెనుఁగునఁ బని చెరుపుల దొరయనియు వర్ణింతురు. ఏకార్యములందు విఘ్నములు కల్పించెనో యెవరిపనులు చెరిపెనో యెవ్వరును జెప్పరు. ఈయనను బ్రార్థించుట "నాకెదురుగ రావలదని" నంబి వానిని బ్రార్థించినట్టులా? విఘ్నములు సేయుట యీయ

నకు సహాజమును అది చేయకుండుటే యీయనచేయు నుప కారమునా? లేదా, ఈయన మనకు మన కార్యములందుఁ దోడ్పడి యేకారణముచేనైన వచ్చు విఘ్నములను బారదోలు నా? అనఁగా, మృత్యువునకు జ్వరవాతాదులు పరిహారమైనట్లు విఘ్నములీతని పరివారమా, లేక జ్వరవాతాదులను ఓషధులు పోఁగొట్టునట్లు విఘ్నముల నితఁడు పోఁగొట్టునా? వీరారేమని నను నే చిన్ననాఁటనుండి పూజించు దేవుని గార్యసిద్ధిచేయు దైవముగ భావింతునుగాని విఘ్నములు కలుగఁజేయు స్వభావముగాని శక్తిగాని గల్గిన ఘాతకునిగ నెంచను.

నా సతి పూజవలననో నా మొ్రిక్కువలననో మా విఘ్నేశ్వరుఁడు నా యెడ సంప్రీతుఁడయ్యె. నాపోయినజోళ్లు దొరకినవి. అవియు శచీనాథుఁడు చెప్పినట్లే దొరకినవి: మఱునాఁడు కళాశాలకు వెళ్లితిని. జోళ్ళుపెట్టు చోటున మఱలఁ జూచితిని. ఏమి ఆశ్చర్యము! అచ్చట అచ్చముగ నాజోళ్లవంటి వేయున్నవి. వీనిక్రొత్తరంగును మాయలేదు. కాని వీనిమీఁద నల్లనిసిరాతో "గ. ప" అను నక్షరములుండెను. ఆయక్షరములు చూచి యవితప్పకుండ నాజోళ్ళేయని నిశ్చయము చేసితిని. నాజోళ్ళపై నేనెట్టి యానవాలును వేయలేదు. అయిన నవి నా పాదరక్షలే యని నేను నిశ్చయించుటకుఁ గారణమిది : ఇన్నియేండ్లనుండి చూచుచున్నానుగాని యెచ్చట జోడుమీఁదఁ బేరు వ్రాసికొనుట చూడలేదు. జోడు నిజముగఁ గొనినవాఁడైనచో దానిపైఁ బేరు వ్రాసికొనియుండఁడు. మఱియుఁ బరు లెత్తుకొని పోవుదు

రను భయముకల్గినవాఁడు గాని జోడుపైఁ బేరు వ్రాసికొనఁడు. జోడులనెత్తికొనిపోవువానికిఁ గాని పాదరక్షలనుగూడఁ దస్క-రింతురను నభిప్రాయమే తట్టదు. కావున వాఁడెవఁడో నా జోడు పట్టుకొనిపోయి నాలుగైదు రోజులు దానిని దాఁచి యీయక్షరములు వేసెనని వినిశ్చితముచేసితిని. నేను వెంటనే యీ పాదరక్షలను దొడిగికొని గబగబ నాగదికివచ్చితిని. వాని నొకమూలవిడిచి యాపూట మరలఁ బాఠశాలకుఁ బోలేదు. విఘ్నేశ్వరుఁడు నామీఁద దయచేతనో నేనిచ్చెదనన్న కొబ్బరికాయ కాశపడుటచేతనో నాజోళ్ళు నాకిచ్చి మాట దక్కించుకొనెను. నామాటకూడఁ జెల్లించుకొనుటకుఁ గొబ్బరికాయ కొంటినిగాని యెక్కడను నాకు విఘ్నేశ్వరుని గుడికనఁబడలేదు.

ఈపంచమినాఁడు అన్నివిధముల మంచిదనియు జోడు దొరకుట శుభసూచకమనియు గుర్తించి యానాఁడే శశిరేఖతోమాటాడఁ బ్రారంభింపఁదలంచుకొంటిని. జోడు తొడుగుకొనకయే మధ్యాహ్నము పాఠశాలకు వెళ్ళితిని. ఆనాఁడు బుధవారము. ప్రతిబుధవారము మధ్యాహ్నమున నొకగంట మేము కళాశాలాపుస్తకభాండాగారమునఁ గూర్చుండి చదువవలయును. మాయుపాధ్యాయులు ముఖ్యాంశములను గుఱించి మాత్రమే యుపన్యసింతురు. వాని వివరముల నామూలాగ్రముగ మేము చదువుకొనవలసినదే. దానికిఁ గావలసిన పుస్తకములను మాత్రము కళాశాలయందు సేకరించియుంచిరి. అవియెల్లరకుఁ గావలసిన వగుటచే వాని నింటికిఁ గొనిపోనీయరు; వానిని

గళాశాలలోనుండి చదువవలసినదే. మా చరిత్ర విషయము నకు సంబంధించిన భాండాగారములో నాలుగు పెద్దబీరువా లును ముప్పదియైదు కుర్చీలును నున్నవి. ఎవరికిఁ గావలసిన పుస్తకము వా రేఱుకొని భాండాగారాధ్యక్షునితోఁ జెప్పి వాని యొద్దనున్న జాబితాపై మాకుఁగావలసిన పుస్తకముపేరును మాపేరును వ్రాయుదుము. మేము చదువుకొనిన పెద్దమను ష్యులము గావున కాలము వృథాగాఁ బోనివ్వక యెట్లుద్దేశింపఁ బడినదో యట్లు వినియోగింతుమని యాతఁడు తలంచును. ఆతఁ డన్యథా తలంచుట మాగౌరవమునకు భంగమే. కావునఁ బుస్తకములు పుచ్చుకొని మామాస్థానములలోఁ గూర్చుండిన తరువాత మావైపాతఁడు చూడఁడు. మాలోఁ బ్రతివాఁడును జదువుచుండఁడు. కొందఱు బంధువుల కుత్తరములు వ్రాయు చుందురు. కొందఱు రహస్యముగ వార్తాపత్రికలు చిన్నచిన్న మడతలుపెట్టి చదువుచుందురు. చాలమంది కబురులు చెప్పు కొందరు.

శశిరేఖతో మాటాడుట కదియే మంచిసమయమని యెంచితిని. సంభాషణావసరము కల్పించు కారణముకై చూచు చుంటిని. మాతరగతిలోని వారందఱు పుస్తకములు పుచ్చుకొను వఱకు నేనధ్యక్షునిబల్ల యొద్దనే నిలుచుంటిని. శశిరేఖ పుచ్చు కొనినపుస్తకమును జూచితిని. అది "యక్బరుచక్రవర్తి వానిపాల నము" అనుపుస్తకము. ఆపుస్తకము పుచ్చుకొని శశిరేఖ గది చివరనున్న కుర్చీపైఁ గూర్చుండిదానిఁ జదువుచుండెను. అప్పుడు

నేనను "అక్బరుచక్రవర్తి వానిపాలనము" అను పుస్తకము నిమ్మని యడిగితిని. "ఆపుస్తకము నిపుడే యెవ్వరో తీసికొనిరి. నీవింకొకపుస్తకము తీసుకొనరాదా?" యని యధ్యక్షుఁడనెను. "ఆపుస్తక మిదివఱకుఁ బ్రారంభించితిని. దానిని ముగించవలయును పోనిండు, దాని నెవరు తీసికొనిరో చెప్పుఁడు. వారి దగ్గఱకుఁబోయి యాపుస్తకము నేను పుచ్చుకొనియెద నంటిని. ఆతఁడు జాబితా చూచి శశిరేఖ పుచ్చుకొనిన దని చెప్పెను. నేను తిన్నగ శశిరేఖ దగ్గఱకు వెళ్ళితిని. "శశిరేఖా! నీవు అక్బరుపాలనమును గుఱించి చదువుచుంటివా?" యని యడిగితిని. నేనాప్రశ్న వేయుటచే నామె తెల్లవోయి తలయెత్తిచూచి "ఏమి?" యని యడిగెను. నేను ప్రశ్న వేయు కారణము లామె యెఱుఁగదు. ఆపుస్తకము నిదివఱకుఁ గొంత చదివితిననియు దానిం బూర్తిచేయ నిశ్చయించుకొంటి ననియుఁ జెప్పితిని.

"ఈపుస్తకమునందేమైన విశేష విషయము కలదా?" యని శశిరేఖ నన్నడిగెను.

"అక్బరు పరిపాలనము సుస్థిరమైనది కాదనియే నాయభిప్రాయము. లేనిచో నంతత్వరలో మొగలాయి రాజ్యము చెల్లాచెదరై పోదు" అని గట్టిగఁ బల్కితిని. నేను శశిరేఖతోఁ గట్టిగఁ బలుకుచుండుట విని యితరగతి విద్యార్థులు మావైపుఁ జూచిరి. మామాటలు వినిరి గావునను నేనపుడే యధ్యక్షుని కడనుండి వచ్చుట చూచిరి గావునను మేము మాపరీక్షకు సంబం

ధించిన విషయమునుగూర్చి ముచ్చటించుచుంటిమని యనుకొనిరి. అధ్యక్షుఁడును మావైపుచూచి "నిశ్శబ్దము" అనెను. వాని యాజ్ఞకు బద్ధుఁడనగుటచే మెల్లగ మాటాడుటకై కుర్చి శశిరేఖ దగ్గఱగ వేసికొని కూర్చుంటిని. ఇదివఱకు నీవేయే పుస్తకములు చదివితి"వని శశిరేఖనడిగితిని.

"ఇచ్చట నొక పుస్తకమని నియామకము లేదుగద! ఒకనాఁడు లభించినపుస్తకము రెండవనాఁడు లేదు. ఒక్కపుస్తకమును బూర్తిగఁ జదువ లేదు. ఆరోజున కేదిదొరకిన నది చదువుదును" అని శశిరేఖ చేతనున్న పుస్తకము బల్లమీఁదఁ బెట్టి జవాబుచెప్పెను. మేమిట్లు మెల్లగఁ బ్రసంగములోనికి దిగితిమి.

"అదిలాభములేదు. ఏదో యొక గ్రంథముపూర్తిగఁ జదువవలయును. నీవు కిందటివారము "ఇండియాసంఘము వారి పాలనము" అను పుస్తకమును బుచ్చుకొంటివే. అదెంతవఱకుఁ జదివితి?" అని నేను ప్రశ్న వేసితిని

"అది యాగంటమాత్రమే యచ్చటచ్చటఁ జదివితిని."

"బెంటింకుచేసిన సాంఘికమార్పులను విమర్శించితివా" ఆమార్పులు వచ్చుట కతఁడే కారణము నీవుతలఁచెదవా?"

"నేనట్లే యనుకొంటిని".

"మనదేశములోఁ బ్రజలసహాయమెంతో యుండి యుండవలెను. లేనిచో నది యొక్కనాఁటికి సాఁగదు. ఆమార్పులు చేయుటకు రామమోహనుఁ డెంతప్రయాసపడెను?"

"మీరనినట్లు ప్రజలుకూడ ఆమార్పులకు సమ్మతించి యుండవలయును. అట్లు కానిచో రామమోహనునకు మాత్రము సాధ్యమగునా సహగమనము మాన్పించుట? అదిగాక సహగమనము మనలో నంతగ వ్యాపించియుండెడిదనుకొనను. నూటికో కోటికో యొక్కొక్కరు మాత్రము సహగమనము చేయుచుండువారు కాఁబోలు".

"అట్లే యగుచోఁ బ్రభుత్వశాసనమున కవసరమేది? పలువురు సహగమనము నాచరింపుచునే యుండవలయును. అబ్బ! అంతక్రూరముగ నెట్లు చేసెడివారో కాని!"

"నిజమే! కొందఱిచే బలవంతముగఁ గూడఁ జేయించు వారఁట! అట్టివి మాన్పించవలసినదే".

"కాని మన మతాచారములందుఁ గల్పించుకొనమని క్వీన్ విక్టోరియా రాణి నుడివెనుగద! అదియు యుక్తమే లె. మన యాచారములు మార్చుటఁ బ్రారంభించుచో నన్నియు మార్చ వలసివచ్చును. మన దేశమువంటిది మన దేశమే కాని యింకొకటి లేదు. ప్రజలు ప్రభువులు నేకజాతివారగుచో నీయిక్కట్టులు కలుగవు. మనయాచారములు వేఱు వారియాచారములు వేఱు. మనవన్నియు వారికి ననాగరికతవలెనుండును; వారివన్నియు మనకు నీతిబాహ్యముగనుండును".

"రాజులకేమి చేయుటకు లేదు హక్కు? ఎట్లైనను శాసింపఁగల్గుదురు. ప్రజల క్షేమమునకై వారేమిచేసినను వలదనుట కెవ్వరి కధికారమున్నది?"

“ఓహో నీప్రశ్నకు సమాధానము చెప్పుటకు మూలమునకే వెళ్లవలయును. ప్రజలకొఱకుఁ బ్రభువా? ప్రభువుకొఱకుఁ బ్రజలా? ఘృతమునకుఁ బాత్రాధారమా పాత్రకు ఘృతమాధారమా? పాత్రనువంచిచూడఁగ దేలినది. ప్రభువు లేకపోయినను బ్రజలుండఁగలరు; గాని ప్రజలే లేనియెడలఁ బ్రభువేల, ఎక్కడినుండివచ్చును? కృతయుగమున రాజనువాఁడే లేఁడు. ఇంచుక ధర్మము తప్పుచుండఁగ దాని సంరక్షణమునకై రాజేర్పఱుపఁబడియె. రాజునకు న్యాయపరిపాలనము చేయుటే విధిగాని లేని క్రొత్తనీతులు కల్పించుటగాదు. నీవడిగిన దానికి సమాధానము చెప్పుచున్నాను: చోరత్వము నేరము కాదనియొకరాజు శాసించినను నది నేరముకాకుండునా?”

“అట్లైనచోఁ బ్రభుత్వమువారు చేసిన శాసనములన్నియు నక్రమమనియా మీ యుద్దేశము?”

“అదిగాదు. ఉన్న నీతిశాస్త్రములు సర్వవిషయముల వర్తింపవు. అట్టియెడ నేదికార్యమో యేది యకార్యమో నిర్ణయించుటకుఁ బెద్దలందఱుఁగూడి యాలోచించి నిర్ణయింతురు.”

అని నేనిట్లు చెప్పుచుండఁగ నధ్యక్షుఁడు మేమేయే పుస్తకములను జదువుచుంటిమో చూచుటకు వచ్చుచుండెను. అతఁడు సమీపించుట చూచి నేను శశిరేఖ పుచ్చుకొనిన పుస్తకమును దెఱచి, అతఁడు మమ్ముచేరునప్పటికి “శశిరేఖా అక్బరుచేసిన కరగ్రహణ విధానమును గూర్చి చదివితివా? అట్టి విధానమునకును నిప్పటి పద్ధతులకును దారతమ్యము తెఱుంగవలయును

ఇది పరీక్షలలోఁ దఱచుగ వచ్చెడిప్రశ్న"యని చెప్పితిని. ఈమాటలు మాయధ్యక్షుఁడు విని నాకడ ఆగి "అవును; అది విపులముగఁ జదువవలసిన విషయమే. ఇప్పటి పద్ధతులకది మూలాధారమందురు ఈవిషయమును గుఱించి చదువునపుడు తోడరుమల్లు జీవితమునుగూడఁ జదువుఁడు" అని వెడలెను.

"శశిరేఖా! ఎన్ని పుస్తకములను జదువఁగలము? ఈచదివినవి చాలవా? చెప్పెడువారి కేమి, ఇదిచదువు, అది చదువు, అని చెప్పెదరు" అని యంటిని.

"అవును. నాకును విసుగే పుట్టుచున్నది మీరు చదువవలసినది చరిత్ర మొక్కటియే. మే మింగ్లీషుకూడఁ జదువవలయునుగద నేఁజదువకుండ మీరేవో కొన్ని విషయములు చెప్పితిరి. అట్లే మిగిలిన పుస్తకములలోని సంగతులు చెప్పుచో నాభారము తగ్గించినవారగుదురు."

"నీవు చదువవలసినదియు నేఁజదివినదియు నేనున్నది, శశిరేఖా, నన్నట్లు స్తుతింపుట కనెదవుగాని!"

"లేదండీ, నిజముగఁ జెప్పుచున్నాను. మీకుఁ దీరుబడియైనపుడు నాకుఁ గొంత చెప్పుచుండుఁడు."

"నాకుఁ దీరిక లేకేమి, ఎప్పుడును దీరికయే"

ఇంతలో గంటయయ్యెను. శశిరేఖ యింగ్లీషు పాఠమునకు వెళ్లెను. నేనచ్చటనే కూర్చుండి యానందముతో నానాఁటి వృత్తాంతమంతయు జ్ఞప్తికిఁ దెచ్చుకొనుచుఁ గూర్చుంటిని. ఆమె వెళ్ళినతరువాత నే శచీనాథుఁడు వేసిన ప్రశ్నజ్ఞాపకమునకు

వచ్చెను; శశిరేఖ మెడలో నేనునగ లున్నవో చూడలేక పోయితి నే యనుకొంటిని.

---

# 13

## గ్రంథపఠనము.

మా చదువులలో విశేషముగలదు. మేమేమి చదివినను మన భాషలోఁ జదువము; అంతయు నింగ్లీషే. పాఠశాలలోఁ దెలుఁగు పుస్తకము ముట్టము. జన్మముచేతనే యాభాషయందుఁ బాండిత్యము వచ్చుననియో, లేక, యాంధ్రము చదువనర్హమైనది కాదనియో, యెందువలనఁ జదివించరో నాకుఁ దెలియదు. ఆంధ్రభాషా విద్యావిక్రేతలగు నొక దొరగారును నొక తమిళ దేశస్థుఁడును, బూర్వవ్యాకరణ శృంఖలములను భేదించి బాలురకు వచస్స్వాతంత్ర్య మీయవలయునని, విద్యార్థులు గ్రామ్యభాష నుపయోగించవలయు ననియుఁ బాఠశాలలందుఁ జిన్నయసూరి వ్యాకరణముగాని పెద్దన్న కావ్యాలంకార చూడామణిగాని యుండరాదనియు వ్రాసిరఁట. మావిద్యార్థులందును దెలివిగలవారి కింగ్లీషే కాని తెలుఁగు రాదని యొక యభిప్రాయము కలదు. రెండు వేమనపద్యములు చదువుచో నతఁ డింగ్లీషు రాని మందబుద్ధియని భావింపఁబడును. స్నేహితు లిద్దఱు మాటాడుకొనుచో నది యింగ్లీషునఁనే కాని తెలుఁగునఁ గాదు, అన్నదమ్ములకుఁ గాని, తండ్రికిఁగాని యుత్తరము వ్రాసి

నను నది యింగ్లీషున నేకాని మాతృభాషను గాదు. అట్లగుటచే నేనిదివఱకుఁ దెనుఁగు పుస్తకముల నంతగ నెఱుఁగను. తెనుఁగుదేశము దాటి యరవనాటికి వచ్చుటచేతను నేనిపుడు చదువునది యొక్క చరిత్రభాగమే యగుటచే నాకుఁ దీరిక యుండుటవలనను మన తెలుఁగు పుస్తకము లెట్లుండునో చూడఁగోరితిని; ఇట్లని చెప్పఁగాఁ జిన్నప్పుడును తెలుఁగు చదువలేదని కాదు. చిన్న తరగతులలో మార్సడను దొరగారి పాఠములు చదివితిని. తెనుఁగు పండితులు, కవులైనవారు, రచించిన గ్రంథముల నెఱుఁగను గాన చెన్నపట్టణము వచ్చిన తరువాత నొక శాస్త్రిగారిని మన తెలుఁగులో రసవంతమైన మంచి కావ్యమేదైనఁ గలదా యని యడిగితిని. ఆయన నవ్వి "లేకేమి! అనేకగ్రంథము లున్నవి మనుచరిత్రను జదువుము" అని చెప్పెను. ఆయన చెప్పిననాఁడే మనుచరిత్రను గొని దానిని నాపుస్తకములలో నడుగున దాఁచియుంచితిని.

ఒకనాఁడు పద్మకుమారుఁడు నాగదిలోనికివచ్చి నాయొద్దనున్న పుస్తకము లన్నిటిని జూచుచు నడుగున నే దాఁచియుంచిన మనుచరిత్రమును గూడఁ జూచెను. అతఁడు దానిని బైటకుఁదీసి, నవ్వుచు "ఓహో! చెన్నపట్టణపుపద్ధతులలవాటు చేసికొంటివే" యనియె. ఆపద్ధతుల నేనెఱుఁగక పోవుటచేఁ దెల్లవోయి చెన్నపట్టణపు పద్ధతు లేమిటని యడిగితిని. చెన్నపట్టణము వచ్చిన విద్యార్థులకు మనుచరిత్ర శ్రీనాథుని వీథినాటకము, రాధికాసాంత్వనము, హంసవింశతి మొదలగు

గ్రంథములు చదువునలవాటు గలదట. పద్మకుమారుఁడు పుస్తకము తెఱచి రెండు పద్యములు చదివి "సోమేశ్వరా ! నిజముగ మన చదువులు తగులఁబెట్టుచున్నారోయి ! మన భాష, మన పుస్తకములు, మన దేశచరిత్ర, లేకుండఁ జేయుచున్నారుగద ! విక్రమార్కుఁ డెవరో యెఱుఁగము, విలియము వీరోజున నింగ్లాండు వచ్చెనో యెఱుఁగుదుము. రావణుని నెవరుచంపిరో యెఱుఁగము, రైయోండిజనిరో యుద్ధములో సేనాధిపతు లెవరో చదువుదుము. కాశీరామేశ్వరము లెచ్చట నున్నవో యెఱుఁగము, కామస్కట్కనుండి యేమి యెగుమతి యగునో చెప్పఁగలము. ఎందులకు వచ్చినట్లు చెప్పు, ఈచదువు మనకు! నిజముగ, వాఁడెవరో యనినట్లు, మనలను పెరికచ్చేరీలలో గుమాస్తాలను జేయుటకుఁదప్ప నెందులకును బనికిరాదు." అని యుద్రేకముతోఁ బలికెను.

"మన మిప్పుడెన్ని క్రొత్తవిషయములు నేర్చుకొనుచున్నాముగాము ? విజ్ఞానశాస్త్రములు ఇంగ్లండునుండి వచ్చిన దొరలు చెప్పుటలేదా ? ఇవియు నవియుఁ జదువ నెవ్వరికి సాధ్యమగును ? " అని నేను బదులు పలికితిని. నామాటలు పద్మకుమారునకు రోషము పుట్టించినవి.

"సీమనుండి దిగిన దొరలు మనకుఁ జెప్పినదేమిటి ? ఇన్ని సంవత్సరములనుండి సీమదొరలే మనకుఁ జెప్పుచున్నారే, వారి బోధనమువలనఁ బైకివచ్చిన వాఁడొక్కఁడున్నాఁడా ? "ఈశాస్త్రములో నేను" అని కంకణము కట్టుకొని చెప్పఁగలిగిన

వాఁడున్నాఁడా? పైపెచ్చు హిందువులకుఁ బరిశీలనా కుతూహలముగాని నూతన విషయాన్వేషణాకౌశలముగాని లేదని పలుకుదురు. పోని, లేదేయనుము, ఇన్ని సంవత్సరములనుండి అన్నేసి రూపాయలు జీతము పుచ్చుకొనుచున్న దొరలు అట్టిది కలిగింపలేకపోయిరేమి? మనకు వారేమియుఁ జెప్పరు, మన పుస్తకములు, మన శాస్త్రిలు, మఱచిపోఁ జేయుదురు ఈమనుచరిత్రములోనున్న భావములు, మృదత్వము, శోభ, అందము గాంభీర్యము, ఏయింగ్లీషు పుస్తకములోనున్నవి? ఎటువచ్చిన షేక్స్పియరొకఁడు. అని పద్మకుమారుఁడింతగఁ జెప్పఁగ నాకును మనుచరిత్ర చదువ బుద్ధిపుట్టెను. నేఁ డిదివఱకే కొంటినిగాని దానిని దెఱచిచూడలేదు. పద్మకుమారుఁడందలి విశేషములను నాకుఁ జెప్పఁగలఁడని యాతనిని బిలిచి నాకు బోధసేయుమని కోరితిని. అతఁడు సముద్రపుటొడ్డునకు వెళ్ళి చదువుదమనియె. అప్పటికింకను నాలుగు గంటలు కాకపోయినను నేను సరేయని యుత్తరీయము వేసికొని గదికి తాళము వేసి మెట్లు దిగితిని. పద్మకుమారుఁడే పుస్తకము పుచ్చుకొని వచ్చుచుండెను. మేము మెట్లు దిగఁగనే హిరణ్యగర్భుఁడను మాపరిచితుఁ డొకఁడు వచ్చెను. అతఁడు, నేను తెప్పించు వార్తాపత్రిక చదువుటకై తఱచు నాగదికి వచ్చువాఁడు. అతనిని మాతోడనే రమ్మంటిమి. మేము ముగ్గురమును రోడ్డుమీఁదకు వెళ్ళఁగనే శచీనాథుఁడు కనఁబడియె. పద్మకుమారుఁడతనిని జూచి నాతో "అదుగో, శచీనాథుఁడు వచ్చుచున్నాఁడు, పకోడీలు కొనిపెట్టుమను

నేమో" యనెను. ఆమాటకు హిరణ్యగర్భుఁడు నవ్వెను. మే మతనిని సమీపింపఁగనే యతఁడును మమ్ములనుజూచి చెప్పుల నుండి పాదములుతీసి, యించుకవంగి, ఓహో, హిరణ్యగర్భుఁడా! నమస్కారము, ఓహో! పద్మకుమారా! నమస్కారము" అని నమస్కరించెను. "ఏమండి మీ యతివినయము?" అని హిరణ్యగర్భుఁడు ప్రత్యుత్తరమిచ్చెను. "మీరు పెద్దలు, మాకు నమస్కరించుటేమిటి" యని పద్మకుమారుఁడు పలికెను. "ఇంత యెండలోనే బైలుదేరితిరేమి" యని శచీనాథుఁడు నన్నడిగెను. సముద్రపుటొడ్డున మనుచరిత్రము చదువఁబోవుచుంటిమి, నీవును రమ్మని పిలచితిని. "అది చదువుచుఁ గూర్చుండుచో నేను రాను, నాకది యర్థముకాదు. మీరు నాతో మాటాడరు" అని శచీనాథుఁడనెను. ఎప్పుడును చదువుచునే యుందుమా? "ఏవో కబురులుకూడ వచ్చుచుండును గాని" యని హిరణ్యగర్భుఁడనెను. నేను ఆదగ్గఱనున్న దుకాణములో తమలపాకులు చెక్కపొడి కొనుటకు వెళ్ళితిని. ఆదుకాణము కడనే యొకనల్లనాయన సేలమంచు జరీపంచెయుఁ బట్టుషర్టును సేలమంచు జరీ యుత్తరీయమును ధగధగమెఱయు తమ్మెట్లు, గల యాయన యొకఁడు సిగరెట్లుపెట్టె కొనుచుండెను. వీనిని జూచి శచీనాథుఁడు "ఓహో సత్యనాథా, ఎన్నిదినములు వెదకుదునప్పా నీకై? యనెను. "నన్ను చూడవలసినపని లేదే, ఆపుస్తకములన్నియు నీకిచ్చివేయవలసినదని మొన్నటిదినమే చెప్పినాను, శివసుందరముతో" అని యాతఁడు ప్రత్యుత్తరమిచ్చెను.

వీరి సంభాషణము ముగియువఱకు మేము రోడ్డుమీఁద నాగితిమి. శచీనాథుఁడు మఱ్ఱుఁ జేరినపిమ్మట "ఈయనెవరు' అని యాతనిని హిరణ్యగర్భుఁడడిగె.

"వీఁడా? వీఁడొక గొప్ప చెట్టిగారి భార్యాపుత్రుఁడు. వీనికేమి, మహారాజు, మొన్ననే పరీక్ష అయినది. వీని యిష్టము వచ్చినట్లు సొమ్ము ఖర్చుపెట్టుచుండును. వీని తండ్రియే గాక యొక మదల్యారుకూడ వీనికి సొమ్ము పంపుచుండును".

"ఈ చెట్టిగారికి మదల్యారు ఎందుకుఁ బంపునండీ? యని హిరణ్యగర్భుఁడు ప్రశ్నించె"

"నీవుకూడ నట్లడిగెదవేల హిరణ్యగర్భా? వీనిపైఁ బుత్రవాత్సల్య మున్నది కాఁబట్టి పంపును. అందాశ్చర్య మేమున్నది?" "ఇంత లోతుపాతులు మీకెట్లు తెలియు"నని హిరణ్యగర్భుఁడాశ్చర్యము నొందెను. సాధారణముగ శచీనాథుఁడు మాటాడుచున్నప్పుడు పద్మకుమారుఁడు బదులు చెప్పక యూరకుండును. మేమందఱము సముద్రపుటొడ్డునకుఁ బోయి చాల దూరము నడచినమీఁదట జరుపుటకుఁ బొద్దుచాలదని నీటివార పడవవాండ్రు వేసిన పగ్గముల నానుకొని కూర్చుంటిమి. పద్మకుమారుఁడే చదువుట ప్రారంభించెను.

"శా. శ్రీవక్షోజ కురంగనాభ మెదపైఁ ♦ జెన్నొంద విశ్వంభరా
దేవిం దత్కమలా సమీపమునఁ బ్రీ ♦ తి౯ నిల్పినాఁడో యనం
గా వందారు సనందనాది నిజభ ♦ క్త శ్రేణికిం దోఁచు రా
జీవాక్షుండు కృతార్థుఁ జేయు శుభదృ ♦ ష్టిం గృష్ణరాయాధిపు౯".

అను మొదటి పద్యము నే పద్మనుమారుఁడు రెండుమూడు సారులు రాగములు మార్చుచుఁజదివెను చదివి, "ఆహాహా, సోమేశ్వర, హిరణ్యగర్భా, చూచితిరా ఈపద్యమందలి భావము, ఆ సనందనాది మునుల మాధుర్యము, ఈపదలాలిత్యము పదగమనము," అని చెప్ప మొదలిడెను.

అంత శచీనాథుఁడు "ఏమిటయ్యా, నీపద లాలిత్యము, నీపదగమనమును ? పద్యము చదివి యర్థము చెప్పలేదు ! అప్పుడే ఆహాహా, ఈహీంహీం యని యారంభించినావు. ఏమిటున్నది యీపద్యములో?" అని గట్టిగఁ బ్రశ్నించెను. "దాని సారస్యము అనుభవించి తీరవలయును గాని చెప్పుట నా చేతఁ గాదు" అని పద్మనుమారుఁడు ప్రతిహతోత్సాహుఁడై బదులు చెప్పెను.

"ఈమాత్రము సారస్యము ప్రతిపద్యములో నుండును." అని శచీనాథుఁ డాక్షేపణగ ననియె. అంత హరిహరసు వాదముజరిగెను.

"అట్లుకాదు. ఇట్టిపద్య మొకటి యింగ్లీషులోఁ జూపిపుడు, ఇంగ్లీషేయననేల ? ఇపుడు మనవారే వ్రాయుచున్నారు పద్యాలు; పేరున కదియుఁ గవిత్వమే. వీనిలో మాత్రము పూర్వపు కవిత్వములందున్న యందమున్నదా ?" యని పద్మనుమారుఁడు పలికెను.

"అంతకంటెను నెక్కువ యున్నది. సమకాలికులు కాఁబట్టి వీరిని గొప్పవారని చెప్పలేము. మన పూర్వులేని

తనమే కొంత కారణము. అంతయేగాని ప్రతివిషయమునను మనము క్షీణించుచునే యున్నామా? మన పూర్వులను పొగడుకొనుట మనము దుర్బలులమనుకొనుట మనరోజులలో న్యాయము పోయినదనుకొనుట ఇప్పటియాచారమైనది లెండు." అని శచీనాథుఁడు తన సిగరెట్టు వెలిఁగించెను. పద్మకుమారుఁడు వానికిఁ గొంచెముదూరముగ జరిగెను.

"ఆచారము కాదండి. నిజముగ నంతే: మనపూర్వులు నడచినారనఁగ దినమునకు ముప్పదిమైళ్ళు నడచి రాఁగలుగువారు. ఇపుడు మనము నాలుగడుగులు వేయలేము" అని యతఁడు జవాబుచెప్పెను.

"వారలకు రైళ్ళు, మోటారులు లేవు కనుక నడచెడువారండి. మన కేమికర్మము? మనము మోటారెక్కెదము." అని శచీనాథుఁడు మాఱుపలికెను.

"మోటారెక్కెదరు కాని, మీకు శరీరదార్ఢ్యమేది? వెనుకటివారికి నిప్పటివారికిఁ బోలికయే లేదు. దేహబలమే కాదు, బుద్ధిబలమే కాదు, అన్ని విషయములలోనంతే. ఇపుడు వచ్చుచున్న పుస్తకములు పూర్వపు పుస్తకములవలె నొక్కటియు లేదు." అని పద్మకుమారుఁడు వాదించెను.

"దీనికొక కారణమువచ్చినది. ఇపుడంతయు నింగ్లీషు పుస్తకముల యనుకరణమే, ఈనవలలు క్రొత్తగ బైలుదేరినవి గదా." అని హిరణ్యగర్భుఁడు సమాధానము చెప్పెను.

"అదియుండినను మంచిదే, అదియు లేదు. ఏదో రెండు

పంక్తులు వ్రాయుటయు దానికిఁ బెద్దపేరు పెట్టుటయు; పంచాస్యచర్మము కప్పుకొనిన గోమాయువులే కాని." అని పద్మకుమారుఁడు కోపముగనే పలికెను.

"పద్మకుమారా, నీవు నిష్పక్షపాతముగ మాటాడుము." అని శచీనాథుఁడు గెలుపొందిన వానివలె నవ్వెను.

"ఉన్న సంగతినే నేను చెప్పుచున్నాను." అని పద్మకుమారుఁడు పలికె.

"అయినచో, పద్మకుమారా, ఇపుడు మనలోఁ గవులే లేరనియా నీయుద్దేశము." అని హిరణ్యగర్భుఁడు ప్రశ్నించెను.

"లేకేమి. అందఱు కవులే. కవికానివాఁడే నాకగపడుట లేదు. ఎటువచ్చిన నిజమైన కవిత్వము లేదుగాని"

"ఎట్టులైననేమి, నీవు నేర్చితివి, రెండుముక్కలు, కవిత్వము, గాంభీర్యము, భావము" అని శచీనాథుఁడు పద్మకుమారుని నాక్షేపణ చేసెను.

"అట్టిదే నేఁజెప్పునదియు; ప్రతివారును ఇంగ్లీషు విమర్శన గ్రంథములు చదువుటయు, ఆ విమర్శనాపద్ధతులు, పరిభాష మన తెలుఁగుభాష కుపయోగించుటయు. బి. ఏ. లోఁ బరీక్షకుఁ జదువు విమర్శన గ్రంథములలోని పరిభాష నేర్చుకొని శకుంతలనాటకమును ఉత్తరరామచరితమును గాదంబరిని విమర్శింతురు; మన చంద్రాలోకము, దశరూపకము, నరసభూపాలీయము వీరెవ్వరెఱుంగరు. అట్టివారందఱు మనకు విమర్శకులు, వ్యాఖ్యాతలును!"

"మన మింగ్లీషు పద్ధతుల ననుకరించుచున్నామనియా మీ యాక్షేపణ" యని శచీనాథుఁ డడిగెను.

"మనకు ఇంగ్లీషుపద్ధతు లొక్కటేనా? కేవలము ఇంగ్లీషు కవులు మన తెలుఁగుదేశమున నవతరించుచున్నారు. కన్నులు గ్రుడ్డివైనచో నతఁడాంధ్రుఁడిల్లటను; ఇంక ఆంధ్రుఁడైరను అగుటకా, అల్లరి చిల్లరగఁ దిరిగినఁ జాలును. ఇట్లే మనకు ఆంధ్రఎడిసను, ఆంధ్రకీట్సు, ఆంధ్రవర్డ్సువర్తు."

హిరణ్యగర్భుఁడు నవ్వుచు, "ఆంధ్రఎడిసను కేమున్నది"? అని యడిగెను.

"ఎడిసను వ్రాసినట్లు వ్రాయ యత్నించువాఁడు ఆంధ్ర ఎడిసను. హాస్యరసమున కెడిసను ప్రసిద్ధిగద! వీరి వ్రాతలు వెయ్యిపుటములు పెట్టినను ఎడిసను వ్యాసములను బోలవు. హాస్యమనఁగ, నవ్వువచ్చునది ప్రతిదియు హాస్యము కాదు. ఇప్పుడు శచీనాథుఁడుగారు బూతుల మాట్లాడుచో మనము నవ్వుదుము. కాని అది హాస్యము కాదు. చంద్రునివ మందహాసము ఎడిసను హాస్యము, కోతియొక్క వెక్కిలి యికిలింపు వీరిహాస్యము; మృదుకరపల్లవస్పర్శము ఎడిసను హాస్యము, మోటుచేతి పిడిగ్రుద్దు వీరిహాస్యము."

"వీరి సామర్థ్యము నలుగురు గుర్తించి గౌరవించి వీరికిఁ దగిన పేరులతోడను బిరుదులతోడను బిలుచుచున్నారనియా నీకుఁ గోపము? అని శచీనాథుఁడు నోటినుండి సిగరెట్టు తీసి పద్మకుమారుని నాక్షేపము చేయుచుఁ బలికెను. ఈతనిమాట

లకు నిజముగఁ బద్మకుమారునకుఁ గోపమువచ్చెను; కాని దాని నతఁడాపుకొని "వీరు పేరు పెట్టుకొనినారని నాకుఁ గోపమెందులకు, వీరికంటెను బెద్దపేరుల వారున్నారు. కలియుగార్జునుఁడు ఉన్నాఁడు. కలియుగ భీముఁడున్నాఁడు. ఆంధ్రవాల్మీకి, ఆంధ్రవ్యాసుఁడు, ఆంధ్రనారదుఁడు, ఆంధ్రమయ్యాంతుఁడు, ఆంధ్రభరతుఁడు, ఎవరుకావలసిన వారున్నారు. మనలో న్యాయశాస్త్రము చదువుచున్నావు గనుక నీవు ఆంధ్రపరాశరుఁడ వనుకొనుము. ఈ హిరణ్యగర్భుఁడు టెంప్లికేను రత్నము; సోమేశ్వరుఁడు మణిపురము వైకాంతము; అగో, అట్లు వెళ్ళుచున్నదే, ఆవిడ మైలాపురము బాంధవి."

పద్మకుమారునకుఁ గోపమువచ్చి మాకందఱకుబిరుదులిచ్చినందులకు మాకు నవ్వువచ్చెను.

ఈ సంభాషణముతోడ నేఁటికటిపడెను. పుస్తకము తెఱచి యొక పద్యమున కర్థము చదువలేదు. ఈనాఁటికి చదువు ముగించి కొంచెము షికారు వెళ్ళుటకు లేచితిమి.

---

# 14

## సల్లాపము.

ఒక ఆదివారమునాఁడు సాయంకాలము నాలుగు గంటలకే హిరణ్యగర్భుఁడు వార్తాపత్రిక చదువుటకు మాగదికి వచ్చెను. అతఁడు వచ్చిన కొంచెది నిమిషములకే శచీనాథుఁడును వచ్చెను. వచ్చిన యిరువురు మిత్రులను సత్కరించుటకై నేను

టీ కాచుచుంటిని. తనకై శ్రమపడవలదని హిరణ్యగర్భుఁడనేను గాని టీ కాచుట శ్రమకాదని నాపక్షమున శచీనాథుఁడే ప్రత్యుత్తరమిచ్చెను హిరణ్యగర్భుఁడు వార్తాపత్రిక చదువుచు "ఓహోహో, ఈసంగతి వింటిరా? ఇంగ్లాండులో ఎనుబది రెండేండ్లున్న చిన్న పెండ్లికుమారుఁడు తనయింటి చిన్నపిల్లను వివాహమాడెనఁట" అని నవ్వి కాటికిఁ గాళ్ళు చాఁచుకొనిన తరువాత పెండ్లియేమిటి శచీనాథా, అని వానిని బ్రశ్నించెను.

"అదివఱకు వారికిఁ బెండ్లి కాకుండ నున్నదని యూహ నీ యూహా ?" అని శచీనాథుఁ డించుకేని యాశ్చర్యము నొందకయే పలికెను.

'ఇప్పుడు వివాహము చేసికొనిరనఁగ నిదివఱకు గాలేదనియే గద" అని హిరణ్యగర్భుఁడు తన యూహకుఁ గారణమును వచించెను.

శచీనాథున కీకారణములలో నిమిత్తము లేదు. "ఎనుబది యేండ్లవఱకు వివాహము కాకుండనున్న పతివ్రతలెవరు?" అనియె.

"శచీనాథా, వివాహమై పతివచ్చినపుడు పతివ్రతలగుదురుగాని వివాహమే కానపుడు పతివ్రతలని యెట్లు చెప్పుదువు?" అని నేనడిగితిని.

"సరిగ నదియె నేనుచెప్పునది. వివాహము కాకపూర్వము నొకపతి, యొకపత్ని, యని వ్రతముండదు." అని నా మాటలకుఁ బెడయర్థము తీసి శచీనాథుఁడు ప్రత్యుత్తరమిచ్చెను.

అతని వచనములకు మాకు నవ్వువచ్చినది.

“ఇట్టివి కలుగకుండ నుండుటకై యే మనలో రజస్వలకుఁ బూర్వమే వివాహము చేయవలెనని నిర్మించినారు. ఎప్పటికైన మన యాచారములే మంచివిసుమండీ” అని హిరణ్యాగర్భుఁడు నుడివెను; కాని శచీనాథుఁడు “దాసికేమి లెండు, మనలోమాత్రము వ్యభిచరించిన వారెందఱు లేరు? సచ్ఛీలమనునది నూటికో కోటికో యొక్కరికడ. నలువురిలోను ఆక్షేపముచేసికొనము కావున నందఱము పెద్దమనుష్యులమే” అనెను.

“చాలుచాలు, బాగుగఁ జెప్పితివి! ప్రపంచమంతయుఁ జెడిపోయిన దనుము!” అనిహిరణ్యాగర్భుఁడు ఆక్షేపము చేసెను.

“ప్రపంచ మంతయుఁ జెడిపోయినదని యందునా? అక్కడక్కడ మాబోంట్లు లేకపోలేదు. అట్టివా రింగ్లాండులో మన దేశమునందుకంటెను దక్కువ.”

“ఇంగ్లాండులో సంగతి మనమెట్లు చెప్పఁగల్గుదుము.” అని హిరణ్యా గర్భుఁడడిగెను. నవలలు చదువుటవలన వారి యాచారములు, నడవడులు మనకుఁ దెలియవచ్చుచున్న” వని నేను చెప్పితిని.

“అక్కడ ప్రత్యేకము న్యాయస్థానములే కలవు, వ్యభిచరించిన భార్యాభర్తలు వివాహోచ్ఛేదము గావించుకొనుటకు.” అని నాలో న్యాయశాస్త్రము చదువుచుండిన శచీనాథుఁడు నాకెఱింగించెను.

టీ కాచితిని, శచీనాథునకును హిరణ్యగర్భునకును జెరియొకగిన్నెలోను బోసి యిచ్చితిని. అందుఁ బంచదార చాలదని శచీనాథుఁడు మఱికొంచెము వేయుమనెను. హిరణ్యగర్భుఁడు దొరలు టీ నట్లే త్రాగుదురనియుఁ బంచదార విశేషము వేసికొనరనియుఁ జెప్పెను. "మనమన్నిటిలోను దొరలవలెఁ జేయుచున్నామా? కట్టుకొనిన భార్యనో భర్తనో జన్మాంతమట్లే కట్టుకొనవలెను గాని దొరలకువలె విడిచిపెట్టుట కున్నదా?" యని శచీనాథుఁడనియె. టీ త్రాగినపిదప గిన్నెలు గదిబైట వేసితిమి. తువాలుతో మూతులు తుడుచుకొని కుర్చీలపైఁ గూర్చుండిన తరువాత, శచీనాథా! మన యాచారములు మంచివియా వారియాచారములు మంచివియా, యని యడిగితిని. అపుడు పద్మకుమారుఁడు కూడ వచ్చెను. శచీనాథుఁడు "అవి నాగరికత చెందిన దేశములు, అందు భార్యాభర్తృసంబంధము కల్పించుకొనుట లయము చేసికొనుటయుఁ గలవు. ఇదియే నాగరికత యని చెప్పవలయును" అనెను.

ఆమాటలు నమ్మరానంత విరుద్ధముగ హిరణ్యగర్భునకుఁ దోఁచుటచే "నిజముగ వివాహము లయముచేసికొందురా? ఎట్లు చేసికొనెదరండి?" అని యడిగెను.

"నీకింకను సందేహమా? అది నాగరికతయఁట! అట్టి నాగరికత మనదేశమున లేకపోవుటే క్షేమము." అని పద్మకుమారుఁడు చెప్పెను. ఇతనికెందువలననో పాశ్చాత్య పద్ధతు

లన్నను ఆచారములన్నను ఆగ్రహము మెండు. ఎవ్వరేది యగు నన్నను శచీనాథుఁడు కాదనును. అది ప్రాశ్న్యాయవాది లక్షణమఁట. అట్టితర్క మలవాటుచేసికొనుటకే యనుకొనెదు, అతఁడు మాతో వాదించుచుండును.

"ఏమిటండీ యీక్షేమము ? భార్యాభర్తలిద్దఱకు సరి పడకపోయినను వారిద్దఱు కీచులాడుచు నట్లే యుండవలయునా ? ప్రతిదినము ఏడుపులు పెడబొబ్బలు, ఒకరి మొగమొకరు చూచుకొనకఁబోవుచో నెవ్వరికి సౌఖ్యము ? ఎవరికి క్షేమము ?" అని యతఁడు పద్మరుమారునితోఁ దర్కమునకు దిగెను.

"ఎంత కీచులాడినను దప్పదని వారు కీచులాడుటమాని యొకరికొకరు సరిపుచ్చుకొని యుందురు. సంబంధము తెంపుకొనుటకు వీలుండఁగనే యొకభర్తతోఁ బడకపోయిన, వాఁడు కాదనిమఱియొకని, వీఁడుకాదని యింకొకనిఁ గట్టుకొందురు."

"భార్యాభర్తల సంబంధము వారిరువురి సమ్మతిని బట్టిగద యేర్పడుచున్నది. పుట్టుకచేతనే, తండ్రి కొడుకులు, అన్నదమ్ములు, అప్పసెల్లెండ్రు అయినట్లు జన్మమాత్రముననే యెవ్వరును భార్యాభర్తలు కారుగద. అది స్త్రీ పురుషు లిరువురు కొన్ని నియమముల కంగీకరించి చేసికొనిన యేర్పాటుచేఁ గల్గుచున్నది. ఒక్కరానియమములను బాటింపక యుల్లంఘించుచో రెండవవారు మాత్రము వానిని బాటింప నెట్లు బాధ్యులగుదురు ? కేవల మంగీకారజనితమైన సంబంధము, ఏకచిత్తతవలనఁ

గల్గిన బంధుత్వము, ఆ యంగీకారము, ఆయేకచిత్తత భిన్నము కాఁగానే, పేడిపోవుచున్నది. ఆ స్త్రీ పురుషులు తొంటిస్థితికి, అవివాహితస్థితికే యని చెప్పవచ్చు వచ్చుచున్నారు."

న్యాయశాస్త్రవిషయముల శచీనాథుఁడేమి చెప్పినను మేమంగీకరింపువారము

"ఇద్దఱి యంగీకారమును బట్టియే వివాహముండుచో వారెట్లేర్పఱచుకొని యంగీకరించిన నట్టి వివాహము చేసికొన వచ్చునా? అనఁగ, అశాశ్వత వివాహములు, అల్పకాలికవివాహములు?" అని హిరణ్యగర్భుఁడు ప్రశ్నించెను.

"నాగరికత మీఱిపోయినచోటుల నట్టివియు నుండును" అని వెటకారముగఁ బద్మకుమారుఁడు పలికెను.

"పద్మకుమారా, నీవు వెటకారముగఁ బలుకనక్కఱ లేదు. అట్టివియుఁ గలవు. మనలో నున్న రాక్షసవివాహములు గాంధర్వవివాహములు గూఢవివాహములు మాత్రమెట్టివి? షియా మహమ్మదీయులలో మీరు చెప్పినట్లు అశాశ్వత వివాహములు జరుగుచునే యుండును." అని శచీనాథుఁడు వచించెను.

"ఆపద్ధతియు బాగుగనే యున్నది, క్రొత్త క్రొత్త మామగారులు, క్రొత్త క్రొత్త కట్నములు." అని హిరణ్యగర్భుఁడు నవ్వెను.

"ఆహా! హిరణ్యగర్భుఁడు ఏమియు నెఱుఁగనట్లు పలుకుచున్నాఁడు? క్రొత్తక్రొత్త మామగార్ల కొఱకా క్రొత్త

కొ్రొత్తపెండిండ్లు?" అని శచీనాథుఁడు ఆక్షేపణము చేసెను.

"శచీనాథా, నీవు చెప్పినట్లు ఎచ్చటను జరుగదనియే నాయభిప్రాయము. ఎంత యనాగరిక దేశములోనైన నట్లుండదు." అని నేను చెప్పితిని.

తనవలెఁ దలఁచువాఁడు తానొక్కఁడే కాక నేనుగూడ నున్నానని బ్రహ్మకుమారుఁ డెఱింగి "ఇంతవఱకుఁ జెప్పినది నీకుఁ దెలియనేలేదా? అవి యనాగరిక దేశములలో నుండనేయుండవు. నాగరికతగల దేశములలోనే" యని యాక్షేపణముగఁ బలికెను.

"చూడఁగఁ జూడఁగ వివాహమనునది చాలచిత్రమే! స్త్రీపురుషు లిద్దఱు కలసి యుండుటకుఁ, బ్రపంచమంతటికిని మేమిరువురము కలసి యుండుచున్నాము, కలిసి కాఁపురము చేయుచున్నామని యెందుకు చెప్పుకొనవలయు? వీరి కష్టసుఖములు వీరివే కాని లోకు లెవరైన వచ్చి తోడ్పడుదురా? ఇద్దఱిష్టపడినతరువాత లోకు లెంతమంది వలదనినను మానుదురా?" అని హిరణ్యగర్భుఁడు వివాహతత్వ విమర్శనము గావించె. దానికిఁ బ్రహ్మకుమారుఁ డిట్లు సమాధానము చెప్పెను.

"వివాహమనునది యతి పవిత్రమైన కార్యము. దీనిచేఁ గల్గు సంబంధము శచీనాథుఁ డనునట్లు నియమితకాలమే యుండునదికాదు. జన్మజన్మములవఱకు నుండునదయే. అట్టి పవిత్ర కార్యం బొనరించునపుడు సర్వదేవతా స్వరూపుఁడైన యగ్ని

యెఱుకను పెద్దల యెఱుకను బంధువుల యెఱుకను జేయుట మన యాచారము. పునస్సంధానముకూడ పెద్దలచే ముహూర్తము పెట్టించి గ్రామములోనివారిని బిలిచి చేయుదురుగాని రహస్యముగఁ జేయరు. మన కట్టుబాట్లు అట్టివి. అవి యెప్పటికిని మంచివే. ఇట్లు శాస్త్రప్రకారము వివాహము చేసికొనఁగ బుట్టిన పుత్రుఁడు ఔరసుఁడు, రహస్యముగఁ గల్గినవాఁడు గూఢజుఁడు. తండ్రి సొత్తునకు, తరువాత కర్మచేయుటకును ఔరసునకే యధికారముకలదు గాని గూఢజునికిఁ గాదు."

ఈ హేతువు హిరణ్యగర్భునకుఁ దృప్తికరముగ లేదు. అతఁడిట్లు నుడివెను.

"దీనికొక కారణముండవచ్చు. మనము పుస్తకములలోఁ జదివిన దానినిబట్టి నాకుఁ దోఁచినది చెప్పుచున్నాను: ఒక స్త్రీయుఁ బురుషుఁడును గలసి కాఁపురము చేయుచున్నట్లు ప్రమాణముచేయు నాచారము నరులు గుంపులుగుంపులుగ వనములలో సంచరించు కాలముననే పుట్టియుండవలెను. ప్రప్రథమమున రాక్షస వివాహములే వాడుకలో నుండియుండును. నాగరికత వచ్చినకొలఁదిని యట్టివి తగ్గియుండును; వివాహితయగుదానినే మరల నింకొకఁడు తెలియక వరించునేమో యని యావివాహము నలువురకుఁ దెలియునట్లు చేయుచువచ్చియుందురు" హిరణ్యగర్భుఁడిట్లు పలుకఁగనే శచీనాథుఁడు నవ్వెను.

"ఓహో, మీరును దేశచరిత్రలు, కవుల జీవితములు వ్రాయఁగలవారే! ఏమియూహా! ఏమి సిద్ధాంతము!! మహాత్మ

దీయులు మనదేశమునకు రాకపూర్వము రజస్వలానంతర వివాహములు జరిగెడివఁట; వారు వచ్చినతరువాత బాల్య వివాహములు వచ్చినవఁట! ఇట్లే యున్నది మీసిద్ధాంతము!!" అనెను. మనయాచారముల నాక్షేపణము చేయుటకుఁ బద్మనాభుఁడు ఒప్పుకొనఁడు.

"అవును అది నిజమే. దానికి సందేహమేమిటి? వివాహముకాని కన్యలను పఠానులెత్తుకొని పోయెడువారు. వారికి భయపడి ప్రతిబాలికకును చిన్నతనమందే వివాహముచేయఁ బ్రారంభించిరి. బాల్యవివాహములు వచ్చుట కిదియే కారణము." అని యతఁడు వాకుచ్చెను.

"కన్యల నెత్తుకొని పోవునంతటి నిష్ఠురులు కాంతలను మాత్రమేల యెత్తుకొనిపోరు? ఈ కారణమున కర్థము లేదు" అని నేను గట్టిగఁ జెప్పితిని. శచీనాథుఁడు నాకు సహాయముఁ వచ్చుననుకొని యాతనివైపు చూచితిని గాని యాతఁ డేలకో మిన్నకుండెను.

"ఏమైనను రజస్వలకుఁ బూర్వమే వివాహములు చేయుట మంచిది. లేకపోయిన ఈదొరల వివాహములవలె వచ్చు"నని హిరణ్యగర్భుఁడు తన యభిప్రాయము చెప్పెను.

అపుడు శచీనాథుఁడు "ఈదొరలకు నిపుడు జరుగునది బహిరంగమైన వివాహము. ఇఁకఁ బుట్టినారా వారి పుత్రులు, అదివఱకు గాంధర్వములు జరిగి యుండవచ్చును" అనియె.

ఈమాటలకుఁ బద్మనాభుఁడు నవ్వుచు "బాగుగ,

జెప్పితివి నిజమే" యనెను. శచీనాథుఁ డిపుడే సరియైన సంగతి చెప్పెనని యాతఁడు మెచ్చుకొనెను.

అట్లు మెచ్చుకొనఁబడుటచే హెచ్చరిక చెంది "సాగినంత వఱకు వివాహము లేకుండనే జరుపుకొందురు, సాగనపుడు మాత్రము వివాహము చేసికొందురు." అని నుడివెను.

వారిద్ద ఱాక్షేపణము చేసిరి కావున దానిని బ్రశంసించుటకై హిరణ్యగర్భుఁడు "అదియు మంచిదే లెమ్ము; మనలోఁ గొందఱు వితంతువులు శిశువులను గని వారిని జంపి పాఱవేయుట కంటె వేయిరెట్లు మంచిదే." అని నావైపు చూచెను.

"ఇంగ్లాండులో అట్టిశిశువులను పెంచుటకు సత్రములు కలవు" అనిపద్మకుమారుఁడు అచ్చటిశాసనముల బాహుళ్యము సూచించెను. "మన దేశమునఁ గన్యలు దోషులుకారు. అజ్ఞాత యౌవనలగువారు వైధవ్యము ననుభవించవలసివచ్చుటచే మాత్రము కొందఱు చెడిపోవుచున్నారు."

పునర్వివాహము లున్నచో స్త్రీ విజయగవు ఆ మాటయే నేనంటిని. పద్మకుమారుని యాభిప్రాయ మేమిటని యడిగితిని.

"అవి చేయఁదగినవే యనుచో మనవారు నిషేధించి యుండరని నాయభిప్రాయము" అని చెప్పెను.

"మనవారి కిట్టివి పనికిరావండి. రహస్యముగ నెన్ని దోషములు చేసినను సరియేగాని పైకి ఆచారము నటన యున్నఁ జాలు" అని శచీనాథుఁడనియె. అతఁడు నాతో నేకీభవించెను.

"నిజమునకు బాలవితంతువులకుఁ దల్లితండ్రులే తిరిగి

వివాహములు చేయవలయును." అని నేను పలికితిని. కాని, శచీనాథుఁ డేప్రసంగవశమున నెవ్వరి నేమనునోయని నాకు వెఱపుకలిగినది. మేము మాటలకువిషయమును మార్చివేయఁ గోరి, "హిరణ్యగర్భ? ఇం కేమిటి వార్తాపత్రికలోని విశేషములు?" అని యతని వైపునకుఁ దిరిగితిని

"ఏమున్నవి? రేపు సాయంకాలము పార్థసారథిస్వామి ఆలయములో హరికథ."

"ఎవరు చెప్పుదురు?" అని పద్మకుమారుఁ డడిగెను.

"సంతానమయ్యంగారు. కుంభకోణమునట. సంగీతము చాల బాగుండునట." ఇట్లు చెప్పిన హిరణ్యగర్భుని నీవువింటివా యని శచీనాథుఁ డడిగెను.

"నేను వినలేదు. ఇదివఱకు వినినవారు చెప్పినారు"

"హరికథ వినుటకు వెళ్ళినవారు ఆయన సంగీతము వినినది!" యని శచీనాథుఁడు హేళనచేసెను.

"మీన్యాయవాది పరీక్షలిపుడే వేయుచున్నారే!" యని పద్మకుమారుఁడు పలికెను

"అదికాదండి. చెప్పునది హరికథ; మనకు హరిప్రార్థనము, తరువాతి కథ ప్రధానము. ఆయన గాత్రప్రసంగమేల? అవి రెండును బాగుండక పోవుటచేతనా ఆయన గాత్రము గుఱించి చెప్పుచున్నారు?"

"శచీనాథా నీతోమాటలాడుట కష్టమే." అని నే నంటిని.

"హరికథగద, పోని, రేపు మనము వెళ్ళి చూచెదమా?" యని పద్మకుమారుఁడు తన కుతూహలము వెల్లడి చేసెను.

"నేను రానండి నాకు సంగీతమేమియుఁ దెలియదు; రసికుఁడను గాను, కేవలము అవిదగ్ధుఁడను" అని శచీనాథుఁడు పరాతి ముణుఁచుకొని పలికెను. ఏని నాక్షేపణముచేయుటకు సమయమువచ్చినదని హిరణ్యగర్భుఁడు ఇట్లనియె.

"శచినాథా ! సంగీతమనిన క్రొత్తభాష యనుకొంటివా ? నిన్ను అర్థము చెప్పుమని యందురా ? నిన్ను పాడుము కూరా యెవరైన? పాటవినుటకు నీకుఁ దెలియవలసినదేమిటి ?"

"సంగీతమనఁగ నాకంత యభిరుచి లేదండి! ఏమిచేయుమనినారు ?" అని శచీనాథుఁడు మెల్లమెల్లగ జారెను కాని హిరణ్యగర్భుఁడు విడువలేదు.

"ఆలింగించు విమల గాంధర్వంబు నిహ్లాదయమును గరఁగింపలేక పోవుచో దాని నేమనవలయు? రాతి మనవలయు" అనెను. వినికిఁ బద్మకుమారుఁడు తోడనెయ్యె.

"ఇపు డింగ్లీషు చదువుకొనువారిలో నొక యాచారమైనది లెండు: మన పూర్వపువిషయములనఁ జులకనగఁ జూచుట, మన తెలుఁగే రాదనుట, సంగీతము తెలియదనుట !!" అని దెప్పిపొడిచెను.

శచినాథుఁడు తానోటువడినట్లు గ్రహించెను. "నాకట్టి

బడాయి లేదండోయి. నాకుఁ దెలుఁగే కాదు, ఇంగ్లీషుకూడ రాదు !" అని పలికెను; గాని వాని సంకను హిరణ్యగర్భుఁడు విడువలేదు.

"ఇపుడు బూటాటకాదు గాని, మాకు సంగీతము తెలియదన్న వారికిఁ బ్రపంచకజ్ఞానము, బుద్ధికుశలత, గడుసుఁదనము, ఎవేవో ఉన్నవని మేమూహించుకొనవలయును."

"ఈ యాక్షేపణములన్నియు నన్నే సంబోలు; నాకు బుద్ధికుశలత లేదు, గడుసుఁదనము లేదు, నాకేమియు రాదనే చెప్పుకొనుచున్నాను గాని సంగీతము వచ్చునని సాహిత్యము వచ్చునని చెప్పుకొనుటలేదు." అని శచీనాథుఁడు తలవంచుకొని పలికెను. అతఁడు చిన్నపుచ్చుకొనినట్లు గ్రహించితిని.

"ఇంతకు రేపు వెళ్ళుదమా ?" అని యడిగితిని.

"ఈయన చాల బాగుగఁ బాడునఁట" యని హిరణ్యగర్భుఁడు చెప్పి "సాధారణముగ దాక్షిణాత్యులు మనకంటె బాగుగఁ బాడుదురు" అని యీవాక్యముకూడ ననియె.

"సంగీతములో మనకంటె నెక్కువ కృషియే చేసిరి. సాధారణముగ వారిలోఁ బ్రతివారును బాడఁగల్గినవారె ?"

అది నిజమేయని నేనంటిని. కాని మేమనినదానిని శచీనాథుఁ డంగీకరింపఁడు.

వారు పాడినను మన తెనుఁగుపాటలే కదా ? యని చుల్కనగఁ బలికెను. పద్మకుమారుఁడు వానికిఁ దోడై మాతృభాషాప్రశంస చేసెను.

మన తెనుఁగుభాషవంటి భాష యున్నదఁటండి? గులక రాళ్ళు చప్పుడు చేసినట్లు అరవభాష సంగీతమున కేమి పనికివచ్చును?"

"మనభాషకంటె హిందుస్థాని యెక్కువ ప్రౌఢము గాను గంభీరముగాను నుండును" అని మరల శచీనాథుఁడు నుడి వెను. తెనుఁగును మించినభాష యున్నదని చెప్పుట పద్మనాభ రుఁడు సహింపలేఁడు.

"ఆ! హై. హై. అను కేకలతో గట్టిపుబళ్ళు తోలుటకు బాగుండును!" అని పరిహాసము చేసెను.

"మీకు మాతృభాషాభక్తి యుండుట మంచిదేకాని, అధికారముతోడను సప్రభావముతోడను బలుకు తెలుఁగు పదములేవి ? ఈ విషయములో హిందుస్థానికి మనభాష చాలదు." అని హిరణ్యగర్భుఁడును శచీనాథుని వచనము నాద రించి పలికెను.

అట్లతఁడు తోడ్పడుటచే "మన కెప్పుడును లేదు ప్రభు త్వము, అధికారమును. మనభాష కెట్లువచ్చును?" అని శచీ నాథుఁడు పలికె. ఆంధ్రుల చరిత్రచదివిన పద్మనాభుఁడీవచ నము నంగీకరింపలేదు.

"అట్లేల చెప్పెదవు? ఆంధ్రరాజ్యము మగధరాజ్యము వఱకు వ్యాపించియుండెడిది కాదా?" అనియె. ఈవిషయమున మరల వాదములోనికి దిగిరి:

"ఆ మాటలకేమి లెండు? మా తాతగారు ఇవి చేసిరి,

యువిచేసిరని చెప్పుకొనుటలో నేమున్నది ? మనసంగతి చెప్పు కొనవలెను గాని! ”

“నిజముగ నీయింగ్లీషు చదువువలన మనదేశభక్తి కూడఁ బోయినదండీ. దీనికి మీరిగాను తప్పు. పరాధీనత్వము తప్పినగాని నిజమైన దేశభక్తి కుదరదు.”

“అదిమన కెన్నడును దప్పదు. ఒకవేళ సురదృష్టమువలనఁ దప్పినను దేశము మఱింత యల్లకల్లోలములోనికి వచ్చును. రాజ్యపాలనమువఱకు పోనేలనండి? చిన్నచిన్న విషయములలోనే కొట్టుకొనుట, లంచములు పుచ్చుకొనుట, ఒకరినిజూచి యొకరోర్వలేకపోవుట, పక్షపాతము, ఎన్ని యున్నవి కావు?”

“అట్టివే దేశములో లేవండి? మహానాగరికత గన్నదని మీరను నింగ్లండులోనే యున్నవి, రెండుపక్షములువారు కొట్టుకొనుట తిట్టుకొనుట.”

ఈవాద ప్రతివాదములకంతముండునట్లు లేదు. అప్పటికే చీఁకటిపడవచ్చినను జల్లగాలిలోనికి వెళ్ళఁగోరి మేమంద ఱము సముద్రపు టొడ్డునకు వెళ్ళుటకు లేచితిమి?

# 15

## విత్తనము.

పుస్తకభాండాగారమున నేనును శశిరేఖయు మాటాడి నప్పటినుండియు మాకుఁ బరిచయ మంతకంత కెక్కువ యయ్యెను. అప్పటినుండియు మేమిరువురము తఱుచుగ నే కలుసుకొనెడివారము. మేము పాఠములను గుఱించి తర్కించుకొనుట వినినవారును, మమ్ము తఱుచు చూచినవారును, మాసంభాషణములు నిష్కళంకములే యని యెఱింగి మమ్ములను గుఱించి యనుమానపడుట మానిరి. మమ్ము నెఱుఁగనివారును మేమెఱుఁగనివారును మమ్మెట్లు తలంచిరో నాకుఁ దెలియదు అట్టివా రేరీతిన మమ్మెంచినను నాకు లోటులేదు గావున నేను వారికి లక్ష్యము చేయువాఁడను గాను. అయినను, ఒరులు మమ్ము గమనించుచున్నారని మేము తెలిసికొనినపుడు ఆంతర్యవిషయములను గాక పైపై సంగతులను గూర్చియే, అనఁగ, గాలి, వేడి, కళాశాలలు, పాఠములు, ఆటలు మొదలగు వానింగూర్చియే సంభాషించువాఁడను అంటియు ముట్టని యట్టి విషయములను గుఱించి భాషించుచు ఆంతరంగిక విషయములను దాఁపెట్టుకొనుట మైత్రికి విరుద్ధమని చింతించువాఁడను గాని నాహృదయమును వెల్లడించుటకు నాకు ధైర్యము చాలెడిది కాదు.

ఒకనాఁడు సాయంకాలము షికారుపోవుచుండఁగ నొక

యావును దూడయు, పాలచెంబుతో గొల్లవాఁడును నాకెదు
రయ్యె. ఆపట్టణమున నింటింటికి నావును దీసికొనివచ్చి పాలు
పితుకుట వాడుక గావున నట్లు కొనరాఁబడిన గోవు లెదురు
వచ్చుటలో విశేషము లేదనియు దానిని శకునముగ నెంచ
రాదనియు ననుకొంటిని; కాని నల్లతంబివీథి దాఁటఁగనే యిరు
వురు పుణ్యకాంత లెదురైరి ఆ సాయంకాల మేదో విశేష
ముండునని యూహించుకొంటిని. కొంచెముదూరము పోయిన
పిదప మరల మంచిశకునమయ్యెను. నాకు మేలుకలుగఁబోవు
చున్నదనియే గ్రహించి యీనాఁడు శశిరేఖ కనఁబడుచో నా
మొఱ్ఱఁ జెప్పఁదలఁచుకొనినది చెప్ప నిశ్చయించుకొంటిని.

ఆ నిశ్చయముతో నేను సముద్రపు టొడ్డునకు వెళ్ళి,
సాధారణముగ నేనును శశిరేఖయుఁ గూర్చుండు చోటునఁ
గూర్చుంటిని. అంతలో నామెయు నొంటరిగ వచ్చెను. శకున
ఫల మప్పుడే కనఁబడినదని సంతోషముగ నుంటిని. ఏమైనను
సరే నేను చెప్పఁదలఁచుకొనినది యీనాఁడు చెప్పుటకు ధై
ర్యము తెచ్చుకొనుచుంటిని. ఆమె నన్నుఁజూచి కొంచెము దూ
రమునుండియే "ఈరోజున మీరు కనపడితిరి. మీతోటి సంభాష
ణమువలనఁ గొంతసేపైన నాహృదయ సంతాపము మఱచి
యుండవచ్చును." అనెను. "శశిరేఖా నీకు హృదయభారమేల?
చాలకాలము మీతల్లిదండ్రులను వదలియుండుటచే బెంగపెట్టు
కొంటివి కాఁబోలు" అంటిని. "ఇంతకాలము నే నెక్కడైనను
వచ్చుటనుండలేదుగాని, అయిన, నేను చిన్నపిల్లనా? తల్లిదండ్రి

లపై బెంగపెట్టుకొనుటకు? ఆవయస్సు దాఁటినది" అని యామె పలికెను.

"ఇపుడెవరికై బెంగ?" యని సాహసించి యడిగితిని.

"నేను బెంగ పెట్టుకొనఁదగినవా రెవరున్నారు? దేనియందు మనకెక్కువ ప్రేమయుండునో దాని యెడబాపువలన బెంగవచ్చును. నాకట్లు ప్రియమైన దేమున్నది? నన్నట్లు ప్రేమించువా రెవరు? కాని నేఁ డెందువలననో, నాకుఁ దోఁచకున్నది."

"నిన్నుఁ బ్రేమించువారందఱు నీతోఁ జెప్పియే ప్రేమింతురా, శశిరేఖా? మీయింటిదగ్గఱనుండి యుత్తరములు వచ్చుచున్నవా? అందఱు క్షేమముగ నున్నారా?"

"ఆ. నాలుగురోజులైనది, అందఱు కులాసగనే యున్నారు."

"పొరుగూర పూఁటకూళ్ల యిండ్లలో నుండుట కలవాటు లేకపోవుటచేతను మనబంధువులు కనఁబడక పోవుటచేతను దోఁచక యేదో దిగులుగా నుండును. కొన్ని దినములవఱకు నాకు నట్లే యుండెడిది. ఈచదువుగాని వెళ్ళిపోవలయు నను కొంటిని. ఇప్పు డిచ్చట బాగుగ నలవాటు పడితినిగాని."

"అదియు నిజమే, మాయూరిదగ్గఱవారు మీరొక్కరగపడుచున్నారు. మిమ్ములను జూచిన మావాండ్ల నందఱిని జూచినట్లే యుండును అయిన మీరనినట్లు నాకీ చదువేల? నే నుద్యోగముచేయుదునా? ఇల్లెందులకు వచ్చితినో, తుదకు దైవ మేమిచేయునో?"

శశిరేఖకుఁ గలుగు చింతను మఱపించుట కామెను నేదో సంభాషణములోనికిఁ దింపఁగోరితిని.

"శశిరేఖా! నిన్నుఁ గూర్చుండఁబెట్టి దేవుఁడేమియు నీకై చేయువాఁడు కాఁడు. నీకుఁ గావలసినది నీవే చేసికొన వలయును" అని చెప్పితిని.

"మనము చేసెడి దేమున్నది? దైవము నుదుట నేమి వ్రాసెనో యది జరుగును."

"నీవు చేసికొనిన దానిఁబట్టియే దైవము నీ నుదుట వ్రాయునుగాని క్రొత్తగ నేవియుఁ గల్పింపఁడు. ఒకని మహారాజును జేసి యింకొకని దరిద్రుని జేయుటకు దైవమునకుఁ బక్షపాతమా?"

"దైవము చేయకపోవుచో నేనిపుడు మహారాణిని గావలెననుకొన్న నగుదునా?"

"అది నీపూర్వజన్మకర్మఫలమునుబట్టి యుండును."

"అంతయు మనకర్మను బట్టియే యుండుచో నిఁక దైవ మెందులకు?"

"దేవుఁడు లేఁడే యనుకొనుము. అతఁడుండి మాత్రము నీవు పాపకర్మ చేసినయెడల దానిని బుణ్యముగ మార్చునా? పుణ్యకర్మలను జేసినఁ బాపముగ మార్చునా? ఎవని యదృష్టమునకు వాఁడే కారణముగాని దైవమించుకయుఁ గాదు.

"మీరు పూర్తిగఁ బాశ్చాత్యభావములే చెప్పుచున్నారే".

'మన వేదాంతమును నిదియే. నీకర్మము, నీకర్మము అందురే, అదియే ఇది. మనకిదియొక్కటే జన్మముకాదు. ఇంతకుం బూర్వ మెన్నియో జన్మములు కలవుగద. ప్రతిజన్మములోను జేసిన కర్మ యాయా జన్మములలోనే యనుభవించుట లేదు. అది సంచితమై మీందటిజన్మములకు నిలువ యుంచుచున్నది. దాని ఫలితమునే యిపుడనుభవింతుము. విధి యిట్లు వ్రాసిపెట్టి నందుముగాని, అది మనము చేసికొనినదే. ఈజన్మములో ననుభవించు ఫలితము లెఱింగి, దీనికిం గారణమైన పూర్వజన్మకర్మలను మఱచుటచే ప్రస్తుతావస్థకుం గారణము లేదనుకొని, దైవమె యేర్పఱచెననుకొందుము."

"మనము చేసిన కర్మవలనే యీఫలితములు వచ్చుచో, మనమిపుడు చేయు కర్మలవలననే ఈ ఫలితములను ఏల మార్పలేము?"

"మార్చకేమి? కాని ఒక సంగతి: మనమిపుడనుభవించు ఫలితము ఒక్క జన్మములోం జేసిన కర్మది కాదని చెప్పితినే; అది యనేక జన్మలది. దీనిని మార్చుట కొక్కజన్మలో మనము చేయంగల్గు ప్రతిక్రియ చాలదు; సరిపడు ప్రతిక్రియ చేయంగల్గుచోం దప్పక మాఱును. ఇపుడొక మోటారుబండి వచ్చుచున్నదనుకొను. దాని కెదురుగ వెళ్ళి యెక్కువబలముతో దానికిం ద్రోయుచో నది యాగిపోవచ్చును. ఇంకను నెక్కువబలము ప్రయోగించుచో నది వెనుకకుం బోవచ్చును. మన ముపయోగించు శక్తి చాలదేని మన ప్రయత్నముయొక్క ఫలితము కనంబడ

కయే పోవును. జాతకముచూచి యొక్కొక్కప్పుడు జపములు చేయించుదురే. ఈజపబలమువలనఁ గీడు తొలఁగిపోయిననుబోవచ్చును.

"ఏమిజాతకము లెందు! ఒక్కటియు నిజము కాదు."

"అది నిజమగుటయు నబద్ధమగుటయు ననేకవిషయములనుబట్టి యుండును: చెప్పెడువాని సమర్థత, పంచాంగముల సిర్దుష్టము జన్మకాల యథార్థము."

"సరే! ఇవెప్పుడును సరిగనుండవు. నాయనుభవము వలననే నేను చెప్పఁగలను. ఇంకొక సంగతి: మనకర్మలవలననే మనజీవిత మేర్పడుచున్నదనుచున్నారుగద. జాతకములో వ్రాయఁబడినదానికంటె వేఱొకలాగున ప్రవర్తించుటకు మనకు సాధ్యము కాదా ? అట్లగుచో నిఁక జాతకము లేల? కానిచో నిఁక మనకర్మ ప్రభావమేది ? మన ప్రయత్నమువలన లాభమేమి ?"

"శశిరేఖా! ఇట్టివిషయములన్నియుఁ దర్కము అనుమానములను బట్టియే చెప్పవలయునుగాని కన్నులారచూచి, పరిశీలించి చెప్పెదమన్న సాధ్యపడునవి కావు. నాకుఁదోఁచినది చెప్పెదను; విను: నీవేమిచేయునదియు నేమగునదియు గ్రహములు నిర్ణయింపవు. అవి సూచించును. గతజన్మములందుఁ గావింపఁబడిన కర్మకొంతయు, నిప్పటిజన్మములోఁ జేయుకార్యములును గలసి ఈజీవితమును నిర్ణీతముచేయుచున్నవి. సంచితకర్మ యందలి యేభాగము వర్తమానజన్మములో ననుభవింతుమో,

ఏభాగము ముందుజన్మలకై నిలవయుండునో, దానిని నిర్ణయించుశక్తి మనకు లేదు. జాతకము పూర్వపుకర్మలవలనఁ గలుగు ప్రవృత్తినే యెఱుకపఱచును నీ యిష్టమువచ్చినట్లు వర్తించు స్వాతంత్ర్యము నీకు సహజముగనే యుండునని చెప్పితిని గదా; ఈ సహజశక్తిని వినియోగించుటయు మానుటయుఁ గూడ నించుక పూర్వకర్మమునుబట్టియే యుండును. ఈశక్తి యుండుట వలననే పూర్వకర్మచే నిర్ణీతమైన మార్గము మార్చుట సంభవించుచున్నది. ఏవిషయములలో నట్టిమార్పు చేయ యత్నింపవలెనో యెఱుంగుటకు జాతకమును దెలిసికొనుట ముఖ్యమగుచున్నది.”

“జాతకమును దెలిసికొనకపోవుటయే మంచిది. నిజముగఁ దెలిసినచో సగముమందికి బెండ్లిండ్లే కావు.”

“ఎఱుఁగక చేసికొని ఖేదపడుటకంటెఁ జేసికొనకుండుటే మంచిదిగద.”

“అవును; అవును కాని మనవా రట్లు చేయరో, ఒకవేళ తెలిసియుండియుఁ దెలియనియట్లు నే వర్తించెదరో ?”

“మనవారిసంగతి నాకుఁ జెప్పకు. మన యాచారములెన్నియో మార్చివేయవలెను ఇట్లిదివఱకే చెప్పువారు చాలమంది గలరు, కాని ధైర్యముపూని చేయువాఁడొక్కఁడును లేఁడు నేను మాటలతోఁగాక, క్రియలోనే మార్పుచేసి చూపింపఁ దలఁచుకొంటిని. శశిరేఖా, నీవు చదువుకొనినదానవు! నీవు చేయఁగల్గిన సంస్కరణము లెన్ని లేవు? చదువు

కొనని స్త్రీలచే నెంత స్వల్పమైనదానినైనఁ జేయించుట యసంభవమే. నీవంటివారు చేయకపోవుచో నిఁక మనదేశమునకు ముక్తియే లేదు."

"నే నేమి చేయఁగలనండి?"

"అట్లనెద వేమి? ప్రతివారు సిగ్గేయుచుచో చేసెడివారెవరు? నీవితరులకు మార్గము చూపింపఁగల్గిన విషయము లనేకము లున్నవి. నీవు చేయుదానికిఁ జనువుకొనిన వాఁడెవఁడును నాక్షేపణము చేయఁడు."

"మగవారే చేయవలయును గాని స్త్రీ లేమిచేయఁగలరు?"

"మగవారు స్త్రీలగుప్పిటనే యున్నారు మగవారు చేయలేకపోవుట స్త్రీలమూలముననే. బందరులోను, బెజవాడలోను నందఱు సంఘసంస్కర్తలున్నారు! దశదిశలు మారుమ్రోగున ట్లుపన్యసింపఁ గలవారు! తమ కుమార్తెలకుఁ దొమ్మిదవయేఁడు రాకుండనే పెండ్లిండ్లు చేసిరి. వారి ముసలి తల్లి జీవించి యుండఁగనే చేయవలెనని యొకరు, వారి యాఁడువారి బలవంతముచేఁ జేసితినని యొకరు, ఇట్లు చెప్పిరి. కాఁబట్టి స్త్రీలే సంస్కరణములు ప్రారంభించుచో నవి నిరాటంకముగ సాగును."

"సంస్కరణములనఁగనే సరియా, వానిని గ్రహించుటకు లోకము సిద్ధముగ లేనియెడల నెన్ని యిక్కట్టులు పడవలసివచ్చును? బాధువులైన నింటికివత్తురా? ఎమైనను స్వాతం

తుల్లైన పురుషులు దానిం బ్రారంభింప వలయునుగాని."

"శశిరేఖా, నీ కుచితమైన సంస్కారము నీవు చేయం బూనుచో నీకు సర్వవిధముల సహాయము చేయువారు లేక పోరు. సంస్కారణము లనునవి సౌకర్యములకొఱకు చేసికొను నవేకాని యిడుములు పడుటకుం గాదుగద! నీవు నిజముగం దలం చితివా నా సర్వస్వమును నీయాధీనము చేసెద." అని గంభీర ముగం బల్కితిని. ఆమె యేమి ప్రత్యుత్తర మిచ్చునోయని యాతురతతో నుంటిని.

"ఏమో, దైవమెట్లు నిర్మించునో" యని, శశిరేఖ నా సంభాషణమును దప్పించుకొనుటకై, "పొద్దుపోవుచున్నది, పాఠము మందరిక యొక్కతె యుండును, నేను వెళ్ళెదను" అని లేచెను. నేనును లేచి యామెతో వెళ్ళితిని మార్గమం దొకరితో నొకరు మాటాడుకొనలేదు. ఇరువురము ఆలోచనయందు మగ్నులమైపోతిమి నేను నా కార్యమునకు విత్తనము వేసితి ననుకొంటిని.

---

# 16

## సి నీ మా.

శశిరేఖ నన్నుం గలసికొనిన నాల్గుదినములకే వరుసగ మూడునాళ్ళు సెలవువచ్చెను. అప్పటికి విశేషముగం జదువ వలసిన పాఠములు లేవు రెండుదినము లెట్లో యామె పొద్దు పుచ్చెను గాని మూడవనాం డేమియుం బని కనంబడక, తోంచక

పోవుటచే నామె కథాసరిత్సాగరమును దీసి చదువ నారంభించెను. పొద్దుటఁ దొమ్మిదిగంటలకు భోజనముచేసి పుస్తకము చేతంబూని నరవాహనదత్తుని కథ చదువుచు నట్లే కూర్చుండెనుగాని మధ్యాహ్నము "టీ" కైనను లేవలేదు. ఆకథ యంత రసవంతముగను మనోహరముగ నుండుటచేతనే కాఁబోలు, ఆమె తదేకబుద్ధితోఁ జదివి యీ కథను ముగించెను. ఒక్కటి మాత్ర మామె ముఖముపైననే విశదమగుచుండె. ప్రారంభించినపుడున్న ముఖవికాస మామెకుఁ గథ ముగించినపుడు లేదు. ఆమె నేదో చింత యావరించుకొనియె. ఆమె చదివిన కథలో భర్తృదారిక ఎన్ని యిడుములు పడినను దుదకు నిజ మనోనాయకుని జేరఁగల్గెను. ప్రాణనాథుని సందర్శనమే యామె కష్టములను మఱపించినది. ప్రాణప్రియుని యనురాగమే యామెను ఆనందాబ్ధి నోలలాడించినది. ఆమెరూపము, యౌవనము నిజనాథునకు భోగ్యంబై సార్థకంబైనవి. ఉవితేశునితో ననఁగి పెనఁగియున్నపుడే నికుంజపుంజముల శోభయు, మల్లికా దామముల సౌరభము, మలయమారుతముల శీతలము, శుక పికారావముల మాధుర్యమును గోచరించు శశిరేఖకా, తన రూపలావణ్యములను జూచి యానందించు వారెవరు ? తన గుణవిద్యా సంపత్తిఁ జూచి మెచ్చుకొను వారెవరు? ఏలతాంగిని గాంచినను బురుషు నాశ్రయించి వాని స్కంధములపై నాని సుఖించునదియే ! శశిరేఖ నిండు యౌవనము నిరర్థకమై యడవిగాచిన వెన్నెలయగునే ? ఆమె మనమున నీవిచారకర

భావము లుదయించె. వయస్సుతో నామె శరీరమే కాకుండ హృదయమును వికాసము నొందుచుండె. పుష్పము వికసించి సౌరభమును వెదజల్లునట్లు హృదయము వికసించి రాగమును బహిర్గతము చేయుచుండెను. తదుద్గతరాగమును నాకర్షించు స్థానము లేనిచో, దానిని గ్రహించు నన్యచిత్తము లేనిచో, నది దానిని నుత్పాదించిన హృదయముపైఁ బడి దానినే శుష్కింపఁ జేయు. యౌవనరాగము ప్రబలాస్త్రమువంటిది. ఒక్కసారి విముక్తంబైన నది యాగదు; దానికార్యంబది చేసితీరు. ప్రయోగలోపంబుచే లక్ష్యంబును దాఁకనేరనినాఁడు ప్రయోగించిన యజమానునే గొట్టును. ఒక్కొకయెడ ఈరాగము గమ్యస్థానమును జేరలేక వికీర్ణమై క్షీణించును. ఈయౌవనరాగమా, ఝరీవేగంబునను హయుతరిశక్తితోడను వచ్చును. ఇదియుఁ బ్రవహించుట మొదలిడెనేని దీని గతిని దప్పించుటగాని దీని మార్గంబునకుఁ గూలంకషము లేర్పఱచుటగాని యసాధ్యము. కావుననే రాగోత్పత్తి సమయంబునకుఁ బూర్వమే, మనలో, నుత్పాద్యరాగంబునకు గమ్యస్థానంబు నేర్పాటు చేయు టాచారమయ్యె; తద్వ్యపగతరాగంబును ఆకర్షించి సంగ్రహించి ప్రత్యర్పించు హృదయమును వెదకి యుంచుట ధర్మమయ్యె. పాపము! శశిరేఖ కిట్టిది ప్రధ్వంసాభావమయ్యెను. ఆమెహృదయమును వ్యాకులమయ్యె. ఆమె యవస్థ తామెకుఁ జింతయయ్యె. ఆమెజన్మ నిరర్థకతకు దుఃఖమయ్యె. అయినను, శశిరేఖ తెలివిగల దగుటచే దానినిగన్పడనీయక యడంచియుం

కఁగోరెను. హృదయంబునం బుట్టిన రాగమును శుష్కింపఁ జేయుటకై, వైరాగ్యంబుచేఁ దపింపఁజేయఁ జూచెను; ఈసుఖములన్నియు మీసాలపైఁ దేనియలని యామె గట్టిగ ననుకొనెను గాని లోపల చిత్తము వేఱొకలాగునఁ జెప్పుచుండెను. ఆమెదృష్టినంతను భగవదాయత్తము చేయఁగోరి కథాసరిత్సాగరమును మూసి దూరముగఁ బెట్టి భాగవతము తీసెను. ఆమె తీసిన పత్రమందు,

"మ. లలనా యేటికిఁ దెల్లవాఱె రవి యేలా తోఁచెఁ బూర్వాద్రిపైఁ
గలకాలంబు నహంబుగాక నిసిగాఁ గల్పింపఁడాబ్రహ్మ దా
వలఁ బోఁడుం గృపలేఁడు కీరములు దుర్వారంబు లెట్లోకదే
కలదే మాపటివేళయుం గలుగునే కంజాక్షు సంభోగముల్.

"ఉ. ఎప్పుడు పొద్దుగ్రుంకు హరియెప్పుడు గోవుల మేపివచ్చు నా
కెప్పుడు తన్ముఖాంబుజ సమీక్షణమబ్బు నతండు వచ్చి న
న్నెప్పుడు గారవించుఁ దుదియెప్పుడు మద్విరహాగ్ని రాశికిం
జెప్పఁగదమ్మ, బోటి, కరుచేఁతల నుల్లము దల్లడిల్లెడిన్.

"మ. చెలియా, కృష్ణుఁడు నన్నుఁ బాసి వనముం జేరంగ నయ్యాక్షణం
బులు నాకన్నియునుండ, నంతఁగడు నాపూర్ణంబులై సాఁగి లోఁ
బలఁ దోఁచుం బ్రహరంబులై దినములై పక్షస్వరూపంబులై
నెలలై యబ్దములై మహాయుగములై నిండారు కల్పంబులై."

అనుపద్యములను జదివెను. వీనివలన శాంతి కలుగలేదు. మఱి కొన్ని పత్రములు త్రిప్పి యచ్చటఁ జదివెను.

ఉ. "నల్లనివాఁడు పద్మనయనంబులవాఁడు కృపారసంబు పైఁ
జల్లెడువాఁడు మౌళిపరిసర్పితపింఛమువాఁడు నవ్వురా
జిల్లెడుమోము వాఁడొకఁడు చెల్వలమానధనంబుఁ దెచ్చె నో
మల్లియలార మీపొదలమాటున లేఁడుగదమ్మ చెప్పరే.

"ఉ. అంగజుసైనఁజూడ హృదయంగముఁడై కరఁగించువాఁడు శ్రీ
రంగదురంబువాఁడు మధురంబగు వేణురవంబువాఁడు మ
మ్మంగజపుష్వుఁదూపులకు నగ్గముసేసి, లవంగలుంగసా
రంగములార మీకడకు రాఁడుగదా కృపనన్నుఁజూపరే.

"సీ. అడె నందనందనుం డంతర్హితుండయ్యెఁ
బాటలీతరులార పట్టరమ్మ
హేలావతులఁ, గృష్ణ, యేల పాసితివని
మ్మైలేయ లతలార యడుగరమ్మ
వనజాక్షుఁ డేపట్టికి వచ్చి డాఁగఁడుగదా
పూతమంజరులార చూడరమ్మ
మానినీ మదనుతో మాటాక యెఱిఁగించి
మాధవీలతలార మనుపరమ్మ

ఆ. జాతిసతులఁబాయ నీతియే హరికని
జాతులార దిశలఁ జాటరమ్మ
కదళులార పోయి కదలించి శిక్షింప
జూటుఁదెచ్చి కరుణఁ జూపరమ్మ."

ఈభాగవతపద్యములు చదువుట వలనను మనశ్శాంతి కలుగలేదు. చిత్తమునలేని వైరాగ్యము పుస్తకము చదివిన మాత్రాన నెట్లువచ్చు? పుస్తకమక్కడ పడవేసి చివాలున లేచి మనోభారమును దులిపివేసికొనఁగోరి "సుందరిగా, సినీమాకు వెళ్ళెదము వత్తువా? యని పిలచెను. సుందరిక శశిరేఖకంటెను మూడు వత్సరములు పెద్దది ఆమెయుఁ గళాశాలలోనే జదువుచుండెను. ఆమె సరేయనఁగనే, శశిరేఖ, దాసినిబంపి, జట్కా-

తెప్పించినది. శశిరేఖయు మాదరికయుఁ జల్లని నీళ్ళతో ముఖములు కడుగుకొని మాచిచీరలు కట్టుకొని బాడీయెక్కి వెళ్ళిరి.

అప్పుడు సినీమాలోఁగనఁబడిన కథ: ఒక రాజకుమారిక మంత్రిపుత్రుని వరించెను. ఆమెను మఱియొక రాజపుత్రునకిచ్చి వివాహము చేయుటకై తండ్రి యేర్పాటులు గావించెను. అంత రాజపుత్రియు మంత్రికుమారుఁడును గుఱ్ఱములెక్కి కోట దాఁటి యర్ధరాత్రిమందుఁ బాఱిపోయిరి. వారొక యడవిలోఁ జేరి వన్యఫలములను భక్షించుచు నవ్వుకొనుచు నొకరినొకరు కౌఁగలించుకొనుచు సంతోషముతో నుండిరి వీరినిజూచి మాదరిక యిట్లనియె! "ఓసీ, శశిరేఖా, చూచితివే, దీని వెఱ్ఱితనము? రాకుమారుని బెండ్లియాడి యంతఃపురములో నుండలేక ఈపాటులేల, చెప్పు?"

"నీకు పాటులువలెఁ గనఁబడునుగాని, ఆమె నవ్వుచున్నది, చూచితివా?"

"అందులకే వెఱ్ఱిదంటిని. దాసదాసీజనములు, హంసతూలికాతల్పములు, అన్నియు వదలుకొని అడవిలో నేమిసుఖమే?"

"దాని నడిగిరా, అది చెప్పును ఏమిసుఖమో?"

"దానినడిగిరా? దానినడుగుటేల? నీవు చెప్పలేవు? నిన్నడిగితిని?" అని శశిరేఖ సమాధానము చెప్పనందులకుఁ దెచ్చిపెట్టుకొనిన కోపముతోడను ఈప్రశ్నభావము ఈమెకుఁ గలుగఁజేసిన నవ్వుతోడను బలికెను.

"అసుఖమేమో చెప్పుటకు నీకును నాకును అదృష్టము లేదు. అది తెలియక వెఱ్ఱి మొఱ్ఱి యంచుము" అని యామె మాటిమాటాడకుండునట్లు శశిరేఖ సమాధానము చెప్పెను. వీరిట్లు సంభాషించుకొనుచుండఁగనే కథసాగుచుండెను. శశిరేఖకు ఇక్కడకు వచ్చినను మనశ్శాంతి లేదు. కథలో, రాకుమారికను బట్టుకొని దీసికొనివెళ్ళుటకై రాజభటులు వచ్చుచున్నారు. వారిని జూచి మంత్రికుమారుఁడు రాజపుత్రిని దన గుఱ్ఱముపై నెక్కించుకొని గట్టుల వెంబడి పుట్టల వెంబడి పరుగిడుచుండెను. వారిం గాంచి శశిరేఖ, "మందరికా, ఇందాక, పాట్లు, అంటివి ఆమంత్రికుమారునివలె నిన్నుఁగూర్చి కష్టముల కోర్చువాఁ డొక్కఁడున్నాఁడా" ? యని యడిగెను.

"బాగు, బాగు, శశిరేఖా, నీకోరిక అదియా? నన్నుఁగూర్చి యెవ్వరికిని గష్టము కలుగనేకూడదు. చేతనగుచో నే నొకరి కుపకారము చేయఁగోరుదును గాని నామూలమున నొకరు కష్టపడవలయునని కాదు".

"అబ్బ! ఏమి దయార్ద్రబుద్ధియే ! పోనీ, నీవలన సుఖపడిన దెవరు ?" అని శశిరేఖ నవ్వెను. మందరిక, తనకంటెఁ జిన్నదగు శశిరేఖచేతనే పరిహాసింపఁ బడియె. ఈమె ప్రశ్నకు సమాధానము చెప్పలేక "శశిరేఖా ! నీవు సినిమా చూచుటకు వచ్చితివా! కబురులు చెప్పుటకువచ్చితివా ?" యని మందరిక ప్రశ్నించెను.

"సినిమా చూచుచుఁ గబుర్లు చెప్పుటకు వచ్చితిని.

యన్నమాటాడిన నీకంత యులుకెందులకు?"

"నాకు ఉలుకులేదు. నావలన నీకించుకైన సహాయము కలుగుచున్నదిగదా! అదియే నాకుఁజాలు. తనను మాలిన ధర్మముండదు కద! మనస్త్రీజాతిని మానుకొని పరజాతిని సుఖపెట్ట యత్నింపనేల? పోనీ, నావలన నీకుఁ గష్టమే కలుగుచున్నదందువా? నీమొదటిప్రశ్నకు జవాబు నీవే చెప్పఁ కొనవచ్చును."

ఇప్పటికి సినీమాకథలో మంత్రికుమారుని రాజభటులు పట్టుకొనిరి. వారితో మంత్రికుమారుఁ డొక్కరుఁడు పోరి వారినోడించి పడద్రోసెను. వారిలోఁ గొందఱు పాఱిపోయిరి. రాజకుమారిక తనవల్లభుని గాఁగలించుకొనియె. అప్పుడు సినీమా చూడవచ్చినవారు చప్పటులు కొట్టిరి. శశిరేఖకును నానందమయ్యెను. కాని తన సంతోషము కప్పిపుచ్చఁగోరి ఇట్లనియె.

"ఎవరికే యీచప్పట్లు? మందరికా, తెరమీఁద బొమ్మలు వినవచ్చినవా?"

"రాజుగారి కుమారిత యదృష్టమునకు మనమందఱము సంతోషించుచున్నామని చప్పట్లు."

మందరిక మొదట "పాట్లు" అని యాక్షేపణచేసిన దానినే యిప్పుడు పరమసంతోషమనియు నదృష్టమనియు ననుచున్నది. శశిరేఖ తెలఁచినట్లే వచించినది. కావున నీమె యానందముతో నిట్లుపన్యసించె. "చూచితివా స్త్రీపురుషు లిరువు రానందముతోఁ గలసికొనుట ప్రపంచమంతయు హర్షించును.

దాని విశేషమే యది. మందరికా, నీవెన్ని చెప్పు! స్త్రీలేక పురుషుఁడు, పురుషుఁడు లేక స్త్రీయు, అసంపూర్ణమే కాని పూర్ణము కానేరదు; ఒక్క నేత్రము, ఒక్క కర్ణము, ఒక్క హస్తము, కలిగిన ప్రాణివలె నుండును. మఱియుఁ దరుణిలేనిలోపము తరుణియే తీర్పవలయును గాని పురుషుని వలనఁగాదు. కావున నే, మందరికా, ఈశ్వరుఁడు స్త్రీపురుష రూపములను ధరించెను. మనుజులలోనే కాదు, ప్రతి జాతిప్రాణులందును ఈభేదమును నీవి కలయికయుఁ గలదుగద ! మృగములను, ఋషులనే గాని యన్యముచూచి యెఱుఁగని ఋశ్యశృంగుఁడును వనితలచే నాకర్షింపఁబడలేదా?" ఈమె యుపన్యాసమునకు మందరిక యీశ్లోకమునే ప్రత్యుత్తరముగఁ జదివినది.

శ్లో॥ "నారీ స్తనభర నాభిదేశం దృష్ట్వామా గా మోహావేశం
ఏతన్మాంసవసాదివికారం మనసి విచింతయ వారం వారం!"

"మందరికా నిన్ను నీవే నిరసించుకొనెద వేమి ? లేదా, నీవు చదివినశ్లోకమున కర్థము నీకే తెలియదా ? నాకంటెఁ బెద్దదానవు నిన్నట్లనఁగూడదు గాని".

"నన్ను నేను నిందించుకొనను లేదు. ఆశ్లోకార్థమునాకుఁ దెలియకపోను లేదు. దానిం జెప్పినది మగవాఁడు గనుక మనలనుగూర్చి చెప్పెను. నాకే శ్లోకము లల్లుటవచ్చునేని నేను పురుషునిగూర్చి యట్లే చెప్పెదను. పోనీ, ఇట్లని యెద:

ఆ. వె. పురుష బాహుయుగము పొలుపారు వక్షంబు
గాంచి భ్రిమలు చెంది కలఁతపడకు
మవియు మాంసభేదమైయుండు తెలియఁగుము
విడుము మోహము, సఖి, విడుము విడుము,

దీనికి సమ్మతించెదువా" ?

"అట్లు చెప్పఁదగిన యవస్థయొకటి యున్నదిగాని, సమ స్తప్రాయములకుఁగాదు. అట్లగుచో నది భగవత్సృష్టికి వ్యతిరేకమే యగును".

ఇంతలో మరలఁ జప్పట్లు వినిపించెను. శశిరేఖయు మందరికయుఁ దెరవంకఁ జూచిరి. మంత్రికుమారుని వక్షముపై రాకుమారిత యూనియుండెను. దీనినిజూచి శశిరేఖ శరీరము గగుర్పాటుచెందె. ఆమె మందరికను నానుకొని కూర్చుండెను.

"ఏమే శశిరేఖా ! నీవు నన్నానుకొంటివి ? ఇదేమె, నీశరీరమింత వేడిగనున్నది ?" యని మందరిక శశిరేఖ వీఁపు మీఁదఁ జెయ్యివేసెను.

"నాకు వేడిచేసినది తలనొప్పికూడ వచ్చినది. అది పోవునేమోయని యిటకు వచ్చితిని. నిన్నును రమ్మంటిని."

"ఈకథ చూచుటతోడనే నీకాం వేడి యెక్కువైనది!"

"ఏమె ! నీమాటలు ! కథ యేమిచేసినదిగాని, ఇక్కడ ఎక్కువ ఉక్కపోయుచున్నదే. అంతకంతకుఁ దలనొప్పి యెక్కువగుచున్నది."

"దీనికిఁ గారణము నాకుఁ దెలియునులే. కాని నేను

వంకాయలు కోసి తినరా ? వానికిమాత్రము ప్రాణము లేదా? మీరు తినునది మీరుతిందురు! మేము తినునది మేము తిందుము" అనెను మఱికొందఱు నావైపుచూచి, "అబ్బో బాపఁడు!" అనిరి. వారికేమి సమాధానము చెప్పుటకు నాకప్పుడు తోఁచినదికాదు. అవిద్యావిహీనులచేఁ బరిభవింపఁ బడితినను కొంటిని. నాకుఁ గోపమువచ్చినది. "భూమిదున్ని విత్తనములు నాటి నీరుపోసి పెంచిన వారికిఁ గష్టసుఖములు తెలియుం గాని యీ పెట్టనిపైరులను సంగ్రహించు సోమరులకు, నిష్కపటముగఁ దిరుగు జీవులదలలుగొట్టు క్రూరులకు, ఏమి తెలియును? మీతో నాకు వాదమేటికి" యని వారికి వినఁబడకుండఁ బలికి యచ్చోటినుండి దూరముగఁ జని యొక్కఁడను నొకచోఁ గూర్చుంటిని. జాలివలనను గోపమువలనను గల్గిన నాగుండె యదుటు ఎంతసేపటికో గాని తగ్గలేదు. వారు నన్నాడినమాటలు తలఁపోసికొంటిని. నిజమే. ఆకులకును గాయలకును బ్రాణమున్నది. మనము తిను ప్రతి దానికిఁ బ్రాణమున్నది-త్రాగెడు జలములో ప్రాణులున్నవి. పీల్చెడు వాయువులోఁ బ్రాణులున్నవి. ఎంత జాలి గలవారమైనను బ్రాణము లేని లోహములను దిని బ్రతుకలేము. ఒకప్రాణి మఱియొక ప్రాణిని భక్షించి బ్రతుకవలయు ననియే బ్రహ్మనిర్మించెఁగాఁబోలు! అట్టులైనచో నొకరిని నాక్షేపింపఁ బనియేమున్నది ?

అట్లని, దయమాలి, యెంతజంతువునైనఁ జంపవచ్చునా ? భూతదయ వలదా ? కాని వధ్యావధ్యప్రాణి నిర్ణయం

బెట్లు ? ఆత్మసంరక్షణాపేక్ష కలదానిని జంపక విడుచుటే యుత్తమమని నేఁదలఁచెదను. ఱెక్కలు రానిపిల్లలకు మేఁత తే వచ్చిన పక్షిని గొట్టఁబోవునపుడు వ్యాధుఁడు తన యాలుబిడ్డల యనురాగమును దలఁచుకొనెనా, దానిని జంపలేక పోవచ్చును. కాని యీతని యీయనురాగమే పరజీవులపట్లఁ గ్రౌర్య మునకుఁ గారణమగుట చిత్రము.

ఇట్లు నేను తలఁపోయుచుండఁగనే శశిరేఖవచ్చెను. ఆ నాఁడామె పరిధాన మత్యంత రామణీయకముగనుండెను. ఆమె ముఖమునదోఁచు మందహాసచంద్రికలు నాకానందము కలిగిం చెను. ఆమె చిఱునవ్వుతో "ఓహో సోమేశ్వరా ! అప్పుడే వచ్చితివే" యనియెను.

"నీవు వచ్చెదనంటివి గద ! నీవు వచ్చునప్పటికి నేనుం డనియెడల నీ వేమనియెదవో !"

"అంత గౌరవమా నాపై ?"

"కాదా మఱి?"

"ధన్యురాలనే !"

నే నిచ్చిన ప్రత్యుత్తరము శశిరేఖకుఁ దగినట్లు మృదు వుగ లేదనుకొని విచారించితిని. అంతవఱకు నామనస్సు కలఁత చెందియుండుటే నేనట్లు పల్కుటకుఁ గారణమయ్యెను. నా మాటల మోటుదన మామె జ్ఞాపకముంచుకొనకుండుటకై నేను వెంటనే, శశిరేఖా! కూర్చుండుము. క్షేమముగ నుండుచుం టివా ? యనిమెల్లగ నడిగితిని.

"మీ దయవల్ల నాకు క్షేమమే. కాని ఈమధ్య మీ దర్శనము లేదేమి ?"

"నీకు నే నగపడుకునా శశిరేఖా? అగపడినను నన్నుఁ జూచెదవా ?"

"ఏమిచూచుకొని గర్వింతునని మీయభిప్రాయము ? మీరు దసరా సెలవులలో వెళ్ళెదరా?"

"నీవో".

"నేనా, ఒక్కొప్పుడు ఇక్కడనే యుండవలెనని యుండును. ఒకప్పుడు ఇంటికి వెళ్ళ బుద్ధిపుట్టును. మీరో?"

ఆమెప్రశ్నకు వెంటనే యుత్తరము చెప్పలేకపోయితిని. అప్పటి కింకను దసరా పది దినములుండెను. మాపద్మకుమారుఁడు అప్పటినుండియుఁ బ్రయాణమునకు సర్దుచుండె. పిలగుచో సెలవుల కొకదినము పూర్వమే యతఁడు వెళ్ళఁగోరుచుండెను. వంటపూటి యింట నుండు టేల? ఇంటికి రమ్మని యతఁడు నాతో ననుచుండువాఁడు. అప్పుడప్పుడు వెళ్ళవలెనని యెయచుకొనుచుంటిని. కాని శశిరేఖను దలఁచుకొనినపుడుమాత్రము నాకుఁ బాలుపోకయుండెడిది. ఇపుడో, శశిరేఖ ముఖజ్యోత్స్నము నాపైఁ బ్రత్యేకముగఁ బ్రసరించుచుండెను. ఆమె నెట్లు వీడిపోఁగల్గుదును? "మందారమకరంద మాధుర్యమునఁ దేలు మధుపంబు వోవునే మదనములకు?" అట్లు డోలాయమానమనస్కుండనై "శశిరేఖా నేను వెళ్ళుటను గూర్చియే యాలోచించుచున్నాను గాని యింకను నిశ్చయింపలేదు" అని ప్రత్యుత్తరమిచ్చితిని.

"అవును వెళ్ళిరావచ్చును. దానికెంతగావలయును?" అని ఆమె యిసుకలో ముగ్గులువెట్టుచుండెను. నేనామెవైపు చూచితిని. ఆమె చెక్కిళ్ళపై నాదృష్టినిలచినది. నాహృదయము నన్ను విడచి నాదృష్టివెంబడి యరిగినది. ఆమెను వీడి వెడలఁ జాలనని యెఱింగితిని. "శశిరేఖా! మాతల్లిదండ్రులను జూడ వలెనని యున్నది కాని వెళ్ళుచో రైలుఖర్చు విశేషముగ నగు నని యాలోచించుచుంటిని; అదిగాక నేనువచ్చి మూడుమాస ములేఁదయైనది!" అంటిని.

"మూడుమాసములలో నే బెంగపెట్టుకొనిరు గాని! అయినను రైలుఖర్చునకేమిలెండు, అది యెంతయగును!"

"అది యెంతయగునని సులువుగ ననియెదవు నీకేమి? ధనార్జనాభారము పురుషులదికద!"

నామాటలకు శశిరేఖ మందహాసముతో నిట్లనియె: "ధనార్జనా భారమిపుడే తోఁచుచున్నది కాఁబోలు. చదువు కొనునపుడే యిట్లుండుచో నిఁక మీరు నిజముగ సంపాదించు నపుడెట్లుందురో? అపుడు మీయింటికివచ్చి చూడవలెను; భోజన మైన పెట్టక పంపుదురు కాఁబోలు సోమేశ్వర! మీరు డబ్బునే చూచుకొనినారు కాని తల్లిదండ్రులయొద్దకు వెళ్ళుటకాదు కదా ఇంతయేన మీయాపేక్ష?"

"శశిరేఖా! ఎంతసొమ్మని మాతండ్రిగారిని బంపుమం దును?"

"అప్పనవును. ధనార్జనాభారమున్న పురుషులకుఁ బ్రేమ యెక్కడిది? అది లేని స్త్రీయుండదుగాని" అని యామె నా వైపు చూచెను.

"శశిరేఖా! ఆపేక్ష లేకపోవునా? ధనమును గూర్చి దాని నణఁచియుంచుకొనవలసి వచ్చును. కొన్ని యెడలఁ బరులకు వెఱచియు నణఁచియుంచుకొనవలసివచ్చును నీవు స్వజాత్యాభిమానమును బోనిచ్చుకొంటివి కాను కాని నిజమునకు దల్లిదండ్రులపైఁ బురుషుల కున్నట్లు స్త్రీలకుండనే యుండను. ప్రతి వనితయుఁ దల్లిదండ్రులనువదలి భర్తకడ కేగుచున్నది కాని తల్లిదండ్రులను విడిచి వెళ్ళిన మగవాఁ డొక్కని జూపింపుము." అని నేను గట్టిగా నవ్వితిని. ఆమాటలకు శశిరేఖ తలవంచుకొని "ఆపేక్షల తెఱం గెఱింగినవారు మీతో నే మాటాడఁ గలనా?" యని కొంతసేపూరకుండి "తుదకేమి నిశ్చయించితి" రని యడిగెను.

"ఎట్లును నిశ్చయింప లేకుండఁ జేసితివి; నేఁ జెప్పిన కారణమును బూర్వపక్షము చేయుదువు. నీవు చెప్పినది నేను కాదనలేను. నీవేమి చేయుదువో నేను నదియే చేసెదను. నీవే చెప్పుము;"

"మందరిక యిచ్చటనే యుండెదనన్నది. నన్నుఁ గూడ నాగుమన్నది."

"నేనుకూడ నిచ్చట నేయుండి హర్షవర్ధనుని గుఱించి పూర్తిగఁ జదివెదను".

"అవునుగాని ఇంతదాక దొరసామయ్యరుగారు అట్లు చెప్పి నారేమండి?"

"దొరసామయ్యరున కేమివచ్చును? జీతము పుచ్చుకొనుచున్నాఁడు గనుక గంటయంతయుఁ బూర్తిగఁ గూర్చుండును".

"ఈకళాశాలలో నిట్టివారి కుద్యోగ మెట్లిత్తురు?"

"ఈకళాశాలలోనే యిట్టిది సులభము".

"పెద్దతరగతులకుఁ జెప్పువారు ఆయావిషయములలో నిధివంటి వా రుండవలెను గాని సామాన్యులుండకూడదు".

"నన్నుఁ జెప్పుమన్నచో నింతకంటె బాగుగఁ జెప్పఁ గలను"

"మీరెక్కడ, మీ తెలివి తేట లెక్కడ !" అని శశిరేఖ మందహాసము చేసెను.

"శశిరేఖా నేనఁనగ నీకంత వేళాకోళము !"

"లేదండి; మిమ్ములనుగూర్చి నిజముగ నాకుండిన నభిప్రాయమును జెప్పితిని. అది తప్పుగావచ్చును" అని నవ్వెను.

దానికి నా కెట్టి సమాధానమును స్ఫురింపలేదు. ఆమె హాస్యమునకు నాకును నవ్వువచ్చి నవ్వితిని.

"ఇదివఱ కాయన చదువుకొని వచ్చుచున్నట్లుండెడిదే. ఈనాఁడదియుఁ గనఁబడదు" అని శశిరేఖ మాయుపాధ్యాయుని గూర్చి పలికెను.

"ఈయన ఇంకను బూర్వపు గ్రంథములలోని సంగతులే, ఆయన చదువుకొనిన కాలమునాఁటివి చెప్పుచున్నాఁడు.

ఇటీవలఁ గొన్ని యభిప్రాయములు మారిపోయినవి. నేనిపుడు చెప్పుచో గుర్రిద్దువచ్చి పిల్లను వెక్కిరించినదని పరిహాసము చేయుదురు గాని నేనే యొక్కసారి లండను వెళ్ళి వచ్చినచో ఇంక నేఁ జెప్పినదే వేదము."

"పోని వెళ్ళిరా రాదా?"

"నిజముగ వెళ్ళవలెనని యే యున్నది. శశిరేఖా, అది తరువాత నుద్యోగములకుఁ జాల లాభదాయకము. ఇంగ్లాండునుండి వచ్చినాఁడన నెంతో ఘనత! ఎంతో తెలివిగలవాఁడని! నీతోఁ జెప్పలేదుగాని యీసంవత్సరము పరీక్షయైన తరువాత బహుశః వెళ్ళుట తటస్థించును."

"నిజము?"

"నిజముగ. నీవు బడాయి అనుకొందువేమో కాని మొన్న పరీక్షలో నాప్రశ్నోత్తరములు చూచి అయ్యరుగారు తమ గదిలోనికిఁ బిలిచి యీవిషయములన్నియు నెక్కడ చదివితివని యడిగిరి. నన్ను ప్రథానోపాధ్యాయునికడకుఁ గొనిపోయి చెప్పిరి. ఈసంవత్సరాంతమందలి పరీక్షనుబట్టి నన్నింగ్లాండునకుఁ బంపుట నాలోచింతుమనిరి. ఈసంగతి నేనింకను నెవ్వరితోడఁ జెప్పలేదు. నీకడ ఏరహస్యమును దాఁచలేను కాఁబట్టి నీతోఁ జెప్పితిని."

"సోమేశ్వర, మీరు లండను వెళ్ళుటకు మీతల్లిదండ్రు లంగీకరింతురా?"

"అంగీకరింపకేమి? రెండేండ్లలోఁ దిరిగిరానా? ఈకళా

శాలకే యుపాధ్యాయుఁడనుగ వచ్చెదను."

"అపుడు మీయొద్దఁ జదువుకొనెదను లెండు!" అని యామె మందహాసము చేసెను.

"నేనుపాధ్యాయుఁడనగుదునని చదువుచుండెదవా?"

"మీ సహాధ్యాయిని మీకు శిష్యురాలయ్యెననిన మీకును గౌరవమే కద! అది మీకవసరము లేనిచో, ఇంతదూరమును వెళ్ళి యుపాధ్యాయత్వమునకా? ఒక కలక్టరుగ రాలేరా?"

"దొరసామిఅయ్యరు అట్లేయనెను. కాని నాకే విద్యావ్యాసంగము చేయవలెనని యున్నది. వెళ్ళినతరువాత నట్లే చేసెదనేమో; తిరిగి వచ్చుటతోడనే పెద్దయుద్యోగమగును."

"అవును."

"ఎందులకుఁ గాకూడదు శశిరేఖ, అయినవారెల్లరు దిగి వచ్చినవారా? నీవే చూచెదవుగాక నేను పెద్దపనిలో నుండఁగ; నాకు మేడలు మిద్దెలు నౌకర్లు చాకర్లు!"

"అవును, ఎందులకు కాఁగూడదు? అపుడుమాత్రము మీరు నన్ను మఱచిపోకుండ నుండవలయునుగాని!"

"నిన్ను నేను మఱతునా శశిరేఖ? ఒకవేళ దైవానుగ్రహమువలన నేనే యింగ్లాండుకు వెళ్ళుట కలిగెనేని నీవే మఱచిపోకుండ నుండవలయును గాని."

"సోమేశ్వర, నిజముగ మీరునన్నుఁ దలఁచుచుందురా?" అని యామె యెందువలననో దీనముగఁ బలికెను.

"శశిరేఖా ! ఇక్కడ కూర్చుండి చెప్పుచున్నాను విను: ఎంతకష్టము రాని ఎంతసుఖము రాని నిన్ను మాత్రము మఱువ లేను."

"మీకెప్పటికిని గష్టములు రావు సోమేశ్వర. మీహృదయము మంచిది. మీరు అభివృద్ధి చెందెదరు; ముమ్మాటికి వృద్ధి గాంతురు. దానివలన నాకును సంతోషమే. అని యామె యర్ధనిమీలితలోచనయై తలవాల్చి యూరకుండెను. ఆమె స్వరమునం దేదో దైన్యము తోఁచె. ఆమెపై నాకు జాలికలిగె. నేనును గొంతసేపు మాటాడలేకపోయితి; "శశిరేఖా చీఁకటి పడుచున్నది. ఇఁక వెళ్ళుదమా" యంటిని. ఆమె లేచెను. మే మిరువురము మాగృహములకై వచ్చితిమి. శశిరేఖను ఆమె యింటికడ విడచితి. త్రోవలో మే మొకరితో నొకరు మాటాడనుకొనలేదు. ఆమెలో నామె యేదో యాలోచించుచుండెను. నాకును నేవో తలంపులు కలుగుచుండెను. అట్లే నాగది చేరితిని.

---

## 18

### అనుమానము.

మాకు దసరా సెలవు లిచ్చిరి. శశిరేఖ చెన్నపట్టణము లోనే యుండునని చెప్పుటచే నేనును అచ్చటనే యాగితిని. పద్మకుమారుఁడు సెలవుల కొకదినము ముందుగనే వెళ్ళెను. నేను దసరాలోఁ జెన్నపట్టణమందే యుండునని మాతండ్రిగారి

కుత్తరము వ్రాసితిని. నాయుత్తరము చేరిననాఁడే చతురిక మాయింటికి వెళ్ళెను. అచ్చటజరిగిన సంభాషణము మీకు సవిస్తరముగాఁ దెల్పెదను. చతురిక వెళ్ళునప్పటికి మాయమ్మ చాకలివానికి అన్నము పెట్టుచుండెను. నాసతి గదిలోఁగూర్చుండి భారతము చదువుకొనుచుండెను. ఆమెయొద్దకుఁ జతురిక వచ్చి "ఏమో ! వదినే! పండుగకుఁ బుట్టింటికి వెళ్ళలేదా ?" అని యడిగెను. ఈమాటలు విని నాసతి తలయెత్తి చతురికను జూచి పుస్తకము చాపమీఁదఁబెట్టి యామెను గూర్చుండుమనెను. చతురిక కూర్చుండి, మరల, "ఏమో, దసరాకు వెళ్ళలేదా" యని యడిగెను. నాసతిని బ్రశ్నార్థకముగాఁ జూచుచు "వెళ్ళలేదా" యని యడుగుటలో "నీవు వెళ్ళకుండుటకుఁ గారణమేమ"ని చతురిక భావమై యుండవచ్చును. నాసతి "వెళ్ళలేదు" అని మాత్రము ప్రత్యుత్తరమిచ్చెను. మరల, "మీవారలు పంపుమని యడుగలేదా" యని చతురిక యడిగెను.

"అడుగకేమి?" పండుగకుఁ బంపుమని యడుగని పుట్టింటివా రుందురా? కాని అడిగినపుడెల్ల వెళ్ళుటకు వీలగునా ? యని నాసతి సమాధానముచెప్పెను. దానితోఁ జతురిక ఊరకొనలేదు. ఇంకను బ్రశ్నించె:

"ఏమి వీలుకాక ? మీయాయన ఇచ్చటలేరు కూడఁ గద."

"నా కిక్కడ నున్నను అక్కడ నున్నను ఒక్కటే. అత్తింట నుంటినని పనిచేసి యలసిపోవుటలేదు; అంతపనియు

మాయత్తగారే చక్కఁబెట్టుకొందురు." అని నాసతి యత్తగారి యందు గౌరవముంచి పలికెను.

ఆమాటకు "అదృష్టవంతురాలవు. నిన్నుఁ గూర్చుండఁ బెట్టి చేసెడివా రున్నారు." అని చతురిక వచింపఁ, దానెన్నడు పనిచేయునట్లు యీమె తలఁచెనని నాసతి యూహించి "నేఁ జేయఁదగినపనులు నేను చేయుచునే యుందును. పనులు చేయుట నాకు మొదటినుండి యలవాటే. నేనంత సుకుమారినిగాను," అని పలికి, "నీవు మీ యాఁడుబిడ్డను దీసికొని రారాదా? నీకుఁ జాల సహాయముగ నుండును" అనియడిగెను.

"చాలు చాలో, వదినె! ఈమాత్రమైన సుఖము లేక పోవుటకా?" యని చతురిక పెదవి విఱచెను ఈమె భావము, నాసతి, ప్రియంవదకుఁ దెలిసినది కాదు "రెండు పూటలు, వంట, పైపనులు, ఆవిడ చేయుచుండఁగ మీరు చేయించుకొన లేకనా?" యని యామె యడిగెను. ఆప్రశ్నకుఁ జతురిక యిట్లు దీర్ఘసమాధానము చెప్పవలసి వచ్చె: "ప్రియంవదా! ఆవిడ, అన్నిపనులు చేయును గాని లేచినది మొదలు పడుకొనువఱకు నెందులకో యందులకు సతాయించుచునే యుండును. లేచినఁదప్పు, కూర్చుండినఁదప్పు, మాటాడినఁదప్పు, మాటాడకుండినఁదప్పు; ఇఁక ఆవిడతో నెట్లు చెప్పు? ఆమధ్య వీధిలోనికి మల్లెమొగ్గలు వచ్చినవి. ఒక యణా పెట్టి యొకవంద కొంటిని. దానికి సణిగినది, సణిగినది, ఏమి చెప్పను? మగవీరులని, మగనిసంపాదనంతా నాచేతిలో వేయు

మాదునని!! ఒక్కమాటగాదు, ఒక్కపలుకుగాదు. ప్రియంవదా! ఒక్కఅణాపెట్టి మల్లెమొగ్గలైన కొనుటకు నాకు లేదా? ఇపుడు రెండుపూటలు వంట అయిననైనది కాని, పోరు లేకుండ ప్రాణము సుఖముగ నున్నది.”

ఇంతయు విని ప్రియంవద “మనము గడుపుకొనుటలోఁ గూడ నున్నదిలె మనము మంచితనముగనుండి పెద్దవాండ్ల యొకఁ బెద్దతికముంచి మసలుచో” అని చెప్పుచుండెను. ఆమె మాటకుఁ జతురిక అడ్డమువచ్చెను. తన యవిధేయతను, అత్త, యాఁడుబిడ్డలందు ఆమె చూపు నిర్లక్ష్యమును నుగ్గడించుచున్న దనుకొని “నీవింత నేర్పరివి గనుక నీవు గడుపుకొనఁగలవో! అయిన నూ ఆఁడుబిడ్డ మీాయత్తగారివలె మెత్తనిది కాదు” అని పలికెను. మఱియు ఈ ధోరణిమాని “ప్రియంవదా, మీా యింటిలోఁ బూజ లారంభించిరా” యని యడిగెను. లేదని ప్రియంవద చెప్పె.

“మూలా నక్షత్రము నాఁటినుండి ప్రారంభించెదరా?”

“అదే మాయత్తగారన్నారు. నీవు ప్రారంభించినావా యేమిటి?”

“లేదో. నేను అసలు పూజలు చేసికొందునో లేదో యనుమానమే నాపూజకు వత్తి ప్రత్తిచూచుకొని కచ్చేరీ వేళకు వంటచేసి పెట్టుట సాగదు అయిన, ఏమి పూజలులే” అని చతురిక పెదవి విఱచెను. ఆమె యట్లేలనిరసించినదో ప్రియంవదకుఁ దెలియలేదు. “ఏలనఁగ?” అని యీామె చతురికను బ్రశ్నించెను.

"మనమింత నోమునునోచి మీఁదటి జన్మములోఁగూడ ఈ సంసారము ఈమగఁడే కావలయునని గద. పూజచేయక పోయినచోఁ బైజన్మములో నైనను మనమే మగవారముగఁ బుట్టుదు మేమో."

"నీ యా పురుషజన్మములో నీకు భార్యగ ఈ నీ భర్తగారే జన్మించునట్లు కోరుకొను" అని ప్రియంవద నవ్వెను. ఆమాటకుఁ జతురికకూడ నవ్వెను. "సరే! ఈజన్మములో నా వలన ఆయనకు ఆయనవలన నాకుఁగల్గిన సుఖము చాలకనా?" అనియెను.

"ఏమి, మీ సౌఖ్యమున కేమితక్కువ?"

"అందఱు మీవలె నున్నారనుకొనుచున్నావు" అని చతురిక పుస్తకమువైపు చూచి "అదేమిటి నీవు చదువు చున్నావు?" అని యడిగెను.

"ఇపుడే భారతము తీసితిని"

"ఏమిటి కథ?"

"సత్యభామ ద్రౌపదిని అడుగుచున్నది. భర్తలను నీయందత్యనురాగులుగఁ జేసికొంటివి; ఎట్లని."

"అవునో! సత్యభామ యొక్కడితోనే వేగలేకపోఁగ ద్రౌపది యైదుగురును బెట్టుకొని యెట్లు కాపురము చేసినదో?"

"రుక్మిణి యింటికిఁ గృష్ణుఁడు వెళ్ళినాఁడని సత్యభామకుఁ గోపమువచ్చినది కాని ద్రౌపదినిగూర్చి ధర్మార్జున భీమాదులు తమలోఁ దగవులాడుకొనలేదు చూచితివా? కాని, ఒక విశే

షమున్నదిలె. పాండవు లైదుగురు నిజముగ నొక్కటియే. ఒక్కయిందుకే యట్లైదుమూర్తు లయ్యేనట."

"అవియేమో నాకుఁ దెలియదుగాని, దేనినైన సహింపవచ్చును గాని పరస్త్రీని బ్రేమించెనన్న సహింపలేము"

"నిజమేలె. చక్కని భార్య యుండఁగఁ గూడఁ గొందఱు పరకాంతలను గూడుదురు; ఎందువలనో ? మన సువర్ణయందమున కేమితక్కువ చెప్పు? దాసిమగఁడు దానివైపే చూడఁడు."

"ఎందువలన నేమిటి ? తెలివైన భార్య యైనయెడల అట్టివి పుట్టకుండఁ జేసికొనవలయును. పుట్టినతరువాత, ఆబుద్ధి నాపుట బ్రహ్మాతరముగాదు. అందులకే, నేను ఊరిలో అమ్మలక్క లేమనుకొన్నను, మావారు సాయంకాలము ఏడుగంటలు దాఁటివచ్చినచో ఒప్పుకొనను, రాత్రి నాటకములలోనికి వెళ్ళనీయను. అంతగ మంచినాటకము వచ్చి గట్టిగఁ జూడవలెనందురా నన్నుఁ దీసికొని వెళ్ళుమని యందును."

"ఇంత అనుమానముతోఁ గాఁపురమేమిటి ? అయినను, కుబుద్ధి పుట్టకనే పోవలెనుగాని పుట్టుచో, నీవు పగ్గములువెట్టి కట్టిలాగిన మానుదురా ?"

"నేనంత కట్టుదిట్టముగ నున్నాను కాఁబట్టియే సంసారము సరిగ నిలుచుచున్నది. ఇంకొకటి! డబ్బువిషయములోఁ గూడ మనము జాగరూకత పడవలయును. మగవారిచేతికి డబ్బు అందనీయక పోవుచో భోగమువారి వలన భయము మనకుఁ గలుగదు."

"అబ్బో చతురికా ! ఇదివఱకు అత్తలు కోడళ్ళను గోడంటిగ్రనము పెట్టుట విన్నానుగాని భార్య భర్తను నింత బాధనముతో నుంచుట వినలేదు, దీనిపే రేమనవలెనో గాని."

"ఆరోజులు వెళ్ళినవో ప్రియంవదా ! కన్న తల్లిదండ్రులను వదలి వీరియింటికి వచ్చునది సుఖపడవలెననియా, చెప్పుదెబ్బలు తినవలెననియా ? ఎవ్వరేమనుకొనినా సరే, నేనింత చేయుచున్నాను గనుకనే సువర్ణ వలెఁ గాక నలుగురిలోను దలయెత్తుకొని తిరుగుచున్నాను."

"దానిగుణములును దగినట్లుగనే యున్నవిలే. అది తిరుపతికొండమీఁదకు వెళ్ళి తపసుచేసికొనునఁట, మొన్న నాతో ననినది. అంత సన్యాసిని లాగుంటే భార్యయేమిటి భర్తయేమిటి? ఇది భర్తను బ్రేమించి యతఁడు వచ్చునప్పటికి సంతోషముగ మాటాడుచున్నదా ? ముఖము దుముదుములాడుచుఁ గను బొమలు ముడివేసికొని తనకు సంబంధము లేనియట్లుండుచో నతఁడుమాత్ర మేమిచేయును ?"

"ఇంటికి రాక తనతో మాటాడక బోగముదానింటికిఁ బోయినవానిమీఁద నేమి ప్రేమయుండును, ఏమి ముచ్చటగ మాటాడ బుద్ధిపుట్టును ? దానితో నవ్వుకొనుచు మాటాడు వాఁడు చేసికొన్న భార్యను బల్కరింపలేఁడు ? అట్టివాని నింటికి రాకుండ వెడలఁగొట్ట వలసినదే."

"చతురికా ! మగవారు కచ్చేరిలోఁ బని చేసిచేసి విసిగి సాయంకాల మింటికి వచ్చునప్పటికి వారి మనస్సునకు

సంతోషము కలుగఁజేయుదువా మఱికొంత విసుగు పుట్టింతువా ? నీవు విసుగు పుట్టించుచో దానిని భరింపఁజాలక వారితో నెవరు సంతోషముగ మాటాడి ముదము కలుగఁ జేయుదురో వారిదగ్గఱకు వెళ్ళుదురు. భర్త చెడునడతకు భార్యయే కారణమనియు దానిఁ దప్పించుట కామెకే సాధ్యమగుననియు నాయుద్దేశము."

"ఏమిమాట చెప్పితివి ప్రియంవదా ? చేసికొనిన భార్యకు లేదుగాని, నీతియు జాతియు లేని వెలయాండ్రకుఁ బ్రేమవచ్చి సంతోషము కలుగఁ జేయుదురో ?"

"చతురికా ! వాండ్లకు అపేక్షకలదని నేనొక్కనాఁటి కనను. వారి దంతయు మోసమే, నటన; లోపల నేమున్నను బైకి నవ్వుచుఁ బ్రేమ యొలికిపడునట్లు వచింతురు. ఈ తియ్యని కబురుల కాశించియే వారిని జేరుదురు. సంతాపితహృదయులకు విశ్రాంతి కలుగఁజేయున దదియే. అంతమాత్రమైన చేసికొనిన భార్య సమకూర్చనియెడల, యెందులకు ? సరే, వారి పైమెఱుఁగులు చూచియుఁ గపటమధుర వాక్యముల వినియు వారివలలోఁ బడిపోవుదురు."

"అయినచో బోగమువారివలెఁ బ్రేమయున్నట్లునటింపుమనియా నీవు చెప్పునది. చాలు చాలో, వదినె మంచియాలోచనయే !" అని నవ్వెను.

"చతురికా! నీవు నవ్వనక్కఱలేదో ! నీకు నీభర్తపై నిజముగఁ బ్రేమలేనపుడు మొదటి నాల్గురోజులు నీవు నటించు,

తప్పు లేదు. అయిదవనాఁడు మీకన్యోన్యానురాగము పుట్టె దేమో నాకుఁ జెప్పు."

"అట్లే యగుచో ప్రతిబోగమువనిత, నాలుగుకాదు పది రోజులైన తరువాత నిజముగఁ బ్రేమించునందువా?"

"ఆసంగతులు మనకుఁ దెలియవు. కథలలోఁ జదివిన దానిఁబట్టి చూడఁగ కొందఱికి నిజముగ నొకనిపైఁ బ్రేమపుట్టును. కాని దానితల్లి అది పుట్టకుండఁ జేయును. డబ్బుకొఱకు వలపు చంపుదురు."

"డబ్బుకొఱకు కొందఱు మందులు కూడఁ బెట్టుదురో!" యని చతురికయనెను.

"నీ కా వెఱపు పోయినది కాదు. మందులు లేవు మాకులు లేవు."

"ఇట్టి యేమిటి? క్రిందటి వారమునాఁడు ఎఱుకలది నా కొక వేరిచ్చినది. అది నా కనుమానము కలిగినపుడు, అఱుగ దీసి, ఆయన కాలి బొటనవ్రేలికి రాయుమన్నది. దైవానుగ్రహమువలన ఆ యవసరము లేకుగాని, ఎప్పటికేమి బుద్ధిపుట్టునో యని కొని దాఁచియుంచితిని."

"నీవు నామాటనమ్మవు. నేనుగూడ పెద్దకాల మనుభవ మున్నదానను గాను కాని, ఇపుడే నీవు వచ్చెడుముందే, యీ సంగతి చదివితిని గావున చెప్పుచున్నాను: సత్యభామ యిట్లే యడిగినది ద్రౌపదిని, నీయందందఱు ననురక్తులై యుండిరి కదా యది" (అని ప్రియంవద భారతము తీసి.)

"తే. చరితము సెంపో మంత్రౌషధ వైభవంబో
సరసనైపథ్యకర్మ కౌశలమొ చతుర
విభ్రమోల్లాస రేఖయో వెలఁది నీ వి
శేష సౌభాగ్యహేతువు సెపుమ నాకు."

అని. దానికి ద్రౌపదికిఁ గోపము వచ్చినది.

"క. నను నిట్లు దుష్టవనితా
జనమునటులుగాఁ దలంప జను నే నీకున్
మనసొప్పదు పురుషోత్తము
వనితవు గాఁదగవు నీవు వనరుహానయనా !

"చ. అలయక మంత్రతంత్ర వివిధౌషధ భంగులఁజేసి యెంతయున్
వలతురు నాథులంట మగువా కడుబేలతనంబు దాన మున్
గలిగిన ప్రేమయుం బోలియుఁ గాని యొకంతను సిద్ధిఁబొంద ద
ప్పాలఁతుకతోడి మన్కి యహిపొత్తుగఁ జూచు విభుం డెటింగినన్."

అట్లు ప్రియంవద పద్యములు చదువుచుండెను.

ఆమె నాపి చతురిక "నా కీపద్యాలు బోధపడవుగాని నీవు చదివెడు వరుస బాగున్నదో, చిన్నప్పుడు సంగీతము నేర్చుకొన్నావా?" యని యడిగెను.

"నేను సంగీతము నేర్చుకొనలేదు. మాయూరిలో నేర్పెడు వారు లేరు. ఉన్నను మావాండ్లకంత శ్రద్ధయులేదు. అదిగాక మాది పల్లెటూరుగద; సంగీతము నేర్చుకొనిన ఆక్షేపణము కూడఁ జేయుదురు."

"నేర్చుకొనకపోయినను బాగుగనే పాడుచున్నావు."

"బాగో ఓగో, నాలుగుపద్యములు చదువఁగాఁ జదువఁగా ఏదో వరుస అలవాటుపడును. చెన్నపట్టణము వెళ్ళిన

ఈమూడు నెలలనుండి నాకు బొత్తిగ పనిలేదు. అందుచే నిల్లే తలచుచు చదువుచునే కూర్చుండుదును."

"దసరాపండుగకు రాలేదేమమ్మా?"

"మా మామగారు రమ్మని వ్రాసినట్టున్నారు. చదువు కొనవలెను, రానని జవాబు వ్రాసినారట."

"ఇప్పటినుండి యేమిచదువో? చైత్రమాసములోఁగద పరీక్షలు. మాఅన్నయ్య పరీక్షల ముందు ఏనెలయో ఏరెండు వారములో చదివెడువాఁడు."

"వారి చదువులసంగతి నాకుఁ దెలియదో. ఏమో, ఏమి చదువుకొనవలసియున్నదో."

"చెన్నపట్టణము మహాపట్టణముగదా, అందు వింతలు చూచుటకు ఆగినారో. ఆపట్టణాలు ఆవైభవములు చూచు చుండఁగ ఇల్లు మనము జ్ఞాపకముందుమా ?"

"నేను జ్ఞాపకముందుననియే నే ననుకొనుచున్నాను."

"నీగుండె నిబ్బరమే నిన్నుఁ గాపాడుచున్నదిలే. కాని, అటువంటి పట్టణములలో సాయంకాలము కొన్నివీథులవెంబడి వెళ్ళుటే భయమఁట. చాలమంది చదువుకొనుటకు వెళ్ళి పాడై వచ్చినారఁట. నిన్న మాఅన్నయ్యవారు చెప్పుకొనఁగ విన్నాను. అందఱు పాడగుదురని కాదు."

ఈవచనములు నాసతి చిత్తమును కొంచెము కదిపెను. అదివఱకెన్నడును నామె యెట్టిభయము లేకయుండెను. ఇపుడు మరల నేను దసరాకు వెళ్ళకుండుట కేమికారణమని యాలో

చించెను. ఆమె యాలోచించిన కొలఁదియు ననుమానము కలుగుచుండె. నే నింతకాలము సెలవు లిచ్చినను వెళ్ళకపోవుట కేదో భయంకర కారణము లేకపోదని నిశ్చయించుకొనెను. మరల చతురిక భారతముచదివి తన కర్థముచెప్పుమని కోరెను; కాని ప్రియంవద కుత్సాహము లేదు "చతురికా, అదివఱకు లేదు గాని, నీవు చెప్పినప్పటినుండియు నాకు భయముగనే యున్నది. సెలవులలోఁ గూడ రాకపోవుటకుఁ గారణమగపడదు. ఇంత కాలము నన్నుఁ దలఁపకుండుట చూడ నాకు భయముగనే యున్నది నే మఱువఁబడితినా యని." అని ప్రియంవద దైన్యముగఁ బలికెను. "నామాటలవలన బెంగపెట్టుకొనకు, నీ వదృష్టవంతురాలవు నీకేమి భయముండ"దని చతురిక ధైర్యము చెప్పెను గాని ప్రియంవదకు గుండెయదురు తగ్గలేదు. చతురిక వెళ్ళినతరువాత నట్లే తలపోయుచుఁ గూర్చుండెను. ఆమఱు నాఁటి నుండియే పూజ ప్రారంభించెను.

---

## 19

### పునర్వివాహాలోచన.

దసరాపండుగకై మాకళాశాలకు సోమవారము నుండియు సెలవులిచ్చిరి; దానికిఁ బూర్వము శనివారమును, ఆదివారమును గలసివచ్చినవి. ప్రయాణము కాఁదలఁచినవారు చాలమంది శుక్రవారము మధ్యాహ్నమే కళాశాలకు వచ్చుట మానిరి. శశిరేఖ చెన్నపట్టణములోనే యుండఁదలఁచుకొనెను

గాన నామె యథాప్రకారము నాలుగుగంటలవఱకుఁ గళా శాలలోనే యుండెను. ఆమె యింటికి వెళ్ళునప్పటికి గదికిటికీలో నుండి తపాలవాఁడు పడవేసిన యుత్తరముండెను. అదిచూచుట తోడనే తండ్రి వ్రాసినదని యామె యానవాలుపట్టెను. చేతిలోనున్న పుస్తకములను బల్లపైఁ బెట్టి కాలిజోడైన విడువక యే దాని నుత్సాహముతోఁ జదువఁ బ్రారంభించెను. కాని యాయుత్సాహ మంతలోనె యంతరించె. ఆయుత్తర మాబల్ల మీఁదఁ బడవైచెను. జోళ్ళు విప్పి కాళ్లుకడుగుకొనివచ్చి కుర్చీలోఁగూర్చుండి మరల నుత్తరము తీసి చదువ నారంభించెను.

"చిరంజీవియగు శశికి,

"రేపటినుండి నీకు సెలవు లనుకొనెదను. రేపే నీవు బైలుదేరి రావలయును. మీఅక్కయ్యకు తొమ్మిదవమాసము వచ్చినది. ఎన్నిసారులడిగినను దానిభర్త పంపననుచున్నాఁడు. అది ఒక్కర్తెయుఁ జేసికొనలేదు. మీయమ్మను బంపుటకును, ఇక్కడ ఇబ్బంది కలుగును, కాఁబట్టి నీవు రేపు బైలుదేరి కౌశాంబికి వెళ్ళవలయును. ముందు సెలవులలో నిక్కడకు రావచ్చును. ఇక్కడ మేమందఱము క్షేమముగ నున్నాము"

ఈయుత్తరము చదువఁగనే శశిరేఖ కనుబొమలు ముడివడెను. అందలి విషయములను గుఱించి యాలోచించుకొనుచుండెను. తానొక్కతెయె మాటాడుకొనుచుండెను. "అక్కయ్యను బంపకపోయిన ఆకష్టసుఖము లన్నియు నతఁడే చూచుకొనును. అంత పంపనివాఁడు తా నదుపాయము చేయలేఁడు?

అతఁడు బిగిసి, పంపకపోవుటయు, ఇక్కడనుండియు నక్కడ నుండియు వీరు వారు వెళ్ళి వారింటఁ జాకిరిచేయుటయునా ? తొమ్మిదినెలలది, తన కేమి పనిపాటలుచేసి పెట్టఁగలదు ? వాండ్లనే చేసికొనని, ఎట్లు చేసికొందురో, ఆకష్టసుఖములు మనస్సునకు నాటవలెను. నేనెందుకు వెళ్ళవలయును ?" ఆమె యిట్లనుకొనుచుండఁగ మందరిక వచ్చెను. ఆమె యీవచనము లస్పష్టముగ వినుటచే శశిరేఖ యేమనుకొనుచున్నదో తెలిసికొనలేక, "ఏమే, శశిరేఖ, నీలో నీ వుపన్యసించుకొను చుంటివి. నాటకములు వేయుట నేర్చుకొనుచుంటివా ?" యని యడిగెను.

"ఆ, నాటకముల వలెనే యున్నది మనపని !"

"ఏమే!"

"ఏమియు లేదు."

"ఏమె నాతల్లి అంతవిసుగుగ నున్నావు ?"

"మనబ్రతుకే విసుగు విసుగు, విచారము లేనివాఁడు కొత్తగాని !"

"ఏమివచ్చినదే, ఇపుడంత విసుగునకు విచారమునకును ?"

"మాఅక్కయ్యను మా బావగారు పంపించనన్నారఁట. నేను వారింటికి వెళ్ళి వారికిఁ జాకిరిచేయవలెనఁట. విన్నావా ?"

"నీ వెందులకు వెళ్ళవలెను ?"

"ఎందులకేమిటి ? మనము లోకువగనుక. నాకర్మ మట్లు కాలిపోయినది గనుక." అని శశిరేఖ కోపముతోఁ బలికెను.

"శశిరేఖా, అందుదానవుగద! పని చేయుటే తప్పటే! మీయక్కగారికి బావగారికిఁ జేయుచున్నగాని పరులకుఁ గాదు కద! అంత కోపమెందులకు?"

"మందరికా, నాకుఁగూడ నొకయిల్లు, కాఁపురముండుచో నన్ను వెళ్ళుమందురా? అంతవఱకు నెందులకు? మా అమ్మ వెళ్ళఁగల్గినదా? పనిపాటలు చేయుటకు బద్ధకించికాదు కాని, ఎవరియింటిలో వారుచేసికొనిన దానికిని బరాయిచోటఁ జేసినదానికిని భేదములేదా?"

"పోని, నీవుకూడ నొకయిల్లు కాఁపురము కల్పించుకొను నిన్నుఁగూడ వెళ్ళుమనరు" అని మందరిక నవ్వుచుఁబలికెను.

"మందరికా, నీకెప్పుడును వేళాకోళమే. ఇపుడు మా అక్కయ్యకు సహాయముచేయుట తప్పనిగాని చేయలేనని గాని యనను. నేను చెన్నపట్టణమునుండి వచ్చినమొదల నన్నుఁ బంపుమని మాఅక్కయ్యయో బావగారో మాతండ్రిగారికి వ్రాసియుందురు. లేదా మాఅమ్మయే వ్రాయించెనో యీయుత్తరము. మనవంటివారి నెంతచులకనగఁ జూతురో చూచితివా? నే ననునది దానిగుఱించి కాని పనిచేయ వలసి వచ్చినందులకుఁ గాదు. మనమే కాఁపురము చేయుచుండనీ, ఇట్లందురేమో."

"శశిరేఖా! భర్త జీవించియుండుటవలనఁ గలుగు మంచిలాభము నే కనిపెట్టితివో! ఎవరింటికి వెళ్ళి సహాయము చేయనక్కఱలేదు, వారేమన్న ననుచో మా వారు పంపినారు కారనవచ్చు!" అని మందరిక నవ్వెను.

"మందరికా, నీమాట లెప్పుడు నెక్కుడుతీరుగ నున్నవి. నీకంతయు నవ్వులాటవలె నున్నది"

"నవ్వ కేమిచేయుమన్నావో? మనలను నవ్వించేవారు లేరుకద ! మనలో మనము నవ్వుకొనఁగూడదా ? పోయిన సుఖము పోనే పోయినది. నవ్వుకొనకుండ నుండుటకూడ నెందులకు?"

"పోయినసుఖము పోవుటేమి ? మరలఁ దెచ్చిపెట్టుకొను" అని శశిరేఖ, మందరిక తన ననినమాటను, అప్పగించెను.

"మరలఁ దెచ్చిపెట్టుకొనఁ గల్గినయెడల ఈచెన్నపట్టణము వచ్చి యీకళాశాలలోఁ జేరి యిట్లింకను జిన్నపిల్లవలెఁ బాఠములు చదువుచుఁ గూర్చుందునా ? సరే గాని సముద్రపుటొడ్డునకు వచ్చెదవా" అని జేబురుమాలుతో ముఖము తుడుచుకొనుచు నడిగెను శశిరేఖ సరే యనియె దాసి గది యూడ్చి వెళ్ళినపిదప దలుపుతాళము వేసికొని సముద్రపుటొడ్డునకు బైలువెడలిరి. మార్గమునఁ గొంతసేపు ఒకరితో నొకరు మాటాడుకొనలేదుగాని, కొంతదూర మేగినపిదప,

"మందరికా ! నీ వెంతచదువు నేర్చినను అది నీలోపమును బూరించ నేరదు. వనితవగుటచేత నే నీకాశ్రయముకావలయును. చదువుకొని పండితురాలవైతివా అపుడును ఆశ్రయలోపమే కనఁబడును. "అనాశ్రయా న శోభంతే పండితా వనితా లతాః" అని శశిరేఖ వచించె.

"మనకు శోభ మొదటే లేదు. మాలక్కయ్య యింటికీ జెల్లెలింటికి వెళ్ళి పనిచేయకుండ నాబ్రతుకు నేబ్రతుకుచో నదియేచాలు."

"ఆశ్రియమున్నచో శోభ లేకపోవుటేమి ? మందరికా, లత తనకాశ్రియమగు వృక్షమును దానే వెదకుకొనుచుఁ బోవునుగాని వృక్షమొకటి దానిచెంతకు రాదుకద?"

"అది ప్రకృతియందు. కాని కృత్రిమోద్యాన వనములందుఁ బురుషులే లతల కాధారము చూపింతురు కద ! ఆ యాధారము నశించుచో దానితోఁ దీఁగెయు నశించును."

"మందరికా, లతలు లేక, కిసలయములు లేక, వృక్షములుమాత్రము శోభించునా ?"

"శోభించకపోవుచో వానిపైలతలను బ్రాకింతురు. నిర్మాణమంతయు వారి చేతులలో నున్నది. శశిరేఖా, వారెట్లు గావలసిన నట్లుచేయుదురు."

"అవునో ! మొదటినుండియు శాస్త్రములు వారిచేతులలో నున్నవి. లక్ష్మీదేవి బాలంభట్టుటీక వ్రాసినది. దానికిని మిగిలినదానికి నెంత భేదమున్నది! కాని పండితులు దీని నాదరింపరు. కారణమేమిటి ? ఇది వనితల పక్షముగ నుండుటే గదా."

"పోని, నీవిపుడు వ్రాయవే శాస్త్రవ్యాఖ్యానము."

"నావ్యాఖ్యానము ప్రకారము నీవు నడచుకొనెదననుచో వ్రాసెదను. లేనియెడల నే వ్రాసిన ప్రయోజనమేమి?"

"నీవు వ్రాసి ముందుగ నీవట్లు ప్రవర్తింపుము తరువాత నిన్ను నే ననుకరించెదను."

"సరే, వ్యాఖ్యానము చేయుటకుఁ బెద్దల యభిప్రాయముకూడ నెఱుఁగవలెను గద ! నీయభిప్రాయమేమిటి ? అనాథయగు వనిత మరల సంసారము కల్పించు కొనవచ్చునా?"

"ఎవరిష్టము వారిది."

"ఎవరిష్టము వారిదగుచో నిఁక నే వ్యాఖ్యానము వ్రాయుటెందులకే" యని నవ్వి, "పోని, నీయిష్టమేమిటి" యని శశిరేఖ యడిగెను.

అప్పటికి వారు సముద్రపుటొడ్డునఁ గొంతదూరము నడిచిరి. అచ్చటఁ దెల్లని యిసుక తిన్నెయుండెను. వారుదానిపై నెక్కి కూర్చుండినపిదప మందరిక యిట్లనియె. "శశిరేఖా నా యభిప్రాయ మడిగితివి గావునఁ జెప్పెదనువినుం ఈవిషయమును మన తాతలవంటివారే నిర్ణయించిరి. నామట్టుకు స్త్రీగాని పురుషుఁడుగాని, వివాహము చేసికొనకుండుట పాపమనియె."

"సరే! ఇది నాప్రశ్నకు సమాధానమును గాదు. మనకా పాపమును లేదు."

"నేను చెప్పెద, తొందఱపడకుము; మనవివాహములు వివాహములుగావు. మనము వివాహితులమని చెప్పుకొనుట సత్యము కాని సత్యము, లేదా అసత్యముగాని అసత్యము, చూచితివా, శ్రావణమంగళవారము కథలో జంగమొకఁడు పుత్రులులేని వనిత ఇచ్చిన భిక్షము పుచ్చుకొనలేదు."

"ఏమిటి? నీవు శ్రావణమంగళవారముల నోముకూడ నోచితివా?"యని శశిరేఖ యాశ్చర్యముతోఁ బ్రశ్నించెను.

"ఒకవారము నోచితినిలె. ఆకథలో శివుఁడే జంగము రూపమున వచ్చెను. ఒక యావిడను బిచ్చము పెట్టుమని కోరఁగ నామె బియ్యము తెచ్చెను. ఆజంగము పుత్రులు లేనివారిచేతి భిక్షను "హర, హర, అంటరాద"ని చనియెను. కాఁబట్టి జన్మ మెత్తినందులకు సంతానము పడయవలయును. సంతానము లేనిది బిచ్చము వేయుటకైన సర్వారాలు కాదు. సంతానహీనత అంత యపవిత్రమైనది. బ్రహ్మ యేమి చేసినాఁడు? సృష్టి పెం పొందించుకొనుటకుఁ దాఁ గనిన సరస్వతిని వివాహమాడినాఁడు. సృష్టిపెంపొందించుటకొఱకే కశ్యపుఁడు, ధర్ముఁడు, దక్షుఁడు మొదలగు వారిని బుట్టించినాఁడు. వివాహోద్దేశము సృష్టిని బెం పొందించుటే ప్రతిజంతువు, ప్రతివృక్షమును స్వజాతిని వృద్ధి చేయుటకు యత్నించును. అదియే యీశ్వరోద్దేశము."

"ఇచ్చటకు వచ్చి మూఁడు నెలలైనదో లేదో అపుడే నీకు ఈశ్వరోద్దేశము తెలియవచ్చినదే! పెద్దకబురులు చెప్పక నీయుద్దేశమేమిటో చెప్పు. తరువాత నీశ్వరోద్దేశము చూచు కొందము."

"నేను ఈశ్వరునిచేఁ బుట్టింపఁబడినదానను; నాకున్న యుద్దేశమును నీశ్వరునిచే నొసంగఁబడినదే, కావున నాయభి ప్రాయంబునకుఁ గారణ భూతమగుదానిని మొదటఁ జెప్పెదను వినుము."

"సరే, నీవు తార్కికురాలవు కూడన ? సరే, నీధోరణినే కానిమ్ము."

"సరే, విను : వివాహము చేయుట విధియనియు నవివాహితలుగ నుండుట పాపమనియు మన దేశములో బాగుగ నెఱింగిరి. అందువలననే ఆఁడుపిల్లలకుఁ దప్పకుండ వివాహము చేయుదురు. పిల్లలకు వివాహము చేయుట తల్లిదండ్రుల విధియనిరి. కాని వారు మ్రొక్కుతీర్చుకొనుటకు, బాధ్యత తప్పించుకొనుటకుఁ జేసిన వివాహములు, వివాహములు కావు. వివాహములు చేయకపోయిన నెంతదోషమో యిట్టి నామమాత్రి వివాహములు చేసినను నంతదోషమే. నీవు నిజముగ వివాహము చేసికొనక కన్యకగానె యుండఁగోరితి వనుకొను, కాని వివాహము చేసికొనకపోయిన నీశ్వరునిచే శిక్షింపఁబడుదువను భయముకలదు. ఆనెప్పిదము రాకుండ, నీకోరిక చెడకుండ, కాటికిఁ గాళ్ళుచాఁచుకొన్న నొక ముదుసలిని వివాహమాడుచో నది యేమగును ? ఇంతమాత్రముచే నీశ్వరుఁడు మోసపుచ్చఁబడఁడు."

ఈమాటలను వినుచు శశిరేఖచేతితో సినుకను నొకచో దిప్పుచు నొకచోఁ బోవుచేయు చుండెను. ఆమె వ్రేలికొకటి గట్టిగఁ దగిలెను. శశిరేఖ దానినిజూచి బైటకుఁదీసెను. అది యొక రంగురంగుల నత్తగుల్ల. దానిపైఁ జిత్రవర్ణము లెన్నియో గలవు. దానింజూచి ముచ్చటపడుచు శశిరేఖ "మందరికా చూచితివే యీనత్తగుల్ల ? ఎంతరమ్యముగ నున్నదో" అనియె,

దానిని మందరిక తన చేతంగొని "చూచితివా సృష్టిచిత్రి మిట్లే యుండును. ఇన్నిరంగు లెట్లువచ్చెనో" అనియె.

"దానికంటెఁ జిత్రము, ఇన్నిరంగులు దీని కెందుకు వచ్చినవో? దీనిలోపల నుండు పురుగు గుల్లపైనున్న రంగులు చూచుకొనలేదుగద !" యని శశిరేఖ మరల దానిని బుచ్చుకొని చూచుచుండెను.

"నీవు నేను చూచి సంతోషించుటకు" అని మందరిక బదులుచెప్పెను.

"నత్తగుల్లకుఁగూడ పరోపకారస్వభావమే కాఁబోలు. తనసంగతి తాను జూచుకొనకుండ మనకొఱకే రంగులు వేసికొనుచున్నది కాఁబోలు ?" అని శశిరేఖ మందహాసము చేసెను.

"శశిరేఖా, ఏమియు నెఱుఁగనట్లే పలికెదవే! నీవెంత యందముగా నున్నావో నీవెఱుఁగుదువా ? నీసౌందర్యము చూచుకొని నీవు సంతోషించుచున్నావా ? నీరూపము నీ యౌవనము చూచి సంతోషింపవలసిన వారు వేఱు. అట్టివారు కలరా నీయందము నీజన్మము సార్థకమగును; లేరా, ఇదుగో, ఈయిసుకలోఁ గప్పువడిన గుల్లవలెనే యుండును. పోని, సౌందర్యమును నీయిష్టము వచ్చినట్లు చేసికొందు నందువా, అది నీధనము కాదు. వేఱొకని కై నీయొద్ద దాఁచఁ బడినది. దానిని దుర్వినియోగము చేసితివా అదియు మహాపాతకము."

"ఇన్ని చెప్పినదానవు నీవేల వ్యర్థము చేయుచున్నావు?" అని శశిరేఖ యడిగెను.

"శశిరేఖా, దాని కెన్ని కుదరవలయును ?"

"కుదురుచో నీవు సార్థకము చేయుకువనియేనా ?"

"నీవు ప్రశ్నించితివి కాఁబట్టియు, నీకుఁగూడఁ దెలియుట ముఖ్యము కాఁబట్టియుఁ జెప్పుచున్నాను:

"తగిన నాథుఁడు కలుగఁడనియే నానమ్మకము. ఇపుడు మనము చదువుకొను చున్నందులకే మావెనుక మనలఁగూర్చి యెన్ని చెప్పుకొందురో నీవెఱుఁగవు. ఇఁక నిజముగ వివాహ మాడుచో బ్రతుకనిత్తురా ? పోని, గుణవంతుఁడగు భర్త యుండుచో లోకము నే మనము గణనసేయక పోదుము. పున ర్వివాహములు తగుననియే నానమ్మకము. కాని, వెనుకముందు లారయక యెవనినో యొకనిని జేసికొనుట తెలివితక్కువ. అది నిరంతరదుఃఖమునకే కారణము, దానిని గుఱించి నే నిదివఱకే తర్కించుకొంటిని. మనలో నీ యాచారమింకను వ్యాప్తి నొందలేదు. దాని నందఱును నిందసేయుదురు కావున సాంప్రదాయక కులమునఁ బుట్టినవాఁడు సాహసించి యట్టి దాని కొడంబడఁడు. దేనికైనను సిద్ధపడివచ్చిన ఆతతాయిని నమ్మిచో ఇఁక నది నరకమే"

"నాప్రశ్న కిప్పుడు చెప్పితివి సమాధానము. మందరికా ! నీవు చెప్పినది యూరకపోదు. నేనిఁక శాస్త్రవ్యాఖ్యానము వ్రాసెదు."

"వ్రాయుటయే కాదు; వ్రాసినట్లాచరింపవలయు; శశిరేఖా, నీవదృష్టవంతురాలవు కావచ్చు."

"సరే, నాయదృష్టము, చూచితివిగ! ఈరోజున ఉత్తరము వచ్చినది."

"సరే, దానికేమిలే. ప్రొద్దు పోయినది. ఇఁక వెళ్ళుదము" అని వారిరువురును దమగదులు చేరిరి.

నాఁటి రాత్రి శశిరేఖ యీవిషయములను గుఱించియే తనలోఁ దర్కించుకొనుచుండెను. మందరిక చెప్పిన కారణము లామెకు సంతృప్తికరముగ లేవు కాని కారణము లెట్టివైనను దనవంటివారికిఁ బునర్వివాహములు తగుననియే యామెకును దోఁచెను. ఈవిషయమై పెద్దలేమి చెప్పినదియు నెఱుంగఁగోరి వీరేశలింగముగారి వ్యాసములు రెండు చదివెను. దానితో నామె యభిప్రాయమే దృఢమయ్యెను. కాని యించుక సందియమును గలుగుచుండెను. "పునర్వివాహములందాక్షేపణ లేనియెడల నవి యనాచారము కాకపోవుటెట్లు? పైఁగ నవి గర్హింపఁబడుటేల? ఆచారమున కెక్కడిది? నల్గురాచరించుచో నదియే యాచారము. అప్పుడా యనాచారమే పరమధర్మమగును. మేనరికము శాస్త్రనింద్యము. కాని యది ప్రబలాచారము. ఒక్కటి యాచారమగుటకు నెప్పుడో యప్పుడు ప్రారంభముండవలెను. అది శ్రుతులవలె ననపౌరుషేయము గాదు. ప్రారంభించినవారికి నించుక క్లేశమయినను నగుఁగాక. పిమ్మట నదియే లోకాచారమగుచో నాక్లేశభారము సహింపవచ్చును. లోకము నన్ను

దూరముగఁ జూచినను ఆప్తబాంధువులు దూరముగఁ జూడరుగద. అట్లుగాక తల్లిదండ్రులుకూడ పుట్టినింటికి రానీయరా, అనుకూలుఁడగు భర్తయున్న పడఁతి పుట్టినింటికిఁ బోయియుండు టేల? కాని మందరిక చెప్పినట్లు తగిన భర్త లభించుటే యదృష్టము." అట్లు చింతించుకొని యెవ్వరున్నారా యని తా నెఱిఁగినవారిని మనమునకుఁ దెచ్చుకొనెను. శశిరేఖకు ఆశ కలుగక పోలేదు. తనకుఁ బరిచితుఁడే మిత్రుఁడైనవాఁడే యొకండు తలఁపునకు వచ్చెను. "ఆతఁడు బుద్ధిమంతుఁడు. వృద్ధిలోనికి రాఁగలవాఁడు ఇదివఱకతనితోడి సంభాషణమువలన నాతనికి సంఘసంస్కారాభిప్రాయములు గలుగుట తెలిసెను. కాని యీవిషయమున నాతఁ డేమనునో? చదువు కొనినవాఁడు స్వాతంత్ర్యముగ విమర్శించుకొనఁ గలవాఁడు, అట్టివాఁ డంగీకరింపకపోవుచో నిఁక నేమందు? ఆతని వచోధోరణి దలఁప నాయందు మక్కువ గలదని తోఁచుచున్నది. ఒకవేళ నాస్థితి నెఱుఁగఁ డేమో? లోకవృత్తాంతమువలె మాటాడుచు రేపే యాతని యభిప్రాయ మెఱుఁగవలెను," అనుకొని యెప్పుడు తెల్లవారు ననుకొనుచు నీవిషయమునే దలఁపోయుచు ఆరాత్రి గడిపెను.

# 20

## దసరాసెలవు.

మాకు దసరాపండుగ సెలవులు ప్రారంభమైనవి. నే నుదయముననే లేచితిని. సెలవులు పదునాల్గుదినములు నత్యానందముతో గడుప నిశ్చయించుకొంటిని. చదువుకొను వారికి సెలవు వచ్చిననే సంతోషము. పైఁగ నవి పండుగదినములు. శశిరేఖ, నన్నుఁగూర్చియే యని నేననుకొందు, చెన్నపట్టణములోనే యాగెను. ఏదోవిధమున ముదము వడయకుండ నొక్క నిమిషమునైన జరుగనీయఁ దలఁచుకొనలేదు. ఈ విశేషదినములలో ననుదినమువలెఁ గాక వేడినీళ్ళ స్నానము చేయఁగోరితి ; కాని దాసి వచ్చి నీళ్ళు కాచునప్పటికిఁ బ్రొద్దెక్కును ; స్నానము చేసినపిమ్మటనే కాఫీత్రాగుట మంచిది. అది శుచిగ నుండును; మనస్సునకుఁ దృప్తికరముగ గూడ నుండును. కాని ప్రొద్దెక్కి కాఫీత్రాగుటలో నానందములేదు. చలి చలిగ నుండఁగనే వేడివేడి కాఫీ త్రాగవలయును. వేడి నీళ్ళ సౌఖ్యము పోఁగొట్టుకొందునా, వెచ్చనికాఫీ సౌఖ్యము పోఁగొట్టుకొందునా? ఈసందిగ్ధావస్థయందు నాకేమియుఁ దోఁచినదికాదు. క్రిందటి సంవత్సరములోఁ జదువుకొనిన తర్కము నుపయోగించితిని. అయిదారు నిమిషములు పెనఁగులాడితిని కాని లాభములేకపోయె. నాయదృష్టవశమున నాకొక సంగతి జ్ఞాపకము వచ్చెను. పలుదేశములు తిరిగి వివిధవిషయములను

సంగ్రహించిన విద్వాంసుఁడు గావించిన యుపన్యాసము వింటిని. నేను చెన్నపట్టణములో నుండుటచేతనే దానిని వినఁ గల్గితిని గాని మాయూరనే యుండుచో ఆభాగ్యము నాకు లేకపోయెడిది. ఆయన చెప్పినసంగతి యిది: నవనాగరికులమని ప్రాచీనపద్ధతులను దూలనాడరాదు, దేశాభిమానులమని పాశ్చాత్యపద్ధతులను నిరసింపనురాదు. ఆ యీపద్ధతులను మేళవించి సమన్వయించి చరించుటే యుత్తమము. నాకును అట్లేతోఁచెను. ఈసంస్కారమును క్రియారూపకముగనే చూపించితి. ఉదయమునఁ జలిపోవకపూర్వము వేడికాఫి త్రాగితిని; పిమ్మట వేడినీళ్ళ స్నానముచేసి శుచిగ నిడ్డెనులు కాఫీయుఁ బుచ్చుకొంటిని, పిమ్మటఁ దాంబూలము వేసికొనుచుఁ గాళ్ళుజాపుకొని పడకకుర్చీపైఁ గూర్చుంటిని. తాంబూలము వేసికొనుచు సిగరెట్లు కాల్చుచో మఱిమఱి హాయిగ నుండునఁట కాని నాకా యలవాటు లేకపోయినది. ఆకుర్చీలోఁ గూర్చుండియే మా పాఠములకు సంబంధములేని యొక శృంగారనవలను దీసి చదువ నారంభించితిని. అందు నాయిక వర్ణింపఁబడినపుడు, ఆమె మాటాడునపుడు, ఆమెనుగూర్చి యితరులు ప్రశ్నించునపుడు, నాకు శశిరేఖ జ్ఞాపకమువచ్చెడిది. పుస్తకముచదువుట బాగుగ సాగుటలేదు గాని నాతలఁపులు పరుగులెత్తుచుండెను. నేననుకొనని లాభ మొకటి కలుగునని నాకు స్ఫురించెను; ఇదివఱకు నేను పెద్దపెద్ద పట్టణములందు వసింపకపోవుటచేతను నించుక పూర్వపద్ధతుల నాదరించు వంశమ్మున జన్మించుటచేతను మా

తండ్రిగారే నాకు వివాహము చేయుటచేతను బరకాంతలను బ ల్కరించు తెఱంగు ఎఱుంగకుంటిని. ఎప్పుడో యప్పుడు శశిరే ఖను నొక విషయమై పల్కరింపవలెను. అపుడెట్లు ప్రారంభిం చుటో నాకుఁ దెలియదు. అపరిచిత భాషణములలో నుండవ లసిన సొగసు ఔచిత్యము నాకుఁ దెలియదనియె నాభయము. ఈ నవలయందు నాయకుఁడు తనభర్తృదారికతోఁ బ్రథమమున నెట్లు పరిచయము చేసికొనెనో పరికింపఁగోరితిని. ఈయంశమును మనమునం దిడుకొని ఆ పుస్తకమునే మరలఁ బ్రారంభమునుండి చదివితిని. ఇందలి నాయికా నాయకులు వేఱొకరింట విందు నకు వెళ్ళినపుడు ఒకరినొకరు చూచుకొనిరి. వారి యాచార ముల ప్రకారము వచ్చిన యతిథులును గృహస్థులును గలసి నృత్తములు గావించిరి. అందు వీరిరువురును గలసి నృత్తము చేయుట తటస్థించెను. దానికిఁ బూర్వపు టేర్పాటేమియు లేదు; దైవము వీరి కూడికను సంకల్పించి యుండెను గాఁబోలు. ఆ కరస్పర్శముచే వారి చిత్తములును గలుసుకొనినవి. అన్యోన్యా నురాగ నివేదనమునకు రహస్యము దాఁచలేని వదనము వచ నములు కాకుండ కరగ్రహణమే సన్మార్గమయ్యె. మరల మరల వారే కలసి నాట్యముచేసిరి.

కాని యీ యుపాయము నాకెట్లు ఉపకరించును? ఏ శచీ నాథునో బ్రతిమాలి నన్నును, ఆతని భార్యచే శశిరేఖను విందు నకుఁ బిలిపింపఁ గలుగుదును కాని నృత్యము చేయు టెట్లు? మనలోఁ గూడ నట్టి యాచారముండెనా, ఇఁకఁ జెప్పవలెనా?

"మ. వనజాతాస్త్రుడు( డేయు సాయకములన్ వారింప(గారాదు, నూ
తనబాల్యాధికయౌవనంబు మదికిన్ ధైర్యంబు రానీదు, యి
ట్లనురక్తిన్ మిముబోంట్లకున్ దెలుప నాహా సిగ్గు మైకోదు, పా
వనవంశంబు స్వతంత్రిమీయదు సఖీ! వాంఛల్ తుదల్మట్టునే?"

అని యా రాకొమరిత బాధపడకుండెడిది గద.

ఈనాట్యము మనలో నాక్షేపింప(బడుటేల? ఇదియు గానమునకు దగ్గఱయే; నాదముతో( గూడినదియు, విలాసముతో(గూడినదియు నిదియే; ఏమైనను నాట్యమాడుట సంప్రదాయకాచారమని సిద్ధాంతము చేయ( బూనుకొంటిని. మన దేవుళ్ళలో నెవ్వరైన నాట్యము చేసిరా యని మొదట నాలోచించితిని.

విష్ణుమూర్తి గానలోలుడే గాని నాట్యమాడెనని నేను వినలేదు; కాని నాట్యమాడిన వాడు లేకపోలేదు. 'శివు(డుం దాండవమాడ(గ' అని నే నిదివఱకు( జదివినది జ్ఞాపకము వచ్చెను. నే( జెప్పినది సమర్థించుట కొక దేవు(డు దొరకినా(డు. కాని, యతనితో( గలసి నాట్యమాడినది భూత, బేతాళ పిశాచములు!! పార్వతి ముదుసలి ముత్తైదువువలె దూరముగ( గూర్చుండెను! ఆ శివు(డైనను ఎక్కడ నాట్యమాడె? అది తలు(చకొనుటే నాకు అపశకునముగ( దో(చినది. శోభను పొంద(గోరుచు శ్మశానవాటికం దిరుగాడు వాని నాదర్శము పెట్టుకొనుటేమిటి? నాకు నాట్యమే వలదు. ఈపుస్తకములో నాకు( బనికివచ్చు విషయము ముందు లాగునలేదు. కావున దానిం

జదువ బుద్ధిపుట్టినదికాదు. అప్పటికి నాకు భోజనముకూడ వచ్చెను. నేను పుస్తకము మూసి. భోజనమునకు లేచితిని.

నాభోజనమైనది; తరువాత మోదాయక మగునది యేపనియుఁ జేయక విశ్రాంతినొందుట యఁట. సుఖముగ నిద్రి పోవుటయఁట ! కొందరట్లు చెప్పుకొనుట వింటిని. ఆ సుఖము నాకుమాత్రి మేలలేక పోవలయునని నేను నాపరుపుమీఁదఁ బరుంటిని. కాని నాకు నిద్రిరాదు. కొంచెముసేపు కన్నులు మూసికొంటిని గాని దానివలన నాకేమియు సుఖము కనఁబడ లేదు సరిగద, తోఁచినదేగాదు. అందుచేఁ గ్రిందటిరోజున వచ్చిన వార్తాపత్రికను బుచ్చుకొని పరుండియే చదువ మొదలిడితిని. కొంతసేపటికి నిదురపట్టెను.

నాకుఁ గొంచెము మెలఁకువ వచ్చినతరువాత ఉలికి పడి లేచితిని. సాయంకాల మైపోయె నేమో యనుకొంటిని గాని యప్పటికి మూఁడుగంటలే యయ్యెను. ముఖప్రక్షాళనము చేసి కొంచెముగ ఫలాహారము చేసితిని. తలకు నిమ్మనూనె రాచు కొని పాపిడినువ్వుకొని గులాబిసబ్బుతో ముఖము రుద్దుకొంటిని. శశిరేఖ యెక్కడకైన వెళ్ళిపోవునేమో యనుకొని యామె వెళ్ళకపూర్వమే యామెకంటఁబడుటకుఁ దొందఱ పడితిని. పెట్టె లోనుండి మంచి చొక్కా తీసి తొడుగుకొనుటకు వ్యవధానము చాలదని పైనున్నదానినే తొడుగుకొంటిని. జేబురుమాలునందు మాత్రిము కొంచెమత్తరు వేసితి. లోపలిచొక్కా యెటు లున్ననేమి? పైన ఉలుకోటు తొడిగికొంటిని. మఱియేదో పని

మీఁద వెళ్ళువానివలె శశిరేఖ యింటిముందఱనుండి మెల్లగ నడచి పోఁగోరి బైలుదేరితిని. నల్లతంబి వీధి మళ్లఁగనే నాకు నెంటిబ్రాహ్మణుఁ డెదురుగవచ్చెను. అతఁడు శచీనాథుఁడే. అప్పుడే యెక్కడకు వెళ్ళుచుంటివని యతఁడు నన్నడిగెను. అతనిని జూచుటతోడనే నాగుండెలలో రాయిపడెను. అయి నను గొంచెము చదువుకొని పట్టణములో మెలఁగుచున్న వాఁడను గనుక, ఇంతమాత్రముననే వికలతం దోఁపనీయక, "నీకొఱకే బైలుదేరితిని. కళాశాల లేకపోవుటచే నాకేమియుఁ దోఁచినది కాదు" అంటిని. "నాకును దోఁచక నేను మీగదికి వచ్చుచున్నానని" శచీనాథుఁడనియె. మంచిముత్యములన్నియు నొక్క చోటునకుఁ జేరునట్లు మనమిరువురము నొకచోటునకుఁ జేరితిమి మంచిదే, పొద్దుపోవుటకు నాలుగువీధులు తిరిగి వచ్చెదము. రమ్మం"టిని. నాచెలికాఁడు సమ్మతించెను. మేము నాలుగడుగులు వేసినపిదప నతఁడు, సోమేశ్వరా నాకడుగు పడకుండ నున్నదోయి, యనెను. కారణమేమని యడిగితిని.

"ఇండ్లు కాలుచుండఁగఁ గాలుటకుఁ గారణమేమని తర్కించుచుఁ గూర్చుండుదునా, ఆర్పుటకుఁ గావలసిన నీళ్ళను దెత్తునా? కారణముతోఁ బనియేమి? ముందు చేయవలసినది చూడవలెను గాని" అని శచీనాథుఁడు పలికెను. కార్యాకార్య వివేక హీనంబున్నట్లు సూచించు ఈవాక్యములు వినఁగనే నాకుఁ గొంచెము చిన్నతన మయ్యెను. "శచీనాథా, ఇల్లు కాలుచున్నదని యెఱింగి దాని నా

ర్పుటకు నీరుకావలయునని తెలిసిన పిదపనే దానిం దెచ్చుచున్నాఁడు గాని యింటి స్తంభములు విఱిగి కూలిపోయినను దానిని నీరువోసి చల్లార్పఁడుగద! అట్లే నీకుఁ గల్గినబాధ తెలిసినఁ గదా తగిన చికిత్సచేయవలయు?" అని ప్రత్యుత్తరము చెప్పితిని. దానికి శచీనాథుఁడు "సోమేశ్వరా, నీవు తర్కము జదివితివి, నీతో వాదించుట కష్టము. నాకుఁ గావలసినది నీకుఁ దెలిసినను నాచేతనే చెప్పింపఁజూచెదవు; పోని నేనే చెప్పెదను" అని దాపుననున్న కాఫీదుకాణమును జూపి యచ్చటకుఁ బోయి కొంచెము "టీ" త్రాగి పోవుదము రమ్మని నడచెను.

మేము మధుర కృష్ణయ్యరు గారి యంగడి కేగితిమి. అచ్చటినుండి త్వరగ మరలివచ్చు నుద్దేశముతో ముందుగదిలోనే కూర్చుంటిమి. అంతా మాకుఁ బూర్వమే నల్వురు మదలియార్లు కూర్చుండిరి. అచ్చటనున్న బ్రాహ్మణ బాలునితో మాకు "టీ" తెమ్మని చెప్పితిమి. అతఁడు లోపలకు వెళ్ళెను. ఇంతలోనే లోపలనుండి మమ్ముఁ జూచిన మఱియొక బాలుఁడు వచ్చి "ఏమి తీసికొనరాను సామి? లడ్డు ఇపుడే అయినది. మైసూరుపాకు ఇపుడిపుడే యగుచున్నది. ఉపమ వేడిగనున్నది, జిలేబి ఉన్నది, పెరుగువడయున్నది, పకోడి యున్నది." అని యున్నవానిని బేర్కొనెను. మాకుఁ గావలసినవి యిదివఱకే యొకనితోఁ జెప్పితిమని యెఱింగించితిని. తల్లిదండ్రులను భార్యను జుట్టములను విడిచివచ్చిన సంగతి నిజముగ నీ దుకాణములవారు మఱపింతురు. పరస్థలమం దొంటరిగ నున్నమాట తలంపునకు రానీ

యరుకద ! ఏమి యాదరణము ! నా రనియు నీ రనియుఁ బక్ష పాతబుద్ధి వీరికి లేదు. ఎవ్వరు తమతో నవసరముండి వచ్చినను ఎంత క్రొత్తవారైన బిడియము పడుచుండినను పదిపది మారులు కనుగొనుచు నెవ్వరి కేది యిష్టమో దానిం జేసి యుంచు వారు గదా ! నిజముగ లోకబాంధవులని వీరిని గాక యెవ్వరి ననఁ దగు ? మేము కూర్చుండినపిదప నొక్కసారిగ నలుగురు పిళ్ళ యూరు లచ్చటకు వచ్చిరి. విశాలముగఁ గూర్చుండుటకుఁ జోటు లేకపోయెను. వారిలో జరీతలపాగ పెట్టుకొనిన యొకా యన మావైపు జూచి, ఏమండి, ఈబ్రాహ్మణులు, రైలుబం డ్లలో స్త్రీలవలె, అనెను. ఆమాటలకు శచీనాథునకుఁ గోప మువచ్చి యేదో యనఁబోయె. నేను కొంచెము జరిగి వారికిఁ జో టిచ్చితిని. మాకు ముందువచ్చి కూర్చుండిన మదలియా రొకఁడు నవ్వుచు "ఏమండి అట్లనెదరు, రైలుబండ్లలోని స్త్రీ లేమిటి?" యని యడిగెను. దానికా పిళ్ళయూ రిట్లనియె. "చూడండి రైలులో ఆఁడువారి బండి వేఱె యున్నదిగద. స్త్రీ లందులోఁ గూర్చుండరు, మగవారి బండిలోనే కూర్చుందురు; మగవారి కిటుకు. కాని వీరు పోయి ఆఁడువారి బండిలోఁ గూర్చుం డుటకు వీలులేదు. చూచినారా ? మనము పోయి యీబ్రా హ్మణులగదిలోఁ గూర్చుందమన్న వారు రానీయరు; వీరు వచ్చి యిక్కడ కూర్చుందురు." దానికి శచీనాథుఁడు "పిళ్ళగారు, మీకున్న యీదురభిప్రాయమును బోఁగొట్టుటకే యిక్కడకు వచ్చి కూర్చుంటిమి. మన సోదరభావము వ్యక్తము చేయుటకే

మీతోఁగలసి కూర్చుంటిమి. మీరే "మాతోఁ గూర్చుండుటకు మీరు తగరు పొండం" దురా ఇపుడే లేచి పోయెదము" అని లేచి నన్నుఁగూడ లెమ్మనియె

ఈలోపుననే వచ్చిన వారందఱును సర్దుకొని కూర్చుండిరి. మాకు బాలుఁడు టీ గొనివచ్చెను. వానితో శచీనాథుఁడు, అయ్యరు! మాకును వీరికిని జిలేబి పట్టుకొనిరా యని చెప్పెను. అయ్యరు రెండుచేతులతోడను నాల్గు పళ్ళెరములు తెచ్చెను. ఆనాల్గును శచీనాథుఁడు పిళ్ళెయారుల ముందునకు జరిపి, పుచ్చుకొనుఁడనియె; వారు మమ్ములను బుచ్చుకొనుఁడనిరి. మాకు మరలఁ దెచ్చునని శచీనాథుఁడు వారిచెంతకే వానిని ద్రోసెను. అయ్యరు మరల పట్టుకొని వచ్చెను. మేము ఫలాహారము చేసితిమి. ఫలాహారము చేయునపుడు మాటలాడుటలో శచీనాథుఁడును బిళ్ళగారును నొకరి నొకరు తెలిసికొనిరి. శచీనాథుని యత్తవారి పట్టణములో నీపిళ్ళ యుద్యోగముచేయుచుండెను. ఇపుడాయన సెలవుమీఁద వచ్చెను.

తన జేబులోనుండి పదిరూపాయల కాగితమును దీసి, శచీనాథుఁడు అయ్యరును బిలచి, "మాకును, పిళ్ళగార్లకు నయినపైకము తీసికొని చిల్లర యిమ్ము; నాకొక కత్తెరగుఱుతు సిగరెట్టుపెట్టె కూడఁ గొనిరా" అనెను. అతఁడు కాగితమును అయ్యరు చేతిలోఁ బెట్టకపూర్వము యీపిళ్ళగారు, "మీ రీయకండి, మీరింకను జదువుకొనువారుగనే యున్నారే; నేనిచ్చెద" నని మొత్తమంతయు నిచ్చివేసెను. పిమ్మటఁ బరస్పరాభివంద

నములతో మేమందఱము బైటకు వచ్చితిమి. అపుడే హిరణ్యగర్భుఁడు కనఁబడియె. వార్తాపత్రికను జదువుటకై మాయింటికై యతఁడు వచ్చుచున్నట్లు చెప్పెను. శచీనాథుఁడును నెండ తగ్గువఱకు నింటియొద్దనే యుండుదమనియె. నాకు వచ్చిన యొంటి బ్రాహ్మణ శకున మూరక పోయినది కాదు. శశిరేఖను జూడకయే నే నింటికి మరలి వెళ్ళితిని.

---

## 21

### సంస్కారము.

సెలవు లిచ్చిరన్న సంతోషమే కాని నాకుఁ బ్రొద్దుపోవకుండెను. నేను శశిరేఖను జూడఁబోవుటకు వెళ్ళినపుడు రెండుసారులు శచీనాథుఁ డడ్డునచ్చెను. ఆతని దప్పించుకొని యెటులో మూడురోజులు సాయంకాలమున సముద్రపుటొడ్డునకుఁ బోయితిని గాని యచ్చటను శశిరేఖ గానరాదయ్యె. నాకుఁ బ్రపంచమంతయు విజనమైనట్లు తోఁచెను. సెలవులలో నింటికి వెళ్ళుటమాని యిట నేకాకినై యుంటిని. ఒక్క నిమిషమునైన గడుపుట కష్టముగ నుండెను. ఈమాటు సాయంకాలమున గాక భోజనముచేసి పదిగంటలకే శశిరేఖ యున్న వీధివైపు వెళ్ళుటకు బైలుదేఱితిని. నేను వీధిలో నడుగుపెట్టఁగనే తపాలవాఁ డొకయుత్తరమిచ్చెను. ఆయుత్తరము మా యింటి కడనుండి వచ్చెననుకొంటిని గాని అది మాతండ్రిగారి దగ్గఱ

నుండి కాదు. ఆవ్రాత యెవ్వరిదో నేను గుఱుతుపట్టలేక పోయితి. నాకు వ్రాసిన వారెవరైయుందురాయని మరల నా గదిలోనికి వచ్చి యుత్తరీయము తీసి వంకెకుఁ దగిల్చి సావకాశముగ గూర్చుండి యుత్తరము చదివితిని. అది యిట్లుండె:

కాశాంబి,
26-9-

సోమేశ్వరా!

సెలవులలోఁ జెన్నపట్టణములోనే యుందునని చెప్పితిని గాని నే నిచ్చటకు రావలసివచ్చెను. నా ప్రయాణమును గుఱించి మీతో మరలఁ జెప్పుటకైన సావకాశము లేకపోయె. ఈ స్వల్ప విషయమునకే యనృతమాడితినని మీ రెక్కడ యనుకొందురో యని జడియుచున్న దాన. ఈపదునాల్గు దినములలోను గళాశాల యుండదు గనుక తీరికగఁ గొన్ని పుస్తకములను జదువఁదలఁచితిని గాని యదియు సాగినది కాదు. కానిమీరు చదివిన పుస్తకముల సారము నాకుఁ జెప్పకపోరని నమ్మెదను. నేనును గొన్ని పుస్తకము లిచ్చటకుఁ దెచ్చితిని. నా భ్రాంతియే కాని, పడఁతులకుఁ బుస్తకములు చదువు టెట్లగును? సుల్తానా రెజియాయు, విక్టోరియా రాణియు దేశముల నేలినను వారే స్త్రీలకు సదుపాయములు చేయలేదు. అట్టి యెడఁ బురుషుల నననేల?

చెన్నపట్టణమునుండి నేనంత తొందఱగ వచ్చుటకుఁ గారణమిది: ఇచ్చట మాయక్కయ్య కలదు. ఆమెకు సహాయముగావలసిన యవసరము వచ్చినది. మాతండ్రిగారు నన్ని

చ్చుటకుఁ ద్వరగ వెళ్ళుమని వ్రాసినారు. నేను రాకపోయినచో, చెన్నపట్టణము వెళ్ళినంత మాత్రముననే చెప్పినమాట వినుట మానినదే యని కోపపడుదురు. ఆ భయముచే శనివారము నాఁడె బైలుదేరి వచ్చితిని.

నే నీయుత్తరము వ్రాయునప్పటికిఁ దపాల వేళ మించి పోయినది. మా భోజనము లాలస్యమగుటయే దీనికిఁ గారణము. ఈయుత్తరము రేపుగాని వెళ్ళదు గనుక మీకు మఱికొన్ని విశేషములను వ్రాసెదను. ఇవి మీ రెఱుంగవలసిన విషయములని కాదు; వీనివలన మీకుఁ బ్రయోజనమున్నదనియుఁ గాదు. ఉత్తరము వ్రాయు నేర్పు నాకుఁ గలదనియుఁ గాదు. సోమేశ్వరా! ప్రియసఖునకు వ్రాయుచుండుటే నాకు సంతోషము. ఆ యానందము మఱికొంతసేపు అనుభవించుటకే యేవేవో వ్రాసెదను. మీకుఁ జదువ విసుగుపుట్టుచో చదువకుఁడు.

ఈదినము మా బావగారి తండ్రి యాబ్దికము. వంట విశేషముగఁ జేయవలయును గాని చేయువా రెవరును లేకపోయిరి. ఇచ్చట పెరికి నీళ్ళు పోయు నామెను బిలిచిరిగాని యామె చేతికి గాజులుండుటచే పనికి రాదనిరి. వంట కిబ్బంది కలుగుచున్నదని మా బావగారు పురోహితునితోఁ జెప్పిరి; వంటచేయు నామెయు భోక్తలు నొక్క శాఖవారే కనుక ఆమె వంటకుఁ బనికి వచ్చునని పురోహితుఁడు చెప్పెనఁట; కాని దానికిఁ బెద్దలంగీకరింపలేదఁట. గాజులుండుట పుణ్యాంగనల కొప్పినను నవి పితృకార్యముల కనాచారమఁట! ఈయూర వంటపూటయింటఁ

బనిచేయుచున్న నొక వితంతువును వంటచేయుటకుఁ దీసికొని వచ్చిరి. ఈపూట కామెకు రూపాయి యిచ్చుట కంగీకరించిరి. ఈబిడను బిలుచుటకు మా బావగారి కిష్టము లేదు. ఎనిమిది మాసముల క్రిందటనే యీబిడ యీయూరి కాలువలో శిశువును బారవేసినదఁట. అది యెవరు ప్రత్యక్షముగఁ జూచిరో నాకుఁ దెలియదుగాని యూరువారందఱు నట్టి యపనింద గలదు. ఆమెను వెలివేయలేదు. ఆమె బ్రాహ్మణకులమునుండి తప్పిపోలేదు గావునను వితంతువులకుఁ జెప్పఁబడిన శిరస్సంస్కారము పిష్టఫలాహారములు స్నానము ఆచారము ఆమెకుఁ గలవు గావునను ఆమె వంట చేయవచ్చుననియు, నది పితృకార్యములకుఁ బనికివచ్చుననియు వీరి పురోహితుఁడు చెప్పి మా బావగారి మనశ్చింత వాపెను.

ఆనాఁడు వండవలసినవి మెండుగ నుండుటచేఁ గొంత పనియైన నామె వచ్చులోపల నేఁ జేయవలయునని తలఁచి కూరలబుట్ట దగ్గఱ పెట్టుకొని యొక పీసెడు వంకాయలను దఱిగితిని. మా బావగారు వంటయింటిలోనికి వచ్చి నేను కూర తఱుగుట చూచిరి. నేను పనిచేసినందులకు సంతోషము పొందుటకు మారుగ ఆయన కోపపడిరి. నన్నుగాదు, "ఏమే, ఒసే, ఎక్కడున్నావు ? తగులవేసినది, పీసెడు వంకాయలు, నీచెల్లెలు ! నీవు దానిని తఱుగుమనుటేమిటి" అని మాయక్కయ్యపైఁ గోపపడిరి. "నేను దానిని తఱుగుమనలేదు. అది వంకాయ తఱిగినట్లు నాకుఁ దెలియనేలేదు. అని మాయక్కయ్య చెప్పఁగ,

ఆయనకుఁ గోపమాఁగక, నన్నేమియు ననంజాలక " నీ కేయుపా ధ్యాయుఁడు చెప్పినాఁడు తద్దినమునకు వంకాయ తఱుగుమని? ఇన్ని యేండ్లనుండి చదివినావు, చెన్నాపట్టణములోఁ గూడఁ జదువుచున్నావు, ఇంతమాత్రము తెలియదా ? ఇంగ్లీషు చదువుటచే దొరసానివైతివి కాఁబోలు తద్దినమునకు వంకాయ తఱిగితివి" అని యాక్షేపించెను. నాకుఁ జిన్నతనమయ్యెఁ తద్దినమునకు వంకాయతగదని యేశాస్త్రములో నున్నదో? అనుదినము తిను వంకాయ తద్దినము నాఁ డెందుకు కానిదగునేల ? వివాహములలో వాడు వంకాయ ఇప్పుడు విసర్జింపఁబడునేల ? పితృదేవతల కిది చేరదా? పోనిండు, భోక్తలు తినిన ప్రతిపదార్థమును నా యుత్తరము తపాలవాఁడు మీకందిచ్చినట్లు భోక్తలు పితరుల కందిత్తురనుకొందము. అరఁటికాయ సంధీయఁగ వంకాయ నేల విడతురు ? ఇది బరువగునా ? ఇది భోక్తల కిష్టముకాని పదార్థమును గాదే!

మా బావగా రామాటలనిన పిదప నేను కత్తిపీటయొద్ద నుండి లేచితిని. వంటకు వచ్చిన యావిడే నీళ్లు తెచ్చుకొని కూరలు తఱుగుకొనెను. చేయున దామెయొక్కతే యగుటచే వంట యగునప్పటికి రెండుగంటలయ్యె. అప్పటికే పొద్దుపోవుటచే మంత్రముల కొంత తక్కువ చేయుమని మా బావగారు పురోహితునితోఁ జెప్పిరి. నాకుఁ బని తక్కువగ నుండుటచే నే నిదంతయుఁ జూచుచుంటిని. వీరి పురోహితుఁడు బియ్యపు చోటునఁ గూర్చుండెను, రెండవ బ్రాహ్మణుఁడు నువ్వులచోటునఁ

గూర్చుండెను. నువ్వుల చోటుకంటె బియ్యపు చోటునకు గౌరవ మెక్కువయఁట. వారిద్దఱకు దగ్గఱగ మా బావగారును గూర్చుండిరి. ఈయనచే వారు వారి పీటలముందు దర్భపుల్లతోఁ దుడిపించిరి. నేను శుభ్రముగ నూడ్చి నీళ్ళు జల్లి వారిపీటలు వేసియుంచితి. అచ్చట ముఱికి లేదు. ఉన్నను నది దర్భపుల్లతోఁ దుడిచినఁ బోదనియె నానమ్మకము. తరువాత దర్భలతోడనే ప్రత్యేకించిరి. కాని అచ్చటఁ జల్లి పడనేలేదు. ముందు త్రిప్పిరో ముందు తుడిచిరో నాకు జ్ఞాపకములేదు గాని రెండును మా త్రిము జరిగించిరి. తిలస్థానమున నొక విధముగను దండులస్థానమున మఱియొక విధముగను మా బావగారు జన్నిదముతో సాముచేసిరి; యజ్ఞోపవీతము నుపయోగించుట యిప్పుడే నేఁ జూచితిని. భోక్తలకు వడ్డనలోను నొకక్రమము గలదు. వారిద్దఱకు వడ్డించుటయు నొక్క విధముగాదు; అందును గూడ భేదమున్నది. వడ్డన పూర్తియైనపిమ్మట, యిది యన్నము, ఇది పప్పు ఇది నెయ్యి అని మా బావగారు బ్రాహ్మణుల యొక్కొక్కరి చేయి పట్టుకొని వారికిఁ జూపించిరి. వా రవి చూడలేని కంటిజబ్బువారని మీ రనుకొందురేమో; కాదు, కాదు, అట్లు చూపించవలయునని మంత్రములోనే యున్నదఁట. ఆబ్రాహ్మణులు మంత్రములతోడనే భోజనముచేసి మంత్రములతోడనే లేచిరి. వారు లేచినతరువాత, వంటలక్కగా రెలపిండి రుబ్బుటకుఁ దనకు సహాయముగఁ దీసికొని వచ్చిన మఱియొక కాంత స్నానముచేసి మడిగ ఆ యెంగిలి విస్తళ్ళను, మా బావగారు

వానిమీఁద నీళ్ళు జల్లినతరువాత, ఎత్తివేసినది.

మఱియొక చిత్రము: తద్దినములలో గారెలే వండుటేల? పితృదేవతలకు గారెలే కాని మఱియొక పిండివంట యిష్టము లేదో? ఈవిషయములలో నాకుఁ దఱచుగ నొకసందే హామే కలుగుచున్నది. చనిపోయినవారు మఱియొక జన్మమెత్తకుండ నాకాశమున వ్రేలాడుచుందురా? ఉన్నను వారికి మన భోజనము కావలయునా? ఈబ్రాహ్మణుఁడు భక్షించినది వారి కెట్లుచేరును? అది యెవరందిత్తురు? అందఱు పితృదేవతల కొక్కటియే రుచియుండునా? లేనియెడల నందఱు గారెలే వండుటేల? ఇన్ని సంవత్సరములనుండి తద్దినము పెట్టుచున్నారు గదా; యేపితృదేవతయైన, (పితృదేవత యనవలెనో, పితృదేవుఁ డనవలెనో నాకుఁ దెలియదు; ఒకవేళ నుభయులునుండిరేమో) మీరు పెట్టిన తద్దినములు మాకు ముట్టినవి. సంతోషించితిమని చెప్పియుండెనా? ఎవరైనఁ బెట్టకయున్నచో తద్దినము పెట్ట లేదేమని యడిగిరా? ఈప్రశ్నలన్నియు ఆబ్రాహ్మణులనే యడిగియుందును గాని యొక్కప్రశ్నకే మాబావగారికిఁ గోపము వచ్చెను. తద్దినమునకు గారెలే చేయుటేల యని బ్రాహ్మణుని నడిగితిని. "ఇది పెద్దల యాచారము అట్లు మనము తలవంచుకొని ప్రవర్తింపవలసినదే కాని, యిదేమి, యది యెట్లు, అని ప్రశ్నింపరాదు. గారెలు వండుట మన దేశాచారము. అది పూర్వమునుండియు వచ్చుచున్నది. కాని పూనానగరములో వేఱు. నే నచ్చటకు వెళ్ళినపుడు చూచితిని. అచ్చట లడ్డు,

జిలేబీలు కూడఁ జేయుదురు. అచ్చటి యాచారమది. అచ్చటి వారును మనమును బితృదేవతల నుద్దేశించి పెట్టుచున్నాము. వారు పదార్థముల నాయాకూపముగఁ బుచ్చుకొందురు. మన పూర్వు లేర్పఱచినట్లు చేయవలసినదే కాని క్రొత్తవి కల్పింప రాదు." అని యింత చెప్పెను. మనదేశమువారు పూనా వెళ్ళి నప్పుడు తద్దినము పెట్టవలసి వచ్చుచో వీరి పితరులు వెనుక నుండి యలవాటుపడిన గారెలను దిందురా, ఆదేశమునకు వచ్చుటచే జిలేబి తిందురాయని మరల నడిగితిని. ఈప్రశ్నకు మా బావగారికిఁ గష్టముగనే యుండెను తమ పురోహితుని గేలి చేయుచున్నానని తలఁచిరి కాఁబోలు; "ఈబిడ చెన్నాపట్ట ణములో సింగ్లీషు చదువుచున్నది లెండు, అందువల్లనే ఈ రోజు కూరలకు మొదట వంకాయ తఱిగినది" అని నిరసనముగఁ బలి కిరి. ఆబ్రాహ్మణుపిద్దలు పక్కున నవ్విరి. సరే, ఇంగ్లీషు చది వితిని, నాకుఁ దెలియలేదు. తెలుఁగు చదివిన మా బావగారు చెప్పలేదు, సంస్కృతము చదివిన యాబ్రాహ్మణులు చెప్ప లేక పోయిరే! ప్రత్యుత్తరము చెప్పలేక పోయినపుడు ప్రశ్నించ కర్తుని గేలిసేయుటే యీ తెలుఁగుసంస్కృతములు చదివినవారి శక్తి కాఁబోలు. సోమేశ్వరా, నాకు నిజముగఁ జిన్నతనమే యైనది. నేనడిగిన ప్రశ్న యంత తెలివితక్కువగనే యున్నదందురా? ఉండిన నుండుగాక, స్వల్పవిషయములను మాత్ర మెఱుఁగని వారుండరా? దానికింత నవ్వేల?

ఇవన్నియుఁ జూడఁగ వెనుక మీరు చెప్పినసంగతి

యొకటి జ్ఞాపకమునకు వచ్చుచున్నది. మన యాచారములలో సంస్కార మవశ్యమని మీరు పల్కితిరి. నిశ్చయముగ నవసర మనియే నాకును గన్పట్టుచున్నది శాస్త్రవిహితము కాని యాచారములు నలుగురెట్లు మార్చిన నట్లు మారును. కాని ధైర్యము చేసి మార్చుటకు ముందంజ వేసెడివా రుండవలయును. ఇట్లు సంస్కార విషయములలోఁ బురుషులకంటె మా యువతులే ముందుగ వచ్చెదరు. ఆత్మస్తుతి యని మీరనుకొనకుఁడు. ఇదే నిజము. నగనాణ్యములందును, బట్టలందును, బట్టలకట్టువిధమందును మేమెంత మార్పు చేసినదియు మీకుఁ దెలియక పోదు. పూర్వపు నగలయందు దోషము కలదని యీమార్పులు చేసిరనను. ముసలి వనితలు వలదనుచున్నను మార్పులు గావించుటలో మా యువతుల కున్న కార్యదీక్షయు ధైర్యము ప్రశంసనీయములుగావా ? సోమేశ్వరా ! ఈయలంకారములందును బరిధానమందును గావించిన భేదములకు, మీరు వింటిరో లేదో కాని, కొందఱు పురుషులును, మఱి మఱి ఆశ్చర్యము, గొందఱు స్త్రీలును నెంతగనో యాక్షేపణము చేయుదురు. ఒక్కొక్కప్పుడు నిందకూడఁ జేయుదురు. అంత నిందింప వలసిన తప్పేమి చేసిరో నే నెఱుంగఁజాల. రాగిడీలను మాని నాగరములు వేసికొను చున్నారు నిజమే. ఇవియు నరచేతియంతయై, గులాబి పూవంతయై యర్ధణాయంతయై చామంతి పూవంత యైనవి. ఎవరిమనస్సున కానందమగు నట్లు వారు వేసికొనిరి. దానిలో తప్పేమి ? దీని కంత

యధిక్షేపణ మేమిటికి ? రాగిడి వారి చుట్టమై నాగరము కాకపోయెనా ? అందెలు అందమై పట్టాగొలుసులు కాకపోయెనా ? కొప్పుగొలుసులు సాంప్రదాయకమై చంపసవరములు కాకపోయెనా ? ఈస్వల్పవిషయములకే కులపాంసనమైనట్లు ఘూర్ణిల్లుటేల ? తమ మనోనాయకుల చిత్తరంజనముకొఱకే ముక్కులు చెవులు పొడిపించుకొని యీ బరువులను మోయుచుండఁగ నింత నిందింపనేలనో? లతాంగు లీ నూతనాభరణములతో నుల్లాసముగ నుండుమనిరిగాని రచ్చలెక్కి రాజ్యమేలెద మనలేదు. నవ్యపరిధానముతో నాజూకుగఁ దోఁచఁగోరిరి గాని నాట్యశాలలెక్కి నృత్తము సేయఁగోరలేదు. సోమేశ్వరా! ఇంతమాత్రము చేసిన హానియా, అపకీర్తియా ? ఈపాటి స్వేచ్ఛయైనఁ జిగురుబోఁడులకు వలదా ? పరిధానమించుక మారిననే పడంతుల చిత్తవృత్తులు మారవు. నీవు నవ్వేదవని వ్రాయఁ దలఁచుకొనలేదు గాని యిచ్చట మాయింటి కెదురుగనున్న ఇంటియాయన కుమారుఁడు తన భార్య బొత్తాముల ఱవిక తొడుగుకొనెనని మొన్నరాత్రి కొట్టినాడఁట! ఇంకేమి చెప్పను? పురుషులును మగువలట్లే పాపిడులు తీసికొనుచున్నారు. దాని కేకాంతమైనను నాక్షేపణము చేసినదా ? నీ వెన్ని చెప్పు, సోమేశ్వరా ! స్త్రీలకుండిన నుదారభావము, కరుణ, సత్క్రియారంభ సాహసము, పురుషులకు లేవు. లేవనఁగ, నీకుఁ గోపమువచ్చునేమో ! అందఱకును లేవని గాదు, నీబోఁటి వారచ్చటచ్చట లేకపోలేదు.

ఇప్పటికి సాయంకాలమైనది. దీపములు పెట్టుటకు లేచె దను. నీయొద్దనుండి జవాబువచ్చిన తరువాత నింకొక యుత్త రము వ్రాసెదను.

శశిరేఖ.

---

# 22

## ప్రత్యుత్తరము.

శశిరేఖవ్రాసిన యుత్తరమునకు జవాబేమి వ్రాయుట యని యీనాఁడంతయు నాలోచించితిని. ఆమె వేసిన ప్రశ్న లకు సమాధాన మెఱుంగుటకై యత్నించితిని గాని నాయొద్ద నున్న పుస్తకములలో నాదును నట్టి విషయములు లేవు. అవి యుండినను వ్రాయుటకుఁ గొన్ని సంగతు లుండెడివి. పోని, ఏవో, కొన్ని కల్పించి వ్రాయవలెననుకొంటిని; ఆమెకు నేను జవాబువ్రాయుటే నాకును ఆమెకును ముఖ్యముగాని యందుం డు విషయములు గావు. శశిరేఖ కిదియే నేను ప్రథమమున నుత్తరము వ్రాయుట. దాని నెట్లు వ్రాయవలెను? ఈప్రథమ లేఖను బట్టియే యామె నన్నెంచఁబోలు, కావున, ఉత్తరమా, రసహీనముగ నుండరాదు. విషయములా శశిరేఖ వ్రాసినట్లు నూతనములు గావలయు. ఫణితియు మాధుర్య మొలుకుచుం డవలయును. ఈ నియమముల ముందుగ నేర్పఱచుకొంటిని. మఱునాఁటి మధ్యాహ్నమునకు నుత్తరమునకు గావలసిన పరి కరముల నేర్పఱచుకొంటిని. కాగితముమీఁదఁ గలము పెట్టఁ

బోవుచుండఁగనే తపాలవాఁడు మఱియొక యుత్తరమును దెచ్చెను. అది పద్మకుమారుఁడు వ్రాసిన లేఖ. సెలవులలో నొక్కఁడను ఉండుటచే నాకుఁ బ్రొద్దుపోవుటకుఁ గాను సాయంకాలమువఱకు నేవేవో కొన్ని కల్పించి యతనికి వ్రాసితిని. దానికి నతఁడును ప్రత్యుత్తరము వ్రాసె. అది యిట్లుండెను.

సోమేశ్వరా,

నీవు క్రిందటివారము వ్రాసిన యుత్తర మిపుడే నేను చదివితిని. అది చదివినతరువాత నే మాతండ్రి వేసిన ప్రశ్నలకుఁ గారణము తెలిసికొనఁ గల్గితిని. మాకు జరిగిన సంభాషణమునకును నాకు వచ్చిన చీవాట్లకును నీవుకూడఁ గారణమగుటచే నీకీవిషయములు పూర్తిగ వ్రాసెదను. ఇట్లంటినని నీపై నాకుఁ గోపము కల్గినదని యెంచకుము. నీసహవాస మెల్లప్పుడు నాకు సంతోషమే. నీతోడి సంభాషణమును ముచ్చటగనే యుండు. నేను తిరిగి చెన్నపట్టణము వచ్చెదనన్న నమ్మకము లేదు. కొంతకాలమచ్చటఁ జదివి సొమ్మును గాలమును వెచ్చించి మధ్యగ మానుట నాకుఁ గష్టముగనే యున్నది. మాతండ్రిగారికెన్నోవిధముల బ్రతిమాలితిని గాని యింకఁ బంపననుచున్నారు. నేను చెడుసావాసములు చేసి పాడైపోయితినని దూషించిరి. సోమేశ్వర ! ఈసంగతులు వినిన నీకును ఆశ్చర్యముగ నుండక పోదు. ఇట్లేలవచ్చెనో సవిస్తరముగ వ్రాసెద.

నేనిచ్చటకు రాకపూర్వమే మా మేనయత్త కబురు పంపినదఁట. నేను చెన్నపట్టణము వెళ్ళినతరువాత ఆమె నన్నుఁ

జూడలేదు. ఆమహాపట్టణములో సీమదొరలయొద్ద నే నింగ్లీషు చదివితినని నన్నామె చూడఁ గుతూహలపడుచుండెనఁట. అమెకుఁ గుమారులు లేరు. మఱియు మా దగ్గఱబంధువులలో నింగ్లీషు చదివినవారును లేరు. ఈసెలవులలో మామేనయత్త గారింటికి వెళ్ళుమని నేనిచ్చటకు రాఁగనే మాతండ్రిగారు చెప్పిరి. వచ్చిన మఱునాఁడే బైలుదేరి వెళ్ళితిని. మామేనమామ గారును నాకెదురుగ వచ్చి తీసికొని వెళ్ళిరి. చెన్నపట్టణములో నాకుఁ గాఫీ యలవాటనియు నది లేక నే నుండలేనని యు నామె తమనగరమునుండి కాఫీగింజలు తెప్పించినది. నన్నక్కడఁ జాల గౌరవముగ నే చూచిరి. మా మేనమామగారి నెఱిఁగిన కాపులు కొందఱు నన్నుఁ జూచుటకువచ్చిరి. నాకుఁ గాఫి నిమిత్తమని ప్రతివాఁడును మెక్కొక్కసేరు పాలుకూడఁ దీసికొనివచ్చెను. వారందఱు నన్నొక్కప్రశ్న వేసిరి. ఇంతదూరము వెళ్ళియు ఓవరుసీరు పరీక్షకై చదువక యీచదువేదో యేల చదువుచున్నారని యడిగిరి. ఇప్పుడైనను నాల్గు నెలలు వారి నిమిత్తమైనఁ గష్టపడి చదివి ఓవరుసీరై తమగ్రామమున కుద్యోగమునకు రమ్మనిరి. అచ్చటైదారు దినములు గడపి యీనాఁడే యిచ్చటకు వచ్చితిని. నేను భోజనము చేసినతరువాత మా నాన్నగారు నన్నుఁ బిలచి "ఏమిరా అబ్బాయి, సోమేశ్వరుఁ డెవరురా ?" అనియడిగిరి. అపుడు నీమాట స్ఫురించినదికాదు. నిన్ను మఱచితినని కోపగించుకొనకుము. నే నూరికి వెళ్ళిరాఁగ నచ్చటివారి క్షేమమునుగూర్చి యడుగుదురని యనుకొంటిని

గాని నిన్నెఱుఁగుదురని గాని నిన్నుగూర్చి యడుగుదురని గాని నేనెట్లు లనుకొనఁగలను? ఆసమయమున నిజముగఁ జన్నపట్టణపుసంగతియే మఱచితి. "ఏసోమేశ్వరుఁడు"? అంటిని. నే నట్లడిగినందులకే మామతండ్రిగారికిఁ గోపము వచ్చెను. మాకీ క్రిందివిధమున సంభాషణము జరిగెను."

"ఏ సోమేశ్వరుఁడా; సోమేశ్వరుఁడను వానిని నీవెఱుఁగవా?"

"ఓహో, అతఁడా, చన్నపట్టణములో నే నున్న గది ప్రక్క నే యున్నాఁడు."

"వాఁ డేయూరివాఁడు? ఎవరి కుమారుఁడు?"

"అతనిది మాశిపురము. ఎందుకు?"

"వానికి నీకు నెట్లు పరిచయము?"

"ఎట్లు లేమిటి? చన్నపట్టణములో సామాన్యముగ నందఱు తెలుఁగువారు ఒకరినొకరు ఎఱిఁగియే యుందురు. అది గాక నాగది ప్రక్క గదియే యతనిది."

"నీకు సహవాసమునకు వీఁడు తప్ప ఇంకెవరును దొరకలేదా?"

"ఏమి, అట్లనుచున్నారు. అతఁడు చాల మంచివాఁడే!"

"ఏడ్చినావు, వాని మంచితనము, నీమంచితనము! మీయిద్దఱొకటే రకము కాఁబోలు!"

మనల నిద్దఱను నిట్లు దూషించినందులకు నాకాశ్చర్యమును భయమును గూడ బొడమినవి. ఆయన నిన్నెఱుఁగ

నిజే ఇంతగ నేల బలుకుచున్నారో నాకప్పుడు బోధపడలేదు. ఇంచుక భయముతోడనే "ఏమి, యట్లనుచున్నారు" అని యడిగితి.

"ఆతఁడున్న యిల్లెవరిది ?"

"ఒక గొల్లవానిది."

"వాఁడేమి చేయుచుండును ?"

"వాఁడేమి చేయుచుండునో? పగలెప్పుడు మాకుఁ గనఁబడఁడు."

"వాని భార్య కెంతవయస్సు ? దానికెన్నివమాసము?"

"ఏమో, ఇవన్నియు నెవరెఱుంగుదురు ? మాకేమిపని దానిని జూచుటకు ?"

"అయినచో నేమిటి యీయుత్తరము ?" అని పళ్లుకొఱుకుచు సందుగపెట్టెలోనుండి నీవు వ్రాసిన యుత్తరమును దీసి నాపై గిరాటువేసిరి. దానిని జదివితి. అది చదువుచుండఁగనే నాకు నవ్వువచ్చినది. "అనుగో, అప్పుడే పండ్లిగిలించుచున్నావే! ఏమియు నెఱుఁగనిచో ఈసంతోషమెందులకు వచ్చును? చదువుకొనరా, నాయనా అని కొంప తాకట్టుపెట్టి నిన్నుఁ జన్నాపట్టణము పంపుటయును నీవు అచ్చట డబ్బు తగులవేయుట, పైగఁ జెడునడతలు నడచుటయునా? చాలు, చాలు, నీచదువు, ఇంటిదగ్గఱనే యుండు. నీవు చదివి సంపాదింపనక్కఱలేదు గాని మంచిబుద్ధులు నేర్చుకొను."

అని యాయన కోపమునకుఁ గారణము చెప్పిరి. నే

నేమియుఁ జెడునడతలఁ బోతేదని యెంతి చెప్పినను వినరు. నీయుత్త
రము చదివినకొలఁదియు నాకు నవ్వు హెచ్చుగుచుండె. నిన్ను గు
ఱించి యెంత చెప్పినను నమ్మరు. నీవు వ్రాసినయుత్తరము తెలుఁ
గునసైన వ్రాసితివిగాదు. అప్పుడింత పుట్టక పోవును. నీ యుత్త
రము వచ్చునప్పటికి నే నింటియొద్ద లేను. అదియింగ్లీషున నుండు
టచే మాతండ్రిగారు మా గ్రామోపాధ్యాయుని కడకుఁ దీసికొని
పోయి యిదేమియుత్తరము, ఎచ్చటినుండి వచ్చెనని యడిగిరఁట.
ఆ యుపాధ్యాయుఁడు నాల్గవ తరగతివఱకుఁ జదువుకొనెను.
అదియుఁ బూర్వకాలపు చదువు గనుక, నాల్గవతరగతి యైనను
గొంచె మింగ్లీషు రాక పోదు. మాయూర ఆమాత్రిమైనవచ్చిన
వాఁడు ఆయన. ఆయన ఉత్తరము విప్పి మీయబ్బాయికిఁ
జెన్నాపట్టణమునుండి వచ్చినదని చెప్పెనట. "మా ఆబ్బాయికిఁ
జెన్నాపట్టణముననుండి సచ్చిన నింగ్లీషుఉత్తరము చదువుఁడని
మా తండ్రిగారు తొందఱచేసిరఁట. ఆయనచదివి పెదవివిఱచి,
అతిగురుత్వముతో "అబ్బె! మీఅబ్బాయి ఇఁకఁ జెన్నపట్టణము
వెళ్ళిన యెడలఁ బనికిరాఁడండి. ఈ చిన్నతనములో నింకను
బెద్దల యదుపాజ్ఞలలో నుండవలయును గాని మహాపట్టణము
లలో నొంటరిగ విచ్చలవిడిగ నుండరాదు" అని తన యనుమా
నమును ఊహాను ముందుగఁ జెప్పి తరువాత నీయుత్తములో
నొక్కొక వాక్యమునకే యర్థము చెప్పెనఁట ఆయునది వచ్చి
యురాని యింగ్లీషు జ్ఞానము. దానికిఁదోడు నీయక్షరము తెలిసి
యుండవు. నీవుప్రయోగించిన శబ్దములలోఁ గొన్నిటికే యాయ

నకర్థమై యుండును. అవును గాని యింటివాఁడు వాని భార్యను గొట్టఁగ నీవా సంగతి నాకు వ్రాయుటేల చెప్పు? నీయుత్తరము చదువునపుడు నీతో నుండినట్లే కులాసగ నున్నది, కాని నీవు వ్రాసినదంతయు నిజమో హాస్యమునకు వ్రాసితివో తెలి యదు. నాపెట్టి పోయినదని వ్రాసితివి; ఎట్లు పోయినది ? అది దొఱకు నుపాయము కలదా ? ఏమిటది ? దైవానుగ్రహము వల్ల నేను మరల వచ్చుట పడెనేని క్రొత్తపెట్టి తెచ్చుకొన వలెనా ? ఏ సంగతియు నిజము వ్రాయుము. మా రాఘవా చారిగారిని గుంభకోణమునకు మార్చిరా ? మాకు క్రొత్తయు పాధ్యాయుని నియమించిరా ఇంకను లేదా ? నేను వచ్చిన వారము రోజులలోను జాలమార్పులే కలిగినవే ! సోమేశ్వరా, నాకిచ్చుటకుఁ ద్వరగ రావలెనని యున్నది కాని మాతండ్రి గారేమిచేయుదురో? ఒకవేళ నన్ను రానీయక పోయినను నీవు నన్ను మఱచిపోకుము.

పద్మకుమారుఁడు.

ఈయుత్తరము చదివినతరువాత నేఁ జేసినది తప్పని గ్రహించితిని. నా యుబుసుపోని వ్రాఁతలవలన పద్మకుమారు నకుఁ జాలనష్టము కలిగెనని మిక్కిలి విచారించితిని. ఇఁక శశి శేఖరు నుత్తరము వ్రాయుట మానితి. అచ్చట నెవరేమి యర్థముతీసి యామె నేమందురో! ఆనాఁడు నాకు మనశ్శాంతి లేదు. నిష్కారణము పద్మకుమారుని చదువునకు భంగము కల్పించినవాఁడను నేనేయని వగచితిని. నేఁ జేసినతప్పునకుఁ బ్రతీ

కార మేమని యాలోచించితిని. ఏమియుం దోఁచక సాయంకాలము సముద్రపుటొడ్డు కేగుచుంటిని; జేబులోఁ జెయ్యి పెట్టికొంటిని; నాచేతికొక కాగితపుముక్క తగిలెను. అదియేమిటోయనితీసి చూచితిని. అది నే నిచ్చిన జీతమునకుఁ గళాశాలవా రిచ్చిన రసీదు. నాకపుడొక యాలోచన తట్టెను. తోడనే నాగదికి మరలి వచ్చితిని. ఆ రసీదుపై అచ్చులోఁ గళాశాల పేరును, ముద్రయునున్నంత మేఱకు చింపితిని. ఆ ముక్కను నొక కాగితముపై నంటించి మరల పద్మకుమారున కుత్తర మిట్లు వ్రాసితిని.

పద్మకుమారునకు,

ప్రభుత్వమువారి యుత్తరప్రకారము మా కళాశాలలోఁ జదువువారిలోఁ దహసీలుదారు పనికిఁ దగినవారి పేరులు ఆయాజిల్లాల కలక్టరుగార్లకుఁ బంపితిమి. ఈసెలవుల పిమ్మటఁ గళాశాల తెఱవఁగనే వీరందఱకు నిచ్చుటనే పరీక్షయగును. అందు మొదటి ముగ్గురకు వెంటనే యుద్యోగ మీయఁబడును. మే మిచ్చినవానిలో నీపేరుండుటచేత నీకుఁ దెలియపఱచుట యైనది.

అని వ్రాసి యెవ్వరికిని దెలియని వ్రాలు చేసితిని. ఈ యుత్తరము మరల పద్మకుమారుని తండ్రి చూచునట్లు చేయుమని వానికి వేఱే యుత్తరము వ్రాసి పంపితిని.

# 23

## ఆకస్మిక దర్శనము.

మా సెలవులు ముగిసినవి. శశిరేఖను జూచి చాలాదినములైనది. ఆమె కళాశాలలోఁ గనఁబడునని సోమవారము తొమ్మిదియున్నరకే వెళ్ళితిని; కాని కనఁబడలేదు. ఆమె సెలవు కొఱకు వ్రాసినట్లును దెలియలేదు. ఒకవేళ, నామె యాదివారమే బైలుదేరి సోమవారమునాఁటి రైలులో వచ్చియుండు ననియు మంగళవారము కళాశాలకు రావచ్చుననియు నెంచితిని. సాయంకాల మామె కనఁబడవచ్చునని సాగరతీరమున నీచివరనుండి యాచివరకుఁ దిరిగితిని. ఎచ్చటను శశిరేఖ గోచరింపదు.

మంగళవారము నేను నిద్దుర లేచునప్పటికే పెద్దమబ్బు పట్టెను. క్షోణీపాతముగ వర్షము కురియ నారంభించెను. శశిరేఖ ముఖసందర్శనాకాంక్ష మనసులో వర్తింపుచుండ నీవర్షమనఁగ నెంత? మోకాలులోతు నీళ్ళలోఁ గళాశాలకుఁ బోయితి. ఆవర్షమునకుఁ జదువునం దత్యంతశ్రద్ధయున్న యే కొద్దిమంది విద్యార్థులో వచ్చిరి గాని పలువురు రానేలేదు. విద్యార్థిను లెవ్వరును రాలేదు. చాలమంది రానికారణముచే నుపాధ్యాయులును గ్రొత్తపాఠములు చెప్పలేదు. వర్షమట్లే కురియుచుండెను. ఇవతలి కాకి యవతల వ్రాలుటలేదు. మాపాఠము ముగిసినను వర్షములోఁ గదలలేక నీటిధారలవైపుఁ జూచుచు శశిరేఖ వచ్చియుండునో రాదోయని యాలోచించు

కొనుచు సాయంకాల మైదుగంటలవఱకు నచ్చటనే యుంటిని. అప్పుడు వాన కొంచెము వెలిసెను. వెలువఁగనే యింటికి వచ్చితిని మధ్యాహ్నము ఫలాహారము చేయకపోవుటచేఁ గొంచెము "టీ" కాచి త్రాగుదమని కిరసనాయిలు పొయ్యి వెలింగించితిని. దానిపైఁ బింగాణి గిన్నెఁ బెట్టి యందు అప్పుడే కూజానుంచి నీళ్ళు పోయుచుంటిని. అప్పుడే మేడమెట్లపై జోడుచప్పుడు వినంబడియె. నాకొఱకే యెవరో వచ్చుచున్నారని గ్రహించి వారికిని 'టీ' నిచ్చుటకై మఱికొంచెము నీళ్ళు పోయుచుంటిని. ఆసమయముననే శశిరేఖ గది తలుపుత్రోసి లోపలకువచ్చెను. నేను నివ్వెరపోయితి. శశిరేఖయు నేనును గలసికొనుచుంటిమి, సంభాషించుకొనుచుంటిమి. కాని యదివఱకామె నాగదికిఁ గాని, నే నావిడగదికిఁ గాని వెళ్ళియుండలేదు. పొయ్యిదగ్గఱఁ గూర్చున్న నన్నుఁ జూచి యామె "ఓహో చదువు పేరునఁ జన్నపట్టణము వచ్చి మగవారు నేర్చుకొనునది వంటకాఁబోలు" అని నవ్వెను. "మగువలు కళాశాలలోఁ జేరి చదువుచుండ మగవారు వంటగాక యేమి నేర్చెదరు, శశిరేఖా" యని, కూజాను గిటికీలోఁ బెట్టి శశిరేఖ కొక కుర్చీనిచ్చి నే నొకదానిపైఁ గూర్చుంటిని. "మగవారికి వంట క్రొత్తగాదు ; వంటలోఁ బ్రసిద్ధికెక్కినవారు పురుషులే; నలపాకము భీమపాకము అందురు గాని దమయంతిపాకము ద్రౌపదిపాకము అనరుగద, సోమేశ్వరా, మీ పాకమెట్లుండునో చూడనిండు" అని శశిరేఖ మందహాసము చేసెను. "శశిరేఖా చేతగాక పొయ్యి కాల్చుకొను

వానిం జూచి యేల యాక్షేపణము చేయుదువు? అని నేనంటి. అట్లే మేము సంభాషణములోనికి దిగితిమి.

"మీకుఁ జేతగాని దేదికలదు? ఒకవేళ, వంట చేత కాక పోయినను మీరు నేర్చుకొనుఁడు. దానివలన మఱియొకరి కైన సుఖముండును."

"నేను చేయునదంతయు మఱియొకరికొఱకె. నామటుకు నాకు నెలకుఁ బదిరూపాయలైనచోఁ జాలవా? వందలకొలఁది సంపాదింపవలెనను నాశ యెందులకు? అవి యింకొకరికిఁ బెట్టుటకే. ధనార్జనాభార మొకరిది, ఇంటియొద్దఁ గూర్చుండి యనుభవించు వారొకరు! శశిరేఖా, నీవేమనినను సరే గాని మా పురుషుల కున్నంత స్వార్థత్యాగము మీకు లేదు గద."

"నే నట్లొప్పుకొనను. స్త్రీలు చూపెడు స్వార్థత్యాగ పరోపకారములో నెన్నవవంతు పురుషులు చూపెడిది? మీరు నవ్వకుండ నుండుచో నిపుడే యొక నిదర్శనము చెప్పెదను. దీనినబట్టియే యాలోచించుకొనుఁడు. పడఁతి తాఁ దలదువ్వుకొనునదియు జడవేసికొనునదియు నందుఁ బువ్వులు పెట్టుకొనునదియు నెవ్వరికొఱకు? వెనుకనున్న పుష్పములు తనకుఁ గనఁబడవుగద; పరిమళము చూచుటకైన నాశికకు దూరముననే యుండును గద!" అని తానే చిఱునవ్వు నవ్వెను.

ఇంతలో నీళ్ళు కాగుటయు టీ కలుపుటకై నేను లేచితిని. అలమారులో నుండి టీ డబ్బా తీసితిని. శశిరేఖయు లేచి

"సోమేశ్వర, మీారు కాచుటేమిటి? నేను కాచిపెట్టెదను లెండు. ఇపుడే స్త్రీల పరోపకారబుద్ధి తెలియఁగలదు" అని నాచేతి లోని డబ్బా పుచ్చుకొనెను. నేను మాఱాడలేక పోయితిని. ఆమెయే పాలుకాచి టీ కల్పి యొక గిన్నెలోఁబోసి నాకిచ్చెను. మీాతో దాఁచక చెప్పెదను, అపుడు నాశరీరము పులకరించెను. ఆ గిన్నె నందుకొని నిశ్చేష్టుఁడనై యరక్షణమేమియు మాటాడ లేక కుర్చీలోనే కూర్చుంటిని. అపుడు నాకు గిన్నె వేడి కూడఁ దెలిసినది గాదు. నాకుఁ బూర్ణస్మృతి వచ్చినతరువాత గిన్నె క్రిందఁబెట్టి, శశిరేఖా, నీవు మాయింటి యతిథివైతివి. నీవు ముందు గ్రహింపక నేను పుచ్చుకొనననని యామెకును మఱి యొక చిన్నపాత్రను నిచ్చితిని. మేమిరువురమును 'టీ' త్రాగిన పిమ్మట "శశిరేఖా ఈవర్షములో ఏలవచ్చితివి? ఏదేని యవసరముండినను నన్ను రమ్మన్నచో నేనురానా?" యని యడిగితిని. "సెలవులైన తరువాతఁ గళాశాలకు రాలేదు కద. ఏమేమి క్రొత్తక్రొత్త పాఠములు జరిగెనో తెలిసికొనుటకే వచ్చితిని. ఈ సెలవులలోఁ బుస్తకమును ముట్టనేలేదు." అని శశిరేఖ పలికెను.

"క్రొత్తసంగతు లేమియు నుపన్యసింపఁబడలేదు. అశోకుని రాజ్యవిస్తీర్ణమును గుఱించియు నపుడు పరదేశములతో నల్పు వాణిజ్యమును గూర్చియుఁ జెప్పిరి. అది యేపుస్తకము లోనైన నుండును" అని నేను బదులుచెప్పిన తరువాత, "సోమేశ్వరా, సోమేశ్వరా, అను కేకలు వినఁబడెను. నన్నుఁ

బిలుచుచున్నవారిని జూడఁగోరి వీథివైపు వసారాలోనికి వచ్చి తిని. శచీనాథుఁడట నిలువఁబడి "సోమేశ్వరా, ఇంకను జను వేనా ? షికారురావా" యని యడిగెను. "ఈరోజున షికారేమిటి? పైకిరమ్ము" అంటేని గాని యతఁడు రాక "నేను పగలంతయు నెచ్చటికిఁ గదలలేదు; కూపస్థమండూకమువలె నొక్కచోఁ గూర్చుండి యుండలేను; వర్షము వెలిసినది గద; అటుతిరిగి వచ్చెదను. నీవు కూడ రారాదా ?" యని మఱలఁ బిలచెను. నేను కళాశాలకు వెళ్ళి వచ్చితిననియు నింకఁ గదలలేననియుఁ జెప్పితిని. ఆతఁడు వెళ్ళిపోయెను. నేను మరలఁ గుర్చిపైఁ గూర్చున్న పిదప శశిరేఖ "ఎవ్వరాతఁడు" అని యడిగెను. "అతఁడు శచీనాథుఁడు; న్యాయశాస్త్రకళాశాలలోఁ జదువుచున్నాఁడు" అని చెప్పితిని. ఇంతలో దాసి వచ్చెను. అది టీ కాచి తాగిన గిన్నెలు కడిగి లోపలఁబెట్టెను. మరల కాఱుమబ్బు క్రమ్మఁ జొచ్చె, ఉఱుములు మెఱపులు వచ్చుచుండెను. దాసిని బిలచి వంటపూర్తియింటికిఁ బోయి యీసాయంకాల మిద్దఱకు భోజనము తెమ్మనుమని చెప్పితిని. 'ఇద్దఱెవరు ? శచీనాథుఁడుకూడ వచ్చునా ?' యని శశిరేఖ యడిగెను. "రాఁడు. ఈవర్షమిప్పుడప్పుడే వెలియునట్లు లేదు. నీవు భోజనముచేసి, వర్షము వెలిసినపిదప వెళ్ళవచ్చును" అని నేఁ జెప్పితి. ఆమాటకు "అక్కఱ లేదు, సోమేశ్వర ! వర్షము వెలిసిపోవును. ఇంత యట్టహాసముగ వచ్చినది నిలువనేరదు. నేను మాయింటికి వెళ్ళెదను" అని శశిరేఖ పలికె.

"శశిరేఖా, ఈవర్షమే కాదు. ఏదైనను ఇంతే. క్రమముగాఁ బెరిగినది నిలచియుండు నట్లొకసారి క్షణములో వచ్చినది నిలువదు, కోపమే కాదు, అనురాగమే కాదు, ఏదైనను అంతే! కాని పొద్దుటినుండియు మబ్బుగానే యున్నది. ఈవర్ష మింతలో నాగదు. నీవు భోజనముచేసియే వెళ్ళవచ్చును." అంటిని.

"నాకొఱకు నాసఖురాండ్రు కనిపెట్టుకొని యుందురు. ఎటులో యటుల వెళ్ళెదను లెండు." అని యామె ప్రత్యుత్తర మిచ్చెను. మాదాసి యచ్చటనే నిలుచుండెను. ఏమాటయు దానికి స్పష్టముగఁ దెలియకుండుటచే "వంటపూటి యయ్యోరుత్తో నేమి చెప్పుదు సామి?" అని యడిగెను. శశిరేఖా, నీవు దీనిచేతనే మీసఖురాండ్రకుఁ గబురు పంపుము; పోని ఉత్తరము వ్రాసి పంపుము, అని యామెకుఁ గాగితమును గలము నిచ్చి, "ఇద్దఱకును దెమ్మని చెప్పు" అని దాసితో నంటిని. శశిరేఖ ఆకాగితముపై "మందరికా, నేనొక మిత్రుని దర్శించుటకై వచ్చితిని. ఈవర్షముచే నిచ్చటఁ జిక్కుపడితిని. అది వెలిసినా వెంటనే వచ్చెదను. లేనియెడల నాకొఱకుఁ గనిపెట్టుకొనియుండకుఁడు" అని వ్రాసి దాసికిచ్చి దానిని మందరిక కిమ్మని యామె యుండుచోటానవాలు చెప్పెను. ఈమందరిక దేయూరని నేనడిగితిని.

"ఆమెది కటకనగరము. తండ్రి కింకెక్కడనో పనియఁట."

"ఆమెకుఁ బెండ్లి కాలేదా?"

"బ్రాహ్మణులలో నింతవఱకుఁ బెండ్లి కాకుండ నుం

గు రా? అయినను, ఆమె తండ్రిపేరే చెప్పవలయుఁ గాని భర్త పేరు చెప్పు నదృష్టము లేదు."

"ఎవరెంత పెట్టిపుట్టినారో యంతయేకాని." అని నేను పూర్తిగ మాట చెప్పనేలేదు. ఆమె "ఔను సోమేశ్వర, అవును. దీనికెవ్వరిని నన బనిలేదు. తల్లిదండ్రులు బిడ్డల సౌభాగ్యము కోరియే వివాహము చేయుదురు గాని కీడు తలఁపరుగద! తరువాత నెవరి యదృష్ట మెట్లులుండునో!" అనియె. ఆ మాట లాడునపు డామె మోముపై నించుక దైన్యము తోఁచె. ఒక నిముషమునకుఁ గన్నులుచు జలపూరితములయ్యె. అది నేఁ జూడకుండవలయునని "వర్షమింకను గురియుచున్నదా" యని శశిరేఖ వసారలోనికేగెను. అప్పుడామెను జూచి నాకును జాలిపుట్టెను, "ఇపుడప్పుడే వర్షము వెలియదు, శశిరేఖా, రా, కూర్చుండు మనిపిలచితిని. ఆమె వచ్చికూర్చుండెను. చీఁకటి పడుటచే దీపము వెలిఁగించుటకై కిరసనాయులు పొయ్యి ప్రక్కనగ్గిపెట్టెకుఁ దడవుచుంటిని. "ఏమిటి యట్లు వెదకుచుంటి" రని శశిరేఖ నన్నడిగెను. ఇందాక అగ్గిపెట్టె నిచ్చటఁ బెట్టితిని, దానికై చూచుచుంటి నంటిని. "దానిని దీసి నేను కిటికీలోఁ బెట్టితిని. నేను వెలిఁగించెదను లెండు." అని యామె పలికెను. నీ వెందులకు శశిరేఖా, నేను వెలిగించెదను, అని నేఁబల్కనను "సోమేశ్వరా! మీయింట నేను దీపము పెట్టఁగూడదా ?" యని యామెయే యగ్గిపెట్టె తీసి దీపము వెలిఁగించెను. అపుడే వంటపూటయింటినుండి బ్రాహ్మణబాలుఁడు భోజనము గొని

వచ్చెను. "శశిరేఖా, లెమ్ము. బైటఁ గుండలో నీళ్ళున్నవి. కాళ్ళు కడుగుకొనుము. పెందలకడ భుజింతము; వర్షము వెలియఁగనే నీవు వెళ్ళవచ్చును" అంటిని. ఆమెయు లేచి "సోమేశ్వరా, నా కాకలి లేదు. నే నిక్కడకు వచ్చునపుడే ఫలాహారము కూడఁ జేసితిని. అయినను మీమాట దీసివేయ లేక వచ్చుచుంటి నని కాళ్ళు కడుగుకొని వచ్చెను. నేను పెట్టెలోనుండి మడత చొక్కా దీసికొని బైటకుఁ దెచ్చుకొంటిని. కాళ్ళు చేతులు ఒళ్ళు శుభ్రముగఁ గడుగుకొని మడతచొక్కా దొడుగుకొని లోనికి వెళ్ళితిని. నేను వెళ్ళునప్పటికే యామె రెండరఁటియాకులను వేసి వంటపూటివాఁడు పంపినది వడ్డించెను. వచ్చిన యతిథిని సత్కరించుటకై నే నింటికడనుండి గొనివచ్చిన యావకాయను దీసి వడ్డించితిని. "ఆవకాయ ఇంటినుండి తెచ్చితిరా? చూడఁగ చదువుమీఁదకంటె భోజనముపై నెక్కువ శ్రద్ధ యున్నట్లున్నదే!" అని యామె నవ్వెను. చదువే భోజనము నిమిత్తమైనపుడు భోజనమే ప్రధానము కాదా యని యడిగితిని. నేను విస్తరిదగ్గఱఁ గూర్చుని శశిరేఖను గలుపుకొమ్మంటిని. అపుడే శచీనాథుఁడు "సోమేశ్వరా, తడిసిపోవుచున్నానోయి" అని కేక వేసెను. "శచీనాథుఁడు వచ్చిన ట్లున్నాఁడే! ఆతఁ డిటువచ్చునా" యని శశిరేఖ కలుపుకొనుట మాని నన్నడిగెను. ఆతఁడు రాఁడని చెప్పి నేను లేచి నా గొడుగును బుచ్చుకొని క్రిందకు వెళ్ళి దాని నాతని కిచ్చితిని. అతఁడు వెళ్ళఁగనే నేను గదిలోనికివచ్చి విస్తరియొద్దఁ గూర్చుంటిని.

శచీనాథుని గది యెక్కడ? యని శశిరేఖ యడిగెను. అతఁడక్బరు సాహెబు వీధిని గాఁపురమున్నాఁడని చెప్పితిని. మీకొఱకు వచ్చినవానిని మేడమీఁదకైన రానీయక వీధిలోని వాని వీథిలోనుండియే పంపినారే! ఇదేనా మర్యాద అని శశిరేఖ నవ్వెను. నేఁ బిలచిన నితఁడిచ్చట నొకగంట కూర్చుండును. ఇతఁడు వెళ్ళువఱకు నితని భార్యయు భోజనము లేక వేచియుండునుగద! అందువలననే పిలువలేదు అని చెప్పితిని. ఆహాహా! అంగనలపై మీకుఁగల యాదరణము! అని శశిరేఖ పలికెను. నేను కూర కలుపుకొనఁబోవుచు నాపూట పంపినది గోరుచిక్కుడుకాయ కూరయగుట చూచితిని.

''శశిరేఖా, వీరికి డబ్బే ప్రధానముగాని వేఱొకటి కాదుగద! నీవు వచ్చినట్టుగనే వీఁడు గోరుచిక్కుడుకాయకూర పంపినాఁడు. పాపము నీకీపూట భోజనము సరిగలేదు అంటిని. అంనుల కామె వెఱఁగుపడుచు ''నిజమె, గోరుచిక్కుడుకాయ నాకు సహించదు. కాని వాఁడు పంపినది గోరుచిక్కుడు కాయయా? సోమేశ్వరా, నే నిదివఱకే ఈకూరతోఁ దింటిని. కాని గోరుచిక్కుడుకాయ యనుకొనలేదే. మీసన్నిధాన మాహాత్మ్యము కాఁబోలు; దానికి సహజముగ లేని యత్యంత మనోహరమైనరుచి వచ్చినది. అదే యననేమి ఈపూట భోజనమంతయు నల్లేయున్నది." అని వచించెను. "శశిరేఖా యీ యుపచారవాక్యములు చాలించు'' మంటిని. "మిమ్ము పొగడుటకుగాని హాస్యమునకుఁగాని యనుటలేదు సోమేశ్వర! నిజ

ముగ నంత యద్భుతరుచిగ నున్నవి. ఇది మీ మాహాత్మ్యము గానిచో వంట చేసినవానినే పొగడవలయును" అని యామె ప్రత్యుత్తర మిచ్చెను. మేమిట్లు సంభాషించుచు భోజనము చేసితిమి:

"ఏమైనను వంటపూటి యింటివి మనము ఇంటిలోఁ జేసికొనినట్లు శుభ్రముగ నుండవు, అంతవఱకెందులకు, మన యిండ్లలోనే మనవారందఱు చేసినట్లు వంట లక్కలు చేసినవి యుండునా? ఏదో ఇప్పుడు నీ కాంక్ష తీరిన నంతేచాలును."

"నిజమె లెండు. మనము స్వంతముగఁ జేసికొనినట్లు వంటలక్క లేల చేయుదురు? ఆమధ్య కొన్నిరోజులు నా బావగారింటిలో వంట లక్కను జూచితిని. ఆవిడ యిష్టము వచ్చినట్లు మనము చేయించుకొన వలసినదేకాని మనయిష్టము వచ్చినట్లు ఆవిడ చేయదు. కాని తప్పనిసరి."

"తప్పనిసరి కేమి శశిరేఖా, ఇంటిలో పనిపాటలు చేసికొనుట మోటగుచున్నది; అది యనాగరికత!"

"చేసికొనలేనివారు వంట లక్కను బెట్టుకొందురు గాని యందఱు కాదుగద."

"శశిరేఖ, వంట లక్కను బెట్టుకొనుట గొప్ప! గొప్పవారు పనిచేసికొనుట తప్పు! అంగడిలో నర్ధణా తోటకూర కొన్నచో దాని నింటికిఁ గొనివచ్చుటకు అర్ధణాకూలి. మగవారిలోను నట్లే యున్నదిలే! అట్లే కాఫీకాచుటకైన వంటలక్క యుండవలెను; పనిచేయుట సౌకుమార్యమునకు లోటుగద!

ఏ పరిపాటులు లేకుండ నుండుట సుఖము. నౌకర్లు చాకర్లు యుండి తాంబూలమైనఁ జుట్టి యీయనక్కఱలేని పడంతి యెంతో యదృష్టవంతురాలు!!"

"బద్ధకురాలిమాట చెప్పలేను గాని యుత్తమకాంత యట్లు తలంపదు సోమేశ్వరా! ఆఁడువారి చిత్తముగూర్చి పలుకుట కధికారము నాకుఁ గలదు గాని మీకుఁగాదు. నేఁ జెప్పెడిది వినుఁడు. ప్రతి కాంతయును దన మనోనాయకునకుఁ దా స్వయముగ నే యమర్చిపెట్టుట సంతోషదాయకముగాని యా పని నొరుల కప్పగించుట కాదు. ఇతరులకుఁ జేసిపెట్టవలసి వచ్చి నపుడా, యది వారివారినిబట్టి యుండును. సోమేశ్వర, నేను జెన్నపట్టణము వచ్చినతరువాత నిట్లెప్పుడు భుజింపలేదు. లేమిటే యాయాసముగ నున్నది. నిజముగ మాయింట భోజనము చేసి నట్లే యున్నది అనుచు నూడిగఁపుఁ బల్కులతో శశిరేఖ లే చెను నేనును లేచి దాసి కొక కాని నిచ్చి తమలపాకులు తెమ్మం టిని. దాసి విస్తరు లెత్తివేసి నీళ్ళు జల్లినతరువాత మేము గది లోనే కూర్చుండి తాంబూలము వేసికొంటిమి. "ఈసంవత్సరము మాఅన్నయ్యకూడ వచ్చి న్యాయశాస్త్ర కళాశాలలోఁ జను వును ననియె. అతఁడు వచ్చునెడల మే మిరువురము నొకయిల్లు పుచ్చుకొని యుండఁదలఁచితిమి. నాకది నేఁడు జ్ఞాపకము వచ్చి నది." అని శశిరేఖ నుడివెను. అట్లైనచో నాతఁ డెందులకు రాలేదని యడిగితిని. మాయమ్మ వెళ్ళవల దనినది. మా పదినెగారును వలదనినది. కాఁబోలు! అని నవ్వి, సోమేశ్వర

మీా కిట్టిబంధములు లేవుకద! మీాయిష్టమువచ్చినట్లు మీారు చదువుకొనెదరు. లండను వెళ్ళినను వెళ్ళవచ్చును. అని యామె పలికెను. నా నిజస్థితి యామె యెఱుఁగలే దనుకొంటిని. నేను తెల్పుదునా యనుకొంటిని. కాని మరల దాఁచితిని. "ఏబంధనములున్నను గొన్నివిషయముల నేనే స్వతంత్రుఁడ నని చెప్పితిని గాని నామనస్సు వ్యాకుల పడఁజొచ్చెను. నేను మాటాడకయూరకుంటిని. నాచిత్తవిభ్రమ మామెకు గోచరించునేమో యని భయపడితిని. శశిరేఖా, అశోకుఁడు మంచిసమయమునకే రాజయ్యెను. లేనిచో బ్రాహ్మణప్రభావ మెక్కువగనే యుండెడిదిసుమా" యని తెలిసియో తెలియకయో యంటిని.

"ఇపుడు మాత్రము బ్రాహ్మణ ప్రభావమునకుఁ దక్కువ యేమియున్నది? బౌద్ధమతము పుట్టినది మనదేశమందే; కాని పుట్టినచోటునుండి వెడలఁగొట్టిరి. అది బ్రాహ్మణప్రభావముకాదా? దీని కిపు డెవరైనఁ జింతించుచున్నారా? ఇదియులేదు."

"అవునులే. పూర్వము బ్రాహ్మణధర్మము లింతకంటె విశృతముగ నుండవలయును. లేనిచో బ్రాహ్మణులకు బౌద్ధులకు నింతవైరము రాదు. ఇపుడు చాల మాఱినది; కాని కొద్దియేండ్లకుఁ బూర్వమే విపరీతముగ నుండెడివి. మన దేశములో నీ సంస్కారములకు వీరేశలింగముగారే కారణము."

"నిజమె. ఆయనవ్రాసిన ప్రహసనములతో వలెనే వెనుక నుండుచో ఆయన గొప్పమార్పుచేసి మహోపకారము

చేసినా రన్నమాటయే. ఆయన చేసిన ముఖ్యసంస్కార మొకటియున్నది. దానింగూర్చి మీయభిప్రాయ మేమిటి?" అని వీథివైపు చూచి "వర్షము వెలిసి నట్లున్నది. నే నిపుడే వెళ్ళెదను." అని శశిరేఖ పలికెను.

దాసిని బండి దీసికొనిరమ్మని పంపి "ఆసంస్కారమును గుఱించి పెద్దపెద్దలే తగవులాడుకొనినారు. నీ వే మనియెదవు?" అని శశిరేఖ నడిగితిని.

దాసి దగ్గఱనుండియే జట్కాబండి తీసికొనివచ్చి క్రింద నుండి కేకవేసెను. శశిరేఖ వెళ్ళెద ననియెను. నేను ఆమెతోఁ గ్రిందకు దిగి యామెను బండియెక్కించి పంపితిని.

---

# 24

## విజ్ఞాపనము.

నాంగదినుండి వెళ్ళినతరువాత శశిరేఖకు నిద్దురపట్టినది కాదు. ఆమె మనస్సులో నుత్సాహము పొంగి పొరలుచుండెను. ఆ యుత్సాహ బలమున నామె యా రాత్రియే తండ్రిగారి కిట్లు ఉత్తరము వ్రాసెను.

మహారాజశ్రీ నాన్నగారికి,

నేను వ్రాసిన యీ యుత్తరము మీరు పూర్తిగఁ జదువఁ గోరుచున్నాను. నాయందు మీ కుండిన ప్రేమచే నా వ్రాసినది మీరు చదువక మానరని నే నెఱుఁగుదును గాని యింను

మాతృ మొకవిపరీత విషయమునుగుఱించి వ్రాయ సాహసించుచున్నాను. అందుచేతనే మిమ్మిట్లు కోరితిని.

నామనస్సున కిపుడు వచ్చిన చెప్పరాని యావేశముచేత నీయుత్తరము వ్రాయఁ బ్రారంభించితినిగాని నేఁ జెప్పఁ దలఁచుకొనినవిషయము నెట్లుచెప్పవలెనో తెలియకున్నది. అది అపూర్వ మైన దనియు, నింతవఱకు నాక్షేపింపఁ బడిన దనియు నే నెఱుంగుదును. నావ్రాఁతకు మీ రేమందురో యని కూడ నామనసు వ్యాకులపడుచున్నది. అయినను మీదగ్గఱ నాకుండిన చనువుచే భయమువిడచి చెప్పెదను. నాశైశవమున నన్నెంత గారాబముతోఁ బెంచిరో నాకుఁ దెలియదుగాని నాకు జ్ఞానమువచ్చినపిదప మీరు నన్నెంత ప్రేమించినదియు నే నెఱుఁగుదును. మీరు నా సౌభాగ్యమునే కోరి దానిం బొందించుచుండ దైవము నా కపకారముచేయఁగ మీరును అమ్మయు నాకై యెంత పరితపించినదియు నిప్పటికి నాకు జ్ఞాపక మున్నది. నాదుఃఖమును మఱపించుటకై మీ రన్నిభంగుల యత్నించి మీ యుద్యోగమునుగూడ మాని బంధువులాక్షేపణసేయు చున్నను దానిని గణనసేయక నన్నుఁ గళాశాలలోఁ బ్రవేశపెట్టించినదియు నాకుఁ దెలియదా? నాన్నగారు! వెనుక నాకువచ్చిన యాపత్తునకు ఏల వగచితిరో అపుడు నాకుఁ దెలియలేదుగాని దాని తీక్ష్ణత యిప్పుడు నాకు బోధపడుచున్నది. మీకును నాకును సంతత దుఃఖదాయకమైన నన్నుఁ జూచుకొనిన నాకే విచార మగుచున్నది.

మీరు నాయెడఁ జేసిన లోప మేమాత్రమును లేకపోయినను నాకీ ప్రపంచమంతయు శూన్యముగనే గనంబడుచున్నది. నే నెంతకాల మిట్లు నిరంతర దుఃఖముతో వేఁగిపోవలయును? దీనికిఁ బ్రతిక్రియ లేకపోవునా? మానుషయత్నముచేఁ దీరని కొఱంత యుండునా? ఈ విషయములను దలపోయుటే యసహ్యముని యెంచకుఁడు. నా భావిదశనుగూర్చి నే నాలోచించుకొనునపుడు నాకాధారములేని యగాధమువలెనే యుండును గాని నిలువనీడ యుండునట్లు తోఁచదు. నేను కొన్నిదినములు తలఁపోసి తలఁపోసియే తుదకు మీకు వ్రాయ సమకట్టితిని. మీకే యిది విరుద్ధముగఁ దోఁచుచో నిం కెవ్వరితోడను నా యుత్తరముసంగతి చెప్పకుఁడు; అమ్మతోఁగాని అన్నయ్యతోఁగాని కూడ చెప్పవలదు. మీరు సావకాశముగ నన్నిసంగతులు నాలోచించి జవాబు వ్రాయుఁడు.

శశిరేఖ.

---

## 25

### అతిథి.

నేను పద్మకుమారునకు వ్రాసిన యుత్తర మూరకపోలేదు. అతనిం బంపుట కాతని జనకుఁడు సమ్మతించెను. కాని నాతోఁ జెలిమి మాని నాకు దూరముగ నుండుమనియు నిఁకనైన మంచిబుద్ధులు నేర్చుకొని శ్రద్ధగఁ జదువుకొనుమనియుఁ

బలుమఱు బోధించి బోధించి పంపెనఁట. తండ్రితో నేమి చెప్పినను నాతోఁ బద్మకుమారుఁడు యథాప్రకారమే మసలుచుండువాఁడు. ఇతఁడు వచ్చిన మూఁడు వారములకు నితని మామగారు, ప్రద్యుమ్నుఁడుగారును జన్నపట్టణము వచ్చిరి.

రైలు దిగి రాఁగానే పద్మకుమారుఁ డాయనను నాగదికిఁ దీసికొనివచ్చెను. అప్పటికి నేను భోజనము చేయుచుంటిని. నా గదియు గదిముందఱ డాబాయు విశాలముగ నుండుటచేతను, నాతోఁబాటు ఆయనకునుభోజనమింటికిఁ దెప్పింపఁదలఁచి యుండుటచేతను దనమామగారిని నాగదియందుంచుదునని పద్మకుమారుఁ డనియె. అందుల కెట్టియభ్యంతర ముండదనియుఁ దమ స్వంతగృహమున నట్లు స్వేచ్ఛగనుందురో అట్లే నాగదియందు నుండవచ్చుననియుఁ జెప్పితిని; మఱియు ఆయన స్నానము చేసి వచ్చులోపలనే భోజనము తెప్పించెదనని చెప్పితిని. ఇటు నటుఁజూచి, ప్రద్యుమ్నుఁడుగారు ఈ యిల్లెవరిది యని ప్రశ్నించిరి. గొల్లబది యని నేఁ జెప్పఁగనే ఆయన 'అబ్బె, ఈయింటిలో నెట్లు భుజించుట, ఎంత బ్రాహ్మణ్యము చెడినను?' అనెను. "వంటపూటి యింటికడఁ దినుట కంటె నిచ్చటనే శుభ్రముగ నుండును. అచ్చట విస్తరి తీసి విస్తరి వేయుదురు గాని నీళ్లైనఁ జల్లరు. చిరకాలమునుండి యింకియున్న సాంబారు కొళంబుల దుర్గంధము కూడ నెక్కువగ నుండును. మీరిక్కడనే భోజనము చేయుఁడు. మీరున్నన్నినాళ్లు పద్మకుమారుఁడు కూడ నిచ్చటనే భోజనముచేయును" అని చెప్పితిని. దాని కాయన సమ్మ

తింపలేదు. "నాకు వంటపూటియింట భోజనము మొదటినుం డియు నలవాటే. నెలకు నిరువదితొమ్మిది రోజులు రాజమ హేంద్రవరములోఁ బూటకూళ్ల యింటిలోనే నాభోజనము. నేనచ్చట కేఁగియే భోజనముచేసెదను" అనెను. పద్మకుమారుఁ డాయన మాట కెదురుసెప్పలేదు. నేనును సరే, మీయిష్ట మంటిని. నేను పదిగంటలకే కళాశాలకు వెళ్లవలయును గనుక, ఆయన స్నానముచేసి భోజనముచేసి వచ్చువఱకు ఆగక నాగది తాళముచెవి ఆయన కిచ్చితిని. "గదినుండి వెళ్లునపుడు తాళము వేసి వెళ్లుఁడు. మీ రెచ్చటికి వెళ్లినను సాయంకాల మైదుగంటలకు మాత్రి మొక్కసారి రండు. పద్మకుమారుఁడు కళాశాలకు వెళ్లక యుండుచోఁ దాళముచెవి యతని కిచ్చినను సరే" అని చెప్పి నేను కళాశాలకుఁ బోయితిని.

మధ్యాహ్నము నాకుఁ గళాశాలలోఁ బాఠము లేక పోయినను, నాగది తాళము వేసియుండునని సాయంకాల మైదు గంటలవఱకు నచ్చటనే యుంటిని. అప్పుడు బైలుదేరి ముందుగఁ బద్మకుమారుని గదికేఁగి వానిందీసికొని నాగదికి వచ్చితిని. ప్రిద్నశ్యుఁడుగారు రాలేదు; తాళము చెవి యీయనకడనే యున్నది; కావున డాబామీఁదనే కూర్చుండి కబురులు చెప్పు కొంటిమి. గది యూడ్చుటకు దాసివచ్చి ఊడ్చకయే వెళ్లిపో యెను. చీఁకటిపడినను దీపము పెట్టుటకు వీలులేదయ్యె. వంట పూటి యింటినుండి నాకు భోజనమును వచ్చెను. కాని బైటనే మేమిరువురము కూర్చుంటిమి. పిమ్మట మాయతిథి వచ్చి, మేడ

మెట్లు ఎక్కుచునే "అబ్బబ్బ, ఏమి పట్టణమండి! తాళవలెచెవి కొఱకు మీ రిబ్బంది పడుచుందురని త్వరగ వచ్చితిని గాని" అని వర్ణింప నారంభించెను. ఇదివఱకు మీరిచ్చటకు రాలేదా యని యడిగితిని.

"ఎంతకాలమునుండియో రావలయునని ప్రయత్నమే గాని వచ్చుట పడినది కాదు."

"పడుట కేమున్నది? మీరు నిజముగఁ దలఁచుకొనినచో రాజమహేంద్రవరము నుండి యొక్క రాత్రిగద ప్రయాణము?"

సరే, ప్రయాణమునకు భయపడియా? స్వంతసొమ్ముతోఁ బ్రయాణము చేయుట ప్రయోజకత్వము కాదు. అట్లైనచో నిదివఱకే పదిసారులు వచ్చి యుందును. ఇప్పుడు మనకు ఖర్చుకాకుండ ఒకఁడు దొరకినాఁడు."

"మీతో నింకెవరైన వచ్చినారా?"

"నాతో నెవరు రాలేదు. అసలువాఁడు కూడ వచ్చుచో నన్నిట్లు తిరుగనిచ్చునా? ఈరోజంతయు దుకాణములే చూచుచుంటిని. కాని కొన్నిటిలోనికి రాకూడదనినా రేమిటి? వారికన్న పైమెత్తు నేను వేసితిని. నాకు సరకు కావలయునని దుకాణమంతయుఁ జూచి చూచి యందు లేనిదానికై యడుగువాఁడను."

"మీరు వచ్చిన పనియైనదా?"

"ఏది? ఇంకను పనివిషయమై వెళ్ళనిదే. రేపు ఆ ప్రయత్నము".

నేను దీపము వెలిగించి నాభోజన పాత్రలను గదిలో నికిఁ దీసికొని వెళ్లితిని. అది చూచి యాయన మీరిఁక భోజ నము చేయుఁడు, మేమును భోజనముచేసి వచ్చెద” మని యెను.

వారిరువురు వెళ్ళిరి. నేను భోజనముచేసి వారికొఱకు, దీపమార్పక గదితలుపు తీసియుంచితిని. ఆరాత్రి పూటకూళ్ళ యింట భోజనముచేసి నాటకము చూడఁబోయిరఁట. నాట కము ముగియునప్పటికి ట్రాము లేకపోవుటచే రూపాయ యిచ్చి బండినెక్కి వచ్చుటేల యని యారాత్రి నాటకశాలకడ నే పరుండిరఁట; మఱునాఁ డుదయమున నే నాగదికి వచ్చిరి. ఇటనుండి పద్మకుమారుఁడు తనగదికి వెళ్ళిపోయెను. ప్రిథ్నశ్వుఁ డుగారు యిచ్చటనే స్నానముచేసి చొక్కా తొడుగుకొని వెళ్ళఁ బోవుచు “ ఇక్కడమంచి న్యాయవాది యెవ్వరండి ? మనము చెప్పినదంతయు విని సరసముగ మాటాడు వారెవ్వరు ?” అని యడిగెను. నాకుఁ దెలియదంటిని. “సరే, మైలాపురము వెళ్ళి నేను కనుగొనెదను లెండు, డబ్బు ఇచ్చినా మాటాడని న్యాయవాది యుండఁడ”ని వెడలెను. ఆయన తిరిగి వచ్చు వఱకు నేను కళాశాలకు వెళ్ళక యుందుసంటిని.

పదిగంటలు దాఁటినను ఆయన తిరిగి రాకపోవుటచే తాళముచెవి యింటిగొల్లవాని చేతికిచ్చి నాకొఱకు వచ్చిన వాని కిమ్మని చెప్పి నేను కళాశాలకు వెళ్ళితిని. ఒంటిగంటకు నేనును శశిరేఖయు గ్రంథభాండాగారమున నొకపుస్తకము చదువుచుఁ గూర్చుండుటచే నేనపు డింటికి రాలేదు. సాయం

కాల నైదు గంటలకే వచ్చితిని. మాయతిథి గదికి తాళము వేసి దానిని తనతోఁ గొంపోయెనఁట. ఆతఁడు వచ్చువఱకును డాబామీఁదనే కూర్చుంటిని. పిమ్మటఁ బద్మకుమారుఁడును వచ్చెను. పదంపడి యొకయరగంటకు నతని మామగారువచ్చిరి; శుభ్రమైన మంచినీళ్ళు ఉన్నవా యని యడిగిరి. గదిలోఁ గూజాలో నున్నవని చెప్పితిని "అబ్బె, ఆనీళ్ళు నేను త్రాగను. ఆకూజా మీ బాసినుట్టుకొనుచునే యుండును. మీరొక పాత్రతో స్వయముగాఁ దెచ్చిన నీళ్ళు లేవా" యని యడిగిరి. తను యల్లునకుఁ బని చెప్పలేక నన్నుఁ గ్రిందకుఁ బోయి కుళాయి దగ్గఱ నీళ్ళు పట్టి తెమ్మనుచున్నారని గ్రహించితిని. పద్మకుమారా, మీ మామగారు మంచినీళ్ళు కావలెననుచుండఁగ నిచ్చటఁ గూర్చుండు వేమి యంటిని ఆతఁడు గదిలోనుండి పంచపాత్రను బుచ్చుకొని క్రిందకు దిగెను. ఆయన ఆచారమును గుఱించియు దానిని గూజానంటుకొన రావమును నుపన్యసింప మొదలిడిరి. ఆసమయమునను శచీనాథుఁడుకూడ వచ్చెను. ఇతఁడాయనతో వాదమునకు దిగెను. పద్మకుమారుఁడు నీళ్ళు తెచ్చె. అతనిమామగారు త్రాగుచుండిరి. శచీనాథుని యుపన్యాసము మాత్ర మాగలేదు. ఆయన మన పద్మకుమారుని మామగారని వానికెఱింగించితిని; మీరు వెళ్ళిన పనియేమయ్యెనని ఆయన నడిగితిని. ఏమిటాపనియని శచీనాథుఁ డడిగెను. "మా గ్రామములో కమ్మ యొకఁడు తన పాలేరు వానికి ముప్ప దెకరముల భూమి వీలు వ్రాసి యిచ్చినాఁడు.

వ్యాజ్యము వేసి దానిని రాఁబట్టుకొనవలయును. అందును గురించి యిచ్చటకు వచ్చితిని" అని యాయన చెప్పెను. వ్యాజ్యె మిచ్చటనే వేయవలెనా యని యడిగితిని. రాజము హేంద్రవరములో వేయవలసియున్నను నిచ్చటి న్యాయవాదు లతో నాలోచన కొఱకు వచ్చితినని యాయన చెప్పెను. ఆవిష యములు న్యాయశాస్త్రము చదువుచుండిన మాశచీనాథునకుఁ గాని నాకుఁ దెలియవని యంటిని. నేనట్లు చెప్పఁగనే మా యతిథి తావినిన కొందఱు న్యాయవాదులపేరులు చెప్పి వారెట్టి వారు పీ రెట్టివారని యడిగెను. ఒకఁడు డాంబికుఁడనియు నొక నికి ధనాశ మెండనియు, వేఱొకనికి మనము చెప్పిన దర్థమే కాదనియు శచీనాథుఁడు తెల్పెను. పిమ్మటఁ బ్రశ్నకర్తఁడుగా రిట్లనిరి. "నన్నొకాయన కనుగొనుమనిన సంగతి జ్ఞాపకమువచ్చి నది. మీరు న్యాయశాస్త్రము చదువుచున్నారు గావున మీకుఁ దెలియును, నేనెక్కడడిగెదను, చెప్పఁడు. ఒకాయనకు నలుగు రైదుగురు కుమారులున్నారు. ఆయన దంతయు స్వార్జితమే కాని పిత్రార్జితము లేదు. ఉన్నను మూఁడు నాలు గెకరముల కంటె నెక్కువయుండదు. ఆయన కుమారునకు వివాహమైన తరువాత ఆపిల్లవాఁడు చనిపోయినాఁడు; కోడలకుఁ బోషణము నిమిత్త మేమైన నీయవలసియుండునా?"

"కోడలుగదా, ఏమైన ఇచ్చిన తప్పా ? దీని కింత యాలోచన మెందులకండి?" అని శచీనాథుఁ డనెను.

"కోడలకేగాదు, ఎవరికిచ్చినను దప్పులేదు. తప్పా యని

కాదు నేనడిగినది. ఈయవలసిన బాధ్యతయున్నదా? ఆకోడలే వచ్చి వారింటఁ బనిపాటలు చేయుచుండిన ఏదైన నీయవచ్చును. ఆవిడ పుట్టినింటనుండి మామగారి సొమ్ము తండ్రిగారికిఁ బెట్టుటకా యిచ్చునది?" అని పృధ్వస్వామిగారు ప్రత్యుత్తరమిచ్చిరి. దానికి శచీనాథుఁడు "బంధుత్వము చెడఁగొట్టుకొనకుండ సరళముగ వ్యవహారము కుదుర్చుకొనవలెననుచో నెట్లైనఁ జేసికొనవచ్చును; లేదా 'అబద్ధంవా సుబద్ధంవా, కుంతీపుత్రో వినాయకః' అని యేవో యబద్ధములాడి పితార్జితమే లేదని గాని ఆబిడ నడవడి చెడిపోయెనని గాని వాదింపవచ్చును" అని యాలోచన చెప్పెను. శచీనాథుఁ డిట్లు పల్కుచుండఁగనే శశిరేఖ వచ్చెను. ఆమె వచ్చునని నే ననుకొనలేను; వచ్చెదనని మధ్యాహ్నము నాతో నాబిడ చెప్పనులేదు. ఆమెను జూడఁగనే నేను లేచి గదిలోనికి వెళ్లి యొక పుస్తకమును దీసికొని వచ్చి యామెకిచ్చి 'నీ వీ పుస్తకమును వెంటనే తిరిగి యిచ్చివేయవలెను. నే నింకను ముగించలేదు' అని చెప్పి పంపివేసితిని. మాయతిథి ఱెప్ప వేయకయే మావైపు చూచుచుండెను. నేను మరల వారియొద్దకేగి కూర్చున్నతరువాత "ఎవరు ఈఅమ్మాయి" అని యాయన ప్రశ్న వేసెను. "ఆబిడ సోమేశ్వరుని యనుంగు నెచ్చెలి" అని శచీనాథుఁడు పలికి నావైపుఁ జూచి మందహాసము చేసెను. ఆతని హాస్యమును బోఁగొట్టు గురుత్వముతో నేను "ఈబిడ మాంతరగతిలోఁ జదువుకొనుచున్నది లెండు, ఏదైన పుస్తకము కావలసిన యెడల నాయొద్దకు వచ్చుచుం

డును" అని యేమాత్రమును నవ్వక హాస్యముచేయక పలికితిని. "బ్రాహ్మణులేనా" అని మరలఁ బ్రధ్నశ్వుఁడుగా రడిగిరి. "బ్రాహ్మణులు కానిచో నింత చదువెట్లువచ్చును? ప్రతిదానికిని మన బ్రాహ్మణులే సిద్ధము" అని శచీనాథుఁడు చెప్పెను. మాయతిథి ప్రశ్న లింతటితో ఆగలేదు.

"ఎవరమ్మాయి ఈచిన్నది?"

"ఎవరి కుమారిత అయ్యా, ఈబిడ" అని శచీనాథుఁడు నన్నడిగెను.

"ఈమె చైకితాయనుఁడుగారి కుమారిత; మాయూరి దగ్గఱనే వారున్నారు."

"ఏయూరిలో'" అని ప్రధ్నశ్వుఁడుగారు మరల ప్రశ్నించిరి. ఈప్రశ్నలకు నాకు విసుగుపుట్టుచుండెను. అయినను జవాబు చెప్పని యెడల నేమనుకొనునో; వారిది తక్షనగరము అని చెప్పితిని. అప్పటికిని నన్ను విడువఁడు.

"తక్షనగరములో నెవరండి? ఏమిపని యాయనకు?"

"వెనుక నేదోపని. ఇపు డేమియులేదు. ఆయన కుమారుఁడు కళాశాలలో నుపాధ్యాయుఁడు."

"ఓహో, ఆయనా, హవ్యవాహనుని వియ్యంకుఁడా? పాపము. ఈ అమ్మాయియేనా, ఆయన కోడలు?"

"ఏమో, నాకుఁ దెలియదు."

"ఈమెకుఁ బెండ్లియైనదా, అది చెప్పుఁడు, తరువాత సంగతి నేను చెప్పెదను."

"నాతో ఆప్రసంగమేమి రాదండి, మాతరగతిలోఁ దెలుఁగువారము మేమే కనుక ఏదైన పుస్తకముకొఱకు ఆవిడ నాయొద్దకు వచ్చుచుండును"

"మీకుఁ దెలియదేమో కాని, ఈ అమ్మాయియేనండి, హవ్యవాహనుఁడుగారి కోడలు. ఏదో శాస్త్రము చెప్పిన ట్లున్నది. ఇపుడు మి మ్మాలోచన అడిగిడితినే, అది ఈ అమ్మాయి విషయములోనే," అని శచీనాథుని వైపు తిరిగి పలికిరి.

"రంగురంగుల చేఁపలు, ఎఱ్ఱనివి, నల్లనివి, పచ్చనివి, ఇతర విచిత్రములు, ఉన్నవి మీరు చూచితిరా" యని నేను ప్రద్యుమ్నుఁడుగారి నడిగితిని. ఆయన "లేదండి, చూచెదము, మీరు కూడ వచ్చెదరా?" యని యడిగెను. వెంటనే గదికి తాళము వేసి మే మందఱము వెళ్లితిమి.

ఆ రాత్రి భోజనము చేసి మా యతిథి తమ గ్రామమును వెళ్లిపోయెను.

---

# 26

## పునర్విజ్ఞాపనము.

శశిరేఖ వ్రాసిన యుత్తరమునకుఁ దండ్రియొద్ద నుండి జవాబునకై యనుదినము నిరీక్షించుచుండెను. అది యెప్పుడు వచ్చినను దండ్రి సమ్మతి యిచ్చినట్టులే యందుండునని యెంచు కొని సంతోషముతో నుండును. కాని దానిని బ్రత్యుత్తముగ

నుత్తరమందుఁ జరుగుటకు వేగిరపడుచుండెను ఉత్తరములు వచ్చువేళ దాఁటిపోఁగనే "అమ్మతోడను, అన్నయ్యతోడను గూడ నాలోచించుచున్నారు కాఁబోలు; అందువలననే వెంటనే జవాబు వ్రాయలేదు. ఈ రోజునను రాలేదు. రేపు తప్పకుండ వచ్చును" అని తలఁపోయుచుండును. అట్లు ఇరువది దినములు గడిచెను గాని ప్రత్యుత్తరము రాలేదు. తన వాంఛితము దూష్యమని యైన వ్రాయకపోవుటచే నామె తండ్రి యీ యభిప్రాయమును బూర్తిగ నిరసింప లేదనియు నేవేని కొన్ని సందియములు కలిగి వానింగూర్చి విమర్శించుచుండురనియు నెంచెను. ఒకవేళ తన యౌవనప్రాదుర్భావము చేతనే ముందు వెనుక లారయక యట్లు వ్రాసెనని యనుకొనుచున్నారేమో యని తలఁచి యాయనకు నిజవృత్తాంతము కొంత విశదపఱుపఁగోరి శశిరేఖ మఱియొక యుత్తర మిట్లు వ్రాసెను:

నాన్నగారికి,

మీకు ఇరువది రోజుల క్రిందటనే యొక యుత్తరము వ్రాసితిని. అది మీ కందే యుండవచ్చును. నేను వ్రాసిన విషయములను గుఱించి యాలోచించినారనుకొనెదను. నేను మీకు వ్రాయఁబోవునపుడు తద్విషయములను విమర్శించితిని గాని యావేళ వేగముననే వ్రాయలేదు. నేఁ దలఁచిన కార్యము ప్రస్తుతాచారమునకు విరుద్ధమని నే నెఱుఁగకపోలేదు. లోకు లాక్షేపణము చేతురని గాని బంధువులు తమ గృహా

ములకు రానీయరని గాని గ్రహింపకపోలేను. లోకుల యా క్షేపణలను సరకుగొనక, బంధువుల తిరస్కృతులను లెక్కింపక యుల్లాసముతోడను, సౌఖ్యముతోడను, గౌరవముతోడను జీవింపఁగలనను నమ్మకము నాకుఁ గలదు. మీ యనుజ్ఞమాత్ర మయినచో నానిరంతర దుఃఖమును బోఁగొట్టుకొని జీవితమును సంతోషదాయక మగు దానిగఁ జేసికొనఁగలను. నాకీ ధైర్య ము కలదు గావుననే మీకు వ్రాసితిని. మీ జవాబునకై నిరీ క్షించుచుంటిని; త్వరగ వ్రాయవలెను.

శశిరేఖ.

---

# 27

## అపవాదము.

చైకితాయనుఁడుగారు తమ కుమార్తెకుఁ దగు సహా యము చేయుమని హవ్యవాహనుఁడుగారిని మరలఁ గోరిరి; తమ బంధువులచేఁ జెప్పించిరి. తమ పుత్రిక పోషణమాత్ర మునకై వీరిని వేఁడుట యవసరము లేకపోయినను నామెకుఁ జెన్నపట్టణములో విద్య చెప్పించుటచేఁ గలుగు వ్యయము మిక్కుటముగ నగుటవలనఁ గొంత సహాయము చేయుమని, చేయవలసినట్టియుఁ జేయఁదగినయట్టియు నామెమామగారిని గోరిరి. ఏ రెవ్వరిమాటలకు హవ్యవాహనుఁడుగారు లక్ష్యపెట్టక పోవుటచేఁ దుదకు చైకితాయనుఁడుగా రొక న్యాయవాదిచే

తమ విద్యాంకున కుత్తరము వ్రాయించిరి. దానికిని సరకుగో నక హాన్యవాహనుఁడుగారు తమ పట్టణ మందలి యొక న్యాయవాదిచేఁ బ్రత్యుత్తర మిప్పించిరి. అందుఁ దమ కోడలను బోషించు బాధ్యత యాయనకు లేదనియు, ఆమెకుఁ బురుషునకువలెఁ జనువు చెప్పించు నగత్యము మొదలే లేదనియు ఆమె తమ యింటికి వచ్చి తమ సంరక్షణములో నుండెనేని యన్నవస్త్రములకు లోపము లేకుండఁ జూచెదమనియుఁ దెలియఁజేసిరి. మఱియు చైకితాయనుఁడుగారు వేగిరించి న్యాయస్థానముల కేగుచో, నాయన కుమారిత పతివ్రతల కుచితంబు గాని కాపథముల వర్తించుట విల్లడిచేయవలసి వచ్చుననియు దానికిఁ గన్నులార చెన్నపట్టణములోఁ జూచినవారి సాక్ష్యము కలదనియు నయ్యది వారి కుటుంబమునకుఁ గాని తమ కుటుంబమునకుఁ గాని గౌరవము కాదనియుఁ దెలియఁజేసిరి. ఈ ప్రత్యుత్తరము చదువఁగ చైకితాయనుఁడుగారి హృదయము వికలమయ్యెను. ధనసహాయము చేయుకపోయిన మానె ఈ యపవాదములు వేయుటేలని వగచిరి. ఈ యుత్తరములోని సంగతులు పీ రిరువురకును దీనిని వ్రాసిన న్యాయవాదికిని మాత్రమే దెలిసి యుండలేదు. ఈ ప్రత్యుత్తరము వ్రాసిన న్యాయవాదిగారు ఆ సాయంకాలమే పురమందిరమున విలాసముగ మాట్లాడుకొనుచు నెల్లవారు వినవలసిన ముఖ్యవిషయముగ హావ్యవాహనుఁడుగారు తమయొద్దకు వచ్చి చెప్పిన సంగతులన్ను ఆయన వ్రాయించిన యుత్తరమందలి సంగతులను, అందు

వ్రాయకమానిన మఱికొన్ని విషయములను, మఱికొన్ని పేరులను జెప్పిరి. వచోనైపుణ్యము న్యాయవాదుల కందఱకును నలవడును గాఁబోలు, అన్ని విషయములను మొలచినట్టును దాము స్వయముగఁ జూచినట్లును దణుకుబెణుకు లేక చెప్పిరి. దానిని శ్రద్ధతో నాకర్ణించిన వారి మిత్రులు "ఇఁక న్యాయస్థాన మందొక చిత్రకథ విందు" మని ముచ్చటపడుచు ఈ వియ్యంకుల కలహాంకురమును మొదటనే త్రుంపివేయక పెంపొందింపుమని యా న్యాయవాదిగారిని కోరిరి. ఆయన అభయ మిచ్చిరి. అంతటితో నాగలేదు. ఆనోట, ఆనోట, నాపేరు వ్యాపించెను. నన్నుఁ గూర్చి యెవరిష్టము వచ్చినట్లు వారు చెప్పుకొనిరి. కొందఱు నన్నే దూషించిరి. కొందఱు నే భ్రమపెట్టఁబడితినని నాపై జాలిగొనిరి. తుదకు ఈ వార్తలు మా గ్రామమందుఁగూడ వ్యాపించెను; మా తల్లిదండ్రులకు నాపై ననుమానము కలిగింపఁజేసెను. మా తండ్రిగారు నన్నుఁ జూచి చాల కాలమైనదనియు నొకసారి వచ్చి మూడురోజు లుండి వెళ్లవలసినదనియు వ్రాసిరి. నేను నిజమే యనుకొంటిని గాని వారిట్లు వ్రాయుట కిదియే కారణమని యప్పటికి గ్రహించలేదు. నాకును వారిని జూడవలెనని యున్నదనియు ఏ వైనను మూడు నాలుగు రోజులు సెలవులు కలసివచ్చినఁ గాని నేను వచ్చుటకు వీలుపడదనియుఁ గష్టపడియే చదువుచున్నాననియు వ్రాసితిని.

# 28

## సంక్షోభము.

నేను మా తండ్రిగారి కట్లు జవాబు వ్రాసి పదునైదు దినములైనది. మరల వారియొద్దనుండి నా కేయుత్తరమును రాలేదు. యథాప్రకారము కళాశాలకుఁ బోవుచుంటిని; మిత్రులతోఁ గలసి ముచ్చటించుచుంటిని; వెనుకటికంటె శశిరేఖమాత్రి మెక్కువ తఱచుగ నన్నుఁ గలసికొనుచు వచ్చినది; నేను మా పుస్తకములను జదివి వ్రాసికొనిన వ్యాఖ్యలను బుచ్చుకొనుచువచ్చినది.

ఒక ఆదివారము నాఁ డుదయము నేను యథాప్రకారము తల యంటుకొంటిని. భోజనమైనపిదప నాకు నిద్దుర వచ్చెను. పగటివేళ నిదురించుట యనారోగ్యమని యెట్లులైనను మేల్కొని యుండవలెననియే యత్నించితిని. ఒక పుస్తకము పుచ్చుకొని కుర్చీలోఁ గూర్చుంటినిగాని నిద్దుర యాగినది కాదు. చేతినుండి పుస్తకము జాఱిపోయినది. నా ఱెప్పలు మూసుకొనిపోయినవి. కొంతసేపటికిఁ దపాలవాఁడు నా తలుపు త్రోసికొని వచ్చి రెండుత్తరములు నా కుర్చీయొద్దఁ బడవేసెను. తలుపు చప్పుడు వింటిని; కన్నులు తెఱచి వానిని జూచితిని, నా బద్ధకము పోలేదు. నే నా యుత్తరములను దీయనేలేదు. మరల నిద్దురపోయితి; మఱికొంతసేపటికి లేచి యావులించి, ఒళ్లువిఱుచుకొనుటలో నాదృష్టి యాయుత్తరములపైఁ బడెను. అందొకటి

శశిరేఖ వ్రాఁతవలె నుండెను. దానిని దీసి చదివితిని. అది చదువునపుడు నాకుఁ గల్గిన యానంద మింతంతగాదు. నాకంత ముదము కలుగఁజేసిన యుత్తర మిట్లున్నది:

చెన్నపట్టణము.

సోమేశ్వరా, 27—11—

ఈయుత్తరము మీ కాశ్చర్యము కలిగింపవచ్చును. అనుదినమును మనము కలసికొని మాట్లాడుచున్నను నిద్దానిని వ్రాయుటకు నిమిత్త మేమని మీ రాలోచించెదరు కాఁబోలు. దీనికిఁ గారణము మీ రెఱిఁగియే యుందురని నే తలఁచెద. ఇదివఱకు మీతోఁ బ్రసంగించునపుడే యొకవిషయము మీకుఁ దెల్పి మీ యభిప్రాయమును విస్పష్టముగఁ దెలిసికొనఁగోరితిని. కాని దాని నెఱిఁగించుట కెద్ది సమయమని యాలోచింతును; ఎట్లు ప్రారంభింపవలెనని చింతింతును. ఇవన్నియు నిశ్చయముచేసికొనఁగ మీ యెదుటఁ జెప్పుటకు నాకు సిగ్గు వొడమును; ధైర్యము చాలదయ్యె. మన సంభాషణలయందుఁ దద్విషయములను గుఱించి మీ రప్పుడప్పుడు ముచ్చటించుటచే నీవిషయమును గుఱించి మీరే ప్రస్తావింతురనికూడ నిదివఱకు ఊరకుంటిని. మీరును నావలె వ్రీడచే వెనుదీసితిరో, నాకున్నట్టి భావములు మీకు లేకపోవుటచేఁ దలఁపెట్టరో నేను చెప్పఁజాలను. మన సంభాషణములను బట్టి చూడ మీకును నిట్టి భావములు పుట్టియుండవచ్చునని నమ్మియే మీ కయుత్తరము వ్రాయుచున్నాను. ఇదివఱకు మీతోఁ బరిహాసముగ

స్త్రీలకే యెక్కుడు ధైర్యమును, సాహసమును గలవని చెప్పి యుంటిని. ఆ నావచనమే నిజమని యిపుడే మీకుఁ బ్రత్యక్షము చేసెదను. నా హృదయాంతరాళమున నుత్పన్నమైయుండిన భావములను నేనే ముందుగ సాహసించి మీకు వెల్లడిచేసెదను. ఈ యుత్తరము ప్రారంభించినప్పటినుండియు నాచిత్తము సంతోషముతో నుప్పొంగుచుండెను. వ్రాసినదానినే మరల వ్రాయుచుంటినో, వ్రాయరానిదానినే వ్రాయుచుంటినో నాకుఁ దెలియుటలేదు. నాపై నాదరముండెనేని నాదోషములను మీరుమాత్రము సైరింపరా! నిజముగ నాపై మీకు మక్కువ కలదేని నాకోరిక ఫలియించెనేని నాకంటె నదృష్టవంతు రాలెవరు? ఇన్నినాళ్లకు దైవమునకు నాపై దయకల్గినదనియే తలంచుచున్నాను; నాకు సాహసము కలుగఁజేసినట్లు మీకు ధైర్యము నొసంగుఁగాక! సోమేశ్వరా! కర్తవ్యమని మీయాత్మ యొఱింగించుదానిని లోకనిందలకు వెఱవక చేసెదరనియు మీరు సేయుదానికి మీ తండ్రిగారు వ్యతిరేకముగఁ బలుకరనియు మీరు వచియించినది నాకు జ్ఞాపకమున్నది. మీమూర్తి యెట్లు నాహృదయమున నాటియున్నదో మీవాక్యములును అట్లే నాటియున్నవి. ఆతురతతో వినిన యావచనములను మఱవఁజాలను. మీవాక్కులను నమ్మికొనియే యాశతో జీవించియుంటిని. ఒంటియై సముద్రమధ్యమున మునుంగు తెప్పను దేల్పఁగలవారు మీరని నమ్మియుంటిని. సోమేశ్వరా! అట్లుండిన నన్ను గట్టునఁజేర్చెదరో, నీటముంచెదరో, మీదే

భారము. అనుకూలంబైన ప్రత్యుత్తరమునకే నిరీక్షించెద. అద్దానిని మీావలన వినినఁగాని మీాదర్శనము చేయఁజాల."

శశిరేఖ.

ఈ యుత్తరము చదివినపిమ్మట నిజముగ నాశరీరము పులకరించినది. నే నిదివఱకు నిద్దురలోనే యిట్టి యానందము నొందితిని కావున నే నిపుడు కల గనుచున్నానో నిజముగ నుత్తరము చేతఁ బట్టుకొని కన్నులు తెఱచి చదువుచున్నానో నాకే నమ్మకము లేకపోయినది. ఆ యుత్తరము కుర్చీలోఁ బెట్టి నేను లేచి కూజాలోని నీళ్లతో ముఖము కడుగుకొని వచ్చి మరలఁ జదివితిని. అహా! ఇపుడుగ ధన్యుఁడను అనుకొని యానందించితిని. ఈ వృత్తాంత మింకను నెవ్వరికిని దెలియకుండ నుంచవలెననుకొంటిని. శచీనాథుఁడుగాని యెవ్వరుగాని వచ్చి చూడకుండనుండుటకై దీనిని మడచి యుంచితిని. ఇఁక నాభావిదశను గూర్చి యాలోచించుట మొదలిడితిని. ఒక విద్యావంతురాలు, నావలెనే యొక బి. ఏ., నా కనుదినము సహాయము చేయుచుండ నే నేయుద్యోగము చేసిన రాణింపను? నాకుఁ జేయరానిది. నాకు భారంబైనది యేమిపని యుండఁగలదు? "శశిరేఖా, నేను నీ యధీనమై యుంటి" నని వ్రాయఁదలంచితిని. ఆ రెండవయుత్తర మెవరు వ్రాసిరో, అదికూడఁ జదివిపిమ్మట జవాబు వ్రాయుటకుఁ గడంగుదమని యీ యుత్తరమును నా గుండియలపైఁ బెట్టుకొని రెండవయుత్తరమును విప్పితిని. అది చదువుచుండఁగ, రాకాని శాకాశము గ్రమక్రమముగ

మేఘాన్వృతంబైనట్లు ఆనందముతోఁ గూడిన నాహృదయము వ్యాకులపూరితమయ్యెను. నన్నట్లు చేసిన యుత్తరమిది :

" నే నిదివఱకు ఉత్తరములు వ్రాసియెఱుఁగను. ఎవరి కెట్లు వ్రాయవలెనో నాకుఁ దెలియదు. ఈ యుత్తరమునకు మీరేమందురో యను భయము కూడఁ గల్గుచున్నది. ఎంత మనస్సు సమాధాన పెట్టుకొనినను నాకు వ్యాకులమే కలుగు చున్నది. కాఁబట్టి మీరేమన్నను సరేయనుకొని యీయుత్త రము వ్రాయఁగడంగితిని. కాని నేను వ్రాయఁబోవుసంగ తులు నేను వ్రాయఁదగినవి కావు; నేను వినఁదగినవే కావు. మిమ్ముల నెఱిఁగినదానవగుటచే ఆ వార్తలను నమ్మలేదు గాని నలువురును అట్లే పలుకుచుండుటచే నామనోస్థైర్యము తగ్గు చున్నది. అవియే యసత్యములైనచో నేను అదృష్టవంతురాలి నే. అవి యసత్యములే యని మీవలన వినఁగోరెదను. త్వరలో నట్లే వింటినేని తిరుపతి వేంకటేశ్వరున కారాధన చేయించెద నని మ్రొక్కుకొంటిని. నేను మొన్నటినుండియు శనివార వ్రతము చేయుచుంటిని. నేను వినినమాటను వ్రాయుటకే నాకుఁ జేయాడకున్నది. చతురిక కూడ వచ్చి వారింటిలో నట్లే చెప్పుకొనిరని నాకుఁ జెప్పినది : మిమ్ముల నెవ్వరో చెన్నపట్ట ణములోఁ జూచి వచ్చిరఁట. మీతోఁగలసి నావయస్సుగల యువతి చదువుకొనుచున్నదఁట; ఆమెకును మీకును బ్రాణస్నే హమఁట, ఇంక నేదేదో చెప్పిరి. ఇది నిజమగునా ? పాపము,

ఆబిడ నిర్దోషిణి కావచ్చు; ఆమెనుగూర్చి యట్లు పలుకుట ఎంత పాతకమో!! మీకు నేను జెప్పఁగలదానను గాను. మీరు చేసినదానిని గాదనలేను. మీ కెయ్యది సంతోషమును, సౌఖ్యము కలుగఁజేయునో దానిని జేయుటే నావిధి. మీచిత్త మాకర్షించి యుంచుకొనుటకును, మిమ్ముఁ బ్రేమించుటకును, మీచేఁ బ్రేమింపఁబడుటకును నాకెంత ఆశయు అధికారమును గలదో మఱియొకరికిని నంత యుండవచ్చు. నేను లేదనలేను. కాని మిమ్ములనే నమ్ముకొని నన్ను మీ కర్పించు కొంటిని.

వారమునుండి నాకు నిద్రాహారములు లేవు. అత్తగారును మామగారును జిన్నవోయి యుండుచున్నారు. మిమ్ములను రమ్మని వ్రాసినారఁట. మిమ్ముఁ జూచువఱకును నాకును దోఁచదు. ”

ప్రియంవద.

ఈ యుత్తరము చదువఁగనే నాకుఁ జకాకు కలిగెను; వింధ్యాచలము నాపై బడినంత భారము కలిగెను. నాచిత్తము భావశూన్యమయ్యెను. ఏ యాలోచనయు లేక స్తంభితుఁడనై అట్లే యైదు నిమిషములు కుర్చీలోఁ గూర్చుంటిని. రెండు గంటలు గావచ్చినది. కాఫీ కాచుకొనుటకు నా కోపిక లేకపోయినది. కొంతభారము తగ్గునని యంగడికిఁ బోయి 'టీ' త్రాగి వచ్చితిని. అపుడీయుత్తరము మరలఁ జదివితిని. ఇదివఱకు శశిరేఖతో సంభాషించునపుడు గాని, యామెను జూచునపుడు గాని, యామెను నాచిత్తములో ధ్యానించునపుడు గాని నా

యర్ధాంగి తలఁపే నాకుండెడిది కాదు. నాకు వివాహమైన సంగతియే మఱచి యుండెనువాఁడను. ఈ యుత్తరమును జదువగ నా యర్ధాంగి నాయెదుట నిలచినట్లే కనఁబడెను. నేను చెన్నపట్టణమునకు వచ్చునాఁడు ఆమె నా పెట్టె సర్దుట, నా కోటు జేబులోఁ జెక్కలను ఆకులను నుంచుట, నేను బండి యెక్కి రైలునకు వచ్చునపుడు వీథిగుమ్మములో మాయమ్మ వెనుక నిలువఁబడి తప్పవేయక యశ్రుపూరితలోచనంబులతో నన్ను వీక్షించుటయు నాకన్నులకుఁ గట్టినట్లుండెను. ఆ పూర్వపు రాత్రి నేను మనోవ్యథచేఁ గుందుచు, ఆమెకు నిజము చెప్పక బాధపడుచున్నపుడామె భోజనమునకు వెళ్లక, నా కుపచారములు చేయుటకై ఆగుటయు, నేను కసిరికొట్టినను బదిసారులు నాకడకువచ్చి నిలుచుండుటయు నాకు జ్ఞాపకమునకు వచ్చుచున్నవి. ఆమెకు నాపైఁగల నిర్వ్యాజానురాగమును నిశ్చలభక్తియు నా హృదయమును మథించుచున్నవి. నా చిత్తములో దాఁగియుండిన హాలాహలమును నిర్గమింపఁ జేసినవి. నేఁ గావించిన మహాపరాధము నాకే స్పష్టమయ్యె. ఇరువురు ముగ్ధలను వంచించితినే, యిఁక నెట్లు తలయెత్తి తిరుగఁగలను ? అదృశ్యుఁడనై యెందేని దాఁగియుండఁ గోరితిని. ఆ రెండు ఉత్తరములపైనను మరల నాదృష్టి పడెను. శశిరేఖయు, నా యర్ధాంగియు నాదోషమును సైరించితి మని యభయమిచ్చినఁగాని నా వేదన చల్లారదనుకొంటిని. వారి యెదుట బడుటకు నాకు ధైర్యము చాలకయుండె.

నేను కదలలేక యాకుర్చీలో నట్లే కూర్చుంటిని. నేఁ జేసిన పాపమునకుఁ బరిహార మెట్లని యాలోచింపఁబోయితిని; గాని మనస్సు క్షోభించి యుండెను. ఏ యాలోచనయుఁ దోఁచుట లేదు. అట్లుండఁగనే తలుపు త్రోసికొని శశిరేఖ వచ్చెను. తలమాత్రమెత్తి యొకసారామెవైపుఁ జూచితిని. నా శరీరము కంపింపనారంభించెను. నేను కుర్చీలోనుండి లేవలేను. ఆమె ముఖమున మందహాసమును లజ్జయుఁగూడ నగుపడెను. శశిరేఖ గదిలోనికివచ్చుచునే "సోమేశ్వరా, మీయుత్తరము వచ్చువఱకు రానంటివిగాని మీతోఁబంతము పట్టఁగలనా?" అనెను. అట్లని యామె కిటికీలోఁ గూర్చుండెను. నేను కూర్చుండుమని యైన ననలేను. తలవంచుకొని కుర్చీలో నట్లే యుంటిని. ఆమె నావైపుఁజూచి, ఏమి సోమేశ్వరా, అట్లుంటిరి? మీశరీరములో బాధ యెట్టిదియు లేదుగద ? అని యడిగెను. ఆమె మృదువాక్యములే నాకు ములుకులవలె గ్రుచ్చుకొనెను. నేను ప్రత్యుత్తర మీయలేకపోయితి. ఏమి, సోమేశ్వరా ! మాటాడరు ! మీయింటి దగ్గఱ నందఱు క్షేమముగ నున్నారా ? అని యుత్తరమువైపు చూచి, అది మీయింటిదగ్గఱనుండి వచ్చినదేనా ? యని యడిగెను. ఆమె యడుగుటతోడనే "శశిరేఖా, నిన్ను మోసగించితిని" అనుపలుకులు నానోటినుండి వచ్చెను. ఆమె నివ్వెరపోయె. "ఏమిటి, సోమేశ్వరా, ఇట్లనుచున్నారు? చంద్రునకు వేడిమి యుండునా ?" అని యామె పలికె. నమ్ము, నామాట నమ్ము. నిన్ను వంచనచేసితి; నీ వెట్లు

శిక్షించినను సరే. అదియే నాయర్ధాంగి వ్రాసిన యుత్తరము. నాకు వివాహమైనట్లు చెప్పక నిన్ను దప్పుత్రోవలఁ బెట్టితిని కాఁబోలు! అని మెల్లగఁ బలికితిని. "మీకు వివాహమయ్యెనా? సోమేశ్వరా!" అని యామె కిటికీలోనుండి క్రిందఁ జతికిలఁబడెను. పదపడి యామెకును మాటవచ్చినది కాదు; నేనును మాటాడలేకపోయితిని. నే నామె చేతులు రెండును బట్టుకొంటిని; ఆమె ముఖమువైపు చూడలేకపోయితిని. తల వంచుకొంటిని. ఆమెయు నట్లే యుండెను. కొంతసేపటికి, "శశిరేఖా, నాతప్పు సైరింపు"మంటిని. ఆమె చేతులను వదలి నాకన్నులనుండి కాలు యశ్రువులు తుడుచుకొంటిని. ఆమె ముఖము వాల్చియే, "సోమేశ్వరా! ఎంత పాపకృత్యము చేసితిని!" అనియె. కొంత సేపూరకుండి, "మీకు వివాహమైనట్లు తెలిసికొనలేకపోయితి; నే వ్రాసిన యుత్తరము సంగతి మీప్రేయసికిఁ దెలియనియకుఁడు. నా యుత్తరమును నా కిచ్చివేయుఁడు" అని నుడివెను. నేను బదులు పలుకలేకపోయితిని. ఆమెయే, నాప్రక్కపడియుండిన తనయుత్తరమును దీసికొని దానిని జింపుచు "సోమేశ్వరా! నేనిట్లుండుటయే భగవన్నిర్మితము. కానిచో నిన్ని భంగపాటులేలవచ్చు? ఇఁక నేనట్టి విషయములఁ దలఁప. సోమేశ్వరా మీరును మఱచిపొండు." అని లేచి యాయుత్తరమును చిన్న చిన్న ముక్కలుగఁ జేసి పాఱవేయుచు నాగదినుండి వెడలి పోయెను.

# 29

## నిశ్చితము.

శశిరేఖ తనగదికి వెళ్లెను. ఆమె మనస్సు వికలమై యుండెను. ఆమె యుత్సాహమడంగె. ఆమెయం దెట్టివికారమును బుట్టనియట్లు కనంబడుటకై యత్నించుచుండెను గాని యామె విగతోల్లాసయైనట్లు తెలియుచుండెను. వెనుకటివలె మందరికతో మాటాడుట లేదు. ఏమిపలికినను దొంబదియేండ్ల వృద్ధ పలికినట్లు విరక్తి మార్గమునం బలుకుచుండెను. అట్లు రెండు మూడు దినములైనపిదప మందరిక, "ఏమే శశిరేఖా, అట్లా యున్నావుంటివి" అనెను. అనుదినము నున్నట్లే యున్నానని శశిరేఖ పలికెను గాని యామెకు మాంద్యమావహిల్లుట మందరిక గ్రహింపకపోలేదు. "శశిరేఖా, సాగరతీరమునకుం బోయెదము వచ్చెదవా" యని మందరిక పిలిచెను. శశిరేఖ రాననియె. "పోని, నీవు సోమేశ్వరునితో వెళ్ళుము. నాతో రానక్కఱలేదు" అని మందరిక హాస్యము చేసెను. దానికి శశిరేఖ నిరుల్లాసముగనే "మందరికా, లేనిపోని మాటలనకు, ఎవరైనను నిజమనుకొనెదరు" అనెను. "లేనిపోనిమాట యేమున్నది? సోమేశ్వరుండు నీ స్నేహితుండు గాండా? నీ విదివఱకు వెళ్ళ లేదా? అని మరల మందరిక నవ్వుచుం బ్రశ్నించెను. "సరే వెళ్లిన, వెళ్ళితిని. తప్పా?" అని శశిరేఖ పలికె "తప్పని యంటినా శశిరేఖా? నీవు నాతో రావు, అతనితోడనే వెళ్ళ

వచ్చునంటివి" అని మందరిక ప్రత్యుత్తర మిచ్చెను. శశిరేఖకు దుఃఖమూగినది కాదు. "నన్నింకను బరిహాసము చేయుదువా, మందరికా!" యని శశిరేఖ తలవాల్చి రెండుచేతులతోను గన్నులను మూసుకొనియెను. తనమాటలకే యంత విచారించుచున్న దేమని మందరిక చిన్నవోయెను. "శశిరేఖా, నేను హాస్యమున కన్నదానికి నింతకోపము రావలయునే" అని మెల్లగఁ బలికెను.

"నాకుఁ గోపములేదే! నాబ్రతుకునకే విచారించుచున్నాను గాని కోపమేమని నాకు ?"

"శశిరేఖా, నీకిప్పుడు దుఃఖమునకుఁ గారణమేమి ? నాకుఁ జెప్పరాదా ? నాకుఁ జేతనైన సహాయము చేసెదను "

"దేవుఁడే నాకు వ్యతిరేకముగ నుండ నాకెవ్వరు సహాయము చేయఁగలరు ?"

"ఎప్పుడు నొక్కటేవిధమున నుండదు. నీకును మంచి రోజులు రానున్నవిలే. సోమేశ్వరుఁడు మిక్కిలి తెలివిగలవాఁడట, మఱియునిష్కపటుఁడు సత్యశీలుఁడువలెనే నాకుఁ దోఁచుచున్నాఁడు "

"కావుననే యాతనిభార్య యదృష్టవంతురాలు. అందఱికి నెట్లువచ్చు నట్టిభాగ్యము ?"

"సోమేశ్వరునకు వివాహమయ్యెనా ?" అని మందరిక ఆశ్చర్యముగ నడిగెను.

"ఇదివఱకే యయ్యెను. "

"శశిరేఖా, అతఁడంత ద్రోహముచేయునా !"

"అతఁడేమిచేసినాఁడు? ఆ తెలివి తక్కువ నాదే. నే నెప్పుడైన నట్లడిగితినా? లేక నాకోరిక యిట్టిదని చెప్పితినా?"

"నీపై నాతనికి మక్కువయున్నదని చెప్పవఁటే?"

"అవును; ఇప్పటికిని నాపై నాతని కనుకంప గలదనియే యను కొందును."

"ఈకనికరముల కేమి లే; అట్టివానిని జూచియే నీవు మోస పోయితివి కాఁబోలు."

"మందరికా, అతని ననవలసినపని యేమున్నది? అది యంతయు నేఁజేసికొనినదే. తొందరపడి మాతండ్రిగారిపేరఁ గూడ వ్రాసితిని, అనవసరముగ వెల్లడిపడితిని."

"ఏమి యేర్పాటు కావలసియుండి వ్రాసితివో లె, కాని, నీపరీక్షలుకాని. అప్పటికేమి జరుగునో చూచుకొన వచ్చును."

"మందరికా, ఇంక నట్టిది యసంభవము. నామనస్సు ఒకచోటునకుఁ బరుగెత్తెను. అది మృగతృష్ణమాత్ర మయ్యెను. ఇఁక వేఱొకచోటుకుఁ బోదు."

"అది నీయిష్టమనుకొంటివి కాఁబోలు. నీవయస్సే నిన్ను పరుగెత్తఁజేయును." అని మందరిక మందహాసము చేసెను.

"మందరికా నాకు మేలే కలుగనున్నదనుకొని, నేనే స్థితిగతులకు లోనైయుంటి; ప్రవాహము నన్నిట్లు గొంపోయిన

నల్లుగానిపో నిచ్చితి. ఇపు డీ భంగపాటువలన నిజస్థితి నెఱిం గితి; నాచిత్తమిపుడు కొంతవఱకు విగతరాగ కల్మషయు నైనది. ఇఁక నట్టిపోకడలఁ బోను. అదే నానిశ్చితము."

"నీ కుత్సాహముగ నుండునేమో, నినాముకు వెళ్ళు దము వచ్చెదవా?" అని మందరిక పిలిచెను. శశిరేఖ రాన నియె. అపుడే ఆనాఁడు రైలు ఆలస్యముగ వచ్చెనని, తపాల వాఁడుత్తరములను దెచ్చెను. అందు శశిరేఖకుఁ దండ్రివ్రాసిన యుత్తరముండెను ఆయన ఏకార్యమును దొందరపడి చేయఁ దగినది కాదనియు, దీనివలన బాధలు మెండు గలవనియు వ్రాసిరి. ఆమెను దమయొద్దకు వచ్చి నాల్గురోజు లుండి వెళ్ళు మనిరి. ఉత్తరములను జదువుకొనుచు శశిరేఖయు మందరికయు నింటికడనే యుండిరి.

---

# 30

## తుదకు.

శశిరేఖ నాగదినుండి వెళ్ళిపోయిన తరువాత శచీనా థుఁడు వచ్చెను. అతనితోఁ గలసి నేను సముద్రపుగొడ్డునకు వెళ్ళితిని. అతఁడేమిచెప్పెనో, నేనేమివింటినో నాకుఁదెలియదు. నా మనోవ్యాపారము లుడిగిపోయెను. నా కేయాలోచనయు దోఁచదు. ఏదో అనిర్వాచ్యచింత యావరించెను. కొన్నిదిన ములవఱకు నట్లే యుంటిని. కళాశాలకుఁ బోవునపుడు గాని

సాగరతీరమున కేగినప్పుడుగాని శశిరేఖ యగపడునేమో యను
భయమో బిడియమో కలుగుచువచ్చెను. మా తరగతుల
యందలి విద్యార్థులు కూర్చుండు వైపు చూడకయే యుండువాఁ
డను. నేనును శశిరేఖయుఁ గలిసికొనిన తరువాత నట్లు రెండు
మాసములు జరిగెను. ఒకనాఁడు మా యుపాధ్యాయుఁడు,
లండనులోఁ బ్రచురింపఁబడిన పుస్తకము క్రొత్తగఁ దెప్పించి
కళాశాలా భాండాగారమున నుంచిరనియుఁ బ్రతివారును,
దానిని జదివి తీరవలయుననియుఁ బరీక్షలకందుండియే ప్రశ్నల
నిత్తురనియుఁ జెప్పిరి. ఆపుస్తకము బిదిపబడకే, నేను వ్యామో
హామగ్నుఁడనై యాకాశహర్మ్యములు నిర్మించునపుడు, ఇంగ్లాం
డు వెళ్లుమనను నమ్మకములో నున్నప్పుడే, లండనునుండి తెప్పిం
చితిని. నే నాపుస్తకమును దెప్పించినట్లొకసారి శశిరేఖతోడఁ
జెప్పియుంటిని. ఆ మాట యామెకు జ్ఞాపకమున్నది కాఁబోలు,
మా యుపాధ్యాయుఁడు చెప్పిన మఱునాఁడే ఆమె యాపుస్త
కము నొకసారి పంపుము నాపేర చీటి వ్రాసి తన దాసిని
బంపెను. ఆచీటియందంతకంటె నెక్కువ లేదు. ఆచీటి చూ
డఁగ నాకు విషాదము, జాలి, యానందము కూడఁ గలిగెను.
దానిని బుచ్చుకొని జేబులోఁ బెట్టుకొంటిని. నేను పుస్తకమును
బంపెదను నీవు వెళ్ళుమని వచ్చిన దాసిని బంపివేసితిని. నేనే
వెళ్ళి యాపుస్తకమీయఁ దలఁచితిని గాని దానికిని ధైర్యము
చాలినది కాదు. అప్పటి కామె కొకయుత్తరము మాత్ర మిట్లు
వ్రాసితిని

శశిరేఖా,

నీవు పంపిన చీటి చూచితిని. పుస్తకమును వెంటనే పంపుటకు వీలులేక పోయినది నేనే పట్టుకొనివచ్చి నీకీయఁ దలఁచితినిగాని యదియు సమకూడినది కాదు. ఆపుస్తకమందు ముఖ్యములని తోఁచిన కొన్నిభాగములు గుఱుతుపెట్టితిని. వానినే నీవును గమనింపుము. నీకింకేమైనఁ బుస్తకములు కావలసివచ్చినఁ బంపెదను. శశిరేఖా! నీకు నేఁ జేయఁ గల్గిన సహాయమేదియుండినను జెప్పుము; మనసారఁ జేసెదను. నీవు వెనుకటివలె వచ్చుట మానితివి; నాపై నీకుఁ గినుక లేదనియే నేను నమ్మెదను. మన సంభాషణము లరుదైనను నీపైఁ బ్రేమ నాకు తగ్గదు. ఇట్లంటినని వేఱొకలాగునఁ దలఁపకుము. పురుషులకుఁ బ్రాణసఖులైనవారు పురుషులే కాని యుండరనుకొనకుము. పురుషులకుఁ బురుషులట్లును స్త్రీలకు స్త్రీలట్లనుగూడ పురుషులకు వనితలలోను పడఁతులకుఁ బురుషులలోను సఖులుండుట యసంభవము కాదు. ఇరువురు మిత్రులు స్త్రీ పురుషులయినేని వారికుండు అన్యోన్యానురాగము జాయాపతుల యనురాగమే యై తీరవలెనని తలంపకుము. వీరిద్దఱును సుహృదులయినేని నిర్మలానురాగ ముండకపోను. అట్టి మిత్రులుండుట యరుదే. ఉన్నను లోకము వారిని బూర్తిగ నెఱుంగకయే వారిపై నపవాదముల మోపును. కాని మనయెడ దోషములేనిచో లోక మేమనిన మనకేమి? శశిరేఖా, నీవు నన్ను విశ్వసించి నాచెలిమి యంగీకరించితివేని నీవును వెను

కవలె వచ్చుచుండుము. పరిచితులైన వారే తలుచు వచ్చు చుండఁ బ్రాణస్నేహమున్న నీ రాకలు యరుదగునా? శశిరేఖా, నాకొఱకు శచీనాథుఁడును బన్నసుమూఁడును వచ్చుచున్నారే అంతమాత్రమైన నీవు రాఁజనదా ?

అని వ్రాసి యీయుత్తరమును బుస్తకమును మావాసి కిచ్చి శశిరేఖకుఁ బంపితిని.

ఈపుస్తకమును బంపిన రెండునెలములకు సాగరతీర మున నేను శశిరేఖను జూచితిని. ఆమెయు నన్నుఁజూచి నా కడకువచ్చెను. "నీవు వ్రాసినట్లే నేనును జెప్పఁదలఁచుకొంటిని, సోమేశ్వరా! మనసఖ్యమున కెద్దియు నంతరాయము కల్పింప నేరదు. నేఁ జేయునది దోషముకాదని నాయంతరాత్మకుఁ దోఁచుచో లోకమేమన్న నేను గణనసేయను" అని యామె వచించెను. ఆనాఁటినుండియు నేనును శశిరేఖయు నెవ్వారికిని జడియకయే బహిరంగముగనే సంభాషించుకొను చుంటిమి. పరీక్షలై మా మా యిండ్లకు వచ్చినతరువాతను నప్పుడప్పుడు కలసికొనుచుండువారము. నా సతియు శశిరేఖయుఁ గూడఁ బ్రియసఖులైరి. మమ్ము బాగుగ నెఱిఁగిన మాబంధువులును బెరవారును, తుదకు శచీనాథుఁడును మా యనింద్యమైత్రి నెఱింగి మమ్మాక్షేపణము చేయుట మానిరి.

1925.

కాకినాడ ముద్రాక్షరశాల, కాకినాడ.

ప్రథమ ముద్రణము 1000.